

కల్లోల లోయ
50 ఏళ్ళ కశ్మీర్
కె. బాలగోపాల్

# కల్లోల లోయ

## 50 ఏళ్ళ కశ్మీర్

కె. బాలగోపాల్

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

**కల్లోల లోయ**


| | | |
|---|---|---|
| ధర | : | రూ. 60/- |
| ప్రథమ ముద్రణ | : | జనవరి, 2007 |
| పునర్ముద్రణ | : | 2008 |
| ప్రతులకు, వివరాలకు | : | **హైదరాబాద్ బుక్ ట్రస్ట్,**<br>ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్, గుడిమల్కాపూర్<br>హైదరాబాద్ – 500 067, ఫోన్ : 23521849<br>www.hyderabadbooktrust.blogspot.com |

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట........................................................ | 4 |
| 1. | చారిత్రక పూర్వరంగం ............................................ | 9 |
| 2. | విలీనం అనంతరం – ప్రజాస్వామ్య విధ్వంసం .................. | 34 |
| 3. | తిరుగుబాటు – అణచివేత ........................................ | 61 |
| 4. | సర్కారీ మిలిటెంట్ల సాయంతో మళ్లీ ఎన్నికలు .................. | 97 |
| 5. | పౌర ప్రభుత్వం పునరాగమనం .................................... | 121 |
| 6. | కాల్పుల విరమణ – చర్చల ప్రతిపాదన .......................... | 136 |
| 7. | కొత్త ప్రభుత్వం, కొత్త ఆశలు, పాత వాస్తవాలు .................. | 152 |
| 8. | ఈ కథకు ముగింపు కనుచూపు మేరలో లేదు .................. | 175 |

# ముందుమాట

కశ్మీర్ ఏదో ఒక కారణంగా వార్తలలో ఉంటూనే ఉంది. మిలిటెంట్లు పర్యాటకులను చంపారనో, మిలిటెంట్లను సైన్యం చంపి వారి కుట్రలను భగ్నం చేసిందనో అడపాదడపా వార్తలు చదువుతూనే ఉంటాం. అంతకు మించి వేరే వార్తలేవీ పత్రికలలో రావు.

భారత పాకిస్తాన్‌ల పరస్పర నిందారోపణలు, దూషణల సందర్భంగా కూడా కశ్మీర్ గురించి వింటుంటాం. ఈ రెండు దేశాల ప్రభుత్వాలూ తమ మధ్యనున్న విభేదాల గురించి మాట్లాడుకునే విషయం ప్రస్తావన కొచ్చినప్పుడు కూడ కశ్మీర్ గురించి వినపడుతుంది. కశ్మీర్‌ను పక్కనపెట్టి వేరే విషయాలు మాట్లాడడానికి భారత్ ప్రయత్నం చేయడం, కశ్మీర్‌ను కూడ చర్చలలోకి లాగాలని పాకిస్తాన్ ప్రయత్నం చేయడం, స్పష్టంగానే కనిపిస్తుంటుంది.

వెరసి 'కశ్మీర్ సమస్య' అనేదొకటి ఉందనీ అది పాకిస్తాన్‌తోనూ, ముడిపడి ఉందని ఇస్లాంతోనూ హింసావాదంతోనూ ముడిపడి ఉందనీ సగటు భారతీయులకు తెలుసును. తరతరాలుగా భరతభూమిలో భాగమైన సుందర కశ్మీరాన్ని పాకిస్తాన్ కబళించాలని చూస్తుండగా, అత్యధిక శాతం ముస్లింలయిన కశ్మీర్‌లు పాకిస్తాన్‌కు పంచమాంగ దళంగా పని చేస్తున్నారనీ, ఇదే 'కశ్మీర్ సమస్య' అనీ బహుశా అత్యధికులు అనుకుంటుండవచ్చు.

పాకిస్తాన్‌కు కశ్మీర్ కావాలని ఉంది. ఇండియాకు ఉన్నట్టే. కానీ 'కశ్మీర్ సమస్య' అది కాదు. కశ్మీరీలకు తమ భవితవ్యాన్ని తామే నిర్ణయించుకోవాలన్న ప్రగాఢమైన కోరిక ఉంది. వారి భూభాగాన్ని కోరుకునే భారత్‌కు ఇది సమస్యే కాబట్టి వారి కోరిక భారత్‌కు 'కశ్మీర్ సమస్య' అయింది. నిజానికి సమస్య ఉన్నది కశ్మీరీలకు. వారి భవితవ్యాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛను వారు కోరుకోవడం భారత్‌కూ, పాకిస్తాన్‌కూ ఇష్టం లేకపోవడం వారి సమస్య. దానికి భారత పాకిస్తాన్‌లు పరస్పర చర్చలలో పరిష్కరించుకుంటామనడం వారికి సహజంగానే విస్మయం కలిగిస్తుంది. వ్యతిరేకతా కలిగిస్తుంది.

ఈ కోరిక వెనకున్న చరిత్ర ఏమిటి? దాని సామాజిక రాజకీయ స్వరూపం ఏమిటి? దానితో భారత్ ఏ విధంగా వ్యవహరించింది? ఏ విధంగా వ్యవహరిస్తున్నది? ఇందులో ఇస్లాం స్థానం ఏమిటి? పాకిస్తాన్ పాత్ర ఏమిటి? హింసావాదం ప్రాముఖ్యం ఏమిటి?

**కె. బాలగోపాల్**

ఈ ప్రశ్నలకు జవాబులు అనేక కోణాల నుంచి చెప్పుకోవచ్చు. హక్కుల కోణం నుండి జవాబు చెప్పేప్రయత్నం ఈ ప్రచురణ. హక్కులనేవి మనిషిగా పుట్టిన ప్రతీ ఒక్కరికీ సహజంగా ఉంటాయనీ, సమానంగా ఉంటాయనీ హక్కుల దృక్పథం నమ్ముతుంది. మామూలు రాజకీయ పరిభాషలకు తరచుగా వినిపించే ఇతర భావనలు – దేశం, జాతి, అభివృద్ధి, ప్రగతి వగైరాలు – మనుషుల హక్కుల కంటే గొప్పని కావని నమ్ముతుంది. వీటన్నిటినీ హక్కుల తక్కెడలో తూచి వాటి ప్రాముఖ్యమెంతో, వాటి మంచి చెడులేమిటో, నిర్ణయిస్తుంది. ఈ ఆలోచనా ధోరణిని రాజకీయాలకు అన్వయించడం సులభమన్న భ్రమ పెట్టుకోకుండా, ఆ ప్రయత్నం అవసరం అని గుర్తిస్తుంది, దానిని ఆచరణాత్మకంగా చేపడుతుంది.

ఈ కోణం నుండి చూసినప్పుడు 'కశ్మీర్ సమస్య' ఏ విధంగా కనబడుతుంది? దాని చారిత్రక నేపథ్యం ఏమిటి? దాని వర్తమాన స్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు జవాబులను అన్వేషించే ప్రయత్నం ఈ ప్రచురణ.

1995 నుండి 2003 దాకా జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో పర్యటించిన అయిదు నిజనిర్ధారణ కమిటీలు ఇంగ్లీష్‌లో ప్రచురించిన నివేదికలను సంక్షిప్తంగా అనువదించి, క్రమానుగత కథనాన్ని అందించే ప్రయత్నం ఈ పుస్తకం. చారిత్రక నేపథ్యానికి సంబంధించిన సమాచారం మాత్రం పూర్తిగా నిజనిర్ధారణ కమిటీలు సేకరించినది కాదు. వివిధ చరిత్ర గ్రంథాలపైన, కశ్మీరీ బుద్ధిజీవులతో జరిపిన సంభాషణపైన ఆధారపడి రూపొందించడం జరిగింది. 1989లో మిలిటెన్సీ మొదలయిన తరువాత నడిచిన వర్తమాన చరిత్రకు సంబంధించిన సమాచారం చాలా వరకు బాధితులతోనూ, భాగస్వాములతోనూ,మాట్లాడి సేకరించినదే.

1947కు పూర్వపు చరిత్ర, 1947లో జమ్మూ కశ్మీర్ రెండుగా చీలి కొంత భారత్‌లో, కొంత పాకిస్తాన్‌లో భాగమైన వైనం, 1947 నుండి 1989 దాకా పార్లమెంటరీ రాజకీయ చట్టంలో వ్యక్తమైన 'కశ్మీర్ సమస్య'తో భారత పాలకులు వ్యవహరించిన తీరు, 1989లో మిలిటెన్సీ ఆవిర్భావానికి దారితీసిన సమీప పరిస్థితి, 1989 నుండి 1996 దాకా సైనిక పాలన అమలయిన వైనం, 1996లో పౌర పాలనను తిరిగి తీసుకొచ్చిన పద్ధతి, 2003లో మొట్ట మొదటిసారిగా ......నేషనల్ కాన్ఫరెన్స్ కాక మరొక పార్టీ జమ్మూ కశ్మీర్‌లో అధికారంలోకి రావడం ఈ విషయాలు, ఘటనలు హక్కుల కోణం నుండి చూసినప్పుడు ఏ విధంగా కనబడతాయో ఈ పుస్తకంలో చదువుతారు.

1995, 1996, 1997, 2001, 2003 సంవత్సరాలలో జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో పర్యటించిన అయిదు నిజనిర్ధారణ కమిటీలలోనూ, దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హక్కుల సంఘాలు పాల్గొన్నాయి. హక్కుల రంగంలో చురుకయిన పాత్ర నిర్వహిస్తున్న ప్రతీ సంఘమూ ఒక సంవత్సరం కాకుంటే మరొక సంవత్సరం నిజనిర్ధారణ బృందంలో

భాగమయింది. ఆ రకంగా చూసినప్పుడు ఈ ప్రచురణలోని అభిప్రాయాలు భారతదేశపు హక్కుల ఉద్యమం ఉమ్మడి అభిప్రాయాలుగా భావించవచ్చు.

ఇది నా పేరు మీద రావడానికి గల కారణం అనువాదం నేను చేసానన్నదొక్కటే కాదు. అయిదు నిజనిర్ధారణ కమిటీలలోనూ అప్పట్లో నేను బాధ్యునిగా ఉన్న హక్కుల సంఘం, (1998 కి పూర్వం ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం, ఆ తరువాత మానవ హక్కుల వేదిక) భాగస్వామిగా ఉంది. అన్ని కమిటీలలోనూ నేను వ్యక్తిగా పాల్గొన్నాను. అన్ని రిపోర్టుల తొలి ముసాయిదా నేను రూపొందించాను. అయినప్పటికీ ఇవి కేవలం నా అభిప్రాయాలు కావు.ఒక దశాబ్ద కాలం పైగా 'కశ్మీర్ సమస్య'ను హక్కుల కోణం నుంచి పరిశీలించి, దాని గురించి చర్చించి, ప్రజల్లో ప్రచారం చేసిన భారతదేశ హక్కుల ఉద్యమం, ఆ క్రమంలో రూపొందించుకున్న అభిప్రాయాలే.

16 సెప్టెంబర్, 2006

హైదరాబాద్

– కె.బాలగోపాల్

**కె. బాలగోపాల్**

# సంక్షిప్తంగా కశ్మీర్

**భౌగోళిక వివరాలు**

**విస్తీర్ణం :** కశ్మీర్ విస్తీర్ణం 84,471 చదరపు మైళ్ళు. అంటే ఇది విస్తీర్ణంలో ఇతర 95 స్వతంత్ర దేశాల కంటే పెద్దది. ఇందులో దాదాపు 63% భారతదేశ ఆధీనంలో ఉండగా, 37% పాకిస్తాన్ ఆధీనంలో ఉన్నది. (5% కంటే తక్కువగా ఉన్న 'ఆజాద్ కశ్మీర్'తో కలుపుకుని)

**భారతదేశ ఆధీనంలో ఉన్న ప్రాంతం : 50,513 చదరపు మైళ్ళు**

| | | |
|---|---|---|
| ఇందులో : | 1. లదాక్ | 33,740 చ.మైళ్ళు |
| | 2. కశ్మీర్ | 6,893 " |
| | 3. జమ్మూ | 9,880 " |

**పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న ప్రాంతం : 33,958 చదరపు మైళ్ళు**

ఇందులో : 1. గిల్‌గిట్ & బాల్టిస్తాన్ 29,814 చ.మైళ్ళు
2. ముజఫరాబాద్ & పూంచ్ లోయ 4,144 చ.మైళ్ళు

1962 లో భారతదేశంతో చైనా జరిపిన యుద్ధంలో 'అక్సై-చిన్ & లదాక్'లోని డెమ్‌చోక్ ప్రాంతాల వద్ద 1,971 చ.మైళ్ళ భారత ఆధీనంలోని కశ్మీర్ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నది.

1962 డిసెంబర్‌లో ఒప్పందం ద్వారా పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న కశ్మీర్‌లోని ఉత్తరప్రాంతం 'షెక్స్‌గామ్' వద్ద 1,868 చ.మైళ్ళ భూభాగాన్ని చైనా తీసుకున్నది.

**జనాభా సంగతులు**

కశ్మీర్ జనాభా 1 కోటి 30 లక్షలు (పాకిస్తాన్ వెళ్ళిపోయిన 15 లక్షలు మరియు ఇతర దేశాల్లో నివసిస్తున్న 5 లక్షల మందితో కలిపి)

1991లో కశ్మీర్ జనాభా 1 కోటి 16 లక్షలు. ఇందులో 73 లక్షల (63%) జనాభా భారత ఆధీనంలోని కశ్మీర్‌లో ఉండగా, 43 లక్షల (37%) జనాభా పాకిస్తాన్ ఆధీనంలోని కశ్మీర్‌లో ఉన్నది. ఈ లెక్కన విస్తీర్ణంలో ప్రపంచంలోని 109 ముఖ్యమైన దేశాల కంటే, జనాభాలో 114 ఐక్యరాజ్యసమితి సభ్యదేశాల కంటే కూడా కశ్మీర్ పెద్దది.

**మతాల వివరాలు**

**భారత ఆధీనంలోని కశ్మీర్‌లో (73 లక్షలు) – ముస్లింలు 64%, ఇతరులు 36%**

**కశ్మీర్ లోయలో :** (38 లక్షలు) – ముస్లింలు : 95%, ఇతరులు :5%

**పూంచ్, రాజౌరి & దోడాలో :** (11 లక్షల 80 వేలు)– ముస్లింలు 65%, ఇతరులు 35%

**జమ్మూ, కతువా & ఉదంపూర్‌లో** : (21 లక్షల 60 వేలు)– ముస్లింలు 10%, ఇతరులు 90%

**లే డివిజన్‌లో :** (80 వేలు) – ముస్లింలు 15%, ఇతరులు 85%

**కార్గిల్ డివిజన్‌లో :** (80 వేలు) – ముస్లింలు 78%, ఇతరులు 12%


**భాషలు :**

ఉర్దూ (అధికార భాష), కశ్మీరి (చాలా వరకు) భాషల్లో ఎక్కువ మంది ప్రజలు మాట్లాడుతుండగా, డోగ్రీ, హిందీ, దర్దీ, పహారీ వంటి ప్రాంతీయ భాషల్లో కూడా మాట్లాడుతారు.


**రాజధానులు :** భారత ఆధీనంలోని కశ్మీర్‌కు వేసవికాలంలో శ్రీనగర్, శీతాకాలంలో జమ్మూ రాజధాని నగరాలుగా ఉన్నాయి.




భయం నీడలో బాల్యం - ఏవైపో నీ పయనం : భారత్, పాకిస్తాన్‌ల మధ్య నలుగుతున్న కశ్మీర్‌లోని ఒక సరస్సులో పడవపై తండ్రీ, కూతురు.




జమ్మూ కశ్మీర్‌లో ముఖ్య మతాలు




జమ్మూ కశ్మీర్‌లో ఆక్రమణలు





వైవిధ్యంగా కనిపించే కశ్మీర్‌లోని ఓ ప్రాంతం.



కశ్మీర్‌ను పాలించిన రాజవంశీయుడు



హుక్కా పీలుస్తున్న కశ్మీర్ వృద్ధుడు



కశ్మీర్‌లో ప్రముఖంగా కనిపించే చినార్ చెట్లు.



వణుకు పుట్టించే సియాచిన్ పర్వతాల్లోనుండి భారత దళాలపైకి ఫిరంగులు
ఎక్కుపెడుతున్న పాకిస్తాన్ సైనికులు




శ్రీనగర్‌లో పెట్రోలింగ్ బాధ్యతల్ని నిర్వహిస్తున్న భారత
సరిహద్దు భద్రతా దళ (BSF) సైనికుడు




శోకసముద్రం : కశ్మీర్‌లో తరచూ కన్పించే దృశ్యం




కశ్మీరీల ప్రదర్శన




అభద్రతా భావంలో..... కశ్మీర్‌లో కనిపిస్తున్న ఓ వీధి



ఆశల ఒడిలో... కుంకుమ పూదోటలో పూలు సేకరిస్తున్న యువతి

# 1. చారిత్రక పూర్వరంగం

ప్రస్తుతం కశ్మీర్‌లో సాగుతున్న సాయుధ పోరాటం 1989 నుండి నడుస్తున్నదని సాధారణంగా భావిస్తూ వచ్చాం. నిజానికి ప్రాంతీయమైన, మతపరమైన సాంస్కృతికమైన సమస్యల మీద పోరాటాలు, ప్రజా ఉద్యమాలు కశ్మీర్‌లో కొత్తకాదు. కానీ ఒక పద్ధతి ప్రకారం ఆయుధాలు వినియోగించటం కొత్త విషయమే. 1989 వరకు కశ్మీరీలు పిరికివాళ్ళనీ, చేతకానివాళ్లనీ భావించేవారు. 1988లో బాంబులు వేసిన కొన్ని ఘటనలు జరిగాయి. ఒకటిరెండు సార్లు కాల్పులు జరిగాయి. అదే సంవత్సరం పాకిస్తాన్ నుండి సాయుధ మిలిటెంట్లు మొట్టమొదటిసారిగా కశ్మీర్ లోయలోకి వచ్చారని కూడా చెప్తారు. అయితే 1989 ఆగస్ట్ 21న నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు మహమ్మద్ యూసఫ్ హల్వాయిని, ఆ తర్వాత సెప్టెంబర్ 14న భారతీయ జనతా పార్టీ నాయకుడు టికాలాల్ టిప్లును, నవంబర్ 4న రిటైర్డ్ జిల్లా జడ్జి నీలకంఠ్ గంజూను చంపడంతో కశ్మీర్ లోయలో సాయుధ పోరాటం మొదలైందని చెప్పవచ్చు.

అయితే దానికి నేపథ్యంగా ఉన్న సమస్య మాత్రం జమ్మూ కశ్మీర్ రాష్ట్రం 1947లో భారత్‌లో విలీనమైన నాడే మొదలైంది. ఆ విలీనం జరిగిన సందర్భం, దానికి సంబంధించిన షరతులు, ప్రజామోదం పొందితేనే ఆ విలీనం పూర్తవుతుంది అన్న నియమం, జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తికి చోటు కల్పించిన ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో పొందుపరచడం, కశ్మీర్ సమస్య ఐక్యరాజ్యసమితి ముందుకు పోవడం, దానిమీద ఐక్యరాజ్యసమితి చేసిన లేక ఆమోదించిన తీర్మానాలు, ప్రత్యేకించి ప్రజామోదానికి సంబంధించిన తీర్మానాలు, ఆ తరువాత జరిగిన చరిత్ర, ప్రస్తుత పరిస్థితికి గల సామాజిక, రాజకీయ నేపథ్యం. ఈ కథ మరొక నాలుగు వందల సంవత్సరాలు వెనక్కి పోతుందని గ్రహించాలి.

ఒకనాటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని అత్యంత జనసాంద్రత కలిగినటువంటి, సారవంతమైనటువంటి భాగం కశ్మీర్‌లోయ. అది సాంస్కృతికంగా, జాతిపరంగా, భాషపరంగా ఏకీకృత ప్రాంతం. అక్కడ తొంబైశాతం మించి మతంరీత్యా ముస్లింలు. అరవై సంవత్సరాలకు పైగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైన ప్రాంతం కూడా కశ్మీర్ లోయే. ఇవ్వాళ ఈ లోయ స్వయం నిర్ణయాధికార పోరాటానికి వేదికగా ఉంది. ఇది చాలా సంక్లిష్టమైన పోరాటం. దానికి చాలా కోణాలున్నాయి. కాని దానికి కేంద్రమైనది కశ్మీరియత్ అని పిలువబడే ఒక చారిత్రక, సాంస్కృతిక గుర్తింపు. ఈ కశ్మీర్ గుర్తింపు స్వరూప స్వభావాన్ని అర్థం

చేసుకోకపోతే కశ్మీర్ సమస్య అర్థం కాదు. కశ్మీరీలు ఆచరించే ఇస్లాం కూడా స్థానిక ముస్లిం రుషులు ప్రచారం చేసిన కశ్మీరీ ఇస్లాం. వారిలో అత్యంత ప్రముఖుడు షేక్ నూరుద్దీన్. చరార్-ఎ-షరీఫ్‌లో ఉన్న అతని దర్గాను 1995 మే 10 నాడు ధ్వంసం చేసారు. సాయుధ మిలిటెన్సీని తొలిదశలో నడిపించిన జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఈ కశ్మీరియత్‌నే తన ప్రాపంచిక దృక్పథానికి పునాదిగా ప్రకటించుకుంది. తర్వాత కాలంలో సాంప్రదాయక ఇస్లామిక్ ప్రాపంచిక దృక్పథం కలిగిన హిజ్‌బుల్ ముజాహిదీన్, క్యాడర్ సంఖ్య రీత్యా ప్రధానమైన గ్రూపుగా ఎదిగింది. అయినప్పటికీ సాధారణ కశ్మీరీలు హిజ్‌బుల్ ముజాహిదీన్ చెప్పే రెండు జాతుల సిద్ధాంతం కంటే కశ్మీరీ గుర్తింపుకే ఎక్కువగా స్పందిస్తారు అనేది చాలామంది పరిశీలకుల అభిప్రాయం. కశ్మీరీలను మానసికంగా ఈ కశ్మీరీ గుర్తింపే బలంగా కదిలిస్తుంది. వారి స్వాతంత్ర్య ఆకాంక్షకు అదొక కేంద్రమనే విషయం కశ్మీరీలతో ఏ కొద్దిసేపు మాట్లాడినా స్పష్టమవుతుంది.

షేక్ అబ్దుల్లా బతికున్న రోజుల్లో కశ్మీర్ లోయలో అతనికి గల ప్రజాదరణ అసాధరణమైనదని అందరూ ఒప్పుకుంటారు. అతను ఈ కశ్మీరీ సంస్కృతిని గాఢంగా అభిమానించాడు. తన జీవితం చివరిదాకా దాన్నే తన ప్రాపంచిక దృక్పథంగా అంగీకరించాడు. ప్రజల్ని హిందూ, ముస్లిం అనే ప్రాతిపదిక మీద విభజించడాన్ని ఆయన తిరస్కరించాడు. జాతి గుర్తింపు, ఆర్థిక అవసరాలు అనే వాటికి అతీతమైన విభేదాలు మనుషుల మధ్య ఉంటాయని ఆయన ఒప్పుకోలేదు. అటువంటి కశ్మీర్ జాతీయవాదులకు కశ్మీర్ అణచివేత 1947లో చివరి పరిస్థితుల వత్తిడిలో ఆ రాష్ట్రాన్ని భారత్‌లో  భాగం చేసినపుడు మొదలుకాలేదు. 1846లో డోగ్రా పాలకుడు గులాబ్‌సింగ్ బ్రిటిష్ వాళ్ళ నుండి జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని పొందినపుడూ మొదలు కాలేదు. 1586లో అక్బర్ పాదుషా తన అధికారాన్ని కశ్మీర్ లోయ మీదికి వ్యాపింప చేసినప్పుడు మొదలైంది. కశ్మీరీ ముస్లింలది మతపరమైన భావజాలమని భారతదేశంలో చాలామంది నమ్ముతారు. కాని కశ్మీర్ లోయలోని ప్రధాన రాజకీయ భావజాలమైన కశ్మీరీ జాతీయవాదం తన చరిత్రను హిందూ దశ, ముస్లిం దశ అంటూ విభజించదు. ఈ ఉపఖండంలో దాదాపు అన్ని ప్రాంతాల వాళ్ళు కూడా ఉపఖండం చరిత్రను హిందూ దశ, ముస్లిం దశ అని విభజిస్తూ ఉంటారు. కాని కశ్మీరీలు ఆ విధంగా కాకుండా తన చరిత్రను కశ్మీరీ దశ, విదేశీ దశ అని విభజిస్తారు. ఈ విదేశీ దశ అక్బర్ పాదుషాతో మొదలై ఆఫ్ఘాన్, సిక్కు, డోగ్రా పాలకుల ద్వారా ప్రస్తుత లౌకిక భారత పరిపాలన దాకా విస్తరించింది.

కశ్మీర్ జనాభాలో తొంభై శాతం పైగా ముస్లింలు. వారు ఆచరించే ఇస్లాం స్థానిక సూఫీ సంప్రదాయం ప్రచారం చేసిన విశ్వాసం. ఆ సూఫీల పరంపరను సిల్సిలా-ఎ-రుషియాఁ అంటారు. వారిలో ఆద్యుడు షేక్ నూరుద్దీన్ (1379-1442). కశ్మీర్‌లోని అత్యల్ప సంఖ్యాకులైన హిందువులు షేక్ నూరుద్దీన్‌ను నూరుద్దీన్ రుషి అని లేక నంద్ రుషి అని పిలుచుకుంటారు. చాలా గొప్ప సాధువుగా, ద్రష్టగా ఆయనను గౌరవిస్తారు. చరిత్రకారులు ఏమంటారంటే, ఉపఖండంలో ఇస్లాంను వ్యాపింపజేయటంలో ముస్లిం

పాలకుల యొక్క అధికారం, వారు ఇచ్చిన పోషణ కంటే భక్తి, ఆధ్యాత్మికత, మానవత్వం, సహకారం మొదలైన సామాజిక విలువల ద్వారా ఇస్లాంను ప్రచారం చేసిన సూఫీలదే ప్రధానమైన పాత్ర. ఇది నిజానికి ఇతర ప్రాంతాల కంటే కశ్మీర్ విషయంలో మరింత సత్యమనిపిస్తుంది. దీర్ఘకాలం జరిగిన సాంస్కృతీకరణ ఆ లోయలోని అత్యధిక ప్రజానీకాన్ని ముస్లింలుగా మార్చిందే తప్ప మతమార్పిడులు వారిని మార్చలేదు. కశ్మీర్‌లో అంతకు ముందు శైవ సంప్రదాయానికి చెందిన సాధువులు, మహాయాన బౌద్ధ బిక్షువులు చాలామందే ఉన్నట్టున్నారు. ముస్లిం రుషులు అదే సంప్రదాయాన్ని ఖురాన్‌లోని అభిప్రాయాలు, భావాల ప్రాతిపదికన కొనసాగించారు. వీరు బ్రహ్మచర్యాన్ని, శాకాహారాన్ని పాటించారు. అవి ఇస్లాంకు విరుద్ధంగా భావించబడే విషయాలు కావడం వల్ల తరువాత కాలంలో సనాతన ముస్లింలు వారి అలవాట్లను సమర్థించడానికి ఇబ్బందిపడ్డారు. అయినప్పటికీ సనాతనేతర ముస్లిం సాధువుల ద్వారానే కశ్మీర్ లోయలో ఇస్లాం వ్యాపించింది. వారు తమను తాము రుషులుగా పిలుచుకున్నారు. వారి కథలను 'రుషినామాలు' అన్న పేరు మీద గ్రంథస్తం చేశారు. అయితే వారు సామాజిక పాత్రలో వారు హిందూ తపస్వుల కంటే బౌద్ధ బిక్షువులకే సన్నిహితులు. ఎందుకంటే వారు ఆత్మజ్ఞానాన్ని పొందటం లేదా ఆత్మావలోకనంతో పాటు సామాజిక చింతనను, సత్యాన్వేషణను కూడా చేర్చారు.

అక్బర్ కాలంలో కశ్మీర్‌కు వచ్చిన అబుల్‌ఫజల్ ఈ లోయలో రెండువేల మంది రుషులున్నట్టు గమనించారు. తాను రాసిన ఐనిఅక్బరీలో వారి గురించి ఈ విధంగా అన్నాడు. "ఈ రుషులు ఈ దేశంలో అందరికంటే గౌరవనీయులు. వారు సంప్రదాయాలకూ, సంప్రదాయక కట్టుబాట్లకూ అతీతులు, అయినప్పటికి వారే నిజమైన దైవభక్తులు. వారు పరమతస్తులను ఎప్పుడూ దూషించరు, చెడ్డగా మాట్లాడరు. వారు అడుక్కోరు. వారు ఎప్పుడు కూడా ప్రయోజనకరమైన పద్ధతిలో జీవిస్తారు. చెట్లునాటుతూ ఉంటారు" అని అన్నాడు. పైన చెప్పినట్టు మతాన్ని మానవీయమైన స్థాయిలో ప్రచారం చేసిన సాధువులు లేదా బిక్షువులు హిందూ సాంప్రదాయంలో కానివ్వండి, ముస్లిం సంప్రదాయంలో కానివ్వండి ఒక కశ్మీర్‌లోనే కాదు బయట కూడా ఉన్నారు. వీరు ప్రచారం చేసిన మతం సాధారణంగా సనాతన పురోహితులు, పూజారుల పట్ల చాలా విమర్శనాత్మకంగా ఉంటుంది. షేక్ నూరుద్దీన్ ఉలేమాల విషయంలో అదే విధంగా ఉండేవాడు. అతని పూర్వీకురాలైన శైవ సాధ్వి లల్లామాజి బ్రాహ్మణుల విషయంలో అదే విధంగా ఉండేది. కశ్మీర్ విశ్వ విద్యాలయంలో ఇంగ్లీష్ ప్రొఫెసర్ అయిన జి.ఆర్. మల్లిక్ ఈ విధంగా అంటారు. "నంద్‌రుషిగా పిలువబడిన షేక్ నూరుద్దీన్ మా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం గల వ్యక్తి. కశ్మీరీ జీవితంపైన, సంస్కృతిపైన అతనికి అపారమైన ప్రభావం ఉండింది. కశ్మీరీ ప్రజానీకంలో ఇంతటి ప్రజాదరణ పొందిన వ్యక్తి వేరే ఎవరు లేరు అంటే అతిశయోక్తి కాబోదు. కశ్మీర్ నేల ప్రతి అంగుళం మీద కూడా అతని పేరు రచించి ఉంటుంది." కశ్మీరీలకు అతను "ఆలందార్–ఇ–కశ్మీర్", అంటే

జాతికి వైతాళికుడు. మనం, భారతీయులం, గ్రహించవలసిన విషయం ఏమిటంటే చరార్–ఇ–షరీఫ్‌లో భారతసైన్యం యొక్క అతి చర్యల వల్ల తగలబడి ధ్వంసమైన దర్గా ఈ కశ్మీరీ జాతి నాయకుడి దర్గా. ఇతని ప్రజాదరణ ఎంతటిదంటే ఆఫ్ఘాన్‌లు పరిపాలిస్తున్న కాలంలో (18వ శతాబ్దంలో) కశ్మీర్ గవర్నర్ తనను తాను కాబూల్‌లోని ప్రభుత్వం నుంచి స్వతంత్రంగా ప్రకటించుకోవాలి అనుకున్నపుడు 'నంద్‌రుషి' పేరు మీద నాణాలు ముద్రించి ప్రజాదరణ పొందాలని ప్రయత్నం చేశాడు. మరొక చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ సంప్రదాయానికి చెందిన ప్రచారకుల్లో స్త్రీలు కూడా ఉండేవారు. ఇది కూడా సనాతన ఇస్లాంలో అసాధారణమైన విషయమే. బేహాత్ బీబీ, దేహాత్ బీబీ, శంగా బీబీ, దేతా బీబీ, సలా బీబీ, శాందేడ్ అనేవాళ్ళు నూరుద్దీన్ శిష్యురాళ్ళు. ఆ తర్వాత కాలంలో ఇదే సంప్రదాయంలో సంఘా బీబీ, గంగా బీబీ అనే సాధ్వీలు కూడా ఉండేవారు.

ఉపఖండం అంతటా కూడా హైందవ సామాజిక వ్యవస్థలోని దిగువ కులాలకు బౌద్ధం, సిక్కు మతం, ఇస్లాంలు ఆకర్షణీయంగా కనబడడానికి గల ఒక కారణం ఆ మతాలలోని సమానత్వం. షేక్ నూరుద్దీన్ తన ప్రవచనాల్లో బ్రాహ్మణులను, కులవ్యవస్థను తీవ్రంగా విమర్శిస్తాడు. విముక్తికి ఇస్లాం ఒక మార్గమని చూపిస్తాడు. ఒక పద్యంలో అతను ఇలా అంటాడు – "తన కులం గొప్పది అని చెప్పుకునేవాడు మతిలేనివాడు, బుద్ధిలేనివాడు. ఇక్కడ మంచికి మాత్రమే వారసత్వముంది. రాబోయే యుగంలో కులమనేది ఉండదు నువ్వు ఇస్లాం సారాన్ని గ్రహించినట్టయితే నీకంటె పరిశుద్ధులు వేరెవరు ఉండరు." షేక్ నూరుద్దీన్ ప్రచారం చేసిన ఇస్లాం ఒక నైతిక వ్యవస్థ. క్షమ, దయ, సహనం, దాతృత్వం, విషయం, మన శ్రమ మీదే మనం జీవించడం అనే గుణాలు నిజమైన ముస్లిం లక్షణాలుగా చెప్పాడు. ప్రతీకార పూర్వకమైన న్యాయాన్ని కాకుండా క్షమను, దయను నూరుద్దీన్ ప్రచారం చేశాడు. మరొక రెండు వాక్యాలు : "నా కోసం అన్ని చోట్ల స్నేహబీజాలు నాటు. నా శత్రువులను కూడా సంహరించవద్దు". నూరుద్దీన్‌కు మత విలువలను కాదని బ్రతికే ముస్లిం పూజారులంటే చాలా అసహ్యంగా ఉండేది. ఉలేమాలను, వారి ద్వంద్వ వైఖరిని, అహంకారాన్ని ధనాశను ఆయన తీవ్రంగా విమర్శించాడు. ఉలేమా కన్పిస్తే అల్లా శరణుజొచ్చు అని తన అనుయాయులకు ఆయన బోధించాడు."

1890లో కాశ్మీర్ గురించి ఒక రిపోర్ట్ రాసిన బ్రిటిష్‌ల్యాండ్ సెటిల్‌మెంట్ కమీషనర్ "ఇస్లాంను, హిందూమతాన్ని ఆచరించే వాళ్ల మధ్య ఒక సంతోషకరమైన పరస్పర సహనముంది కశ్మీర్‌లో" అని అన్నాడు. బ్రాహ్మణ మతాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన శైవ సాధ్వి లల్లామాజి ఈనాటి కశ్మీరి ముస్లింల చేత ఒక గొప్ప సాధ్విగా గుర్తించబడుతున్నది. ఆమెను లాల్‌దేడ్ అంటారు. షేక్ నూరుద్దీన్ ఆమె దగ్గర పాలు

తాగాడని అంటారు. నూరుద్దీన్ ఆమెనొక అవతారంగా భావించాడు. కశ్మీరీలు ఈ సాధువుల దర్గాలలో ఆచరించే మత సంప్రదాయాలలో హైందవ చిహ్నాలు, రూపాలు మెండుగా కన్పిస్తాయి. ఈ సాధువుల భౌతిక చిహ్నాలను దర్గాలల్లో భద్రపరచడం (ఉదాహరణకు హజ్రత్‌బల్‌లో ఉన్న ప్రవక్త మహమ్మద్ వెంట్రుక), అట్లాగే పుణ్యగ్రంథాలను, పవిత్ర గ్రంథాలను పాటల రూపంలో చదవడం, చేతులు జోడించి ప్రార్థించడం ఇవన్నీ కూడా ఇస్లాంకు పూర్వపు సంప్రదాయాలుగా గుర్తించబడతాయి. అవన్నీ పూర్వకాలం నుండి కశ్మీరీ ఇస్లామిక్ సంస్కృతిలో వచ్చాయని చరిత్రకారులు భావిస్తారు.

నిజానికి మసీదులే కాకుండా జియారత్‌లు (దర్గాలు) అనేవి ఉండడమే ఒక సంప్రదాయేతర లక్షణమని సనాతన వాదులు భావిస్తారు.

కశ్మీర్ లోయలో ఈ ప్రత్యేకమైన కశ్మీరీ లక్షణం కలిగిన ఇస్లామిక్ సంప్రదాయాన్ని వ్యతిరేకించిన సనాతన సంప్రదాయం కూడా ఉంది. అది కశ్మీరీలు పాటించిన ఇస్లాంను సనాతన రూపంలో తిరగరాయడానికి ప్రయత్నం చేస్తూ ఉంటుంది. దోడా జిల్లాకు చెందిన భదర్వా నివాసి అయిన ఒక న్యాయవాది ఈ విధంగా అంటాడు – " ఇది సాధువుల దర్గాల మీద నమ్మకం ఉండేవాళ్ళకు, లేనివాళ్ళకు మధ్య పోరాటం. రెండో వర్గానికి చెందిన వాళ్ళకు ఒకప్పుడు, 19వ శతాబ్దం చివరి భాగంలో, అహల్–ఇ–హదిత్ ప్రతినిధిగా ఉండేది. తర్వాతి కాలంలో జమాతె ఇస్లామీ ప్రతినిధి అయ్యింది. వీరు కశ్మీరీ ఇస్లాంలోని సనాతనేతర సంప్రదాయాలను తొలగించడానికి గట్టి కృషి చేస్తూనే ఉన్నారు." ఇది సరైనదా కాదా అనేది ప్రస్తుతం మనకు అనవసరం కానీ ఏది ప్రస్తుతం అంటే, కశ్మీరీ ఇస్లాంకూ సనాతన ఇస్లాంకూ మధ్యన ఉన్న తేడా అక్కడి ప్రజలు తమ భవిష్యత్ గురించి చేసే ఆలోచనల్లో కూడా ప్రతిఫలిస్తుంది. అదే న్యాయవాది అన్నట్టు "దర్గాల మీద విశ్వాసమున్నవారు స్వతంత్ర కశ్మీరును కోరుకుంటారు. దర్గాల మీద విశ్వాసం లేనివారు పాకిస్తాన్‌లో చేరాలని కోరుకుంటారు." అయితే భారతదేశంలో ఉండాలని మాత్రం ఎవరికీ కోరిక లేదు.

జమాతె ఇస్లామీ కశ్మీర్‌లోయ అంతటా పాఠశాల నెలకొలిపి యువకులను తన ప్రాపంచిక దృక్పథానికి అనుగుణంగా తయారు చేయడానికి ప్రయత్నం చేసింది అనేది అందరూ ఒప్పుకునే విషయమే. అయితే దీంట్లో ఎంతవరకు విజయం సాధించింది అనేది వివాదాస్పదం. ఉదార దృక్పథం ఉన్నవారితో మాట్లాడితే మనకేమనిపిస్తుందంటే జమాతె ఇస్లామీ కశ్మీర్ సంస్కృతిని తన అదుపులోకి తెచ్చుకోవడానికి చాలా ప్రయత్నం చేసినప్పటికీ ఏమంత గొప్ప విజయం సాధించలేదు. తద్విరుద్ధంగా మతవాదులే దర్గాలతో రాజీపడక తప్పలేదని ఒక పరిశీలకుడు అంటాడు. వారి నాయకుల్లో ఒకడైన సయ్యద్ ఆలీషా గిలానీ దర్గాల్లో జరిగే ప్రార్థనలను నిరసిస్తూనే చాలా ప్రజాదరణ కలిగిన హజరత్ బల్ వంటి దర్గాలలో జరిగే మీటింగులకు హాజరై ఉపన్యాసాలిస్తాడు.

నిజానికి మతవాదులు సాధించిన విజయం 20 శాతం కూడా ఉండదు అని అదే పరిశీలకుడు అంటాడు. అయితే వారు బలంగా కన్పించడానికి కారణం పాకిస్తాన్ మద్దతు ఉన్న హిజ్‌బుల్ ముజాహిదీన్ తుపాకులు వారి వెనుక ఉండడమే. అంతేకాక భారత ప్రభుత్వం కశ్మీర్ పోరాటానికి ప్రతినిధులుగా సెక్యులర్ కశ్మీరీ జాతీయవాదులను గాక ఈ మతవాదులనే చూపించడం కూడా కారణం కావచ్చు. ఎందుకంటే తాను కశ్మీర్ లోయలో కశ్మీరీ జాతీయవాదంతో పోరాటం చేయడంలేదనీ ముస్లిం మతవాదంతో పోరాటం చేస్తున్నాననీ చెప్పుకోవటం భారత్‌కు అనుకూలంగా ఉంటుంది. మరొక పరిశీలకుడి అభిప్రాయం ప్రకారం జమాతే ఇస్లామీకి పెద్దలతరంలో బలముంది తప్ప యువతరంలో లేదు. అయితే ఇదంతా కూడా కశ్మీరీలకు తమ భవిష్యత్తును నిర్ణయించుకునే స్వయం నిర్ణయాధికారం ఉందా లేదా అన్న విషయం అప్రస్తుతం. కశ్మీరియత్ యొక్క సహన, సహకార, మానవీయ సంప్రదాయాలను అభినందించడానికి కారణం వారికి తమ భవిష్యత్ నిర్ణయించుకునే స్వేచ్ఛ ఇవ్వమని వాదించడానికి కాదు. కశ్మీర్ సంస్కృతిని మెచ్చుకుంటున్నామంటే, కశ్మీరీ సమాజం భవితవ్యానికి అది చేయగల మేలు దానికి కారణం. భారతదేశంలో ఉన్నా లేకున్నా కశ్మీర్ సమాజానికి అది మేలు చేస్తుంది. ఇక స్వయం నిర్ణయాధికారం మాటకు వస్తే వారు కోరుకునేది సెక్యులర్ స్వతంత్ర కశ్మీర్ అయినా, పాకిస్తాన్‌లో విలీనమైనా ఆ హక్కు ఒక గుర్తింపు పొందిన రాజకీయ హక్కే.

కశ్మీరీ సంప్రదాయంలోని సెక్యులర్ మానవతావాద కోణం జమ్మూ కశ్మీర్‌ను భారతదేశంలో కలిపేసుకోవడానికి ఉపయోగపడుతుంది కాబట్టి దీనికి మనం విలువనివ్వాలి అనే వైఖరి ఒకటి భారతదేశంలో ఉంది. దీన్ని మనం తిరస్కరించాలి. ఆ సంప్రదాయం దానంతటదే విలువైనది. అందుకోసం మనం ఆహ్వానించాలి. అది భారతదేశంలోకి జమ్మూకశ్మీర్‌ను తీసుకు రావడానికి ఉపయోగపడినా ఉపయోగపడకపోయినా దాని విలువ దానిదే.

## కశ్మీరీ జాతీయోద్యమ చరిత్ర

ఒక పూర్వ నేషనల్ కాన్ఫరెన్స్ మంత్రి అన్నట్టు ఉపఖండం మొత్తం పరాయి పాలన మీద పోరాటం చేస్తున్నప్పుడు కశ్మీరీలు డోగ్రా మహారాజు మీద పోరాటం చేస్తున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రం విభిన్న జాతులు, మతాలు, భాషలు నైసర్గిక స్వరూపాలు కలిగిన ప్రాంతాల సమాహారం. అక్కడ కనీసం 12 భాషలు మాట్లాడుతారు. ప్రధానమైనవి కశ్మీరీ, డోగ్రీ, పహాడీ, లదాఖీ, ఉర్దూ. ఇవ్వాళ జమ్మూ కశ్మీర్ రెండుగా విభజించబడి ఉంది. ఒక భాగం భారత్‌లో, ఒక భాగం పాకిస్తాన్‌లో ఉన్నాయి. భారత్‌లో ఉన్నదాన్ని మనం జమ్మూ కశ్మీర్ రాష్ట్రం అంటాము. పాకిస్తాన్‌లో ఉన్నదానిని ఆజాద్ కశ్మీర్

అంటుంది. మనం పాక్ ఆక్రమిత కశ్మీర్ అంటాము. గిల్‌గిట్ ఉత్తర భాగం కూడా పాకిస్తాన్‌లోనే ఉంది. భారతదేశంలోని జమ్మూ కశ్మీర్‌లో జమ్మూ డివిజన్ (అందులో ఆరు జిల్లాలు) కశ్మీర్ డివిజన్ (అందులో ఆరు జిల్లాలు) లదాక్ డివిజన్ (అందులో రెండు జిల్లాలు) ఉన్నాయి. పాకిస్తాన్‌లోని జమ్మూకశ్మీర్‌లో మీర్‌పుర్ డివిజన్ (అందులో మూడు జిల్లాలు) ముజఫరాబాద్ డివిజన్, (అందులో రెండు జిల్లాలు) ఉన్నాయి. పాకిస్తాన్‌లో కేంద్ర పాలనలో ఉన్న గిల్‌గిట్ ఉత్తర కొసన ఉంది. దేశ విభజన కాలంలో అప్పటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో 77 శాతం ముస్లింలు. రాష్ట్రం మొత్తం మీదనే కాదు. పైన పేర్కొన్న ప్రతి డివిజన్‌లో కూడా ముస్లింలే మెజారిటీ – ఒక లదాక్ మినహాయిస్తే, లదాక్‌లో మాత్రం బౌద్ధులు, ముస్లింలు దాదాపు సమానంగా ఉండేవారు. కానీ ఆ రాజ్య పాలకుడు హిందువు. అతడు మహరాజు హరీసింగ్. 1846 నుండి జమ్మూ కశ్మీర్‌ను పరిపాలించిన ఒక డోగ్రా రాజ వంశానికి వారసుడు. ఈ రాజవంశం చాలా క్రూరమైనది. అణచివేత స్వభావం కలిగినది. వారి గురించి చెప్పే కొన్ని కథలు వింటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అయితే వారు బహుశా వారి పూర్వీకులైన సిక్కు, అఫ్ఘాన్, మొగల్ పాలకులకంటె మరీ భిన్నమైన వారు కాకపోవచ్చు. ఈ రాజవంశానికి పూర్వీకుడైన గులాబ్‌సింగ్‌కు లాహోర్ సిక్కు పాలకుడైన మహారాజ రంజిత్‌సింగ్ జమ్మూను ఒక జాగీర్‌గా ఇచ్చాడు. అతను రంజిత్‌సింగ్ సైన్యంలో ఒక హోదాలో ఉండేవాడు. తర్వాత కాలంలో అతను రంజిత్‌సింగ్ రాజధాని అయిన లాహోర్‌లో ప్రముఖ స్థానాన్ని చేరుకున్నాడు. బ్రిటిష్‌వాళ్ళు రంజిత్‌సింగ్ మీద యుద్ధం చేసినప్పుడు గులాబ్‌సింగ్ బ్రిటిష్ వాళ్ళకు సహకరించి ఆంగ్లో – సిక్ యుద్ధంలో సిక్కుల ఓటమికి తోడ్పడ్డాడు. ఈ కపట సేవకు గుర్తింపుగా బ్రిటిష్‌వాళ్ళు జమ్మూ కశ్మీర్‌ను గులాబ్‌సింగ్‌కు అమృత్‌సర్ ఒప్పదం ప్రకారం 1846లో అప్పగించారు. డెబ్బయి అయిదు లక్షల రూపాయలు, ప్రతి సంవత్సరం 12 పాశ్మీనా గొర్రెలు, ఒక గుర్రం, మూడు కశ్మీరీ ఉన్ని దుప్పట్లు దీనికి బదులుగా గులాబ్‌సింగ్ బ్రిటిష్ వాళ్ళకు ఇచ్చాడు. తర్వాత కాలంలో కశ్మీరీ జాతీయవాదులు దీన్ని ఒక అమ్మకం అన్నారు. పైగా అల్లమా ఇక్బాల్ అన్నట్లు అది చాలా చవక బేరం.

అయితే కశ్మీరీలు పరాయిపాలనను 1586లో ప్రారంభమైన అక్బర్ పాలనతో మొదలుపెట్టి లెక్కిస్తారు. వారి దృష్టిలో వారి దేశం మొగల్‌ల నుంచి ఆఫ్ఘాన్లకు, ఆఫ్ఘాన్ల నుంచి సిక్కులకు, ఇప్పుడు డోగ్రాల చేతుల్లోకి పోయింది. మొగల్ కాలం నుంచి కూడా కశ్మీరీలు నియంతృత్వ పాలన కింద అణచివేతకు గురౌతున్నారు. ఆ పాలన ముస్లిం పాలన కావచ్చు, సిక్కు పాలన కావచ్చు, హిందూ పాలన కావచ్చు. అందరూ పన్నులు విపరీతంగా వసూలు చేసేవారు. గులాబ్‌సింగ్ పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పీల్చేవాడని అంటారు. 1940లలో ఒక బ్రిటీష్ సామాజిక సేవకుడు హరీసింగ్ ప్రభుత్వాన్ని గురించి చెబుతూ ప్రతి ఇంటికి, ప్రతి కిటికీకి, ప్రతి ఆవుకు, ప్రతి గొర్రెకు, ప్రతి భార్యకు కూడా పన్ను ఉండేది అంటాడు. ఇదంతా చాలక ఈ వసూలు యంత్రాంగాన్ని

నడపడానికి అవసరమైన ఖర్చు కోసం 'జైల్‌దారి' పన్ను కూడా వసూలు చేసేవారు. అధికారానికి వ్యతిరేకంగా ఏ తిరుగుబాటు చెలరేగినా కూడా గులాబ్‌సింగ్ చాలా వేగంగా, క్రూరంగా అణచివేసేవాడు. 'పూంచ్' ప్రాంతంలోని కొంతమంది తిరుగుబాటుదార్లను సజీవంగానే చర్మం వొలిచి గడ్డికుక్కి రోడ్డుపక్కన దిష్టిబొమ్మల్లాగ నిలబెట్టాడనీ, ఇతరులకు ఒక ఉదాహరణగా వారిని చూపించడానికి ఈ శిక్షవేశాడనీ అంటారు. అతని కొడుకు 'రణవీర్‌సింగ్' తిండిలేక ఆకలితో మాడుతున్న ముస్లింలు మరీ ఎక్కువగా బ్రిటీష్ వాళ్ళకు కన్పించకుండా ఉండేందుకు పడవల్లో తీసుకెళ్ళి నదిలో వాళ్ళను ముంచాడు అని కూడా అంటారు.

కశ్మీర్ లోయలో అత్యధిక ప్రజలు ముస్లింలు. 1947లో వీరి జనాభా 93 శాతం. అయితే జమ్మూ కశ్మీర్ రాజధాని జమ్మూ. అది డోగ్రా ప్రజలు నివసించే ప్రాంతం. ఆ కారణంగా రాజ్యంలోని ప్రధానమైన పదవులు క్రమంగా డోగ్రా పెత్తందారీ వర్గాల చేతుల్లోకి పోయాయి. లోయలో అతి స్వల్ప సంఖ్యలో ఉన్న హిందు అల్పసంఖ్యాకులైన పండిట్లు ఉన్న కొద్దిపాటి తెల్లబట్టల ఉద్యోగాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే రాజ్యంలోని అధికార యంత్రాంగమంతా కూడా ప్రధానంగా డోగ్రా రాజ్‌పుత్‌ల చేతుల్లో ఉండడం వల్ల పండిట్లు కూడా పూర్తిగా సంతృప్తిగా లేరు. తమకు కశ్మీర్‌లో మరింత పాలనాధికారం కావాలని పండిట్లు కూడా ఆందోళన చేశారు. పండిట్లలో చాలామందికి భూములు పల్లెల్లో, నివాసాలు పట్టణాల్లో వుండేవి. వీరిలో చెప్పుకోదగ్గ సంఖ్యలో రైతులు కూడా ఉన్నారు. కాని లోయలో ఉన్న ముస్లింలలో కొద్దిమంది జాగీర్‌దార్లను మినహాయిస్తే మిగిలిన వారు తీవ్రమైన నిర్లక్ష్యానికి, అణచివేతకు గురయ్యేవారు. వారిలో అత్యధికులు పేదవారు మాత్రమే కాక, మధ్యతరగతి కూడా – హిందూ పరిపాలనలో వివక్షను ఎదుర్కున్నారు. మహారాజాకు విదేశీ, రాజకీయ సలహాదారుగా ఉన్న సర్ ఆల్బియన్ బెనర్జీ 1929లో తన పదవికి రాజీనామా చేస్తూ, ఇక్కడ అతిపెద్ద సంఖ్యలో ఉన్న ముస్లిం జనాభా దాదాపు పూర్తి నిరక్షరాస్యులుగా, పేదలుగా, నోరులేని పశువుల్లాగా జీవిస్తున్నారు అని ప్రకటించాడు. వారు కూలీలు, కౌలు రైతులు, చేతివృత్తులవారు. వారు ఎదుర్కున్న అణచివేతకు ఒక బలమైన సంకేతంగా శ్రీనగర్‌లో 1924లో ప్రభుత్వం యాజమాన్యంలో నడిచిన ఒక పట్టు పరిశ్రమ దాదాపు 5 వేల మంది (దాదాపు అందరూ ముస్లింలే) కార్మికులు సమ్మె చేశారు.

అయితే 'ఈ పశువులు' మూగగా ఉండిపోలేదు. బెనర్జీ ఇచ్చిన ప్రకటనను పత్రికల్లో చూసి దానిని విమర్శించిన ముస్లిం పెద్దలను వ్యతిరేకిస్తూ సంపాదకునికి లేఖ రాసిన ఒక కశ్మీరీ ముస్లిం యువకుడు షేక్ మహమ్మద్ అబ్దుల్లా. అతనప్పుడు అలిఘర్ ముస్లిం యూనివర్సిటీలో కెమిస్ట్రీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు. తర్వాతి కాలంలో అతను శ్రీనగర్‌లో ఒక స్కూల్లో సైన్స్ అధ్యాపకునిగా ఉద్యోగం సంపాదించుకున్నాడు. కాని అది ఎక్కువ కాలం నిలువలేదు. త్వరలోనే అతను ఇతర విద్యావంతులైన ముస్లిం యువకులతో కలిసి మహారాజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కశ్మీరీల నిరసనను సంఘటితం

చేయసాగాడు. మసీదుల్లోనూ ఇతర బహిరంగ ప్రదేశాల్లోనూ సభలు, సమావేశాలు నిర్వహించడం, అణచివేతకు గురౌతున్న ముస్లింల సమస్యల గురించి ఆందోళన చేయడం, ముస్లింల పట్ల వివక్షను అంతం చేయవలసిందిగా మహారాజుకు అర్జీలు పెట్టడం అతని కార్యక్రమంగా ఉండింది.

1931 జులై 13వ తేది ఇప్పటికీ కశ్మీరీలు తమ జాతీయోద్యమంలో ఒక మైలురాయిగా గుర్తుంచుకునే దినం. ఆనాడు జరిగిన ఘటనలను షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాలలో భారత స్వాతంత్ర్య పోరాటంలో జలియన్‌వాలాబాగ్‌తో పోల్చదగ్గవిగా పేర్కొన్నాడు. ముస్లింల సమస్యలను, వారి అర్జీలను వినడానికి మహారాజు ఒప్పుకున్నాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మహారాజును కలవడానికి ప్రతినిధి బృందాలను ఎంపిక చేయడం జరుగుతున్నది. కశ్మీర్ లోయనుంచి ఎంపికైన ఏడుగురిలో షేక్ అబ్దుల్లా కూడా ఉన్నాడు. అప్పట్లో ముస్లింల మతభావాలను కించపరిచిన కొన్ని ఘటనలు ముస్లింలలోని అసంతృప్తికి ప్రధానమైన కారణం. ఒక పక్క మహారాజుతో మాట్లాడే ప్రయత్నం జరుగుతుండగా అబ్దుల్ ఖదీర్ అనే వ్యక్తి 1931 జూన్ 21వ తేదీన ఒక నిరసన సభలో ఒక ఉపన్యాసం ఇచ్చాడు. ఆ ఉపన్యాసాన్ని అధికారులు రాజద్రోహ పూరితమైనదిగా భావించారు. అతనిని అరెస్టు చేశారు. జూలై 6వ తేదిన విచారణ మొదలు కావల్సి ఉండింది. కాని ఆ రోజున ప్రజలు పెద్ద సంఖ్యలో విచారణ స్థలం దగ్గర కూడి అడ్డుపడేసరికి విచారణను శ్రీనగర్ సెంట్రల్ జైలుకు తరలించి జూలై 13న ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు. ఆ రోజు విచారణ ప్రారంభం కావలసి ఉండగా ప్రజలు పెద్ద సంఖ్యలో బలవంతంగా జైల్లోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. పోలీసు బలగాలతో గవర్నర్ అక్కడికి రాగా ప్రజలు రాళ్ళు వేశారు. గవర్నర్ కాల్పులు జరపమని ఆదేశించాడు. 22 మంది ఆ కాల్పుల్లో చనిపోయారు. మృతదేహాలను ఖన్‌కా–ఇ–నక్షబందియా ప్రాంతంలో ఖననం చేశారు. అప్పటి నుంచి జూలై 13వ తేది కశ్మీర్‌లో అమరవీరుల దినంగా గుర్తించబడుతుంది.

ఇక్కడ గుర్తించవలసిన విషయం ఏమిటంటే కశ్మీరీల అవగాహనలో వారి పోరాటం ఏక సమయంలో ఒక అణచివేత స్వభావం కలిగిన, నియంతృత్వ పూరకమైన భూస్వామ్య ప్రభుత్వానికి వ్యతిరేకమైన పోరాటం. అదే సమయంలో హిందూ మతస్తుల అదుపులో ఉన్న ప్రభుత్వం మెజారిటీ అయిన ముస్లిం ప్రజల మీద అమలు చేసిన వివక్షకు వ్యతిరేకమైన పోరాటం. కానీ అన్నింటినీ మించి పరాయి పాలనకు వ్యతిరేకంగా జరిగిన కశ్మీరీల పోరాటం. వారి అవగాహనలో కీలమైన అంశం, అణచివేత స్వభావం గల విదేశీ పాలన నుండి విముక్తి కావాలన్న ఆకాంక్ష. కశ్మీరీ ప్రజానీకం యొక్క రాజకీయ ఆకాంక్షలోని ఈ కోణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోకపోతే మనకు 'కశ్మీర్ సమస్య' గురించి ఏమీ అర్థంకాదు. మొదటి నుంచి కూడా ఈ ఆకాంక్ష నిర్ధిష్టమైన ముస్లిం ప్రజానీకపు కోరికలతో ముడిపడి ఉండడం, ఆ ఉద్యమం బహిరంగ ప్రదేశాల నుండే కాక మసీదుల వంటి మత ప్రదేశాల వరకూ సాగడం వాస్తవమే కానీ ప్రాథమికంగా వారి పోరాటం

కశ్మీరీ జాతీయ వాద పోరాటమనేది మనం గుర్తించాల్సిన సత్యం. ఈ పోరాటం నాయకత్వంలో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తులు, ప్రత్యేకించి షేక్ మహమ్మద్ అబ్దుల్లా, మొదటి నుంచి కూడా తమది మతపరమైన పోరాటం కాదని స్పష్టం చేస్తూ వచ్చారు. కశ్మీర్ పండిట్‌లల్లో చాలామంది మతపరంగా స్పందించటం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశాడు. అబ్దుల్లా నాస్తికుడు కాదు. ఆయన ఇస్లాం మతాన్ని విశ్వసించేవాడు, ఆచరించేవాడు. ఆ మతం పట్ల ఆయనకు భావోద్వేగం కూడా ఉండేది. అయినప్పటికీ అతను, అతని సహచరులు హిందూ పాలకులు ముస్లిం మెజారిటీ ప్రజలపైన చూపించిన వివక్ష పట్ల నిరసనతో కశ్మీరీ ప్రజల స్వాతంత్ర ఆకాంక్షను ఏ ఇబ్బందీ లేకుండా మతం నుంచి వేరు చేశారు.

## కాన్ఫరెన్స్ కథ

19వ శతాబ్దంలో ముస్లింలపైన అమలైన వివక్ష పట్ల నిరసనను వివిధ సనాతన వాద అంజుమన్లు చేపట్టాయి. ఈ అంజుమన్లు తరువాతి కాలపు నాయకత్వం కంటే కూడా మరింత తీవ్రమైన మత దృక్పథాన్ని కలిగి ఉన్నాయి. నిరసన ఉద్యమంతో పాటు వారు సనాతన ముస్లిం సంప్రదాయంలో భాగంగా విద్యావ్యాప్తి చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సనాతన వాద ముస్లిం నిరసన, సంస్కరణ, ఉద్యమం యొక్క తొలి నాయకుల్లో ఒకడు కశ్మీర్ మీర్‌వైజ్* అయిన మౌల్వీ అహ్మదుల్లా షా. అతని మేనల్లుడు యూసూఫ్ షా తరువాతి కాలంలో మీర్‌వైజ్ అయ్యాడు. కశ్మీర్ లోయలో ముస్లిం రాజకీయాల్లోని సనాతన సంప్రదాయానికి ఒక ప్రతినిధిగా ఉన్నాడు. అయితే మరింత ఎక్కువగా ప్రజాదరణ కలిగిన సంప్రదాయం షేక్ అబ్దుల్లా వంటి వ్యక్తుల నాయకత్వంలో ఎదిగిన సెక్యులర్ కశ్మీరీ జాతీయవాద సంప్రదాయం. పైన పేర్కొన్న పరిస్థితుల్లో మెజారిటీ ప్రజలైన ముస్లింలు, రాజ్య పాలకులు హిందువులు కావడం, స్థానిక అధికార గణంలో అత్యధికం కశ్మీరీ పండిట్లుండటం, తమ సమస్యలన్నిటికీ కారణం అని భావించడం ఏమంత ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. పండిట్లలో చాలామంది కూడా రాజ్యంతో మమేకమై, కశ్మీరీ పండిట్ కాన్ఫరెన్స్ అనే సంస్థలో సంఘటితమై మెజారిటీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయడం మొదలుపెట్టారు. 1930ల తొలి రోజుల్లో దీని ఫలితంగా మతపరమైన విద్వేషాలు కొంతమేరకు నెలకొన్నాయి. అయితే కశ్మీరీల సహన పూరితమైన సంస్కృతి దాన్ని అధిగమించగలిగింది. అప్పటి నుండీ ఇటీవలిదాకా కశ్మీర్ లోయలో మత ఘర్షణలెప్పుడు జరగలేదు. ఉపఖండమంతటా కూడా చాలాపెద్ద ఎత్తున మతఘర్షణలు జరుగుతున్నప్పుడు, మరీ ప్రత్యేకించి ఇవి జమ్మూ ప్రాంతంలో తీవ్రంగా

* మీర్‌వైజ్ అనేది వంశపారంపర్యంగా సంక్రమించే మత సంబంధమైన హోదా

జరుగుతున్నప్పుడు కూడా, కశ్మీర్‌లో ఎన్నడూ జరుగలేదు. ఈ విషయాన్ని కశ్మీరీలు సహజంగానే గర్వంగా చెప్పుకుంటారు.

కశ్మీరీ ముస్లింలలో అసంతృప్తికి ఒక ప్రధానమైన వ్యక్తీకరణగా జమ్మూ కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ ఏర్పడింది. ఇదే తర్వాతి కాలంలో నేషనల్ కాన్ఫరెన్స్‌గా మారింది. ఈ సంస్థ మొదటి వార్షిక సమావేశం 1932లో జరిగింది. మొదటి నుంచి కూడా ఈ సంస్థలో శాఖాపరమైన, వ్యక్తిగతమైన, రాజకీయమైన విభేదాలు ఉన్నాయి. కొన్ని అంతర్గతంగా ఉన్నాయి. కొన్ని బయటి నుండి దాడి రూపంలో ఎదురైనాయి. వాటన్నిటి వివరాలు ప్రస్తుతం మనకక్కరలేదు. కాని కశ్మీరీ ప్రజల పోరాటం మొదటి నుండి రెండు పోకడలుగా ఉండింది. (1) దానిని సనాతన ముస్లిం సంప్రదాయంలో భాగంగా నడపాలనే పోకడ. (2) ఆ ఉద్యమాన్ని సామాజిక సమానత్వం దిశగా నడపాలని భావించిన సెక్యులర్ కశ్మీరీ జాతీయవాద పోకడ. ముస్లిం కాన్ఫరెన్స్ మొదటి అధ్యక్షునిగా ఎన్నికైన షేక్ అబ్దుల్లా తన అధ్యక్ష ఉపన్యాసంలో ఇలా అన్నాడు – “మేం పదే పదే ప్రకటించాం – కశ్మీరీ ఉద్యమం మతపరమైన ఉద్యమం కాదనీ సమాజంలోని అన్ని వర్గాలకూ తమ సమస్యలను వ్యక్తం చేయడానికి ఇదొక వేదిక. మా సహ పౌరులైన హిందువులకు, సిక్కులకు, సహాయం చేయడానికి మేం ఎప్పుడూ సిద్ధమే. మనమంతా కలిసి మెలిసి బ్రతకడం నేర్చుకోకపోతే ఏ ప్రగతీ సాధ్యం కాదు. కలిసిమెలసి బ్రతకాలంటే ఒకరి హక్కులను ఒకరు గౌరవించడం నేర్చుకోవాలి అని నేను మరొక్కసారి నొక్కి చెపుతున్నాను. కశ్మీర్ ఉద్యమం మతపరమైన ఉద్యమం కాదు”.

మీర్‌వైజ్ యూసుఫ్‌షాకు అబ్దుల్లాతో దృక్పథంలో తేడా ఉండడమే కాక అబ్దుల్లా తొందరగా నాయకత్వానికి ఎదగడం, ప్రజాదరణ పొందడం, అతనిలో ఈర్ష్యను రగిల్చినట్టున్నాయి. అతను అబ్దుల్లాను అహ్మదియా అంటూ నిందించాడు. అహమ్మదీయులు అనేవారు ముస్లింలలో చాలా సంప్రదాయేతరమైన ఒక శాఖ. వాస్తవానికి అబ్దుల్లా అహ్మదియా కాడు. అతను హనాఫి శాఖకు చెందిన సున్నీ ముస్లిం. ఈ ఆరోపణ కారణంగా అబ్దుల్లా అనుచరులకూ, మీర్‌వైజ్ అనుచరులకూ వీధి కొట్లాటలు జరిగాయి. తరువాతి కాలంలో మీర్‌వైజ్ అనుచరులు ముస్లిం కాన్ఫరెన్స్ నుండి బయటికి పోయి ఆజాద్ ముస్లిం కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అయితే నాయకుల్లోను, అనుచరుల్లోను మెజారిటీ షేక్ అబ్దుల్లాతోనే ఉండిపోయారు. ఈ అనుచరుల్లో తరువాతి కాలంలో భారత ప్రభుత్వానికి పనిముట్లుగా పనిచేసి తామంతా కలిసి మొదలు పెట్టిన ఉద్యమానికి ద్రోహం చేసి కశ్మీరీ ప్రజానీకానికి అన్యాయం చేయడానికి సిద్ధపడిన ఆశాపరులు బక్షి గులాంమహమ్మద్, గులాం సాదిక్‌లు కూడా ఇందులో ఉన్నారు.

ముస్లిం కాన్ఫరెన్స్ మహారాజాకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ముందుకు వచ్చిన ప్రధానమైన డిమాండ్లలో ఒకటి ప్రాతినిధ్య పరిపాలన. 1934లో మహారాజు ఒక ప్రజాసభను ఏర్పాటు చేయడానికి ఒప్పుకున్నాడు. ఇదొక చట్టసభ. అయితే దీంట్లో 70 శాతం కంటే ఎక్కువ మహారాజు నియమించే ప్రతినిధులుంటారు. అంతేకాక ఈ చట్టసభ చేసిన చట్టాలను వీటో చేసే అధికారం మహారాజుకు ఉంటుంది. ఈ వ్యవస్థ ఒక బూటకపు వ్యవస్థ అని ముస్లిం కాన్ఫరెన్సే గుర్తించినప్పటికి దానికి జరిగిన ఎన్నికల్లో పాల్గొంది. ఎన్నికల్లో ముస్లిం కాన్ఫరెన్సుకు వ్యతిరేకంగా మీర్‌వైజ్ యూసుఫ్‌షా ఏర్పాటు చేసిన ఆజాద్ ముస్లిం కాన్ఫరెన్స్ పోటీ చేసినప్పటికీ ముస్లిం కాన్ఫరెన్స్ గెలిచింది. కశ్మీర్ పోరాటాన్ని ఒక సెక్యులర్ జాతీయవాద పోరాటం దిశగాను, ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని లక్ష్యంగా కలిగిన పోరాటం దిశగాను మరల్చిన క్రమం వేగంగా ముందుకు పోయింది. అబ్దుల్లా తన జ్ఞాపకాలల్లో ఒక విషయం చెప్తాడు. తాను 1937లో కలిసిన జవహర్‌లాల్ నెహ్రూ, కవి మహమ్మద్ ఇక్బాల్ ఇద్దరూ కూడా ఆ పార్టీ పేరు నుండి ముస్లిం అనే మాటను తీసేయమని తనకు చెప్పారని అంటాడు. ఈ విషయాన్ని ముస్లిం కాన్ఫరెన్స్ ఒక పక్క పోరాటాలు చేస్తూ అరెస్టులు, నిర్బంధాలు అనుభవిస్తూనే చాలా లోతుగా చర్చించి ఒక నిర్ణయం తీసుకుంది. 1938 జూన్ 24వ తేదీన ఆ సంస్థ వర్కింగ్ కమిటీ మెజారిటీ నిర్ణయం ప్రకారం సంస్థ పేరును జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌గా మార్చాలని, సంస్థ నియమావళిని తదనుగుణంగా సవరించి అన్ని మతాల వాళ్ళు కూడా సభ్యులు కావడానికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. అయితే అబ్దుల్లా దృక్పథంలో ముస్లిం కాన్ఫరెన్స్ మొదటి నుండి కూడా సారాంశంలో జాతీయ సంస్థే. ఇక్కడ 'జాతీయం' అంటే కశ్మీర్ జాతీయత అని అర్థం చేసుకోవాలి. అయితే అప్పుడున్న పరిస్థితులల్లో ఈ మతేతర గుర్తింపును బహిరంగ పరచడం, స్పష్టంచేయటం, అంత సులభమైన విషయం కాదు. అతని మాటల్లో చెప్పాలంటే "మమ్మల్ని హిందూ, ముస్లిం సనాతన వాదులు రెండు వైపుల నుంచి బాదుతూ ఉన్నారు." కశ్మీరీ పండిట్లు అనుమానంగా చూశారు. జమ్మూ ముస్లింలు వ్యతిరేకించారు. జమ్మూలోని సనాతనవాద ముస్లిం విమర్శకులు కూడా ఒకవైపు రాళ్ళు విసురుతున్నారు. అయినప్పటికి వర్కింగ్ కమిటీ తీర్మానాన్ని సంస్థ సర్వ సభ్య సమావేశం 1939 ఏప్రిల్ 27న ఆమోదించింది. ఆ రకంగా జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పుట్టింది.

దాని పేరు ముందు జమ్మూ కశ్మీర్ అని ఉండడాన్ని బట్టి ఇదొక రాష్ట్ర వ్యాప్తసంస్థ అనే అభిప్రాయం కలుగుతుంది. కాని కశ్మీర్ బయట ఈ సంస్థకున్న ప్రాతినిధ్యం స్వల్పమే. దాని ప్రధాన పాదు లోయలోపలే ఉండింది. అక్కడ మాత్రం

అన్నిటి కంటే ప్రధానమైన రాజకీయ శక్తిగా ఉండింది. భారత పాలకులు దురాశాపరులైన స్థానిక కుట్రదారులతో చేతులు కలిపి ఆ పార్టీ ప్రతిష్టను ధ్వంసం చేసి ఇవాళ అందరూ కూడా చింతిస్తున్న పరిస్థితికి దారితీసేదాక నేషనల్ కాన్ఫరెన్స్ కశ్మీర్ లోయలో ప్రధానమైన రాజకీయ శక్తిగా ఉండింది.

నేషనల్ కాన్ఫరెన్స్ జాతీయ లక్ష్యం చాలా సరళమైనది. అదేమిటంటే విదేశీ పాలన నుండి కశ్మీర్‌కు విముక్తి. మొదట జమ్మూకు చెందిన డోగ్రా రాజవంశం నుండి విముక్తి.ఆ తర్వాత భారత రాజ్యం నుండి విముక్తి. మొదటి వార్షిక సమావేశంలో నేషనల్ కాన్ఫరెన్స్ తన అధ్యక్షుడిగా సర్దార్ బుద్‌సింగ్ అనే సిక్కు నాయకుణ్ని ఎన్నుకుంది. ఆయనను షేక్ అబ్దుల్లా తన ఆధ్యాత్మిక తండ్రి అని పిలుచుకున్నాడు. అయితే తర్వాతి కాలంలో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రధానమంత్రిగా ఉన్న షేక్ అబ్దుల్లా జమ్మూ ప్రాంతం సమస్యల గురించి సరిగ్గా పట్టించుకోవడం లేదని సర్దార్ బుద్‌సింగ్ అసంతృప్తిని వ్యక్తం చేశాడు. అది వేరే విషయం. 1940లలో నేషనల్ కాన్ఫరెన్స్ భారత జాతీయ ఉద్యమంతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుంది. భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాలకు నేషనల్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు హాజరయ్యేవారు. ఉపఖండం రాజకీయాలల్లో నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ పార్టీకి సన్నిహితంగా ఉండి ముస్లింలీగ్‌ను వ్యతిరేకించింది. అబ్దుల్లా అభిప్రాయంలో ముస్లింలీగ్ నవాబుల పార్టీ. కశ్మీర్ లోయలో అబ్దుల్లాతో విభేదించిన ముస్లింలు మీర్‌వైజ్ యూసుఫ్‌షా నాయకత్వంలో 1941లో ముస్లిం కాన్ఫరెన్సును పునరుద్ధరించారు. ఈ ముస్లిం కాన్ఫరెన్స్ 1947 తరువాత ఆజాద్ కశ్మీర్‌లో మొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.

తన విశాలమైన సామాజిక లక్ష్యాలను కొనసాగించడానికి నేషనల్ కాన్ఫరెన్స్ ఒక నయా కశ్మీర్ లక్ష్య ప్రకటనను 1944లో బారముల్లా జిల్లాలోని సోపోర్ గ్రామంలో జరిగిన పార్టీ వార్షిక సమావేశంలో అంగీకరించింది. ఈ లక్ష్య ప్రకటనలోని ప్రధానాంశాలు స్త్రీలు, కార్మికులు, బలహీన వర్గాల హక్కుల సంరక్షణ. ఈ లక్ష్య ప్రకటనను, ప్రణాళికను, ముస్లింలీగ్ నవాబులే కాక కాంగ్రెస్ పార్టీలోని సనాతన వాదులు కూడా వ్యతిరేకించారు అని అబ్దుల్లా అంటాడు. అయితే ఇది దీర్ఘకాలిక లక్ష్యాలుగల ప్రణాళిక. జమ్మూ కశ్మీర్ భారతదేశంలో భాగం అయిన తర్వాత దీన్ని అమలు చేసి సామాజిక సంస్కరణలు తీసకురావాలని నేషనల్ కాన్ఫరెన్స్ ప్రయత్నించింది. ఈ విధంగా మనకథ 1947కు చేరుకుంది. బ్రిటిష్ వారు దేశం నుండి పోనున్నారు. ఉపఖండం రెండుగా విభజించబడనుంది. తూర్పులోను వాయవ్య ప్రాంతాలలో ఉన్నటువంటి ముస్లిం మెజారిటీ ప్రాంతాలు పాకిస్తాన్ కానున్నాయి. తక్కిన బ్రిటిష్ పాలిత ఉపఖండం ఇండియా కానుంది. రాచరికాలు తమ పాలకుల అభీష్టాన్ని బట్టి ఈ రెండు దేశాలల్లో దేనితోనైనా ఉండవచ్చు లేదా స్వతంత్రంగానైనా ఉండవచ్చు. ఈ విధంగా జమ్మూ

కశ్మీర్ రాష్ట్ర ప్రజానీకానికి ఆకస్మికంగా ఒక సంకటస్థితి వచ్చింది. ఏ పాలకుడినైతే ఆ రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు ద్వేషించారో అతనే వారు ఇండియాతో చేరుతారా పాకిస్తాన్‌లో చేరుతారా, అని వారి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా నిర్ణయించేవాడయ్యాడు. బ్రిటిష్ వాళ్ళు 1846లో జమ్మూ కశ్మీర్‌ను గులాబ్‌సింగ్‌కు 75 లక్షలకు అమ్మకుండా ఉన్నట్లయితే, తమ భూభాగంగా పరిపాలించి ఉన్నట్లయితే, జమ్మూ కశ్మీర్లోని మెజారిటీ భూభాగం అప్పటి దేశ విభజన ప్రమాణాన్ని అనుసరించి పాకిస్తాన్‌లో కలిసిపోయి ఉండేది. కాని చరిత్ర ఇంకోరకంగా ఉండడం వల్ల ఇపుడు 40 లక్షల ప్రజానీకం భవితవ్యాన్ని ఒక వ్యక్తి నిర్ణయించే పరిస్థితి ఏర్పడింది. ఆ నిర్ణయాన్ని తమకు అనుకూలంగా దిద్దడానికి ఎవరు ఏం చేశారు అనే దానిపై చాలా వివాదాలున్నాయి. ఆ వివాదాల వివరాల్లోనికి మనం పోనవసరం లేదు. కొత్తగా ఏర్పడిన భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలు రెండూ కూడా మహారాజు తమకు అనుకూలంగానే నిర్ణయం చేస్తాడని ఆశించి అతని మీద రకరకాల రూపాల్లో ఒత్తిడి పెట్టారు. మహారాజు స్వతంత్రంగా ఉండాలని లేదా ఏ దేశమైతే తన అధికారాన్ని షేక్ అబ్దుల్లా నాయకత్వంలోని కశ్మీరీ పోరాటకారుల నుంచి కాపాడుతుందో ఆ దేశంలో చేరాలని భావించాడు.

ఈ విషయంలో నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరి సుస్పష్టం. వారు 1946లోనే పాలక రాజవంశానికి వ్యతిరేకంగా "క్విట్ కశ్మీర్" ఉద్యమాన్ని ప్రారంభించారు. వారి అభిప్రాయంలో కశ్మీరీలు మొదట స్వతంత్రులయిన తర్వాతే విలీనం గురించి ఒక నిర్ణయం తీసుకోగలుగుతారు. కాబట్టి వారి దృష్టిలో కశ్మీర్‌ను హరిసింగ్ పాలన నుంచి విముక్తం చేసి ప్రాతినిధ్య ప్రభుత్వం ఏర్పాటు చేయడం మొదటి పని. 'విలీనం ముందు స్వేచ్ఛ' వారి వివాదం అని షేక్ అబ్దుల్లా 1947 అక్టోబర్ 2న ఒక బహిరంగ సభలో వివరించాడు. డోగ్రా పాలకులను కూలదోయడం మొదటి కర్తవ్యం. ఆ తర్వాత ప్రాతినిధ్య పరిపాలన నెలకొల్పి, స్వేచ్ఛ, సంక్షేమం, అభివృద్ధిలకు బాట వేయడం తమ కర్తవ్యం అని అన్నాడు. భారత పాలకులకు ఒక విశ్వాసం ఉండింది. నేషనల్ కాన్ఫరెన్స్ నిర్ణాయక స్థితిలో గాని ఉంటే భారత్‌లో విలీనం కావాలని ఆ పార్టీ నిర్ణయిస్తుంది అని వారు నమ్మారు. ఇక మహారాజు మాటకొస్తే పాకిస్తాన్‌లో చేరడానికి కూడా అతడు సిద్ధమయ్యాడు. ఎందుకంటే ఇండియాలో చేరితే ఎలానూ రాజ్యంపోతుంది. కాని పాకిస్తాన్‌లో చేరితే అతని రాజ్యం సురక్షితంగా ఉండవచ్చని ఆశించాడు. దీనికి ఒక కారణం ఏమిటంటే మహమ్మద్ అలీజిన్నా పాకిస్తాన్‌లో చేరిన రాచరికాల సర్వసత్తాక అధికారాలను గౌరవిస్తానని హామీ ఇచ్చి ఉన్నాడు. మరొక కారణం ఏమిటంటే కశ్మీర్ పాకిస్తాన్‌లో చేరిన తర్వాత హరిసింగ్‌ను పాకిస్తాన్ గనుక తొలగిస్తే జిన్నాను చాలా గట్టిగా వ్యతిరేకించే షేక్ అబ్దుల్లాతో వారు తలపడవలసి వస్తుంది. జమ్మూ ప్రాంతంలోని హిందూ మతవాదులు చాలామంది నిజానికి మహారాజు ఇండియాలో విలీనం కాకూడదని

భావించారు. ఎందుకంటే ఒక హిందూ రాజ్యంగా ఉన్న జమ్మూ కశ్మీర్ లౌకికవాద భారత్‌లో భాగం కావడం వారికి ఇష్టం లేదు. కాబట్టి స్వతంత్రంగా ఉండిపోమ్మని వారు మహారాజుకు సలహా ఇచ్చారు.

జమ్మూకు చెందినటువంటి ప్రముఖ విశ్లేషకుడు, రాజకీయ కార్యకర్త, ప్రజాస్వామికవాది అయిన బల్‌రాజ్‌పురిగారు ఆనాటి సంఘటనల గురించి జ్ఞాపకం చేసుకుంటూ.... "మా వంటి వారు ఆ రోజు భారత్‌లో విలీనం కావాలి అని భావించినప్పుడు మమ్మల్ని హిందూ వ్యతిరేకులుగా హిందూ మతవాదులు నిందించారు". ఆనాటి సాధారణ కశ్మీరీలు ఏం కోరుకున్నారో చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే అప్పుడు గాని, ఆ తర్వాతి కాలంలో గానీ వారి అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం వారికి ఎవ్వరూ ఇవ్వలేదు. ఒకటి మాత్రం వాస్తవం. షేక్ అబ్దుల్లా విపరీత ప్రజాదరణ కలిగి ఉన్నాడు. దాని నుంచి బహుశా అతని రాజకీయ అభిప్రాయాలకే మెజారిటీ మద్దతు ఉంది అని మనం భావించవలసి వస్తుంది. ఇక అబ్దుల్లా మాటకు వస్తే అతనికి ప్రధానంగా కావలసిన కశ్మీర్ విముక్తి, కశ్మీరీలకు తమ గురించి తాము మాట్లాడుకునే అవకాశం, ఆ తర్వాతే వేరే ఏదయినా, అతను ముస్లింలీగ్ ప్రవచించిన రెండు జాతుల సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన మాట కూడా వాస్తవమే. నెహ్రూ, గాంధీల సామాజిక దృక్పథం పట్ల తనకు సానుభూతి, భావ సారూప్యత ఉంది అని ప్రకటించిన మాట వాస్తవమే. తన పార్టీ ఆమోదించిన నయా కశ్మీర్ ప్రణాళిక లౌకిక వాద, ప్రజాతంత్ర, అభ్యుదయ వాద భారత సంవిధానానికి అతికే ఆలోచనారీతి అని భావించిన మాట కూడా వాస్తవమే. కాని ఆయన మొదటి లక్ష్యం కశ్మీరీల స్వాతంత్ర్యం. 1946లో అతను క్యాబినెట్ మిషన్‌కు పంపిన టెలిగ్రాంలో ఈ విధంగా అన్నాడు– "ఈ రోజు కశ్మీరీ ప్రజానీకానికి కేవలం ప్రాతినిధ్య పరిపాలన సరిపోదు. వారికి స్వేచ్ఛ కావాలి. నియంతృత్వ మహారాజు పాలన నుంచి పూర్తి స్వేచ్ఛ కావాలి. ఇదొక చారిత్రాత్మక ఘట్టం. భారత ప్రజల భవితవ్యం నిర్ణయించబడుతున్నది. విలీన హక్కు అనేది ముగ్గురి మధ్య వివాదంగా ఉంది – ప్రజలు, పాలకులు, సమాఖ్య. "మేము కశ్మీరీలం దీన్ని చారిత్రక దృక్పథంతో చూడదలచుకున్నాం. అమ్మకపు ఒప్పందం రెండు దేశాల మధ్య ఒడంబడిక వంటిది కాదు. దానికి ఆ ప్రతిపత్తి ఉండదు. కాబట్టి బ్రిటిష్ పాలన అయిపోయిన తర్వాత కశ్మీర్‌కు స్వతంత్ర అయ్యే హక్కు ఉంది. కశ్మీరీలం మా భవిష్యత్తును మేమే రచించుకోవాలి అని కోరుకుంటున్నాం." అబ్దుల్లా అన్ని సందర్భాల్లోను ఇంత స్పష్టంగా మాట్లాడలేదు. కాని పై వాక్యాలు అతని అవగాహనకు పునాది, ప్రాతిపదిక అనడంలో సందేహం ఏమీ లేదు. అప్పటి పరిస్థితిని ఈ విధంగా మనం క్లుప్తంగా చెప్పుకోవచ్చు. కశ్మీరీలు కోరుకుంటున్నది స్వేచ్ఛ కాగా భారత్, పాకిస్తాన్, మహారాజు హరిసింగ్ కశ్మీర్‌ను కోరుకున్నారు. ఈనాటికీ సమస్య అదే, తేడా ఏమిటంటే ఇపుడు హరిసింగ్ లేదు.

పైన చెప్పినట్టు జమ్మూ కశ్మీర్ మహారాజు ఆ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి దారితీసిన పరిస్థితులేమిటి అనే విషయంలో అనేక కుట్ర సిద్ధాంతాలు ప్రచారంలో ఉన్నాయి. వాటి జోలికి పోకుండా అందరూ అంగీకరించే వాస్తవాల్ని మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. విలీనాన్ని గురించి ఒక నిర్ణయం తీసుకునే విషయంలో మహారాజ హరిసింగ్ అక్టోబర్ 1947 వరకు అనాసక్తిగానే ఉన్నాడు. ఈ కాలంలో పాకిస్తాన్ నుండి ఇండియాలోకి చాలా పెద్ద సంఖ్యలో హిందువులు, సిక్కులు, అదే విధంగా ఇండియా నుండి పాకిస్తాన్‌లోకి చాలా పెద్ద సంఖ్యలో ముస్లింలు కొత్తగా నెలకొన్న సరిహద్దుకు ఇరువైపుల నుంచి వలస వెళ్ళారు. చాలా పెద్ద ఎత్తున హత్యలు, అత్యాచారాలు, దోపిడీలు, గృహదహనాలు జరిగాయి. ఈ నేరాల ప్రభావం జమ్మూ కశ్మీర్ రాజ్యంలోని జమ్మూ ప్రాంతంపైన పడింది. అక్కడ ముస్లింలపైన పెద్ద ఎత్తున దాడులు, హత్యాకాండ జరిగాయి. వారిలో చాలామంది పాకిస్తాన్‌కు పారిపోయారు. కనీసం ఐదు లక్షలమంది ముస్లింలు జమ్మూ నుండి పాకిస్తాన్‌కు పోయారని బ్రిటిష్ చరిత్రకారుడు అలిస్టెర్ ల్యాంబ్ అంచనా వేశాడు. దీని ఫలితంగా పూంచ్ ప్రాంతంలోని ముస్లిం ప్రజానీకంలో తీవ్రమైన నిరసన నెలకొంది. పూంచ్ జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో పాకిస్తాన్‌ను ఆనుకొని ఉన్నటువంటి ప్రాంతం. ఆ ప్రాంతంలోని ప్రజలు చాలా కాలంగా ఆ రాజ్యపాలకులైన డోగ్రా రాజవంశీయులపైన తిరుగుబాటు చేస్తూ వచ్చారు. గులాబ్‌సింగ్ కాలంలోనే పూంచీలు తిరగబడి తీవ్రంగా శిక్షించబడిన విషయాన్ని పైన ప్రస్తావించాను. అంతేకాకుండా పూంచీలకు ఒక సైనిక సంప్రదాయం కూడా ఉండింది. అప్పటికి పూంచ్‌లో 60 వేలమంది మాజీ సైనికులు ఉన్నారు. అందులో ఎక్కువమంది ముస్లింలు.

ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 1947లో పూంచ్ ప్రాంతంలో మహారాజు పాలనపైన ఒక తిరుగుబాటు మొదలైంది. డోగ్రా సైన్యం చాలా కిరాతకంగా దాన్ని అణచివేసింది. కొత్తగా ఏర్పడిన పాకిస్తాన్ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ పాలకులు ఆరోపించినట్టు ఈ తిరుగుబాటుకు వాస్తవంగా వత్తాసు ఇచ్చిందా లేదా అనేది వివాదాస్పదం అయితే కావచ్చు కానీ, అనధికారికంగా పాకిస్తాన్ నుంచి చాలా సహాయాన్ని అందుకున్న మాట వాస్తవం. జమ్మూ కశ్మీర్ రాజ్యంలో ముస్లింలపైన జరిగినటువంటి అత్యాచారాల గురించి కొత్తగా ఏర్పడిన పాకిస్తాన్ ప్రభుత్వం అప్పటి హరిసింగ్ ప్రభుత్వంతో వాదులాటకు కూడా దిగింది. ఇరుపక్షాలు ఈ వాదులాటలో భాగంగా తీవ్ర పరిణామాలుంటాయని ఒకరినొకరు హెచ్చరించుకున్నారు. ఏది ఏమైనా పాకిస్తాన్ తోడ్పాటు అవసరం లేకుండానే పూంచీలు తిరగబడటానికి కావలసిన కారణాలున్నాయి. 1947 అక్టోబర్ 24వ తేదినాడు పాకిస్తాన్‌లోని నార్త్‌వెస్ట్ ఫ్రాంటియార్‌ప్రావిన్స్ నుంచి చాలా పెద్ద సంఖ్యలో గిరిజన తెగలకు చెందినవాళ్ళు పూంచ్ తిరుగుబాటు దారులకు మద్దతుగా జమ్మూ కశ్మీర్ రాజ్యంలోకి ప్రవేశించారు. పాకిస్తాన్ సైనికులు చాలామంది

సెలవు మీద దాంట్లో పాల్గొన్నారు. దీనికి నాయకత్వం వహించిన వ్యక్తి పాకిస్తాన్ సైన్యంలో మేజర్ జనరల్ హోదాలో ఉన్న అక్బర్‌ఖాన్. అయితే ఇది అధికారికంగా ప్రణాళిక ప్రకారం జరిగినటువంటి దాడి కాదు. పాకిస్తాన్ ప్రభుత్వానికి ఈ దాడి గురించి తెలుసు. అందుకే దాన్ని ఆపడానికి ఏమీ చేయకపోవడం ద్వారా దానికి పరోక్షంగా దోహదపడింది. దాడి చేసిన వాళ్ళు రెండువేల మంది ఉంటారని షేక్ అబ్దుల్లా అంచనా కాగా, మూడువేలమంది ఉంటారని అలిస్టైర్ ల్యాంబ్ అంచనా. భారత ప్రభుత్వం మాత్రం ఇంకా చాలా పెద్ద సంఖ్యలో వచ్చారని ఆరోపించింది. ఈ దాడి చేసినవాళ్ళు జమ్మూ కశ్మీర్ సరిహద్దు దగ్గరికి రాగానే, పూంచి తిరుగుబాటు దారులు వారితో చేరడం మాత్రమే కాక, జీలం నది మీద ఉన్నటువంటి వంతెనకు కాపలా కాస్తున్న మహారాజు సైనిక బృందానికి చెందిన ముస్లిం సైనికులు కూడా వారితో చేరారు. వారి సహాయంతో చొరబాటుదారులు జమ్మూ కశ్మీర్ రాజ్యంలోని పూంచ్ ప్రాంతంలోకి ప్రవేశించారు. అయితే వారు పూంచ్‌ను దాటి కశ్మీర్ లోయలోని బారాముల్లా జిల్లాలోకి ప్రవేశించగానే విచక్షణారహితంగా దోపిడీలు, గృహదహలకు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడడం మొదలు పెట్టారు. ముస్లింలను గాని, హిందువులను గాని, సిక్కులను గాని ఎవరినీ విడిచి పెట్టలేదు. ఒక్క బారాముల్లా పట్టణంలోనే మూడు వేలమంది హతమయ్యారని అంచనా. కిరాతకమైన ఈ దాడి నుంచి తనను, తన రాజ్యాన్ని కాపాడుకోవడానికే హరిసింగ్ భారతదేశంలో విలీనం కావాలని నిర్ణయించుకున్నాడు. వాళ్ళను ఎదుర్కోవ డానికి అతనికి భారత్ సహాయం అవసరమైంది. విలీనాన్ని ప్రతిపాదిస్తూ అతను భారత ప్రభుత్వానికి రాసిన ఉత్తరంలో చెప్పినట్లు తన రాజ్యం భారత్‌లో భాగం కాకపోతే భారత్ సహాయం పంపదన్న భయంతో విలీనానికి ఒప్పుకున్నాడు. 1947 అక్టోబర్ 26 నాడు విలీన ఒడంబడికపై సంతకం చేశాడు.

మహారాజు భారత ప్రభుత్వానికి మూడే మూడు విషయాల్లో అధికారాన్ని అప్పగించాడు. అవి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసారరంగం. తనవైపుగా భారత ప్రభుత్వం మరుసటి రోజు విడుదల చేసినటువంటి ప్రకటనలో విలీనాన్ని అంగీకరిస్తూ శాంతి భద్రతలు తిరిగి నెలకొన్న తర్వాత ఈ విలీనానికి జమ్మూ కశ్మీర్ ప్రజానీకం సమ్మతిని కోరుతానని విలీనం అప్పుడే నిజంగా అయినట్టు భావించబడుతుందని ప్రకటించాడు. ఇప్పటి వరకు భారత్ ఆ సమ్మతిని పొందలేదు. ఆనాడు ప్రజల సమ్మతి పొందుతాము అని ప్రకటించడానికి కారణం ఏమిటంటే, ఏదైనా ఒక రాజ్యం విలీనం కావడం వివాదస్పదం అయినట్టయితే ఆ వివాదాన్ని రాజ్య ప్రజలు ఆకాంక్షల ప్రాతిపదిక మీద పరిష్కరించాలి అన్న సూత్రాన్ని భారత్ విశ్వసించడమేనని అన్నారు. అద్భుతమైన ఆ ప్రజాస్వామిక సూత్రాన్ని భారత్ ఎందుకు గాలికి వదిలిపెట్టిందో ఎప్పుడు వదిలిపెట్టిందో ఇప్పటిదాకా చెప్పలేదు. ఒకసారి చట్టబద్ధంగా జమ్మూ కశ్మీర్ రాజ్యం భారత్‌లో భాగం అయిపోయిన తర్వాత భారత సైన్యం విమానాల ద్వారా, రోడ్డు మార్గం ద్వారా శ్రీనగర్‌కు తరలివెళ్ళింది. చొరబాటుదారులను ఎదుర్కొనింది. అక్కడ భారత సైన్యానికి అండగా

నిలిచింది నేషనల్ కాన్ఫరెన్స్ కార్యకర్తలతోపాటు లోయలోని స్థానిక ప్రజలు కూడా. షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాలలో చెప్పినట్టు దాడి జరుగుతుందని తెలియగానే మహారాజు ప్రభుత్వం, లోయలో నెలకొల్పిన అధికార యంత్రాంగం యావత్తు, లోయను విడిచిపెట్టి వెళ్ళిపోయింది. పాలనా యంత్రాంగం నేషనల్ కాన్ఫరెన్సు చేతిలో ఉండింది. నేషనల్ కాన్ఫరెన్స్ హిందువులను, ముస్లింలను కూడా సంఘటితపరచి వంతెనలను, ఆస్తులను ముఖ్యంగా ముస్లిమేతరుల ఆస్తులను కాపాడింది. హిందువులకు, సిక్కులకు ఆశ్రయం కలిగించినందుకు బారముల్లాకు చెందిన మహమ్మద్ మక్బుల్‌షేర్వాని, ముజఫరాబాద్‌కు చెందిన అబ్దుల్ అజీజ్ అనే నేషనల్ కాన్ఫరెన్స్ కార్యకర్తలను చొరబాటుదారులు హత్య చేశారు. కాశ్మీర్‌లోని ప్రజాభిప్రాయం, దాడి చేస్తున్న పాకిస్తానీలకు వ్యతిరేకంగా ఉండింది అని అబ్దుల్లా మాత్రమే కాదు వర్తమాన పత్రికా రిపోర్టులు, బ్రిటిష్ అధికారులు కూడా చెప్పారు. భారత సైన్యం ఈ దాడి చేసిన చొరబాటుదారులను పాకిస్తాన్ సరిహద్దు వైపు నెట్టిన క్రమంలోనే పాకిస్తాన్ సైన్యం రంగంలోకి దిగింది. కొత్తగా ఏర్పడిన ఈ రెండు రాజ్యాల మధ్య యుద్ధం ప్రారంభమైంది. 1947 డిసెంబర్ 31 నాడు కాల్పుల విరమణ ప్రకటించడంతో ఆ యుద్ధం తాత్కాలికంగా ఆగింది. ఈ రకంగా జమ్మూ కశ్మీర్ రెండుగా విభజించబడింది. ఒక భాగాన్ని ఇండియా పాక్ ఆక్రమిత కశ్మీర్ అని, మరొక భాగాన్ని పాకిస్తాన్ ఇండియా ఆక్రమిత కశ్మీర్ అని పిలువసాగాయి.

జవహర్‌లాల్ నెహ్రూ 1947 నవంబర్‌లో ఆలిండియా రేడియోలో ఒక ప్రకటన చేస్తూ, జమ్మూ కశ్మీర్ రాష్ట్రం భవితవ్యాన్ని ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయిస్తారు అన్న హామీని పునరుద్ఘాటించాడు. శాంతి నెలకొనడం జరుగగానే రెఫరెండం, అంటే ప్రజాభిప్రాయం సేకరణ నిర్వహిస్తామనీ, అంతర్జాతీయ పర్యవేక్షణలో అది జరుగుతుందని, ఈ హామీ తగ్గదని ఎప్పటికి వెనక్కు ప్రకటించాడు. లోయలో పాకిస్తాన్ నుండి వచ్చిన చొరబాటుదారులను మొత్తం విజయవంతంగా తరిమేసిన తర్వాత శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో నెహ్రూను ఆదరిస్తూ ఒక పెద్ద సభ జరిగింది. అక్కడ జవహర్‌లాల్ నెహ్రూ షేక్ అబ్దుల్లా చేతులు పట్టుకొని మరొక్కసారి కశ్మీరీలకు స్వయం నిర్ణయాధికారం ఉంటుందనీ భారత్ దానికి హామీ ఇస్తుందనీ నెహ్రూ ప్రకటించాడు. తర్వాతి కాలంలో, నెహ్రూ ప్రజాభిప్రాయం అన్నపుడు రెఫరెండం లేక ప్లెబిసైట్ అనేవి ఉద్దేశించలేదని, ఎన్నికల్లో ప్రజలు పాల్గొనటం కూడా ప్రజాభిప్రాయం కిందికే వస్తుందని, భారత ప్రభుత్వం వాదించడం మొదలుపెట్టింది. ఈ వాదనతోనే భారత ప్రభుత్వం ప్లెబిసైట్ పెట్టనక్కరలేదని అనసాగింది. విలీనం జరిగినప్పుడు దానిపైన ప్రజల అభిప్రాయం సేకరించడం జరుగుతుందని ఏ హామీ అయితే ఇచ్చారో ఆ హామీలో ప్లెబిసైట్ అనే మాటను వాడనిమాట వాస్తవమే. కాని పైన చెప్పినట్టు ఆలిండియా రేడియో ద్వారా

నెహ్రూ చేసిన ప్రకటనలో ఇచ్చిన హామీకి ఈ రకమైన వ్యాఖ్య వర్తించదు. ఆ ప్రసంగంలో నెహ్రూ ఖచ్చితంగా రెఫరెండం లేక ప్లెబిసైట్ జరుగుతుంది అనీ, అది అంతర్జాతీయ పర్యవేక్షణ జరుగుతుందని హామీ ఇచ్చాడు. సరే, హామీ మాటకే వస్తే అది కేవలం నైతికంగా భారత్‌ను కట్టిపడేస్తుంది తప్ప చట్టపరంగా కాదని అనవచ్చునేమో. కాని, భారత్ అంతర్జాతీయ చట్టం దృష్టిలో తప్పించుకోవడానికి వీలులేని హామీ ఒకటి కొద్దినెలల తర్వాత ఐక్యరాజ్యసమితికి ఇచ్చింది. జమ్మూ కశ్మీర్ పైన పాకిస్తాన్ దాడిచేస్తూ ఉందనీ, పాకిస్తాన్‌ను ఆపాలనీ, 1947 డిసెంబర్ 31 నాడు భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి చేసిన ఫిర్యాదులో జమ్మూ కశ్మీర్‌లో ప్లెబిసైట్ నిర్వహించడం జరుగుతుందన్న ఖచ్చితమైన హామీ ఇచ్చింది. భారత ప్రభుత్వం మాటల్లోనే చెప్పాలంటే – "భారత ప్రభుత్వం ప్రస్తుతం కశ్మీర్‌లో నెలకొని ఉన్న అనిశ్చిత పరిస్థితిని తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోంది అన్న అపోహను తొలగించటం కోసం, మేము చొరబాటుదారులను బయటికి తరిమేసి సాధారణ పరిస్థితులను నెలకొల్పిన వెంటనే రాష్ట్ర ప్రజానీకానికి తన భవితవ్యాన్ని నిర్ణయించుకునే స్వేచ్ఛ యిస్తామని స్పష్టం చేస్తున్నాం. ఆ నిర్ణయం వారు అంతర్జాతీయంగా ఆమోదం పొందినటువంటి ప్లెబిసైట్ లేక రెఫరెండం అనే ప్రజాస్వామిక ప్రక్రియ ద్వారా చేస్తారు. ఆ ప్లెబిసైట్ అనేది స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉండటం కోసం ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణ దానికి తప్పనిసరిగా అవసరం అవుతుంది". ఇవి భారత ప్రభుత్వం ఆనాడు వాడిన మాటలు. ఇక ఆ తర్వాత హామీ నుంచి తప్పించుకోవడానికి భారత ప్రభుత్వానికి ఉన్నవి రెండే రెండు మార్గాలు. ఒకటి– చొరబాటుదారులందరిని ఇంకా తరిమేయులేదనో, రెండు – సాధారణ పరిస్థితి ఇంకా నెలకొనలేదనో బుకాయించడం. నిజంగా ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుని అమలు చేయాలన్న ఉద్దేశ్యం కాని ఉంటే ఈ వాదనలు వట్టి బుకాయింపులు మాత్రమే.

ఒకసారి వివాదం ఐక్యరాజ్యసమితి ముందుకు పోయిన తర్వాత ఆ సంస్థ తన మొదటి ప్రయత్నాలన్నీ కూడా భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధాన్ని నిలిపి శాంతిని నెలకొల్పడం మీద కేంద్రీకరించింది. 1948 జనవరి 17, 20 తేదీల్లో, ఐక్యరాజ్యసమితి జారీ చేసిన రెండు తీర్మానాల సారాంశం ఇదే. రెండు దేశాల మధ్య సంధి ప్రయత్నం చేయడం కోసం యుఎన్‌సిఐపి (భారత, పాకిస్తాన్ వ్యవహారాల ఐక్యరాజ్యసమితి కమీషన్) అనేదాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆధ్వర్యంలో నెలకొల్పడం జరిగింది. 1948 ఏప్రిల్ 21 నాటి తీర్మానంలో ప్లెబిసైట్ ప్రస్తావన ఐక్యరాజ్యసమితి మళ్లీ చేసింది. భారత్ పాకిస్తాన్‌లు రెండూ జమ్మూ కశ్మీర్ రాజ్యం భారత్‌లో విలీనం కావాలా లేక పాకిస్తాన్‌లో విలీనం కావాలా అనేది స్వేచ్ఛగా స్వతంత్రంగా నిష్పాక్షికంగా జరిగే ప్లెబిసైట్ ద్వారా నిర్ణయం కావాలని ఒప్పుకుంటున్నాయి. అనే విషయం పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ దానికి ఒక ముందు షరతుగా కొన్ని తీర్మానాలు చేసింది.

- F దాడి చేసిన గిరిజన తెగలకు చెందిన చొరబాటుదారులందరిని వెనక్కి తీసుకోవాలి.
- F జమ్మూ కశ్మీర్ నివాసులు కానటువంటి పాకిస్తానీలందరినీ వెనక్కి తీసుకోవాలి.
- F కశ్మీర్ రాష్ట్రంలో పౌర ప్రభుత్వం, శాంతి భద్రతలు నెలకొల్పడానికి ఏ మేరకు భారతసైన్యం అవసరమో అంతే ఆ మేరకే వుంచి తక్కిన సైనిక బలగాలను వెనక్కితీసుకోవాలి.
- F విలీనం విషయంలో ఓటు వేయడానికి కావలసిన స్వేచ్ఛ, అవకాశం కశ్మీరీ ప్రజలకు ఇచ్చేందుకు ఇరుదేశాలూ సహకరించాలి.
- F ఐక్యరాజ్యసమితి ప్లెబిసైట్ కోసం నియమించే అధికారికి అవసరమైన అన్ని రకాల అధికారులు, అవకాశాలు, సౌకర్యాలు భారత ప్రభుత్వం కల్పించాలి.
- F అప్పటి వరకు కశ్మీర్ రాష్ట్రాన్ని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, ప్రతినిధులు కలిసి ఏర్పాటు చేసిన ప్రభుత్వం పరిపాలించాలి.

ఈ తీర్మానం ఇవ్వాళ్టి వరకు అమలు కాలేదు. మొదట్లో భారత్, పాకిస్తాన్‌లు రెండు సూత్రరీత్యా ప్లెబిసైట్‌కు అంగీకారం తెలిపినప్పటికి, దాన్ని ఏ విధంగా నిర్వహించాలన్న విషయంలో ఏకాభిప్రాయానికి ఎప్పుడూ రాలేదు. బహుశా ఈ రెండు దేశాలూ కూడా మనస్ఫూర్తిగా ఈ సమస్యను ప్రజాభిప్రాయం ప్రాతిపదిక మీద పరిష్కరించాలని విశ్వసించకపోవడమే దీనికి కారణం. రెండు దేశాలూ కూడా ప్లెబిసైట్ నిర్వహించే పద్ధతి, నిర్వహించే సమయం, దాని ఫలితం తమకు అనుకూలంగా ఉండేటట్టు చూసుకోవాలని భావించాయి. ఆ విధంగా ఒకసారి జమ్మూ కశ్మీర్ రాష్ట్ర భూభాగంలో కొంతభాగం పాకిస్తాన్ చేతుల్లోకి, కొంతభాగం ఇండియా చేతుల్లోకి పోయిన తర్వాత జమ్మూ కశ్మీర్ ప్రజల యొక్క స్వయం నిర్ణయాధికార సమస్య ఈ రెండు దేశాల సమస్యగా మారింది.

1948 ఏప్రిల్ 21 నాటి తీర్మానానికి మరింత నిర్దిష్టమైన రూపం ఇస్తూ యుఎన్‌సిఐపి ఆగస్టు 13వ తేదీన మరో తీర్మానం చేసింది. అయితే భారత్ అభిప్రాయంలో పాకిస్తాన్ సంపూర్ణంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం నుండి బయటికి వెళ్ళిపోవాలి. కాని భారత్ పూర్తిగా జమ్మూ కశ్మీర్ పైన అధికారాన్ని కలిగి ఉండి ప్లెబిసైట్‌ను తానే నిర్వహించాలి. భారత్ వైఖరి ఏమిటంటే దాడి చేసింది పాకిస్తాన్ కాబట్టి నైతికంగా, చట్టపరంగా జమ్మూ కశ్మీర్‌పై భారత్‌కు అధికారం ఉంది. అందువల్ల భారత్ తన సైన్యాలను ఒక కనీస పరిమాణానికి తగ్గించాలని అనడం దాడి చేసినవాళ్ళను, దాడికి గురైనవాళ్ళను సమానంగా చూడటం అవుతుంది. పాకిస్తాన్ అభ్యంతరం ఏమిటంటే

తన అదుపులో ఉన్న జమ్మూ కశ్మీర్ భూభాగం నుండి తాను సంపూర్ణంగా బయటికి పోవలసి ఉండగా భారత్ మాత్రం తన సైనిక బలగాలను కనీస స్థాయికి మాత్రమే తగ్గిస్తుంది తప్ప పూర్తిగా బయటకి తీసుకుపోదు. అంతేకాకుండా పౌర పరిపాలనా యంత్రాగం షేక్ అబ్దుల్లా అదుపులో ఉంటుంది. పాకిస్తాన్‌కు ఇది ఎందుకు అభ్యంతరకరమంటే పాకిస్తాన్ నాయకులు షేక్ అబ్దుల్లాను కాంగ్రెస్ పార్టీ ఏజెంట్‌గా భావించారు. లియాకత్‌లీఖాన్ షేక్ అబ్దుల్లాను ఆ విధంగానే వర్ణించాడు.

ఈ అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని 1949 జనవరి 5 నాడు యుఎన్‌సిఐపి పాకిస్తాన్ ప్రభుత్వాన్ని సంతృప్తి పరచడం కోసం తీర్మానాన్ని కొంత సవరించింది. రెండు దేశాల సైనిక బలగాల మోహరింపును ప్లెబిసైట్ నిర్వాహకుడు నిర్ణయిస్తాడనీ ప్లెబిసైట్ నిర్వహణలో అతనికి రెండు ప్రాంతాల స్థానిక అధికార యంత్రాంగాలు పూర్తిగా సహకరిస్తాయని ఈ సవరణ చెబుతుంది. దీనిని పాకిస్తాన్ ఆమోదించింది. కానీ ఇండియాకిది నచ్చలేదు. ఈ విధంగా మొదలైంది రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన పద్ధతిలో ప్లెబిసైట్ నిర్వహించడానికి ఐక్యరాజ్యసమితి చేసిన ప్రయత్నాల పరంపర.

సూత్రరీత్యా ప్లెబిసైట్‌కు రెండు ప్రభుత్వాలు అనుకూలంగా ఉన్నట్టే కానీ ఆచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉండింది. ఒక్కొక్క ప్రయత్నానికి సూచికగా ఐక్యరాజ్యసమితి తీర్మానాలు పదే పదే జారీ చేసింది. 1948 జూన్ 3న, 1950 మార్చి 14న, 1951 మార్చి 30న, 1951 నవంబర్ 10న, 1952 డిసెంబర్ 23న, 1957 జనవరి 24న, 1957 ఫిబ్రవరి 21న, 1950 డిసెంబర్ 22వ తేదీన తీర్మానాలు జారీ చేయడం జరిగింది. ఒక్కొక్క తీర్మానంలోను 1948 ఏప్రిల్ 21 నాటి తీర్మానాన్ని , 1949 జనవరి 5 నాటి తీర్మానాన్ని మరొక్కసారి గుర్తు చేస్తూ ఇప్పటికీ ఆ తీర్మానాలను ఇండియా, పాకిస్తాన్‌లు ఆమోదిస్తున్నందుకు వారిని అభినందించి, మిగిలిన తేడాలను పరిష్కరించే సంకల్పాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. అందుకోసం అనేక ప్రణాళికలు రచించారు. ఒక మెక్‌నాటన్ ప్రణాళిక, ఒక డిక్సన్ రిపోర్టు, ఒకటి కాదు 5 గ్రహాం రిపోర్టులు, గున్నార్ జారింగ్ గారి ఒక మధ్య వర్తిత్వ ప్రయత్నం, మరొకసారి 1958లో ఫ్రాంక్‌గ్రహాం గారి మధ్యవర్తిత్వ ప్రయత్నం జరిగాయి.

అయితే 1957 తర్వాత సోవియట్ యూనియన్ భారత్‌కు అండగా ముందుకు వచ్చింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో సోవియట్ వీటో కారణంగా భారత ప్రభుత్వ ప్రయోజనాలకు భిన్నంగా తీర్మానాలు జారీ చేయటం అసాధ్యమైపోయింది. దీనితో భారత్‌కు బలమెంతొచ్చిందంటే 1964లో ఐక్యరాజ్యసమితిలోని భారత ప్రతినిధి మహమ్మద్ కరీం చాగ్లా “మా ప్రభుత్వం ఎటువంటి పరిస్థితుల్లోను కశ్మీర్‌లో ప్లెబిసైట్

నిర్వహించదలచుకోలేదు అని స్పష్టం చేస్తున్నాము" అని భద్రతా మండలికి చెప్పాడు. ఐక్యరాజ్యసమితి చేపట్టిన ఈ మొత్తం ప్రయత్నంలో కొట్టొచ్చినట్టు కనిపించేదేమంటే జమ్మూ కశ్మీర్ ప్రజల ఆకాంక్షల సమస్యగా ప్రారంభమైంది. భారత, పాకిస్తాన్‌ల ప్రయోజనాల సమస్యగా మారిపోయి ఈ రెండు ప్రభుత్వాల ప్రయోజనాలకు రాజీ కుదరని కారణంగా పరిష్కారం లేకుండ చిక్కుకుపోయింది. పరిష్కారం ఎందుకు లేదూ అంటే ఈ రెండు ప్రభుత్వాలకూ కూడా తమ ప్రయోజనాల కంటే జమ్మూ కశ్మీర్ ప్రజానీకం యొక్క ఆకాంక్షలు ముఖ్యమైనవి, ప్రధానమైనవి అన్న అవగాహన లేదు. ఈ రెండు ప్రభుత్వాలకు కూడా ప్లెబిసైట్ ద్వారా ఆ ప్రజాకాంక్షను నిర్ణయించాలి అన్న సంకల్పమూ లేదు.

మొదట్లో పాకిస్తాన్‌కు ప్లెబిసైట్ పట్ల పెద్దగా ఆదరభావం లేదు. ఎందుకంటే అత్యంత అనుకూలమైన పరిస్థితులలో కూడా ఆ ప్లెబిసైట్ తనకు అనుకూలంగా ఉంటుంది అని పాకిస్తాన్ భావించలేదు. బ్రిటిష్ చరిత్రకారుడు అలిస్టైర్ ల్యాంబ్* కూడా 1948లో ప్లెబిసైట్ గాని పెట్టి ఉంటే అది ఇండియాకే అనుకూలంగా వచ్చి ఉండేదని, ప్లెబిసైట్ ఏ విధంగా నిర్వహించాలి అనేది పాకిస్తాన్ చెప్పిన పద్ధతిలోనే జరిగి ఉన్నా కూడా ఇండియాకే అనుకూలంగా వచ్చేదని అంటారు. దీనికి కారణం ఏమిటంటే అప్పట్లో ఈ రెండు దేశాల మధ్య షేక్ అబ్దుల్లా ఇండియాకు అనుకూలంగా ఉన్నాడు. పాకిస్తాన్ అతన్ని నెహ్రూ ఏజెంట్‌గా భావించినప్పటికీ కశ్మీర్ లోయలో అతనికున్న ప్రజాదరణ ఎట్లాంటిదంటే అతని అభిప్రాయం ప్రజాభిప్రాయంపై బలమైన ప్రభావం వేసి ఉండేది. అయితే జమ్మూ కశ్మీర్ రాష్ట్రం ఇండియాలోనో, పాకిస్తాన్‌లోనో కలవకుండా స్వతంత్రంగా ఉండే మూడో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లనే అబ్దుల్లా ఇండియాలో విలీనం కావడానికి అనుకూలంగా ఉన్నాడా అనేది వివాదాస్పదమైన విషయం. ఈ విషయంలో అబ్దుల్లా అన్ని సందర్భాల్లోను స్పష్టంగా మాట్లాడలేదు. అయితే అక్టోబర్ 1947లో మహారాజు భారత్‌లో ఆ రాష్ట్రాన్ని విలీనం చేసిన తర్వాత ఒక బహిరంగసభలో షేక్ అబ్దుల్లా ఈ విధంగా అన్నాడు – "కశ్మీర్ అన్ని మతాల ఉమ్మడి రాజ్యంగా ఉంటుంది. మన మొదటి డిమాండ్ అధికారాన్ని కశ్మీర్ ప్రజానీకానికి బదలాయించడం. ఒక ప్రజాతంత్ర కశ్మీర్‌లో ప్రజా ప్రతినిధులు ఈ రాష్ట్రం ఇండియాలో చేరాలా లేక పాకిస్తాన్‌లో చేరాలా అనేది నిర్ణయిస్తారు. ప్రజలను పక్కన పెట్టిన ప్రభుత్వం ఇండియాకో లేక పాకిస్తాన్‌కో అనుకూలంగా ప్రకటిస్తే నేను తిరుగుబాటు చేస్తాను. ఒక పోరాటాన్ని చేపట్టవలసి వస్తుంది. అయితే మనకు స్వేచ్ఛ కావాలి అనే డిమాండుకు ఎక్కడైతే గుర్తింపు, మద్దతు

---

* ఈయన కశ్మీర్‌పై "Kashmir A Disputed Legacy" అనే పుస్తకం రాశాడు.

లభిస్తుందో ఆ దేశంలోకే మనం పోతాం. ఎవరైతే మన భవిష్యత్తు విషయంలో మనకు మాట్లాడే అవకాశం ఉండదు అని అంటారో వాళ్ళలో మనం చేరం". 1944లోని నయా కశ్మీర్ ప్రణాళికలోనే నేషనల్ కాన్ఫరెన్స్ యూరప్‌లో స్విట్జర్లాండ్ నమూనాలోని ఒక స్వతంత్ర, తటస్థ కశ్మీర్‌ను ఊహించింది. 1950లలో షేక్ అబ్దుల్లాతో అమెరికా ప్రభుత్వం తరపున అనేకసార్లు మాట్లాడిన అమెరికా రాయబారి, అబ్దుల్లా స్వతంత్ర కశ్మీర్‌నే కోరుకున్నాడని, అదిగాని సాధ్యం కాకపోతే పాకిస్తాన్ బదులు ఇండియాలో చేరడం మేలని భావించాడని చెప్తారు.

ఆనాడు కానీ ప్లెబిసైట్ పెట్టి ఉంటే నూటికి 90 పాళ్ళు భారత్‌కే అనుకూలంగా ఓట్లు వచ్చి ఉండేవని అందరూ అంటున్నప్పటికీ భారత్ కూడా ప్లెబిసైట్ పట్ల ఎందుకు అంత ఉత్సాహం చూపించలేదు అనేది చాలామంది విశ్లేషిస్తున్న ప్రశ్న. విశ్లేషకులు, చరిత్రకారులు, దీనికి ఇస్తున్న అన్ని జవాబులను ఇక్కడ ప్రస్తావించనవసరం లేదు. కానీ దీంట్లో కొట్టొచ్చినట్టు కనిపించే విషయం ఏమిటంటే మొత్తంగా జమ్మూ కశ్మీర్ విలీనం విషయంలో భారత ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక వైఖరి. భారత్‌కు ఎప్పుడూ కూడా జమ్మూ కశ్మీర్ ప్రజలపై విశ్వాసం లేదు. వాళ్ళకు తమ అభిప్రాయాలను చెప్పుకునే అవకాశం ఇవ్వాలా అనే సంకల్పమూ లేదు. భారత ప్రభుత్వం ఎప్పుడూ ఏ పద్ధతి అవలంభించింది అంటే స్థానిక ప్రజానీకంపైన పట్టు ఉన్న ఒక వ్యక్తి మీద ఆధారపడటం, ఆ వ్యక్తిమీద ఆధారపడితే ఆ రాజ్యం భారత్‌లో కలిసిపోతుంది అని నమ్ముకోవడం. కశ్మీర్‌ను తనకు ఎవరైతే అందజేస్తారో (అదేదో వస్తువు అయినట్టు) వాళ్ళ మీద ఆధారపడటం భారత ప్రభుత్వం అనుసరించినటువంటి ఎత్తుగడ. షేక్ అబ్దుల్లా గురించి జవహర్‌లాల్ నెహ్రూ "మనకు కశ్మీర్‌ను అందజేయగలడు" అని మెచ్చుకుంటూ కూడా మాట్లాడాడు. మరి ఆ విధంగా చేసే సత్తా ఉన్న వ్యక్తికి భారత్ ఏమిస్తుందంటే అతను జమ్మూ కశ్మీర్‌లో ఏ విధంగా ప్రవర్తించినా, అవినీతిపరుడైనా, నియంత అయినా, కర్కోటకుడైనా అతన్ని సమర్థిస్తుంది. ఈ వైఖరే ప్రస్తుత సంక్షోభానికి దారితీసిందనే విషయాన్ని రాబోయే అధ్యాయాల్లో చూద్దాం. కాలం గడిచే కొద్ది జమ్మూ కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించే 'వ్యక్తులు' తక్కువైపోయారని భారత్ గుర్తించింది. అందువల్ల అటువంటి వారిపై ఆధారపడే అవసరం కూడా లేకుండా రాజకీయ గూడుపుఠానీల ద్వారా, రాజ్యాంగ వ్యతిరేకమైన కుట్రల ద్వారా, జమ్మూ కశ్మీర్‌ను ఇండియాలో కలిపేసుకోవాలనే ఆలోచన చేయసాగింది. కశ్మీరీలు పిరికివాళ్ళని, చేతగానివాళ్ళని దాదాపు 1989 దాకా అనుకున్నారు. అందువల్ల ఇటువంటి ఎత్తుగడలు సాగుతాయని భారత్ భావించింది. ఈ కారణంగా క్రమంగా ప్లెబిసైట్ పట్ల పాకిస్తాన్ మరింత ఎక్కువ ఉత్సాహం చూపిస్తూ ఉండగా భారత్ అసలు దాని గురించి మాట్లాడడమే మానేసింది.

1947–48లలో తానే ప్రకటించుకున్నటువంటి ఉన్నతమైన సూత్రాలు, విలువలను ఎందుకు వదిలిపెట్టింది. అనే విషయం సమర్థించుకోవడం కోసం 1950ల చివరి భాగంలో ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాల పరిభాషను భారత్ ఉపయోగించడం మొదలుపెట్టింది. 1953 తర్వాత పాకిస్తాన్, ప్రచ్ఛన్న యుద్ధ పరిభాషలో అమెరికా కూటమిలో చేరింది. సియాటో (SEATO)* లోను, సెంటో (CENTO)* లోను చేరింది. ఇవి రెండూ ఆసియా ఖండంలో అమెరికా మద్దతు ఉన్నటువంటి దేశాల కూటములు. అంతేకాకుండా పాకిస్తాన్ అమెరికా సైనిక సహాయాన్ని తీసుకుంది. తన భూభాగం మీద సైనిక స్థావరాలు నెలకొల్పడానికి అమెరికాను అనుమతించింది. పాకిస్తాన్ ఈ సంబంధాలను కశ్మీర్ విషయంలో భారత్‌పైన అమెరికాచేత ఒత్తిడి పెట్టించడానికి వాడుకోవాలని చూసిన మాట వాస్తవం. కాని భారత్ ఈ వాస్తవాన్ని దేని కోసం వాడుకుందంటే, ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల నుడికారాన్ని కశ్మీర్ సమస్యలోకి ప్రవేశపెట్టి 1957 తర్వాత సోవియట్ రష్యా వీటోల చాటున దాక్కొని తానే ప్రకటించిన విలువలను తిరస్కరించడానికి. పాకిస్తాన్ అమెరికాతో నెలకొల్పిన సంబంధాల దృష్ట్యా కశ్మీర్ సమస్య సందర్భం మొత్తం మారిపోయిందనీ, గతంలో మాట్లాడినట్టు ప్లెబిసైట్ గురించి మాట్లాడటం ఇక సాధ్యం కాదనీ భారత్ దబాయించడం మొదలుపెట్టింది. కాబట్టి మారిన పరిస్థితి పేరు మీద గతంలో తానిచ్చిన హామీలకు తాను నిబద్ధునిగా ఉండనక్కరలేదని భారత్ చెప్పదలచుకుంది. అలిస్టైర్ ల్యాంబ్ మాటల్లో చెప్పాలంటే "పాకిస్తానీ విదేశ విధానంలో వచ్చినట్టి మార్పును నెహ్రూ కశ్మీర్‌లో ప్లెబిసైట్ పెడతాము అన్న హామీని శాశ్వతంగా వాయిదా వేయడానికి వాడుకున్నాడు. 1957 తర్వాత సోవియట్ రష్యా తన ప్రచ్ఛన్నయుద్ధ ప్రయోజనాల కోసం భారత్‌కు అండగా నిలబడటం మొదలుపెట్టిన తర్వాత నెహ్రూ, అతని సలహాదారులు, మళ్ళీ అలిస్టైర్ ల్యాంబ్ మాటల్లోనే చెప్పాలంటే "పాకిస్తాన్‌కు అమెరికా ఇస్తున్న సైనిక సహాయం దృష్ట్యా భారత్‌కు రష్యా ఇస్తున్న నైతిక మద్దతు దృష్ట్యా, ఇక కశ్మీర్‌లో ప్లెబిసైట్ నిర్వహణ గురించి మాట్లాడనవసరం గానీ దానిపట్ల నిబద్ధత ఉన్నట్టు నటించాల్సిన అవసరం గానీ లేదని భావించసాగారు."

ప్రచ్ఛన్నయుద్ధ రాజకీయాల గురించి ఇక్కడ విడమరచి చెప్పనవసరం లేదు. అమెరికా విస్తరణ వాదం పట్ల భారత్ లాంటి మూడో ప్రపంచ దేశాలు ఆందోళన చెందడం న్యాయం కాదా అన్నది ఇక్కడ విషయం కాదు. అయితే ఈ వాస్తవాలు, ఈ భయాలు, భారత్‌కు ఒక సాకును కల్పించాయని, భారత్ నిస్సిగ్గుగా దాన్ని వాడుకుని

---

* SEATO - East Asia Treaty Organisation

* CENTO - Central Treaty Organisation

1947-48 కాలంలో జమ్మూ కశ్మీర్ విషయంలో తానిచ్చినటువంటి, తాను ప్రకటించినటువంటి ఉన్నతమైన విలువలను వదిలిపెట్టడానికి వాడుకుందని చెప్పకతప్పదు. జమ్మూ కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార సమస్య మొదట భారత్, పాకిస్తాన్‌ల సైనిక, రాజకీయ వైరుధ్యంలో ఇరుక్కుని ఆ తర్వాత ప్రచ్ఛన్న రాజకీయాల వైరుధ్యంలో ఇరుక్కొనింది. జమ్మూ కశ్మీర్ భూభాగం గురించి భారత్ పాకిస్తాన్‌లు ఎప్పుడయితే యుద్ధానికి దిగాయో అప్పుడు వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా వారి స్వయం నిర్ణయాధికార ఆకాంక్ష భారత, పాకిస్తాన్‌ల సైనిక, రాజకీయ వైరుధ్యంలో భాగమైంది. ఆ తర్వాత ఎప్పుడయితే భారత్, పాకిస్తాన్‌లు ప్రచ్ఛన్న రాజకీయాల్లో ఒకరు అమెరికా పక్షం, మరొకరు రష్యాపక్షం వహించారో అప్పుడు మళ్ళీ ఆ రాష్ట్ర ప్రజానీకం ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా అమెరికా, రష్యాల అంతర్జాతీయ ప్రచ్ఛన్న రాజకీయాలలో అది భాగమైంది. ఇప్పుడు భారత్ పాకిస్తాన్‌లు రెండూ ఏకమై ప్రపంచాధిపతి అయిన అమెరికాను మెప్పించే ఆరాటంలో నిమగ్నమయి ఉన్నాయి కాబట్టి ఇక మీదట అది అమెరికా ప్రపంచాధిపత్యకాంక్ష కిందనలిగి పోనుందా? అన్నది ఇవాల్టి ప్రశ్న.

## 2. విలీనం అనంతరం - ప్రజాస్వామ్య విధ్వంసం

హరిసింగ్ తన రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేసినపుడే తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన షేక్ అబ్దుల్లాతో అధికారాన్ని పంచుకోవడానికి ఒప్పుకున్నాడు. అబ్దుల్లా 1931 నుంచి జైలులోకి పోతూ వస్తూ ఉన్నాడు. చివరికి 1947 సెప్టెంబర్ 24న భారత ప్రభుత్వం పెట్టిన ఒత్తిడి మేరకు అతన్ని విడుదల చేయడం జరిగింది. అయితే తాను మహారాజుకు విశ్వాసపాత్రుడిగా ఉంటానన్న భరోసా అతడి నుండి తీసుకోవడం జరిగింది. కానీ బయటికి రాగానే ఆ హామీని అతడు అతిక్రమించడం మొదలుపెట్టాడు. చివరికి హరిసింగ్ ఎప్పుడైతే పరిస్థితుల ఒత్తిడి వల్ల భారత్‌లో విలీనం కావడానికి అంగీకరించాడో నెహ్రూ షేక్ అబ్దుల్లాతో అతను అధికారం పంచుకోవాలి అని వత్తిడి పెట్టాడు. నెహ్రూలో ఉన్న ఈ కోరిక వల్లనే మహారాజు విలీనం కావడానికి ఇచ్చిన ఒప్పుకోలును భారత్ స్వీకరించడంలో ఆలస్యమైందని సీనియర్ పాత్రికేయుడు అజిత్ భట్టాచార్జి అంటారు. ఈ కారణంగా విలీనాన్ని భారత్‌కు అందజేసే లేఖలో మహారాజు హరిసింగ్ ఒక మధ్యంతర ప్రభుత్వాన్ని వెంటనే నెలకొల్పబోతున్నట్టు, తన ప్రధానమంత్రితో పాటు షేక్ అబ్దుల్లా ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో పరిపాలన బాధ్యత స్వీకరించాలి అని అడగబోతున్నట్టు కూడా చెప్పాడు. ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటింటే హరిసింగ్ వెంటనే ఒక ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వాన్ని కశ్మీర్‌లో నెలకొల్పాలి అని నెహ్రూ ఒత్తిడి పెట్టి ఉండవచ్చు. కాని ఆ పని చేయలేదు. ఆయన హరిసింగ్ తన పాలనాధికారాన్ని షేక్ అబ్దుల్లాతో పంచుకోవాలని మాత్రమే కోరాడు. షేక్ అబ్దుల్లా ప్రజాదరణ కలిగిన నాయకుడు కాదా అనేది ఇక్కడ విషయం కాదు. అతను ఖచ్చితంగా ప్రజాదరణ కలిగిన నాయకుడే - కనీసం కశ్మీర్ లోయలో - అతను ప్రజాదరణ కలిగిన వ్యక్తి కాబట్టే అతను ఏ నిర్ణయం చేసినా ప్రజలు అంగీకరిస్తారని అనడం కూడా సరయినది కాదు. కశ్మీరీ ప్రజల ఆలోచనారీతి కాంగ్రెస్ ప్రకటించుకున్నటువంటి ఆదర్శాలకే తప్ప ముస్లింలీగ్, జమ్మూ కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ వంటి పార్టీలు మాట్లాడే లేదా ప్రకటించే మతపరమైన మాటలకు స్పందించే ఆలోచనారీతి కాకపోవడం వల్లనే షేక్ అబ్దుల్లా పట్ల కశ్మీరీలలో ఆదరభావం ఉందనీ, అతను కశ్మీర్‌ను భారత్‌లోకి తీసుకురాగలిగాడు అని బల్‌రాజ్‌పూరి అంటాడు. ముస్లింలీగ్, జమ్మూ కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ పార్టీల నాయకులు మీర్‌వైజ్ యూసుఫ్‌షా, చౌదరిగులాం అఫ్జల్ త్వరలోనే సరిహద్దుదాటి అవతలివైపు వెళ్ళిపోయారు.

ఇది నిజమే అయినప్పటికి అబ్దుల్లాను గద్దెనెక్కించడమే ప్రాతినిధ్య పరిపాలన నెలకొల్పడం కాజాలదు. నెహ్రూకు ఈ సంగతి పట్టలేదు. జమ్మూ కశ్మీర్‌లో భారత్

ప్రయోజనాలను కాపాడటానికి అబ్దుల్లాకున్న ప్రజాదరణ పనికొస్తుంది. ఆ ప్రజాదరణే భారత్ ప్రయోజనాల ప్రధానమైన భరోసా అని నెహ్రూ భావించాడు. అంతేతప్ప జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం ఉండాలని ఆయన కోరుకోలేదు. ప్రాతినిధ్య ప్రభుత్వం అంటే ఆ రాష్ట్రాన్ని భారత్‌కు అప్పగించగల ఒక ప్రజాదరణ కలిగిన వ్యక్తి యొక్క పరిపాలన అనే నిర్వచనమేదయితే నెహ్రూ ఇచ్చాడో దీని ఫలితంగా విభిన్న మతాలు, జాతులు, భాషల సమ్మేళనమైన ఆ రాష్ట్రంలో భిన్న ప్రజా బృందాల మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. షేక్ అబ్దుల్లా కశ్మీరీ ప్రజల ఆలోచనా రీతిని బాగా అర్థం చేసుకున్నాడు. దానికి ప్రాతినిధ్యం చక్కగా వహించాడు. అయితే అతనికి జమ్మూ, లదాక్ ప్రాంతాల ప్రజల ఆలోచనారీతితో పరిచయమూ లేదు. వాటి పట్ల సానుభూతీ లేదు. వారిలోని ముస్లింల గురించి కూడా అతనికి అవగాహన లేదు. అతని దృష్టిలో జమ్మూ కశ్మీర్ అంటే కశ్మీరే. జమ్మూ ప్రాంతాన్ని పాలక రాజవంశమైన హరిసింగ్ వంశంతో సమానంగా చూసేవాడు. దీని ఫలితంగా ప్రాంతాల మధ్య సంబంధాలు బాగా చెడ్డాయి. ఈ సంగతి బల్‌రాజ్‌పురి చక్కగా వివరించారు. అబ్దుల్లా ప్రభుత్వంలో జమ్మూ ప్రాంతానికి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండింది. దాని ఫలితంగా రాష్ట్రంలో కశ్మీరీల పెత్తనం సాగుతుంది అన్న నిరసన తలెత్తింది.

మరొక వైపు జమ్మూలో హిందూమతవాద శక్తులు పైకి లేచాయి. వీరు మరింతగా ప్రాంతీయ, మతపరమైన విభేదాలను పెంచారు. షేక్ అబ్దుల్లా మరింతగా కశ్మీర్ ప్రాంతానికే, కశ్మీరీ గుర్తింపుకే కుదించుకుపోయేటట్టు వారు చేశారు. అతను అట్లా ప్రవర్తించే కొద్దీ దాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకొని అతని పాలనను ముస్లిం మతోన్మాద పాలనగా చూపించారు. వాస్తవానికి అబ్దుల్లా దృక్పథం ముస్లిం మతోన్మాదం ఎప్పుడూ కాదు. ఈ ప్రచారం ఫలితంగా అబ్దుల్లా చాలా మనస్తాపానికి గురయ్యాడు. కశ్మీర్, జమ్మూ ప్రాంతాల మధ్య విభేదాలు పెరిగాయి. ఈ విభేదాలు పెరగడం వల్ల మొత్తంగా రాష్ట్ర భవితవ్యాన్ని నిర్ణయించుకునే సమస్యను విస్మరించే పరిస్థితులు నెలకొన్నాయి. అబ్దుల్లా మొదట్లో ఆ రాజ్యంలో ప్రధానమంత్రి మెహర్‌చాంద్ మహాజన్‌తో పాలనాధికారాన్ని పంచుకోవలసి వచ్చింది. అతను ఆర్యసమాజ్ వాది. అబ్దుల్లా అంటే అతనికి ఇష్టం లేదు. మహాజన్‌ను ప్రధానమంత్రిగానే కొనసాగించి అబ్దుల్లాను పరిపాలనా డైరెక్టర్ జనరల్‌గా పిలిచేవారు. 1948 మార్చిలో మహాజన్ పదవీ విరమణ చేసిన తర్వాత షేక్ అబ్దుల్లా అతని స్థానంలో ప్రధానమంత్రి అయ్యాడు. తనకు చేజిక్కిన అధికారాన్ని అబ్దుల్లా భూసంస్కరణలు అమలు చేయడానికి వాడుకున్నాడు. జాగీర్‌దారీ, చాక్‌దారీ హక్కులను నష్టపరిహారం లేకుండా రద్దుచేసి గరిష్ట పరిమితి చట్టాన్ని తీసుకొచ్చాడు. దీనివల్ల ముస్లిం జాగీర్‌దార్లు కూడా నష్టపోయినప్పటికి ప్రధానంగా ఇది హిందువులకే దెబ్బ అయింది. జమ్మూ ప్రాంతపు డోగ్రా భూస్వాములు, కశ్మీరీ

పండిట్లు దీనివల్ల దెబ్బతిన్నారు. 396 పెద్ద జాగీర్లను రద్దుచేసి 9 వేలమంది భూస్వాముల నుండి 4 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. కశ్మీర్ లోయలో సైనిక బలగాల ఎంపికలో జరిగిన అన్యాయాన్ని సవరిస్తూ షేక్ అబ్దుల్లా కశ్మీర్ లోయకే పరిమితమైన ఒక సైనిక బలగాన్ని రూపొందించాడు. అది ఆ లోయకే పరిమితమైంది కాబట్టి సహజంగానే దాంట్లో ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అంతకు ముందు ముస్లింలకు పాలనా యంత్రాంగంలో నిరాకరించబడిన సముచిత స్థానాన్ని కల్పించే ప్రయత్నం కూడా చేశాడు. ఆ తర్వాత గ్రామీణ రుణభారాన్ని తగ్గించడానికి ఒక ఆదేశం జారీ చేశాడు. అప్పు తీసుకున్న వ్యక్తి అసలుకు ఒకటిన్నర రెట్లు గాని చెల్లించి వేస్తే అప్పు మొత్తం తీరిపోయినట్టేనని ఈ ఆదేశం ప్రకటించింది. తన జ్ఞాపకాల్లో షేక్ అబ్దుల్లా ఈ విధంగా చెప్పుకున్నాడు– "400 సంవత్సరాల తర్వాత కశ్మీరీలు స్వతంత్ర్యాన్ని పొందారు. తమ పరిస్థితిని మెరుగు పరుచుకోవడం మొదలుపెట్టారు." కశ్మీరీలు ఆనాటి ఘటనలను ఈ విధంగా చూశారు. ఈ విధంగా అర్థం చేసుకున్నారు– ఇతరులు మాత్రం ఎంతసేపు జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనమవుతుందా లేక పాకిస్తాన్‌లో విలీనమవుతుందా అనే అంశం మీద దృష్టి పెట్టారు. కశ్మీరీలకు ఎక్కువ మనస్తాపం కలిగించిన విషయం ఏమిటంటే గతంలో జరిగిన అన్యాయాలను సవరించడానికి తాము చేపట్టిన న్యాయమైన చర్యలను హరిసింగ్, అతని మనుషులు, మతోన్మాద హిందువులు, మతవాద చర్యలుగా విమర్శించడం.

మరొకవైపు జమ్మూ ప్రాంతంలో ముస్లింలపైన మతపరమైన దాడులు కొనసాగాయి. హరిసింగ్, అతని భార్య తారాదేవి, అతని ప్రధానమంత్రి మహాజన్, హిందూ మతోన్మాదులతో చేతులు కలిపి ముస్లింలపైన ఊచకోత ప్రత్యక్షంగా జరిపించారని షేక్ అబ్దుల్లా నమ్మాడు. అయితే పాకిస్తాన్‌లో హిందువులపైన, సిక్కులపైన జరిగిన దాడుల నుంచి తప్పించుకుని జమ్మూ ప్రాంతానికి పారిపోయి వచ్చిన హిందువులు, సిక్కులు, జమ్మూలో జరిగిన మతఘర్షణలో, మతపరమైన హత్యాకాండలో, ప్రధాన పాత్రధారులని అనిపిస్తుంది. హరిసింగ్ ప్రభుత్వం షేక్ అబ్దుల్లా చెప్పినట్లు, వారు చేసిన దాడులను తానే వెనుక ఉండి నిర్వహించిందో లేదో కానీ వాటిని ఆపడానికీ, ముస్లింలను కాపాడడానికీ ఏ ప్రయత్నం చేయలేదన్న మాట వాస్తవం. కశ్మీర్ లోయ మత సహనానికి ఒక సంకేతంగా నిలిచింది. ఆ నేపథ్యంలో డోగ్రా పాలకులు జమ్మూలో ముస్లింల ప్రాణాలు కాపాడలేకపోవడం సిగ్గుపడవలసిన విషయం అని అబ్దుల్లా అన్నాడు. మహాత్మాగాంధీ అయితే మహారాజు జమ్మూలో జరుగుతున్న హత్యాకాండకు బాధ్యత వహించి రాజీనామా చేయాలనీ పరిపాలన షేక్ అబ్దుల్లాకు అప్పగించాలని కూడా ప్రకటించాడు. కాని అదే సమయంలో భారత హోంమంత్రి అయిన సర్దార్ పటేల్ ఒక లేఖలో జమ్మూ కశ్మీర్ ప్రాంతపు ముస్లిమేతరులు మహారాజును తమ భద్రతకు ఒక చిహ్నంగా భావించడం సహజమేనని అన్నాడు.

అబ్దుల్లా ఎదుర్కొన్న సమస్య ఏమిటంటే ఒక పక్క మతాన్ని ఎరగా చూపిస్తూ కశ్మీర్ ప్రజానీకాన్ని ఆకర్షించడానికి పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలనూ, భారత్ యొక్క లౌకికవాద స్వభావంపట్ల ఉన్న సందేహాలనూ అధిగమించి తన రాజకీయ ప్రజాదరణను లోయలో నిలబెట్టుకోవాలి. జమ్మూ ప్రాంతంలో ముస్లింల ఊచకోత, అక్కడి హిందూ మతోన్మాదులు బహిరంగంగా మతోన్మాద వ్యాఖ్యలు చేయడం, అతని కర్తవ్యాన్ని మరింత కష్టతరం చేశాయి. పోనుపోను అతనిలో నిరసన బాగా పెరిగింది. జమ్మూ ప్రాంతంలో ముస్లింలపై ఊచకోత ఆగిన తర్వాత హిందూ మతోన్మాదులు జమ్మూలోను తదితర భారతదేశంలోనూ కశ్మీర్‌కు ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తికి వ్యతిరేకంగాను, షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగాను ఓ ప్రచార కార్యక్రమం చేపట్టారు. 400 సంవత్సరాల పరాయి పరిపాలనలో కశ్మీర్‌కు జరిగిన అన్యాయాన్ని సవరించడానికి అతను అనుసరించిన విధానాలకు మతం రంగు పులిమి ప్రచారం చేశారు. షేక్ అబ్దుల్లా, హరిసింగ్‌లు చేస్తున్న పరస్పర ఆరోపణలు కొనసాగాయి. భారత హోంమంత్రి సర్దార్ పటేల్ హరిసింగ్‌కు చెవి ఒగ్గుతుండగా నెహ్రూ మాత్రం అబ్దుల్లాకు అంతే బలంగా ఆసరా ఇవ్వలేదు. అబ్దుల్లా తానెంచుకున్న పాలనా విధానాల్లోని మరీ ర్యాడికల్ చర్యలు కొంచెం తగ్గించాలని నెహ్రూ అతన్ని ఒప్పించడానికి ప్రయత్నం చేశాడు. ఉదాహరణకు రద్దయిన జాగీర్ల అధిపతులైన జాగీదార్లకు నష్టపరిహారం ఇవ్వకపోవడం సరైంది కాదనీ కొంత ఇవ్వాలనీ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. చివరికి నెహ్రూ ఒత్తిడి మేరకే హరిసింగ్ మహారాజు పదవి నుండి దిగిపోయి ఆయన కొడుకు కరణ్‌సింగ్ ఆ రాష్ట్ర పాలకుడయ్యాడు. ఇది జరిగింది 1949 మే, 25న. ఆ తర్వాత కరణ్‌సింగ్‌ను ఆ రాష్ట్ర మొదటి రాష్ట్రపతిగా (సదరీ రియాసత్‌గా) ఎంపిక చేసుకోవడం జరిగింది. ఆ హోదాలో అతను భారత ప్రభుత్వానికి ఒక నమ్మినబంటుగా వ్యవహరించాడు. ఆయన చేసిన మొట్టమొదటి చర్యల్లో ఒకటి నష్టపరిహారం లేకుండా జాగీర్లను రద్దు చేసిన చట్టాన్ని భారత రాష్ట్రపతి ఆమోదానికి పంపించడం. ఈ చర్య కశ్మీర్‌కు ఇయ్యనంగీకరించిన స్వయం ప్రతిపత్తికి విరుద్ధమైనది. ఈ పని చేసినందుకు భారత ప్రభుత్వం కరణ్‌సింగ్‌ను తప్పు పట్టవలసింది పోయి, దాన్ని అవకాశంగా తీసుకొని ఆ చట్టాన్ని సవరించవలసిందిగా షేక్ అబ్దుల్లా పైన ఒత్తిడి పెట్టసాగింది. షేక్ అబ్దుల్లా చేపట్టిన ప్రాథమికమైన సామాజిక, ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగాను, జమ్మూ కశ్మీర్‌కు యిచ్చిన ప్రత్యేక ప్రతిపత్తికి వ్యతిరేకంగాను జమ్మూ ప్రాంతంలో ప్రారంభమైన ఆందోళన ఆర్‌ఎస్‌ఎస్‌కు బాగా సన్నిహితమైన జమ్మూ ప్రజాపరిషత్ ఏర్పాటుకు దారి తీసింది. ప్రజాపరిషత్ ఎంత అధికంగా మతోన్మాద వైఖరి అవలంబిస్తే పాకిస్తాన్ భారత్ యొక్క లౌకికవాదం గురించి వ్యక్తపరుస్తున్న సంశయం అంత సమర్థనీయమైనదిగా కనిపించడం మొదలైంది. ముస్లింలు మెజారిటీ ఉన్న కశ్మీర్‌లో ఒక లౌకికవాద, అభ్యుదయకర సమాజం నిర్మించే షేక్ అబ్దుల్లా కర్తవ్యం మరింత కష్టతరమైంది.

## ఆర్టికల్ 370 అంతరార్థం

జమ్మూ ప్రజాపరిషత్‌ను 1947లో బల్‌రాజ్ మధోక్ నెలకొల్పాడు. అతను ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. ఆ తర్వాత అతను జనసంఘ్ నాయకుడయ్యాడు. 1949 నుండి ప్రజాపరిషత్ షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగాను, భారత రాజ్యాంగలోని ఆర్టికల్ 370కి వ్యతిరేకంగాను, ప్రజాభిప్రాయ సేకరణ లేదా ప్లెబిసైట్ అనే ఆలోచనకు వ్యతిరేకంగాను చాలా గట్టిగా ఆందోళన చేపట్టింది. షేక్ అబ్దుల్లా యొక్క సామాజిక, ఆర్థిక సంస్కరణలను చాలా గట్టిగా వ్యతిరేకించింది. ఈ సంస్కరణలు ప్రధానంగా హైందవ పెత్తందారి వర్గాలు, ముఖ్యంగా డోగ్రా పెత్తందారి వర్గాలను దెబ్బతీశాయి. ప్రజాపరిషత్‌కు హరిసింగ్ ఆర్థికంగా సహాయం ఇస్తున్నాడని షేక్ అబ్దుల్లా మాత్రమే కాదు భారత ప్రభుత్వం కూడా నమ్మింది. 1952లో ప్రజాపరిషత్ జమ్మూ కశ్మీర్ భారత్‌లో సంపూర్ణంగా విలీనం కావాలి అనే ఒక ఉద్యమం చేపట్టింది. కశ్మీరీలు, వారిలో భాగంగా షేక్ అబ్దుల్లా ఈ ఉద్యమాన్ని చూసి చాలా ఆవేదన చెందారు. దీనికి వ్యతిరేకంగా లోయలో బలమైన నిరసన పెల్లుబికింది. ఈ నేపథ్యంలో భారత్ ఒక సెక్యులర్ ప్రజాతంత్ర దేశంగా ఉంటుంది అని గతంలో తనకున్న విశ్వాసం ఎంతవరకు సరైంది అనే సంశయం అబ్దుల్లాను పట్టుకుంది. అతను మరొక్కసారి స్వాతంత్ర్యాన్ని గురించి బహిరంగంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. 1952లో ఒక బహిరంగసభలో ప్రజాపరిషత్ వాళ్ళ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ ఈ విధంగా అన్నాడు– "మా భవితవ్యం నిర్ణయించుకునే హక్కుని సవాల్ చేయడం మొదలుపెడితే, భారతదేశంలో మతోన్మాదం మళ్ళీ పుట్టి పెరిగితే, భారత్ కశ్మీర్‌ను మింగివేయదు అని కశ్మీర్‌లోని ముస్లింలను ఏ విధంగా నమ్మించడం? ఇవన్నీ కూడా భారత్‌తో జరిగిన కశ్మీర్ విలీనాన్ని తెంపడానికే దారి తీస్తాయి."

1949లో ఒక పాశ్చాత్య విలేకరితో మాట్లాడుతూ షేక్ అబ్దుల్లా ఐక్యరాజ్యసమితి భరోసా పొందిన స్వతంత్ర కశ్మీరే ఈ సమస్యకు పరిష్కారం కాగలదు అని అన్నాడు. భారత నాయకత్వం ఈ మాటల్ని వెనక్కు తీసుకొమ్మని అతనిపై చాలా ఒత్తిడి పెట్టింది. అయితే అతని ఆలోచనా రీతి మాత్రం అదేవిధంగా కొనసాగింది. ఈ లోపల భారత రాజ్యాంగ పరిషత్ దేశానికి రాజ్యాంగాన్ని రూపొందించింది. జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనమైనపుడు ఏ ప్రత్యేక ప్రతిపత్తి హామీ ఇవ్వబడిందో దానిని రాజ్యాంగంలో రాయవలసి వచ్చింది. అదే భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 370. ఈ ప్రత్యేక ప్రతిపత్తి ఏమిటో ఇప్పటికే చూశాం. భారత్‌లో ఉన్నంతకాలం ఆ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి ఉంటుంది. భారత్‌లో ఉండేది లేనిది ఆ రాష్ట్రం యొక్క ప్రజలు నిర్ణయించుకుంటారు అనేది ఈ ప్రత్యేక ప్రతిపత్తి. ఆర్టికల్ 370 దీంట్లోని మొదటి అంశాన్ని మాత్రమే రాజ్యాంగంలో చేర్చింది. రెండవదాన్ని భారత రాజ్యాంగకర్తలు పూర్తిగా విస్మరించారు. ఆర్టికల్ 370ని బట్టి చూస్తే జమ్మూ కశ్మీర్ శాశ్వతంగా భారత్‌లో భాగమే అనేది రాజ్యాంగకర్తల

అభిప్రాయమని అర్థమవుతుంది. అంతేకాకుండా విలీన ఒడంబడికలోని స్వయంప్రతిపత్తి అంశాన్ని ఆర్టికల్ 370లో రాశారుగానీ ఆ స్వయం ప్రతిపత్తిని తొలగించడానికి అవసరమైన ఉప అంశాలు కూడా దాంట్లోనే రాశారు. మరొకరకంగా చెప్పాలి అంటే భారత పాలకుల ఉద్దేశం అప్పుడే స్పష్టమైపోయింది. ఆర్టికల్ 370ని తిరిగి పూర్వ వైభవానికి తీసుకరావాలనీ దానిని సక్రమంగా అమలుచేయాలనీ మనం డిమాండ్ చేసేటప్పుడు (ఇది చాలా న్యాయమైన డిమాండే) ఆర్టికల్ 370ని రాసినప్పుడే భారత రాజ్యాంగకర్తలు అంతకుముందు ఇచ్చిన వాగ్దానాలకు, హామీలకు ద్రోహం చేశారని మరచిపోకూడదు.

ఆర్టికల్ 370 ఏమంటుందంటే కేంద్ర ప్రభుత్వము, పార్లమెంటు జమ్మూ కశ్మీర్‌పైన రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార సాధనాలు అనే మూడు అంశాలలో మాత్రమే అధికారాన్ని కలిగి ఉంటాయి. అయితే ఏదైనా ఒక అంశం ఈ మూడింటిలోకి వస్తుందా రాదా అన్న సందేహంగానీ వస్తే భారత రాష్ట్రపతి జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయం చేస్తాడు అని అంటుంది. అంతేకాకుండా ఇతర భారత రాష్ట్రాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి ఏయే అధికారాలైతే ఉంటాయో ఆ అధికారాలన్నీ జమ్మూ కశ్మీర్ రాష్ట్రప్రభుత్వం కానీ సమ్మతిస్తే ఆ రాష్ట్రం విషయంలో కూడ భారత ప్రభుత్వానికి కట్టపెట్టే అధికారం భారత రాష్ట్రపతికి ఉంటుంది అని కూడా ఆర్టికల్ 370 అంటుంది. షేక్ అబ్దుల్లా అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని 370ని రాయడం జరిగిందని బ్రిటీష్ చరిత్రకారుడు అలిస్టైర్ ల్యాంబ్ అంటాడు. షేక్ అబ్దుల్లాను సంప్రదించి రూపొందించారని కూడా అంటాడు. అతను ఎప్పటికైనా జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లోకి తీసుకురావాలి అంటే అతన్ని సంతృప్తిపరచాలి. అందువల్ల రాజ్యాంగ ముసాయిదా కమిటీ తరపున గోపాలస్వామి అయ్యంగార్ అతన్ని సంప్రదించి అతని సమ్మతితో ఆర్టికల్ 370ని రూపొందించారని అలిస్టైర్ ల్యాంబ్ అభిప్రాయం. మరొకవైపు అజిత్ బట్టాచార్జి ఏమంటాడంటే షేక్ అబ్దుల్లాకు ఆర్టికల్ 370 పట్ల సంతృప్తి లేదని, తాము అంగీకరించిన దానికి విరుద్ధంగా 370 ఉన్నదని షేక్ అబ్దుల్లా భావించాడని బట్టాచార్జి అంటారు. సరే వ్యక్తులు, వారి కోపతాపాల్ని వదిలిపెట్టి, ఆర్టికల్ 370ని మనం నిష్పాక్షికంగా చూసినట్లయితే విలీన ఒడంబడికలో ఇచ్చిన హామీలను అది చాలావరకు నీరుగార్చిందనీ, అదే విలీన ఒడంబడికలో అంతర్భాగంగా ఉన్న ప్రజాభిప్రాయ సేకరణ అనే దాన్ని పూర్తిగా తృణీకరించిందనీ అర్థమవుతుంది. ఏ మేరకైతే స్వయం ప్రతిపత్తి ఆ ఆర్టికల్‌లో ఉందో దాన్ని సైతం ధ్వంసం చేయడానికి కావలసిన ఉప అంశాలు దాంట్లోనే ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి ఉండే అధికారాల పరిధిలోని ఏదైనా ఒక అంశం, జమ్మూ కశ్మీర్ విషయంలో కేంద్రానికి ఉండే మూడు అధికారాల పరిధిలోకి వస్తుందా లేదా అనే వివాదం తలెత్తితే, దాన్ని పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వము ఆ రాష్ట్ర ప్రభుత్వము సమాన స్థాయిలో కూర్చొని నిర్ణయిస్తాయి అని అనక, రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కేంద్రమే నిర్ణయిస్తుంది అని అనడం కేంద్రానికే

పెద్ద పీట వేయడం అవుతుంది. అక్కడితో ఆగిపోకుండా జమ్మూ కశ్మీర్ రాష్ట్రప్రభుత్వం గనక ఒప్పుకుంటే విలీన ఒడంబడికలో లేని అంశాలపైన కూడా కేంద్ర ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టవచ్చునని ఆర్టికల్ 370 అంటుంది. ఆ పైన రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆ సమ్మతి నిరంతరాయంగా లభించేటట్టు భారత ప్రభుత్వం చూసుకుంది. తప్పనిసరిగా కేంద్రప్రభుత్వంతో అంగీకరించేవాళ్ళు మాత్రమే జమ్మూ కశ్మీర్‌లో అధికారానికి రాగలిగేటట్టు, వచ్చి నిలువగలిగేటట్టు చేసుకుంది. ఆర్టికల్ 370లోనే ఉన్న ఈ తిరోగమన అంశాన్ని వాడుకుని భారత ప్రభుత్వం దాని సారాన్ని మొత్తం తీసేసింది.

## అటు ఇటుకాని అబ్దుల్లా

జమ్మూ కశ్మీర్‌ను పరిపాలించిన ప్రభుత్వాలనే కాకుండా ఆ రాష్ట్రం యొక్క రాజ్యాంగ పరిషత్‌ను కూడా దీనికోసం వాడుకుంది. జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి రాజ్యాంగాన్ని రాయడానికి ఒక రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకుని 1951 అక్టోబర్‌లో సమావేశపరిచారు. మొదట్లో భారత ప్రభుత్వం ఈ విషయంలో అనుసరించిన వ్యూహం ఏమిటంటే ఆ రాష్ట్రాన్ని ఎప్పటికైనా భారత్‌లోకి తీసుకొచ్చే పద్ధతిలో ఒక రాజ్యాంగాన్ని రాయడానికి షేక్ అబ్దుల్లాపైన ఆధారపడాలని. ఆ రాష్ట్ర ప్రజలు తమకు నచ్చిన ఒక రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకొని, తమకు నచ్చిన ఒక రాజ్యాంగాన్ని రాసుకోవాలి అని భారత పాలకులు ఏనాడూ అనుకోలేదు. ఆ స్వేచ్ఛను గౌరవించి ఉంటే అది విలీన ఒడంబడికలోని అంశాలకు, ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంది అనే హామీకి అనుకూలంగా ఉండేది. దాని బదులు భారత్ ఏం భావించింది అంటే షేక్ అబ్దుల్లా ఆ రాష్ట్రానికి ఒక రాజ్యాంగాన్ని రూపొందించాలి. అతడు గాని ఎప్పటికైనా ఆ రాష్ట్రాన్ని భారత్‌లోకి తీసుకొచ్చే పద్ధతిలో రాజ్యాంగాన్ని రూపొందించేటట్లయితే అతను దానికి ఏ పద్ధతులు అవలంబిస్తాడు అనేది భారత్ చూడదు. ఆ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్‌లో 100 సీట్లున్నాయి. అందులో 25 పాకిస్తాన్‌లోని జమ్మూ కశ్మీర్‌కు కేటాయించబడ్డాయి కాబట్టి మిగిలిన 75 సీట్లకు ఎన్నిక జరగవలసి ఉండింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఆ 75 సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రత్యర్థులెవరూ లేకుండా గెలిచింది. ఇది ఇతర్ల నామినేషన్ పత్రాలనే మొత్తంగా తిరస్కరించడం ద్వారా జరిగింది. అప్పటికి రెండు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీయే నడుపుతోంది అని మనం జ్ఞాపకం పెట్టుకోవాలి. పాలక పార్టీకీ పాలనా యంత్రాంగానికి తేడా మొత్తం అక్కడ చెరిగిపోయింది. ముస్లిం కాన్ఫరెన్స్ దాదాపుగా ఆజాద్ కశ్మీర్‌లోకి పారిపోయింది. ఇక ప్రత్యర్థులు అంటూ మిగిలితే జమ్మూలోని ప్రజాపరిషత్ మాత్రమే. వారి నామినేషన్ పేపర్లను 27 నియోజకవర్గాల్లో తిరస్కరించి నేషనల్ కాన్ఫరెన్స్‌నే అన్ని నియోజక వర్గాల్లోను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

ఈ విధంగా షేక్ అబ్దుల్లా కోరుకున్న రాజ్యాంగ పరిషత్ ఉనికిలోకి రానిచ్చారు. అతను కోరుకున్న రాజ్యాంగాన్ని ఇక అతను రాసుకోవచ్చు. దానికి ఒకే షరతు ఏమిటంటే అతను భారత పాలకులను మెప్పించే విధంగా రాజ్యాంగాన్ని రాయాలి. ఆ రాష్ట్రానికి రాజ్యాంగం ఒకటి వచ్చేదాక రాజ్యాంగ పరిషత్తే రాష్ట్ర చట్టసభగా కూడా వ్యవహరించింది. అయితే షేక్ అబ్దుల్లా మాటిమాటికి స్వతంత్రం, స్వేచ్ఛ అంటూ మాట్లాడుతూ ఉండడంవల్ల నెహ్రూకు అనుమానం పట్టుకుంది. అతను ఏ రకమైన రాజ్యాంగం రాస్తాడో అని సందేహం పట్టుకుంది. వాళ్ళిద్దరు, అంటే నెహ్రూ, అబ్దుల్లా పరస్పర ఆరోపణలు కలిగినటువంటి ఉత్తరాలు ప్రత్యుత్తరాలను రాసుకున్నారు. చివరకు ఇరుపక్షాలు కూడా తేడాలు, అభిప్రాయ భేదాలు సర్దుకోవటానికి చర్చలు పెట్టుకున్నారు. ఈ చర్చల నుంచి 1952లో ఢిల్లీ ఒడంబడిక రూపొందింది. దాన్ని 1952లో జూలై 24న ఆమోదించారు. దీని ప్రకారం జమ్మూ కశ్మీర్ రాజ్యాంగం భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370కి లోబడి తయారు చేయబడుతుంది. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర అధిపతిని సదర్–ఇ–రియాసత్ (అంటే రాష్ట్రపతి) అని పిలుస్తారు. అతన్ని భారత రాష్ట్రపతి నియమించడు. జమ్మూ కశ్మీర్ చట్టసభ ఎన్నుకుంటుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 అంటే రాష్ట్రపతి పాలన విధించే ప్రకరణం జమ్మూ కశ్మీర్‌కు వర్తించదు. అంతేకాకుండా ఆ రాష్ట్రం యొక్క జెండాతో పాటు దానికి సమానంగా భారత త్రివర్ణ పతాకం కూడా ఎగురవేయబడుతుంది. ఒక అంశంలో షేక్ అబ్దుల్లా నెహ్రూతో రాజీపడక తప్పలేదు. ఇది మొట్టమొదటి సదర్–ఇ–రియాసత్ అంటే జమ్మూ కశ్మీర్ రాష్ట్రపతి ఎన్నిక విషయంలో, నెహ్రూ జమ్మూ కశ్మీర్ వ్యవహారాల్లో అన్ని విషయాల్లో వ్యవహరించినట్టే ఈ విషయంలో కూడా అప్రజాస్వామికంగా వ్యవహరించాడు. అప్పటికే ఎన్నికైన జమ్మూ కశ్మీర్ చట్టసభ తమ రాష్ట్రపతిని ఎన్నుకోవలసి ఉండింది. ఆ పని చేయనీయకుండా యువరాజైన కరణ్‌సింగ్‌ను ఢిల్లీ ఒడంబడికలో భాగంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీ చేత ఏకగ్రీవంగా రాష్ట్రపతిగా ఎన్నుకునేటట్టు చేశారు. ఈ విధంగా ఏ కుటుంబం మీదనైతే కశ్మీరీ ప్రజానీకం ఒక శతాబ్దానికి పైగా పోరాటం చేశారో ఆ కుటుంబానికి చెందిన వ్యక్తినే తమ మొట్టమొదటి రాష్ట్రపతిగా ఎన్నుకోవాల్సి వచ్చింది. అతడు 1952 నవంబర్ 15న పదవి చేపట్టాడు. కరణ్‌సింగ్ దృక్పథం హిందూమతవాద దృక్పథం అని, అతనికి అబ్దుల్లా అంటే ఇష్టం లేదని అందరికీ తెలుసు. అయినా నెహ్రూ అతనినే ఎంచుకోవడం గమనించదగ్గ విషయం. ఏదో ఒకరకంగా జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లో భారత్ ప్రయోజనాలను కాపాడడానికి అబ్దుల్లాపైన అధారపడాలి. కాని అతనిపై ఆధారపడడం కష్టం కాబట్టి అతనిని కరణ్‌సింగ్ పర్యవేక్షించాలి. ఇది నెహ్రూ ఆలోచనా రీతి.

ఈ విధంగా నెహ్రూ ఒక పక్క షేక్ అబ్దుల్లాను పూర్తిగా దూరం చేసుకోకుండా (జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం అనే దానికి నెహ్రూ దృష్టిలో అర్థం ఇదే) జమ్మూ కశ్మీర్‌ను శాశ్వతంగా భారత్‌లో భాగం చేయడానికి తగిన రాజ్యాంగాన్ని ఆ రాష్ట్రానికి తయారుచేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తూ ఉండగా మరొకపక్క జమ్మూ ప్రాంతంలో జమ్మూ ప్రజాపరిషత్ ఢిల్లీ ఒడంబడికకు వ్యతిరేకంగా జనసంఘ్ మద్దతుతో ఉద్యమాన్ని చేపట్టింది. దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ (అంటే రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు) ఒకే దేశంలో ఉండడానికి వీలులేదు అంటూ వాళ్లు ప్రాసయుక్తంగా నినదిస్తూ హైందవ జాతీయవాద దృక్పథంతో ముందుకు వచ్చారు. షేక్ అబ్దుల్లాను ఈ రకమైన దాడి ఎంతగా బాధ పెట్టిందీ, ఆర్టికల్ 370లో ఇచ్చినటువంటి హామీ గౌరవించబడదు అని వీటివల్ల అతనికి ఏ విధంగా అనుమానం కలిగిందీ మనం పైన చూశాం. 1950 జూలై 10వ తేదీన – అంటే ఈ సంక్షోభానికి ముందే – షేక్ అబ్దుల్లా నెహ్రూకు వ్రాసిన ఒక లేఖ అతని మానసిక స్థితిని బాగా వ్యక్తం చేస్తుంది. "భారత్‌ను ఒక నిజమైన సెక్యులర్ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న నీ ఆదర్శాన్ని తిరస్కరించే శక్తివంతమైన వర్గాలు భారత్‌లో ఉన్నాయి. భారత్‌లో అటువంటి వర్గాలు పనిచేస్తున్నాయన్న విషయం స్పష్టంగానే ఉంది. నేను చాలాసార్లు చెప్పాను మేం భారత్‌లోనే విలీనం కావాలి అనుకోవడానికి కారణం మాకు రెండు కాంతివంతమైన తారలు భారత్‌లో కనిపించాయి కాబట్టి. ఒకరు గాంధీ, మరొకరు మీరు. మీరిచ్చిన కాంతి మాకు ఆశను, ఉత్సాహాన్ని కలిగించాయి. మాకు పాకిస్తాన్‌తో అనేక విధాల అనుబంధం ఉన్నప్పటికీ కూడా మిమ్మల్ని చూసి మీరైతేనే మా విధానాలను ఆదరిస్తారు అని భావించి భారత్‌లో భాగం కావడానికి ఒప్పుకున్నాం. అయితే మాకు తోచిన రీతిలో మా రాష్ట్రాన్ని మేం అభివృద్ధి చేయడం సాధ్యం కాదు అనే అభిప్రాయం మాకుగాని కలిగితే మా ప్రజానీకానికి ఏం జవాబు చెప్పుకోవాలి. నేను నా ముఖం వారికి ఏ విధంగా చూపించాలి?" జమ్మూ ప్రజాపరిషత్ ఆర్టికల్ 370ని పూర్తిగా రద్దుచేయాలని, జమ్మూ కశ్మీర్‌కు ఎటువంటి ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వకూడదని ఆందోళన చేసింది. ఇవాల్టికీ భారతదేశంలోని హైందవ మతోన్మాదులు కశ్మీర్ విషయంలో చేస్తున్న వాదన ఈ ప్రాతిపదిక మీదనే ఉన్నది. కశ్మీరీ నాయకులు జమ్మూ ప్రాంతాన్ని అర్థం చేసుకోక జమ్మూ ప్రాంతం యొక్క అవసరాలను, ప్రయోజనాలను విస్మరించడంవల్ల ఆ ప్రాంతంలో కలిగిన నిరసనను ప్రజాపరిషత్ చాలా తెలివిగా వాడుకుంది. తన హైందవ జాతీయవాద ఎజెండాలో దాన్ని కలుపుకుంది. మరొకపక్క షేక్ అబ్దుల్లా కేవలం కశ్మీరీ నాయకుడుగా ఉన్న తన స్వభావాన్ని అధిగమించలేకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రతరమైంది. ప్రజాపరిషత్ వాళ్ళ ఆందోళన నెహ్రూను కూడా చాలా అసంతృప్తికి గురిచేసిందని అంటారు. అతనుగాని విలీనం విషయంలో సూత్రబద్ధంగా వ్యవహరించి ఉంటే ప్రజాభిప్రాయ సేకరణకు కూడా సిద్ధపడి ఉంటే వారితో ముఖాముఖి తలపడి ఉండవచ్చు. కాని అతని వ్యూహమేమిటంటే జమ్మూ కశ్మీర్‌ను ఏదో ఒక రకంగా భారత్‌లో విలీనం చేసుకోవాలి.

దానికి కశ్మీరీ ప్రజానీకంలో అత్యధికంగా ఆదరణ కలిగిన నాయకుడు షేక్ అబ్దుల్లాను ఏదో ఒక రకంగా మెప్పించాలి, బుజ్జగించాలి. ఈ వైఖరివల్ల నెహ్రూ హిందూ మతోన్మాదుల సవాలును ఎదుర్కోవడం కష్టమైంది.

ఆ తర్వాత జరిగిన ఘటనలకు ఎవరు ఏ మేరకు బాధ్యులు అన్న విషయంలో చాలా చర్చ ఉంది. ఈ కుట్రలు, కుట్ర సిద్ధాంతాల గూర్చి వివరించడానికిది సందర్భం కాదు. ప్రజాపరిషత్ వాళ్ళ ఆందోళన, దేశంలో దాని ఫలితంగా నెలకొన్న వాతావరణం, షేక్ అబ్దుల్లాను తొలగించాలి అని భావించిన వాళ్ళకు అవకాశం కల్పించింది. జనసంఘ్ అధ్యక్షుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ 1953 మే 8న కశ్మీర్ లోయలోకి ప్రవేశించాడు. జనసంఘ్ అప్పటికే జమ్మూ ప్రజాపరిషత్ మొదలుపెట్టిన ఆందోళనను దేశమంతటా నిర్వహిస్తున్నది. షేక్ అబ్దుల్లా అతన్ని జైల్లో పెట్టాడు. అతడు జైల్లోనే శ్రీనగర్‌లో జూన్ 23న గుండె ఆగి చనిపోయాడు. దీనికి దేశవ్యాప్తంగా నిరసన వచ్చింది. ఈ నేపథ్యంలో షేక్ అబ్దుల్లాపైన ఒక అస్పష్టమైన ఆరోపణను పుట్టించడం జరిగింది. అతను విదేశీయులతో కుట్రలు పన్నుతున్నాడని, భారత్‌లో జమ్మూ కశ్మీర్ విలీనాన్ని అంతం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని, ప్రచారం చేయసాగారు. 1953 ఆగస్టు 9న ప్రధానమంత్రి పదవి నుండి అతన్ని కరణ్‌సింగ్ (ఆ రాష్ట్ర రాష్ట్రపతి) తొలగించి అరెస్టు చేశాడు. ఈ ఘటనలపట్ల నెహ్రూ బాధ చెందినట్టు చెప్తారు. ఈ పరిస్థితి రావడానికి ప్రజాపరిషత్ ఆందోళనే కారణం అని కూడా ఆయన అన్నాడు. అయితే ఆయన అబ్దుల్లా కూడా తెలివితప్పి ప్రవరిస్తున్నాడని, తానే నమ్ముకున్న విలువలకు తానే దూరమయ్యాడని వ్యాఖ్యానించాడు. నెహ్రూ దృష్టిలో అబ్దుల్లా నమ్ముకున్న విలువలు ఏమిటి అంటే ఢిల్లీ సాధనంగా పనిచేసి జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లోకి ఎట్లాగయినా తీసుకురావాలి అన్నది. ఆ రాష్ట్రానికి ఎప్పుడైతే రాజ్యాంగం రాయడం జరుగుతున్నదో అప్పుడే అబ్దుల్లా ఈ పాత్ర నుండి పక్కకు జరుగుతున్నాడు అన్న సందేహం భారత పాలకులకు వచ్చిందనీ, అదే అతని అరెస్టు వెనకున్నటువంటి ప్రధాన కారణం అనీ అనడంలో అనుమానం ఏమీ లేదు. అలిస్టైర్ ల్యాంబ్ ఏమంటాడంటే ఆ రాష్ట్ర రాజ్యాంగ పరిషత్ యొక్క వర్కింగ్ కమిటి షేక్ అబ్దుల్లా మార్గదర్శకత్వంలో నెహ్రూ ప్రభుత్వం భావించిన విలీనానికి భిన్నమైన ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తూ ఉండింది. అబ్దుల్లా మాటకొస్తే, అతను 1947-53 మధ్యకాలంలో కొన్నిసార్లు అస్పష్టంగా మాట్లాడినా, అస్పష్టమైన వైఖరి అవలంభించినా, దానికి ప్రధానమైన కారణం తాను నియంత్రించలేని శక్తుల మధ్య ఇరుక్కుని ఉండడమే తప్ప కశ్మీరీ ప్రజల ఆకాంక్షల విషయంలో కానీ అందులో తన పాత్ర విషయంలో కానీ ఆయనకు అస్పష్టత ఉండడం కాదు. ఏ పాత్రయితే అతను నిర్వహించాలని, నిర్వహించడానికి కట్టుబడి ఉన్నాడని భారత్ నమ్మిందో, లేక నమ్మినట్లు

నటించిందో అది అతని అభిప్రాయం ఎప్పుడూ కాదు. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ పరిషత్ ప్రారంభ సమావేశంలో ప్రారంభ ఉపన్యాసమిస్తూ తన అభిప్రాయాలను షేక్ అబ్దుల్లా స్పష్టంగానే చెప్పాడు. ఆ ఉపన్యాసాన్ని అజిత్ బట్టాచార్జి అద్భుతమైన ఉపన్యాసంగా న్యాయంగానే వర్ణించాడు. షేక్ అబ్దుల్లా ఏమన్నాడంటే "శతాబ్దాల తర్వాత మనం స్వేచ్ఛా రేవును చేరుకున్నాం. కశ్మీరీ ప్రజలకు స్వతహాగా ఉన్న పరస్పర సహనం, పరస్పర ఆదరణ అనే లక్షణాలు మనకు సాధనంగా పనిచేశాయి". రాజ్యాంగ పరిషత్ కర్తవ్యాన్ని గురించి చెప్తూ ఆయన ఏమన్నాడంటే "భారత రాజ్యాంగం జమ్మూ కశ్మీర్‌ను భిన్నంగా చూస్తోంది. స్వయం ప్రతిపత్తిని ఇస్తాననింది. అందువల్ల మనకు మన రాష్ట్రంలో మనకు నచ్చిన రాజ్యాంగాన్ని రాసుకునే స్వేచ్ఛ ఉంది. మన సంప్రదాయాలను, మన జాతి యొక్క ప్రత్యేక లక్షణాలను దృష్టిలో పెట్టుకుని మన అభివృద్ధిని సాధించుకునే అవకాశం మనకు లభించింది" కశ్మీరీలు పాకిస్తాన్ కంటే భారత్‌లో చేరడమే మేలని ఎందుకు భావించారో వివరిస్తూ... అతనీ విధంగా అన్నాడు. " భారత రాజ్యాంగం ఆ దేశానికి, అందరికీ న్యాయాన్ని, స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ ఎటువంటి వివక్ష లేకుండా కల్పించే సెక్యులర్ ప్రజాస్వామ్య వ్యవస్థనూ లక్ష్యంగా ఉంచింది. దాని ఫలితంగా హిందువులు మెజారిటీగా ఉన్న భారతదేశంలో కశ్మీరీ ముస్లింలకు భద్రత ఉండదు అని భయపడేవాళ్ళ ఆందోళన తొలగిపోతుంది". కశ్మీరీ జాతీయోద్యమం సహజంగానే సెక్యులర్ ప్రజాస్వామ్యంవైపే ఆకర్షితమౌతుందనీ ఎందుకంటే ఇక్కడి ప్రజలు ఒక మతాన్ని గాని ఒక సామాజిక వర్గాన్నిగాని ప్రత్యేకంగా చూసే సూత్రాన్ని ఎప్పటికి ఆమోదించరు కాబట్టి అనీ అన్నాడు. అంతేకాకుండా కశ్మీర్ భారత్‌లో కొనసాగితే భారత్‌లో హిందూ మతోన్మాదాన్ని ఓడించడానికి అది దోహదం చేస్తుందనీ మతోన్మాదం యొక్క వాదనకు విరుద్ధమైన వాదనకు సంకేతంగా అది నిలుస్తుంది అని కూడ అన్నాడు. "మనం ఒక ప్రాచ్య స్విడ్జర్లాండ్‌గా ఎందుకు ఉండకూడదు?" అన్న ప్రశ్న కూడా వేసుకొని, జమ్మూ కశ్మీర్ ఒక తటస్థమైన రాజ్యంగా ఉండడం చాలా ఆకర్షణీయమైన ఆలోచన అనీ ప్రస్తుత సంక్షోభానికి అదొక పరిష్కారం కాగలదు అనీ ఆయన అన్నాడు. అయితే ఆ ఆలోచనను ఆయన వెంటనే తిరస్కరిస్తూ దానికి ఒకే ఒక కారణం చూపించాడు. అదేమిటంటే ఇన్ని దేశాల వ్యతిరేకతను అధిగమించి జమ్మూ కశ్మీర్ రాజ్యం సరిహద్దును భద్రంగా కాపాడడం కష్టమౌతుందని. వాటిలో ప్రధానమైనవి ఇండియా, పాకిస్తాన్ అని మనం గ్రహించాలి. ఈ రెండు దేశాలు తమకు ఎంతటి నాగరిక వారసత్వం ఉందని తమ గురించి తాము గర్వంగా చెప్పుకుంటాయో దానికి అనుగుణంగా ప్రవర్తించడానికి ఒప్పుకుని ఉంటే స్వతంత్రమైన, స్వేచ్ఛాయుతమైన జమ్మూ కశ్మీర్ ఆనాడే సాధ్యమయి ఉండేది. తమను తాము ప్రజాస్వామిక వాదులుగా భావించే భారతీయులు, పాకిస్తానీయులు ఈ విషయం గురించి కొంత ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ఏమైతేనేం ఈ ఉపన్యాసం నుండి షేక్ అబ్దుల్లా, అతనితో ఏకీభావమున్న కశ్మీరీలు తమ పరిస్థితిని, అందులో అబ్దుల్లా పాత్రను ఏవిధంగా అర్థం చేసుకున్నారో మనం గ్రహించగలుగుతాం. అతను నిలబడింది ఈ సూత్రాల కోసమే – ఎంత సందిగ్ధతలోనైనా కావచ్చుగానీ, నెహ్రూ భావించినట్టు జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లోకి తీసుకొచ్చే సూత్రానికి అతనెప్పుడు కట్టుబడి లేడు. కానీ ఎప్పుడూ కట్టుబడి ఉండనటువంటి ఈ సూత్రం నుండి పక్కకు తొలగినందుకే అతన్ని శిక్షించారు. 1953–68 వరకు షేక్ అబ్దుల్లా ఎక్కువ కాలం జైల్లోనే ఉన్నాడు. అతన్ని 1958 జనవరి 8న విడుదలచేసి ఏప్రిల్ 30న తిరిగి అరెస్టుచేసి మళ్ళీ 1964 ఏప్రిల్ 6న విడుదలచేసి 1965 మే 8న అరెస్టు చేశారు. 1968 జనవరి 2న మళ్ళీ అతన్ని విడిచిపెట్టారు. 1971లో అతన్ని జమ్మూ కశ్మీర్ రాష్ట్రం నుంచి బయటికి బహిష్కరించారు. అతని సన్నిహిత సహచరుడైన మీర్జా అఫ్జల్‌బేగ్ దాదాపు అంతకాలమూ జైల్లో ఉన్నాడు. వీరిద్దరిపైన ఎప్పుడూ ఏ విచారణా జరుగలేదు. ఏ నేరానికీ వాళ్ళకు శిక్షపడలేదు. 1953లో షేక్ అబ్దుల్లాను మొదటిసారి అరెస్టు చేసినపుడు కశ్మీరీ ప్రజానీకం ఉద్రిక్తులై పెద్ద ఆందోళన చేపట్టారు. షేక్ అబ్దుల్లా స్థానంలో ప్రధానమంత్రిగా వచ్చిన బక్షి గులాం మహ్మద్ ప్రభుత్వం ఆ ఆందోళనను బలప్రయోగంతో అణచివేసింది. పోలీసు కాల్పుల్లో దాదాపు 60 మంది చనిపోయారు. షోపయా దగ్గర బక్షి గులాం మహ్మద్ అనుచరులైన గులాం మహ్మద్ సాదిక్, మీర్ ఖాసిం అనే ఇద్దరు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులను 20వేల జనం దాదాపు కొట్టి చంపినంత పనిచేశారు. ఒక దశాబ్దం తర్వాత ఇదే నాటకం పునరావృతమై సాదిక్ ప్రధానమంత్రి హోదాలో అస్పష్టమైన ఆరోపణలతో బక్షి గులాం మహ్మద్‌ను అరెస్టు చేయబోతాడు. మరొక అర్ధ దశాబ్దం తర్వాత ఢిల్లీ ప్రభుత్వం సాదిక్‌ను బలహీనపర్చడానికి మీర్‌ఖాసింను ప్రోత్సహించబోతుంది.

## గులాంగిరీ

షేక్ అబ్దుల్లా బర్తరఫ్‌కు సహకరించింది అతని క్యాబినెట్‌లో సభ్యులైన కొందరు వ్యక్తులు. వాళ్ళ నాయకుడైన బక్షి గులాం మహ్మద్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను చీల్చి భారత్‌లో జమ్మూ కశ్మీర్‌ను శాశ్వతంగా అంతర్భాగం చేసే అజెండా గల ఒక గ్రూపుకు నాయకుడిగా ముందుకు వచ్చాడు. బక్షి గులాం మహ్మద్ అబ్దుల్లా అరెస్టుకు సంబంధించిన కార్యక్రమానికి పథకం వేశాడు, అమలు చేశాడు. అబ్దుల్లా క్యాబినెట్‌లో డిప్యూటి హోంమంత్రిగా ఉన్న డి.పి.ధర్ అనే కశ్మీర్ పండిట్, జమ్మూ కశ్మీర్ సదర్–ఇ–రియాసత్ (రాష్ట్రపతి) అయిన కరణ్‌సింగ్, ఢిల్లీలోని భారత ప్రభుత్వం, బక్షి గులాం మహ్మద్‌తో కలిసి ఈ పథకాన్ని రచించాయి. షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాలలో డి.పి.ధర్ గురించి ప్రస్తావిస్తూ అతను ఢిల్లీ యొక్క ప్రత్యేక ఏజెంట్‌గా వ్యవహరించాడని అంటాడు. మొత్తం వ్యవహారంలో ధర్

పాత్ర చాలా అసహ్యకరమైనది అని నిందిస్తూ కశ్మీరీలు సంప్రదాయకంగా చెప్పుకునే ఒక నానుడిని ఉదహరిస్తాడు. ధర్ వంశీయులు ఎప్పుడైతే వర్ధిల్లుతారో కశ్మీర్ అప్పుడు పతనమవుతుంది అనేది ఈ నానుడి. ఈ డి.పి.ధర్ తర్వాత కాలంలో ఇందిరాగాంధికి ఒక ముఖ్య సలహాదారుడు అయ్యాడు. ఆయన పూర్వీకుల్లో ఒకరు మొదటి డోగ్రా పాలకుడైన గులాబ్‌సింగ్‌కు పర్సనల్ సెక్రెటరీ.

బక్షి గులాం మహ్మద్ అవినీతిపరుడు, నియంత. జమ్మూ కశ్మీర్ అభివృద్ధి పేరుమీద కేంద్రప్రభుత్వం త్వరలోనే పెద్ద ఎత్తున డబ్బులు ఆ రాష్ట్రంలో కుమ్మరించింది. ఆ రాష్ట్ర ప్రధానమంత్రి అయిన బక్షి గులాం మహ్మద్, అతని అనుచరులు ఈ డబ్బును సొంతం చేసుకున్నారు. ఈ పరిపాలనను కశ్మీర్‌లో బి.బి.సి. అంటే బక్షి బ్రదర్స్ కార్పొరేషన్ అని వ్యంగంగా పిలిచేవారని అజిత్ భట్టాచార్జి అంటారు. అయినప్పటికీ అతను ఢిల్లీకి కావలసినవాడు కాబట్టి ఢిల్లీకి అభ్యంతరం లేదు. నేషనల్ కాన్ఫరెన్స్‌లోని అతని గుంపును అతను విలీనానికి అనుకూలంగా ఉంచుతాడు. కేంద్ర ఎప్పుడెప్పుడైతే తన అధికారాలను పెంచుకోవాలని చూస్తుందో అప్పుడు దానికి అవసరమైన సమ్మతిని అతనిస్తాడు. అటువంటి మొదటి ఆదేశం 1954లో జారీ అయిన కాన్‌స్టిట్యూషన్ అప్లికేషన్ టు జమ్మూ & కశ్మీర్ ఆర్డర్. దీని ద్వారా జమ్మూ కశ్మీర్ పైన పార్లమెంటుకు మరిన్ని అంశాల మీద శాసనాధికారం ఇవ్వడం జరిగింది. ఈ ఆర్డర్‌ను తర్వాత పదేపదే సవరించి మరికొన్ని అంశాలను కూడా పార్లమెంటు యొక్క శాసనాధికారంలోకి తీసుకెళ్ళారు. దాదాపు దేశంలో ఇతర ప్రాంతాల్లో పార్లమెంటుకున్న శాసనాధికారం అంతా కూడా ఇవ్వాళ జమ్మూ కశ్మీర్‌పైన పార్లమెంట్ చలాయించగలుగుతుంది. భారత రాజ్యాంగంలోని కేంద్ర ప్రభుత్వ జాబితాలోని 6 అంశాలు మినహా మిగిలిన అంశాలన్నిటిపైనా ఇప్పుడు పార్లమెంటు జమ్మూ కశ్మీర్ విషయంలో శాసనాలు చేయగలదు. అదే సంవత్సరం అంటే 1954లోనే జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ పరిషత్ భారత్‌లో ఆ రాష్ట్ర విలీనాన్ని ఆమోదించింది. 1958లో ఐఏఎస్, ఐపిఎస్, తదితర కేంద్ర సర్వీసులను రాష్ట్రపతి ఆర్డరు ద్వారా జమ్మూ కశ్మీర్‌కు విస్తరించారు. షేక్ అబ్దుల్లా అరెస్టు తర్వాత అతని సహచరుడు మిర్జా అఫ్జల్ బేగ్ 1955 ఆగస్టు 9న ప్లెబిసైట్ ఫ్రంట్ ఏర్పాటు చేసి విలీనానికి అనుకూలమైన బక్షి గులాం మహ్మద్ పార్టీ అయిన నేషనల్ కాన్ఫరెన్స్‌ను వ్యతిరేకించసాగాడు. అబ్దుల్లాలాగే బేగ్ కూడా జైలుకు పోతూ వస్తూ ఉన్నాడు.

1956 నవంబర్ 17న జమ్మూ కశ్మీర్ రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. విస్పష్టంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రం భారతదేశంలో అంతర్భాగం అని, అంతర్భాగంగానే ఉంటుంది అని ప్రకటించారు. షేక్ అబ్దుల్లా జైలు నుంచే తన నిరసన తెలియజేశాడు. అయితే అతన్ని జైల్లో పెట్టిందే ఈ ఫలితాన్ని సాధించడం కోసం.

అప్పటికే ప్లెబిసైట్ గురించి అనేక తీర్మానాలు చేసిన ఐక్యరాజ్యసమితి భద్రతామండలి 1957 జనవరి 24న తన విమర్శను వ్యక్తం చేసింది. జమ్మూ కశ్మీర్ రాజ్యాంగ పరిషత్ చేసిన ఈ ప్రకటన ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రాతిపదికన ఆ రాష్ట్రం భవిష్యత్తును నిర్ణయించే విషయం కాదు అని ఖచ్చితంగా చెప్పింది. కానీ భారత్ బలవంతంగా సాధించిన ఈ ఆమోదాన్నే విలీనానికి ప్రజామోదంగా ఆనాటి నుంచి చలామణీ చేస్తున్నది.

## ఎన్నికల ప్రహసనం

కొత్త రాజ్యాంగం కింద 1957లో ఎన్నికలు జరిగాయి. బక్షి గులాం మహ్మద్ నాయకుడుగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచింది. అయితే 75 సీట్లలో కేవలం 32 సీట్లలో మాత్రమే పోటీ జరిగింది. మిగిలిన అభ్యర్థులు, ముఖ్యంగా కశ్మీరు లోయలో, పోటీ లేకుండానే నెగ్గారు. 1962 ఎన్నికల్లో బక్షి గులాం మహ్మద్ పార్టీ మళ్ళీ గెలిచింది. 75 సీట్లలో 70 సీట్లు వారికే దక్కాయి. అయితే ఇప్పుడు కూడా 75 సీట్లలో కేవలం 41 సీట్లలో మాత్రమే పోటీ జరిగింది. ఈ ఎన్నికను ప్రస్తావిస్తూ బక్షి గులాం మహ్మద్‌తో జవహర్‌లాల్ నెహ్రూ "కనీసం ఒకటి రెండు సీట్లయినా ఓడిపోయి ఉంటే బాగుండేది" అన్నాడంటారు. కాని ఈ బీభత్సపాలన యొక్క ప్రధాన లబ్దిదారు నెహ్రూ ప్రభుత్వమే. మళ్ళీ 1967లో, 1972లో కూడా ఈ పార్లమెంటరీ ఎన్నికల ప్రహసనం జరిగింది. అయినప్పటికీ భారత్ మాత్రం ఐక్యరాజ్యసమితిలో ఏమని వాదిస్తోంది అంటే "జమ్మూ కశ్మీర్ ప్రజానీకం ఒక ఎన్నిక తర్వాత మరొక ఎన్నికలో వరుసగా పాల్గొంటూ ఉండడం ద్వారా విలీనాన్ని ఆమోదించేశారు. కాబట్టి ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ చేయనక్కరలేదు" అని. భారత వ్యూహం పైన చెప్పినట్టు, విలీనానికి అనుకూలమైన ఒక నాయకుడ్ని ఎంచుకోవడం, అతనికి అన్ని రకాల స్వేచ్ఛను, మద్దతును, ఎన్నికలు రిగ్‌చేసి గెలిచే స్వేచ్ఛతో సహా ఇవ్వడం, అధికారంలో ఉండటానికి అతనికి కావలసిన సహాయం అందివ్వడం, అభివృద్ధి నిధులుగా జమ్మూ కశ్మీర్‌కు పంపుతున్న వాటిని సొంతం చేసుకునే అవకాశం ఇవ్వడం, తన ప్రత్యర్థులందరి పైన కూడ ఏ అధారాలు లేకున్నా పాకిస్తాన్ అనుకూలురు అని నిందవేసి వారిని అణచివేసే స్వేచ్ఛను ఇవ్వడం. బల్‌రాజ్‌పూరీ అన్నట్లు ఈ విషయంలో భారతదేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, పత్రికలు, మేధావులు ఏకాభిప్రాయంతో ఉన్నారు. ప్రతి విషయంలోనూ కాంగ్రెస్ పాలకులు ఆ రాష్ట్రంలో చేసిన పనులన్నీ వారంతా ఆమోదించకపోవచ్చునేమోగానీ, ఒక రకమైన ఏకాభిప్రాయం మాత్రం ఉండింది. కశ్మీర్‌ను ఎవరూ కూడా ఎప్పుడూ కశ్మీరీల దృష్టికోణం నుంచి చూడలేదు. భారత పాకిస్తాన్‌ల వైరం కోణం నుంచో, మతోన్మాదం లౌకికవాదం అనే వైరుధ్యం కోణం నుంచో చూశారు. పాకిస్తాన్‌ను, ముస్లిం మతోన్మాదులను దూరముంచగల వ్యక్తి కశ్మీర్‌లో పరిపాలనలో ఉండాలని అందరూ భావించారు. అటువంటి వ్యక్తిని బలోపేతం చేయాలి. అతనికి మద్దతునివ్వాలి. అది భారత్ ప్రయోజనాలకూ లౌకికవాద ప్రయోజనాలకూ అవసరం అని అందరూ భావించారు.

అతను అవినీతిపరుడు కావచ్చు, నియంత కావచ్చు, ప్రజాదరణ లేనివాడు కావచ్చు, అయినా ఫర్వాలేదు. నెహ్రూ తనతో ఈవిధంగా అన్నాడని బల్‌రాజ్‌పురి అంటాడు. “మనం అంతర్జాతీయ వేదిక మీద కశ్మీర్ విషయంలో జూదం ఆడాము. ఓడిపోవడానికి వీలులేదు. ప్రజాస్వామ్యము, నీతి, కొన్ని రోజులు ఆగవచ్చు.” కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని సమర్థించిన జయప్రకాశ్ నారాయణ్ సహితం ఆ రాష్ట్రం ఒక అంతర్జాతీయ వివాదంలో ఇరుక్కుని ఉన్నంతకాలం అక్కడ ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధి చెందడం మంచిది కాదు అని భావించారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు వ్యతిరేకంగా ఒక ప్రతిపక్షాన్ని రూపొందించాలనే ప్రయత్నాన్ని కేవలం ఢిల్లీ ప్రభుత్వం మాత్రమే కాదు, అన్ని ప్రతిపక్ష పార్టీలు, పత్రికారంగం కూడా ఆ రాష్ట్రంలో జాతీయవాద లౌకిక రాజకీయాలను బలహీనపర్చే చర్యగా విమర్శించేవి. 1957లో జి.ఎం. సాదిక్ బక్షి గులాం మహ్మద్ నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్‌ను చీల్చి డెమోక్రటిక్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేసినప్పుడు తిరిగి మళ్ళీ నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరాలి అని అందరూ అతని మీద ఒత్తిడి పెట్టారు. ఆ పని అతను చేసినప్పుడు (1961లో) ది హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూస్తాన్ టైమ్స్ మొదలైన ప్రముఖ దినపత్రికలన్నీ కూడా దాన్ని దేశభక్తియుత చర్యగా కొనియాడాయి. 1967లో సాదిక్ తన వర్గాన్ని కాంగ్రెస్ పార్టీలో కలిపేసిన తర్వాత బక్షి గులాం మహ్మద్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను పునరుద్ధరించగా అతన్ని కూడా తన చర్యను వెనక్కి తీసుకొమ్మని ఒత్తిడి పెట్టారు. ఆ పని అతను చేసినప్పుడు జాతీయవాద శక్తులను బలపరచినందుకు అతన్ని కొనియాడారు. ప్రధాన పార్లమెంటరీ పార్టీలన్ని కూడా కశ్మీర్ లోయలో తమ శాఖలను అభివృద్ధి చేయడానికి అయిష్టంగా ఉండేవి. దానికి అందరూ ఇచ్చిన వివరణ ఏమిటంటే, అది లౌకికవాద శక్తులను బలహీనపరుస్తుందని. ప్రజా సోషలిస్టు పార్టీ కశ్మీర్ లోయలో తన ఉనికిని నెలకొల్పే ప్రయత్నం చేసినప్పుడు బక్షి గులాం మహ్మద్ మనుషులు వారిపై భౌతికంగా దాడులు చేయడమే కాకుండా జవహర్‌లాల్ నెహ్రూ వారు దేశ శత్రువులతో చేతులు కలుపుతున్నారని నిందించాడు.

ఇక్కడ నిజానికి ఒక ద్వంద్వ వైఖరి, రెండు నాల్కల వైఖరి ఉంది. భారత్ ఒక లౌకికవాద ప్రజాస్వామ్య దేశం కాబట్టే పాకిస్తాన్ లాగా నియంతృత్వ దేశం కాదు కాబట్టే జమ్మూ కశ్మీర్ ప్రజానీకం స్వచ్ఛందంగా భారత్‌లో చేరారు అని మనలను నమ్మమంటారు. ఇది భారత్‌లో అందరూ గట్టిగా విశ్వసించే విషయం. మరొకవైపు జమ్మూ కశ్మీర్‌లో సాధారణ పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలను కూడా అభివృద్ధి కానివ్వరు. కశ్మీర్ భారత ప్రజాస్వామ్యంలో అంతర్భాగం కావాలని గానీ మానసికంగా భారత్‌లో అంతర్భాగం కావాలనీ గాని వీరెవరు భావించలేదు. పాకిస్తాన్ కంటె భారత్ స్వభావరీత్యా ఉన్నతమైన రాజకీయ వ్యవస్థ కాబట్టి జమ్మూ కశ్మీర్‌పైన దానికి ఒక

హక్కు ఉంది అని అంటూనే ఆ ఔన్నత్యంలో కశ్మీర్‌ను ఒక భాగం చెయ్యాలి అని ఎవరూ భావించలేదు. చేసిన ప్రయత్నమంతా ఏమిటీ అంటే భారత రాజ్యంలో జమ్మూ కశ్మీర్‌ను భాగం చేయడమే. దీనికి కావలసింది భారత్‌కు ఒక ఏజెంట్‌గా ఈ కర్తవ్యాన్ని ఏదో ఒక రకంగా సాధించి పెట్టే వ్యక్తి అక్కడ ఉండడం. అతనికి వ్యతిరేకంగా రాజకీయ ప్రత్యర్థులెవరు ఎదగకుండా చూడడానికి అందరూ సహాయం చేశారు. అతనికి వ్యతిరేకంగా రాజకీయ ప్రత్యర్థులు ఎవరైనా ముందుకు వస్తే వారిని జాతి వ్యతిరేకులు అన్నారు. ఢిల్లీ నుంచి మరింత డబ్బు రావాలన్నా, తాము చేసిన నేరపూరిత చర్యలకు మరింత స్వేచ్ఛ కావాలన్నా కశ్మీర్ పాలకులు "వేర్పాటువాదుల ప్రమాదం" అనే బూచి పదేపదే వాడుకోసాగారు. ఆత్మాభిమానం, తమ సంస్కృతి అంటే గౌరవం ఉన్న ఏ ప్రజలకైనా తమను ఈ విధంగా చూడటం, తమతో ఈ విధంగా వ్యవహరించడం అవమానకరంగానే ఉంటుంది. ఈ రోజు అందరూ కూడా 'కశ్మీర్ ప్రజలు పరాయీకరణకు గురయ్యారు' అని అంటున్నారు. దానికి మూలం జమ్మూ కశ్మీర్‌ను బలవంతంగా ఇండియాలోకి తీసుకురావడానికి భారత పాలకులు ఉపయోగించినటువంటి పైన ఉదహరించిన పద్ధతులు.

1958లో షేక్ అబ్దుల్లాను తాత్కాలికంగా జైలు నుండి బయటకు విడిచిపెట్టారు. అప్పటికి జమ్మూ కశ్మీర్ రాజ్యాంగాన్ని ఆమోదించడం జరిగింది. ఆ రాష్ట్రం శాశ్వతంగా భారత్‌లో భాగం అని ఆ రాజ్యాంగం ప్రకటించుకోవడం జరిగింది. జైలునుంచే షేక్ అబ్దుల్లా ఈ ప్రకటనను వ్యతిరేకించి ఉన్నాడు కాబట్టి బయటకు రాగానే అతను ప్లెబిసైట్ లేక ప్రజాభిప్రాయం గురించి మాట్లాడడం మొదలుపెట్టాడు. భారత్ ఇచ్చిన హామీని గుర్తు చేయడం మొదలుపెట్టాడు. ఐక్యరాజ్యసమితి తీర్మానాల్లో ఇది పొందుపరచబడి ఉంది అని చెప్పడం మొదలుపెట్టాడు. మళ్ళీ డి.పి.ధర్, బక్షి గులాం మహ్మద్ ముఠాకట్టి అతన్ని జాతివ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడంటూ నిందించసాగారు. ఈసారి అతనిపై ఏమి ఆరోపణ వేశారంటే తన అనుచరుడు నెలకొల్పిన ప్లెబిసైట్ ఫ్రంట్ పార్టీకి పాకిస్తాన్ నుంచి నిధులు తీసుకుంటున్నాడు అని. మళ్ళీ 1958 ఏప్రిల్ 29 రాత్రి అతనిని, మిర్జా అఫ్జల్ బేగ్ వంటి అతని సహచరులను జైల్లో పెట్టారు. చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర చేస్తున్నారు అని కూడా నింద మోపారు. అదే సంవత్సరం వారిపై విచారణ జరపడానికి ఒక స్పెషల్ కోర్టును నెలకొల్పారు. ఆ స్పెషల్ కోర్టు ఆ కేసును 1962లో విచారణకు పంపించింది. అయితే 6 సంవత్సరాల తర్వాత ఎటువంటి విచారణ లేకుండా వారిని విడిచిపెట్టారు. 1964 ఏప్రిల్ 8న బయటికి వచ్చారు. ఆరేళ్లనాడు బక్షి గులాం మహ్మద్ ప్రభుత్వం వారిని అరెస్టు చేసింది. ఇప్పుడు సాదిక్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడిచిపెట్టింది.

రెండు చర్యలూ కూడా రాజకీయ చర్యలే తప్ప వాటికి చట్టంతోగాని, న్యాయంతోగాని ఏమీ సంబంధం లేదు.

ఈలోగా రాష్ట్ర ప్రధానమంత్రి బక్షి గులాం మహ్మద్ అవినీతి, ఆశ్రిత పక్షపాతం భారత ప్రధానమంత్రికి ఇబ్బందికరంగా తయారయ్యాయి. 1963 అక్టోబర్ 11న అతన్ని బయటికి పంపించి వేశారు. అతని అనుయాయుడైన ఖ్వాజా షంషుద్దీన్‌ను అతని స్థానంలో పెట్టారు. మళ్ళీ షంషుద్దీన్ స్థానంలో జి.ఎం. సాదిక్ మరుసటి సంవత్సరం మార్చి 1న అధికారంలోకి వచ్చాడు. ఈ మార్పుల్లో దేనికీ కూడా శాసనసభ్యుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేదు. ఇక ప్రజల యిష్టాలతో ప్రమేయం లేదని వేరే చెప్పనక్కరలేదు. ఇవి ఢిల్లీ నుంచి రుద్దబడిన మార్పులు. అయితే షంషుద్దీన్‌ను ప్రధానమంత్రి చేయడం బక్షి గులాం మహ్మద్‌కు ఆమోదనీయమే అయినప్పటికీ సాదిక్‌ను చేయడం ఆమోదనీయం కాదు. శాసనసభ్యులందరు కూడా బక్షి గులాం మహ్మద్ ఎంపిక చేసినవారే కాబట్టి సాదిక్‌కు వ్యతిరేకంగా నో కాన్ఫిడెన్స్ ఓటు పెడతానని అతడు బెదిరించాడు. అపుడు ఢిల్లీ పాలకుల సలహా మేరకు జమ్మూ కశ్మీర్ రాష్ట్రపతి బక్షీని అరెస్టు చేయమని సాదిక్‌పై ఒత్తిడి పెట్టాడు. అతన్ని అరెస్టు చేయకపోతే ఆ రాష్ట్రంలో పాలన అస్థిరమవుతుందని హెచ్చరించాడు. అప్పటిదాక ఎవరూ పట్టించుకోని అతని అవినీతి చర్యలు దీనికి పనికొచ్చాయి. బక్షి గులాం మహ్మద్‌ను అవినీతి ఆరోపణలపై అరెస్ట్ చేసి 11 వారాల తర్వాత ఎటువంటి విచారణ లేకుండా చార్జ్‌షీట్ కూడా దాఖలు చేయకుండా విడిచిపెట్టారు. మరొకసారి కేంద్ర ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తిని శ్రీనగర్‌లో అధికారంలో నెలకొల్పడానికి చట్టాన్ని, ప్రజాస్వామ్య సూత్రాలను భంగపర్చడం జరిగింది.

1964లో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదంతో వరుసగా శాసన సవరణలు చేపట్టారు. బక్షి గులాం మహ్మద్ ప్రధానమంత్రిగా ఉన్నపుడే ఇది మొదలైంది. సాదిక్ నాయకత్వంలో ఇది పూర్తయింది. వీటి ఫలితంగా ఆ తర్వాత ఆ రాష్ట్ర అధిపతిని సదర్–ఇ–రియాసత్ లేక రాష్ట్రపతి అని కాక గవర్నర్ అని పిలుస్తారు. అతన్ని జమ్మూ కశ్మీర్ శాసనసభ ఎన్నుకోదు. దేశ రాష్ట్రపతి నియమిస్తాడు. ఇకమీదట ఆ రాష్ట్రం యొక్క ప్రధానమంత్రిని ముఖ్యమంత్రి అంటారు. కేంద్ర ప్రభుత్వ పాలన విధించడానికి పనికి వచ్చే ఆర్టికల్ 356 జమ్మూ కశ్మీర్‌కు కూడా ఆ తర్వాత వర్తిస్తుంది. జమ్మూ కశ్మీర్ నుంచి పార్లమెంటుకు వచ్చే సభ్యులు ఇదివరకు లాగా రాష్ట్ర అసెంబ్లీ సభ్యులచేత కాక ప్రత్యక్షంగా ప్రజలచేత ఎన్నుకోబడుతారు. దేశంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యవస్థ ఇదే. వీటిలో గవర్నర్ నియామకం, రాష్ట్రపతి పాలన విధించడం, అనే అధికారాలను 1980లలో చాలా కుట్రపూరితంగా ఉపయోగించుకోవడం, దానివల్ల తీవ్ర పర్యవసానాలు సంభవించడం

జరిగింది. ఆ విషయం తర్వాత చూద్దాం. జమ్మూ కశ్మీర్‌ను మరింత సంపూర్ణంగా భారత్‌లోకి తీసుకొచ్చిన ఈ మార్పులకు సమాంతరంగా సాదిక్, మీర్ ఖాసింల నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీని 1965లో కాంగ్రెస్ పార్టీ కశ్మీర్ శాఖగా మార్చారు. దీన్నొక సంకేతాత్మకమైన చర్యగా భావించవచ్చు. ఎందుకంటే కశ్మీర్‌లో భారత ప్రభుత్వము కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఒకటే.

నాటకీయంగా జరిగినటువంటి ఈ చర్యలకు నిరసనగా కశ్మీర్ లోయలో ప్రజాగ్రహం పెల్లుబికింది. హింసాత్మకమైన నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించబడ్డాయి. జైలు నుంచి బయటకు వచ్చిన షేక్ అబ్దుల్లా ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరిన కశ్మీర్ నాయకులను ప్రజలు సాంఘిక బహిష్కరణకు గురిచేశారు. రాజ్యాంగపరంగా జమ్మూ కశ్మీర్ యొక్క స్థితిని సమూలంగా మార్చిన ఈ సవరణలను విమర్శిస్తూ ఆ రాష్ట్రంలో గతంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న ముఫ్తి బహావుద్దీన్ ఫరూకీ జమ్మూ కశ్మీర్ ప్రాథమిక హక్కుల పరిరక్షణ కమిటి పేరిట రాసిన ఒక ప్రచురణలో ఈవిధంగా అంటాడు– "ఈ మార్పులు జమ్మూ కశ్మీర్ రాజ్యాంగం యొక్క పునాది స్వరూపాన్నే మార్చేశాయి. ఆర్టికల్ 370 జమ్మూ కశ్మీర్ రాజ్యాంగం పునాది స్వరూపానికి కేంద్రం. దానికి భిన్నంగా ఈ మార్పులు నడిచాయి. భారత సుప్రీంకోర్టు పదేపదే చెప్పిన విధంగా ఏ రాజ్యాంగ సవరణ కూడా రాజ్యాంగ ప్రాథమిక లేక పునాది స్వరూపాన్ని మార్చడానికి వీలు లేదు. కాబట్టి ఈ సవరణలేవీ కూడా చట్టబద్ధం కావు." ఇది రాజ్యాంగ నిపుణులెవరూ కాదనలేని వాదన. "అయితే భారత్‌లో వినేవాళ్ళెవరు?" అని ఆయనే ప్రశ్నిస్తాడు. న్యాయ విశ్లేషకుడు ఎ.జి.నూరాని కూడా రాష్ట్ర రాజ్యాంగ పరిషత్ కాలం తీరిపోయిన తర్వాత విలీన ఒడంబడికను దాటి కేంద్రానికి అధికారాలు కల్పించిన రాష్ట్రపతి ఆదేశాలకు జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అనుమతి అసలు చెల్లుతుందా అన్న ప్రశ్న వేశాడు. ఎందుకంటే ఆర్టికల్ 370 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రతి అనుమతినీ కూడా రాజ్యాంగ పరిషత్ ముందు పెట్టాలి. అంటే రాజ్యాంగ పరిషత్ ఇంకా ఉనికిలో ఉండగానే అటువంటి అనుమతులు అడగడం, ఇవ్వడం జరగాలి. కాని రాజ్యాంగం రాసిన తర్వాత రాజ్యాంగ పరిషత్ లేనే లేదు. కాబట్టి ఏ రకంగా చూసినా 1964-65 కాలంలో భారత రాష్ట్రపతి జారీచేసిన శాసన ఆదేశాలు చట్టరీత్యా చెల్లవు అనేది స్పష్టమవుతుంది. గత మూడు దశాబ్దాలుగా జమ్మూ కశ్మీర్‌లో జరిగిన విషయాలు కేవలం నైతికంగా అభ్యంతరకరమైనవి మాత్రమే కాకుండా చట్టవిరుద్ధం కూడా అని అర్థమవుతుంది.

## 'హద్దులు దాటిన అబ్దుల్లా'

త్వరలోనే షేక్ అబ్దుల్లాను మళ్ళీ అరెస్టు చేశారు. 1965 ఫిబ్రవరి 5వ తేదీన అతను మక్కాకు పోయాడు. అక్కడి నుండే వివిధ ఇస్లామిక్ దేశాలను పర్యటించాడు. చాలామంది విదేశీ నాయకులతో మాట్లాడాడు. వారిలో ఒకరు చైనా ప్రధామంత్రి చౌఎన్‌లైతో షేక్ అబ్దుల్లా మాట్లాడిన తర్వాత కశ్మీరీ స్వయం నిర్ణయాధికారానికి అనుకూలంగా అతను కొన్ని వాక్యాలు పలికారు. భారత ప్రభుత్వం షేక్ అబ్దుల్లాను వెంటనే వెనక్కి వచ్చేయమని చెప్పింది. అతను వెనక్కి రాగానే అరెస్టు చేసింది. అజిత్ బట్టాచార్జి అన్నట్టు అబ్దుల్లా నిజానికి వెనక్కు రాకుండా ఉండి ఉండవచ్చు. భారత్‌గాని అతని పాస్‌పోర్ట్‌ను రద్దుచేస్తే అతనికి పాస్‌పోర్ట్ ఇవ్వడానికి చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయి. అలిస్టెర్ ల్యాంబ్ చెప్పినదాని ప్రకారం పాకిస్తాన్ అతనికి పాస్‌పోర్ట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉండింది. అయినప్పటికీ షేక్ అబ్దుల్లా భారత్ వెనక్కి రమ్మనగానే గౌరవప్రదంగా వెనక్కి వచ్చాడు. కాని భారత ప్రభుత్వం అంతే గౌరవప్రదంగా ప్రవర్తించలేదు. విదేశీ ప్రభుత్వాలతో కుట్ర చేసే అవకాశాన్ని అతనికి లేకుండా చేసిన తర్వాత అతన్ని ఇండియాలో స్వేచ్ఛగా ఉండనీయవచ్చుగదా? అయినప్పటికి అతన్ని మూడు సంవత్సరాలు జైల్లో పెట్టారు. ఈ అరెస్టు తర్వాత కూడా కశ్మీర్‌లో పెద్ద ఎత్తున అలజడులు జరిగాయి. పోలీసులు అణచివేత ప్రయోగించి చాలామంది ప్లెబిసైట్ కార్యకర్తలను అరెస్టు చేశారు. అప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న సాదిక్ 1967 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తన స్థితిని మరింత పదిలపరచుకున్నాడు. అతని పూర్వ ప్రధానమంత్రి అయిన బక్షి గులాం మహ్మద్ 1957లో, 1962లో ఏ విధంగా అయితే గెలిచాడో సాదిక్ అట్లే గెలిచాడు. 75 నియోజకవర్గాల్లో 39 స్థానాల్లో 118 నామినేషన్లను తిరస్కరించి ఏకగ్రీవ ఎన్నికలను సాధ్యం చేశారు. సాదిక్ 1971 డిసెంబర్‌లో చనిపోగా అతని తర్వాత మీర్ ఖాసిం జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి అయ్యాడు. 1971-72లో భారత పాలకులకు జమ్మూ కశ్మీర్‌లో తాము ప్రజాస్వామికంగా వ్యవహరిస్తాము అని రుజువు చేసుకునే అవకాశం మరొకసారి కలిగింది. 1971లో పార్లమెంటరీ ఎన్నికలు జరిగాయి. 1972లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. షేక్ అబ్దుల్లా జైలు బయట ఉన్నాడు. అతని ప్లెబిసైట్ ఫ్రంట్, కాంగ్రెస్‌తో పోటీకి దిగడానికి సిద్ధంగా ఉండింది. ఆ పోటీని గాని అనుమతించి ఉంటే జమ్మూ కశ్మీర్ ప్రజానీకానికి, ప్రత్యేకించి కశ్మీరీ లోయ ప్రజానీకానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే ఏమిటో, దాని రుచి ఏమిటో తెలిసి ఉండేదేమో? పాకిస్తాన్‌ను గాక ఇండియాను కోరుకోవడానికి ఇండియాలో ఉన్న ప్రధానమైన ఆకర్షణ అదే అని చెప్పబడుతుంది కాని దాని రుచి ఏమిటో వాళ్ళకు ఎప్పుడూ చూపించలేదు. ఈ ఒక్క అవకాశాన్ని కూడా భారత పాలకులు సాగనివ్వలేదు. 1971

జనవరి 8 నాడు షేక్ అబ్దుల్లా ఢిల్లీ నుండి శ్రీనగర్‌కు పోవడానికి తయారుకాగా అతను ఎక్కబోయిన విమానాన్ని ఆఖరు నిమిషంలో రద్దుచేశారు. కారణం ఏమని చెప్పారు అంటే విమానంలో బాంబు ఉంది అని ఎవరో చెప్పారు అందువల్ల రద్దయిందని. కాని అసలు కారణం అబ్దుల్లాకు మరుసటి రోజు అర్థమై ఉండాలి. మరుసటి రోజు అతను, బేగ్, జమ్మూ కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి వీలులేదు అంటూ నిషేధిస్తూ తాఖీదులు జారీ చేశారు. ఆపైన జమ్మూ కశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీ ఆ రాష్ట్ర ఎన్నికల్లో ప్లెబిసైట్ ఫ్రంట్ పాల్గొనడానికి వీల్లేదు అని నిషేధిస్తూ చట్టమే చేసింది. తిరిగి మళ్ళీ 1972 అసెంబ్లీ ఎన్నికలప్పుడూ ఇదే జరిగింది. ఈ విధంగా ప్రధాన ప్రతిపక్షాన్ని ఎన్నికల్లో పాల్గొననీయకుండా నిషేధించి కాంగ్రెస్ పార్టీ 75 సీట్లలో 57 గెలుచుకుంది. అయినప్పటికీ షేక్ అబ్దుల్లా అనుచరులు కనీసం ఒక ప్రతీకగా అయినా సరే ప్రతీకారం తీర్చుకోవడానికి బక్షీ గులాం మహ్మద్ మీద షమీమ్ అహ్మద్ షమీమ్ అనే జర్నలిస్టును స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి పెట్టి అతన్ని ఓడించారని షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో చెప్పుకుంటాడు.

చెప్పుకోదగ్గ మరొక విషయం ఏమిటంటే షేక్ అబ్దుల్లా యొక్క ప్లెబిసైట్ ఫ్రంట్‌ను నిషేధించిన కాంగ్రెస్ పార్టీ పనిగట్టుకొని జమాతె ఇస్లామీని ఎన్నికల్లో పాల్గొనడానికి ప్రోత్సహించి 5 సీట్లు గెలవనిచ్చింది. 1950 నుంచి కూడా కశ్మీర్ లోయలో ఢిల్లీ స్థానిక ప్రతినిధులు గెలవనిస్తే తప్ప ఎవరూ గెలిచే అవకాశం లేదు. ఢిల్లీ పాలకులు అటువంటి గుండాయిజాన్ని, హింసను లోయలో ప్రోత్సహించారు. ఇది ఎవరో వేసిన ఆరోపణ కాదు. 1972లో జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా ఉన్న మీర్ ఖాసిం తర్వాత కాలంలో రాసిన ఆత్మకథలో షేక్ అబ్దుల్లా మద్దతుగల వారెవరూ పోటీ చేయకుండా చూడడం కోసం కాంగ్రెస్ పార్టీ జమాతె ఇస్లామీ సాయం తీసుకొని ఆ ఖాళీని పూరించిందని, అయిదు నియోజకవర్గాల్లో వారిని గెలవనిచ్చిందనీ స్వయంగా చెప్పాడు. లౌకికవాద ప్రత్యర్థులను అణచివేయడం వల్ల ఏర్పడ్డ ఖాళీలను నింపడానికి మతోన్మాద శక్తులను ప్రోత్సహించడం అనే అసహ్యకరమైన ఈ గుణాన్ని భారత పాలకులు కశ్మీర్‌లో తర్వాత కూడా చాలాసార్లు ప్రదర్శించారు. ఒక కశ్మీరీ మేధావి అన్నట్లు 1960 నుంచి కూడా బక్షి గులాం మహ్మద్ షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా కశ్మీర్ లోయలో ముస్లిం మతవాద రాజకీయాలకు ప్రతినిధిగా ఉన్న మిర్వైజ్ ఫరూక్ నాయకత్వం వహించిన సనాతనవాద సాంప్రదాయాన్ని ప్రోత్సహించాడు. ఎందుకంటే భారత రాజ్యాంగానికి కశ్మీరీ జాతీయవాదులు మింగుడుపడని శక్తి. జాతీయవాదుల రాజకీయాలకు, వాదనలకు ఒక నైతిక బలం. ఒక తర్కబలం ఉంటుంది. దాన్ని ఎదుర్కోవడం భారత్‌కు సాధ్యం కాదు. జమాతే ఇస్లామీ మరింత అనుకూలమైన ప్రత్యర్థి. అదే తన ప్రత్యర్థిగా ఉంటే భారత రాజ్యం తాను సనాతనవాద శక్తులమీద పోరాటం చేస్తున్న ఒక లౌకికవాద శక్తి అని చెప్పుకోగలుగుతుంది.

## రెండు యుద్ధాలు

ఈ లోపల భారత్‌కూ పాకిస్తాన్‌కూ రెండు యుద్ధాలు జరిగాయి. ఒకటి 1965లో, మరొకటి 1971లో. మొదటి దానికి కారణం 1964–65 మధ్య కాలంలో కశ్మీర్ లోయలో జరిగిన ఘటనలు పాకిస్తానీ పాలకుల్లో రేకెత్తించిన ఒక ఆశ. ఆ సంవత్సరాల్లో లోయలో జరిగిన రాజ్యాంగపరమైన, రాజకీయపరమైన మార్పులపట్ల ప్రజల్లో పెల్లుబికిన నిరసన గురించి పైన చెప్పాం. అదేవిధంగా షేక్ అబ్దుల్లా, మీర్జా అఫ్జల్ బేగ్‌ల అరెస్టుకు వ్యతిరేకంగా తర్వాత తలెత్తిన నిరసన గురించి కూడా పైన చెప్పాం. మరొక కారణంగా కూడా ఆ రోజుల్లో ఒక ఆందోళన జరిగింది. అదేమిటంటే శ్రీనగర్‌లోని హజరత్‌బల్ దర్గానుండి 1963 డిసెంబర్ 26 తేదీన ప్రవక్త మహమ్మద్ వెంట్రుక మాయం కావడం. ఇది విపరీతమైన ప్రజాగ్రహానికి దారి తీసింది. చాలా హింస జరిగింది. ప్రత్యేకించి బక్షి గులాం మహమ్మద్ కుటుంబం యొక్క ఆస్తులపై దాడులు చాలా జరిగాయి. ఎంత విచిత్రంగా ఆ వెంట్రుక మాయం అయ్యిందో అంతే విచిత్రంగా 1964 జనవరి 3వ తేదీన తిరిగి వచ్చింది. అయినప్పటికి గౌరవనీయులైన ముస్లిం మత పెద్దలు మౌలానా మసూది నాయకత్వంలో అది నిజంగా మాయమైన వెంట్రుకే అని నిర్ధారించే దాకా ప్రజాగ్రహం, అందోళన తగ్గలేదు. ఈ ఆందోళన తర్వాతే షంషుద్దీన్‌ను తొలగించి జి.ఎం.సాదిక్‌ను రాష్ట్ర ప్రధానమంత్రిగా తీసుకురావడం జరిగింది. ఈ ఘటనలన్నీ కూడా పాకిస్తాన్‌కు విదేశాంగ మంత్రిగా ఉన్న జుల్ఫికర్ ఆలీ భుట్టోలో ఒక దురాశను రేకెత్తించాయి. పాకిస్తాన్ కానీ భారత్‌పై దాడిచేస్తే జమ్మూ కశ్మీర్‌లోని ముస్లింలు భారత్‌పైన తిరుగుబాటు చేసి ఆ భూభాగాన్ని పాకిస్తాన్‌లో కలపడానికి సహకరిస్తారు అని భుట్టో భావించాడు. పాకిస్తాన్ ఆ ప్రయత్నం చేసింది, విఫలమైంది. భారత సైన్యం పాకిస్తాన్ సైన్యాన్ని వెనక్కి నెట్టేసింది. ఇటు భారత పాలకులు గానీ, అటు పాకిస్తాన్ పాలకులు గానీ కశ్మీరీలను ఎప్పుడు కూడా సరిగ్గా అర్థం చేసుకోలేదనిపిస్తుంది. కశ్మీరీల ఆలోచనల్లో, వారి కశ్మీరీ గుర్తింపు వారి ముస్లిం గుర్తింపు, విడదీయరానివి. పాకిస్తాన్ దీంట్లో రెండవదాన్ని, ఇండియా దీంట్లో మొదటి దాన్ని తమకు అనుకూలంగా వాడుకునే ప్రయత్నం చేశాయి. ఇక మీదట కూడా భారత్ ఈ ప్రయత్నంలో సఫలం కావడం కష్టం. ఎందుకంటే తాను దేన్నయితే వాడుకోవాలని ప్రయత్నం చేస్తుందో దాన్ని భారత్ ఎప్పుడూ గౌరవించలేదు. పాకిస్తాన్ తన ప్రయత్నాల్లో సఫలం కాగలనని ఆశిస్తున్నట్టు అర్థమవుతుంది. 1953లో, మౌలానా మసూది, షేక్ అబ్దుల్లాను అరెస్టు చేయడానికి, తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్న దశలో ఇచ్చిన ఒక పత్రికా ప్రకటన నుంచి ఈ రెండు దేశాల ప్రభుత్వాలూ కూడా ఒక సత్యాన్ని నేర్చుకోవచ్చునేమో. "1947లో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా కశ్మీరీలు ఒక్కటిగా తిరగబడ్డారంటే దానికి కారణం తమకు ఆమోదనీయం కానటువంటి స్థితిలోకి నెట్టడానికి

ఆ ప్రభుత్వం చేసిన ప్రయత్నం. ఇవాళ ఇండియా ఈ రాష్ట్రం స్వయం ప్రతిపత్తి స్థితిని తొలగించే ప్రయత్నంగానీ చేస్తే కశ్మీరీలు మూడో ప్రత్యామ్నాయమైన స్వతంత్ర్యం గూర్చి ఆలోచిస్తారు. ఆలోచిస్తే వారిని ఎవరూ కూడా నిందించడానికి వీలులేదు" అని మసూది అన్నారు.

1971లో బంగ్లాదేశ్ విషయంలో మరొక యుద్ధం భారత్ పాకిస్తాన్‌ల మధ్య జరిగింది. దాంతో భారత్ మరింత బలపడింది. ఆ యుద్ధం జరిగింది జమ్మూ కశ్మీర్ గురించి కాకపోయినప్పటికీ, భారత్‌ను సైనికంగా ఓడించడం పాకిస్తాన్‌కు అసాధ్యం అన్న అభిప్రాయం కశ్మీరీ పాలకుల్లో కలిగినట్టుంది. 1965 యుద్ధం తర్వాత ఢిల్లీ పాలకులను, షేక్ అబ్దుల్లాను, చర్చలకు ఒక దగ్గరకు తీసుకురావాలన్న ప్రయత్నం భారత్‌లో మొదలైంది. ఈ ప్రయత్నం చేసిన వారిలో జయప్రకాశ్ నారాయణ్ ప్రముఖుడు. ఈయన జమ్మూ కశ్మీర్ ఇండియాలోనే ఉండాలని భావించినప్పటికీ ఆ రాష్ట్రం యొక్క స్వయం ప్రతిపత్తిని గౌరవించాలనీ, కశ్మీరీల ఆకాంక్షలను గౌరవించడం ద్వారా సమస్యను పరిష్కరించాలే తప్ప వారిని జాతి వ్యతిరేకులు అని నిందించడానికి వీలు లేదనీ భావించాడు. సరిహద్దు సమస్యను బలప్రయోగంతో పరిష్కరించాలని పాకిస్తాన్ 1965లో చేసిన ప్రయత్నం విఫలమైన తర్వాత, 1971లో పాకిస్తాన్ జాతి, భాషల ప్రాతిపదిక మీద రెండుగా విడిపోయిన తర్వాత, మనుషుల మధ్య మతమే అన్నింటికంటె బలమైన బంధం అనే ఆలోచన విఫలమైంది అన్న భావన బలపడిన కారణంగా, జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు షేక్ అబ్దుల్లాకూ, భారత ప్రభుత్వానికీ మధ్య చర్చలు మొదలుపెట్టాలి అని చేసిన ప్రయత్నం ఒక రూపం తీసుకుంది. షేక్ అబ్దుల్లా జమ్మూ కశ్మీర్ యొక్క విలీనాన్ని నిర్ద్వంద్వంగా అంగీకరించాలి అనేది భారత పాలకుల యొక్క డిమాండ్. అంగీకరించేంత వరకు అతనికి ఆ రాష్ట్రంలో ఎన్నికల్లో పాల్గొనే కనీస రాజకీయ స్వేచ్ఛ కూడా నిరాకరించబడింది. ఆ స్వేచ్ఛే కాదు చాలా కాలంపాటు అతనికి భౌతిక స్వేచ్ఛ కూడా లేకుండా చేశారు. ఏ రకంగా చూసినా సమర్థనీయం కానటువంటి ఈ ప్రజాస్వామ్య విలువల విధ్వంసం ఈ దేశంలో ఎటువంటి నిరసనకూ దారితీయలేదు. ఈ దేశ పాలకులు, ఈ దేశ రాజకీయ పార్టీలు, ఈ దేశ మేధావులు తమకు గొప్ప ప్రజాస్వామిక సంప్రదాయాలు, ఆదర్శాలు ఉన్నాయని చెప్పుకుంటారు. కానీ షేక్ అబ్దుల్లా హక్కుల మీద జరిగిన దాడికి ఇక్కడ ఎటువంటి నిరసన కూడా వ్యక్తం కాలేదు. అయినప్పటికీ భారత పాలకులు, పాకిస్తాన్ రాజకీయ వ్యవస్థ కంటే మన ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఉన్నతమైంది కాబట్టే, మనకు కశ్మీరీల విశ్వాసాన్ని డిమాండ్ చేసే హక్కు ఉంది అని బుకాయిస్తూనే ఉంటారు. ఇంతకంటే రెండు నాల్కల వైఖరి ఉండజాలదు.

## చీకటి రోజులు

చివరికి ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో షేక్ అబ్దుల్లా ఇందిరాగాంధీతో కుదుర్చుకున్న ఒడంబడిక కశ్మీర్ లోయలో అతని ప్రతిష్టను బాగా దెబ్బతీసింది. ఒకవైపు అతను

భారత పాకిస్తాన్‌ల మధ్య జరిగిన సిమ్లా ఒడంబడికను తీవ్రంగా విమర్శించాడు. కశ్మీర్ సమస్య భారత, పాకిస్తాన్‌ల మధ్య ద్వైపాక్షిక సమస్య అని చెప్పినందుకు సిమ్లా ఒడంబడికను ఆయన తిరస్కరించాడు. కశ్మీర్ ప్రజలతో నిమిత్తం లేకుండా ఈ రెండు దేశాలు ఆ ప్రాంత భవితవ్యాన్ని నిర్ణయించడానికి వీలులేదు అని ప్రకటించాడు. 1972 ఎన్నికల తర్వాత అతనికి కశ్మీర్‌లోకి ప్రవేశించే స్వేచ్ఛ ఇవ్వబడగా జమ్మూ కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికారం వారి జన్మహక్కు అని మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇందిరాగాంధితోను, స్వరణ్‌సింగ్‌తోను జరిగిన చర్చల్లో అతను 1953కు పూర్వ పరిస్థితిని తిరిగి తీసుకురావాలని అనసాగాడు. అంటే అతన్ని మొట్టమొదటిసారి అరెస్టు చేసిన తర్వాత భారత్ జమ్మూ కశ్మీర్‌లో పాల్పడిన రాజ్యాంగ, చట్ట వ్యతిరేక చర్యలన్నిటినీ తిరగదోడాలని అతని ప్రయత్నం. కాని చివరికి మీర్జా అఫ్జల్ బేగ్ తన తరపున, పార్థసారధి భారత ప్రభుత్వం తరపున రూపొందించిన ఒడంబడిక మీద 1974 నవంబర్ 13న సంతకం చేశాడు. ఈ ఒడంబడికను ఇందిరాగాంధీ 1975 ఫిబ్రవరి 24న ప్రకటించారు. ఈ ఒడంబడిక 1953కు పూర్వపు స్థితిని తిరిగి తీసుకురాలేదు. ఆ తర్వాత జరిగిన ఏ మార్పులనూ తిరగదోడలేదు. ఈ ఒడంబడిక జమ్మూ కశ్మీర్ శాశ్వతంగా భారత్‌లో భాగమని ప్రకటించింది. జమ్మూ కశ్మీర్‌కు భారత్‌లో ఉన్న స్థానం ఆర్టికల్ 370ని అనుసరించి ఉండాలని ఈ ఒడంబడిక చెప్పింది. అయితే షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసిన తర్వాత, అతన్ని పక్కకు తొలగించిన తర్వాత, రాజ్యాంగపరంగా జమ్మూ కశ్మీర్‌లో చేసిందా అంతా కూడా ఆర్టికల్ 370 పేరు మీదనే చేయడం జరిగింది కాబట్టి ఈ షరతుకు పెద్దగా అర్థం లేదు. తన జ్ఞాపకాల్లో ఈ ఒడంబడిక గురించి షేక్ అబ్దుల్లా ఏమంటాడంటే ఆర్టికల్ 370 తన తొలి రూపంలో ఉండాలి అన్నది తన అభిప్రాయం అని. వాస్తవానికి 370 ఆర్టికల్‌ను ఎన్నడూ సవరించలేదు. అది రాజ్యాంగం రాసినపుడు ఎట్లా ఉందో అట్లాగే ఉంది. అయితే బహుశా ఆర్టికల్ 370 యొక్క సారాన్ని తొలినాటి రూపంలో కాపాడాలన్నది తన అభిప్రాయం కావచ్చు. కానీ ఒడంబడిక పర్యవసానంగా జరిగింది ఇది కాదు. ఒడంబడిక సారాంశమూ ఇది కాదు. బహుశా ఈ వైఫల్యాన్ని వివరించడానికి కాబోలు షేక్ అబ్దుల్లా తన జ్ఞాపకాల్లో "మా లక్ష్యంలో మార్పేమి లేదు. వ్యూహంలో మాత్రమే మార్పు ఉండింది" అని అంటాడు.

## ఫరూక్‌శకం

1975 ఫిబ్రవరి 25 నాడు షేక్ అబ్దుల్లాను జమ్మూ కశ్మీర్ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకునిగా ఎన్నుకున్నారు. అతను రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాడు. అయితే అతను కాంగ్రెస్ పార్టీలో కొనసాగదలచుకోలేదు. జూలై నెలలో నేషనల్ కాన్ఫరెన్సును పునరుద్ధరించి 1977 అసెంబ్లీ ఎన్నికల్లో తన ప్రజాదరణ ఎప్పటిలాగే ఉన్నదని రుజువు

చేసుకున్నాడు. 1977లో జరిగిన శాసనసభ ఎన్నికలు కశ్మీర్‌లో జరిగిన మొట్టమొదటి స్వేచ్ఛాయుతమైన ఎన్నికలని పరిశీలకులంతా అంటారు. (అప్పటి భారత ప్రధాని మొరార్జీదేశాయికి దేశంలో ఎక్కడా లేనంత గౌరవం కశ్మీర్‌లో అందుకే కనిపిస్తుంది). 70 సీట్లలో 47 నేషనల్ కాన్ఫరెన్స్ గెలుచుకుంది. షేక్ అబ్దుల్లా 1982 సెప్టెంబర్ 8న చనిపోయాడు. అతని కొడుకు ఫరూక్ ముఖ్యమంత్రి అయ్యాడు. రాష్ట్రంలోని కాంగ్రెస్‌పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ నుండి ఫిరాయింపులను ప్రోత్సహించి అతని బావమరిది అయిన గులాం అహమ్మద్‌షా (ఇతన్ని గుల్‌షా అని కూడా అంటారు)ను గద్దెనెక్కించారు. అంతకుముందు 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్సుకు నాయకత్వం వహించి గెలిచాడు. లోయలోని 42 సీట్లలో 39 నేషనల్ కాన్ఫరెన్స్‌కే వచ్చాయి. ఆ ఎన్నికల్లో ఇందిరాగాంధీ జమ్మూ ప్రాంతంలో భారతీయ జనతాపార్టీని మించిన మతోన్మాద ప్రచారం చేపట్టి 25 సీట్లు కాంగ్రెస్‌పార్టీ గెలుచుకుంది. ఆ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఫరూక్ అబ్దుల్లా భారతదేశంలోని కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీల గుంపులోకి నేషనల్ కాన్ఫరెన్స్‌ను తీసుకుపోయే ప్రయత్నం చేశాడు. ఎన్.టి.రామారావు 1983 మే 31న విజయవాడలో నిర్వహించిన ప్రతిపక్ష పార్టీల సమావేశానికి ఆయన హాజరయ్యాడు. ఆ తర్వాత శ్రీనగర్‌లో జరిగిన కాంగ్రెసేతర పార్టీల సమావేశాన్ని తానే నిర్వహించాడు. అయితే జమ్మూ కశ్మీర్ భారత్‌కు విశ్వాసపాత్రంగా ఉండడం, అంటే కాంగ్రెస్ పార్టీకి విశ్వాసపాత్రంగా ఉండటం అని ఎప్పుడూ కూడా అర్థం. వేర్పాటువాదులను ప్రోత్సహిస్తున్నాడని, పాకిస్తాన్ అనుకూల వ్యక్తులను ప్రోత్సహిస్తున్నాడని ఫరూక్ అబ్దుల్లా మీద ఎప్పటిలాగే ఆరోపణలు వేయడం జరిగింది. గుల్ మహమ్మద్ షా నేషనల్ కాన్ఫరెన్స్‌ను చీల్చి 13 మంది శాసనసభ్యులను తీసుకుపోయాడు. కాంగ్రెస్‌పార్టీకి ఉన్న 26 మంది శాసనసభ్యులను కలుపుకుంటే వీరు మెజారిటీ అయ్యారు. అయితే అప్పుడు జమ్మూ కశ్మీర్ గవర్నర్‌గా ఉన్న బి.కె. నెహ్రూ ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడానికి నిరాకరించాడు. గవర్నర్ పదవి నుండి బి.కె.నెహ్రూను ఇందిరాగాంధీ తొలగించింది. జగ్‌మోహన్‌ను జమ్మూ కశ్మీర్ గవర్నర్‌గా 1984 ఏప్రిల్‌లో తీసుకొచ్చింది. ఆశించినట్టుగానే జగ్‌మోహన్ ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని జూలై 2న బర్తరఫ్ చేసి గుల్ మహమ్మద్‌షాకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్నిచ్చాడు. అయితే గుల్ మహమ్మద్‌షా ఎక్కువకాలం ఉండలేదు. 1986 మార్చి 6న కాంగ్రెస్ శాసనసభ్యులు అతనికి తమ మద్ధతును ఉపసంహరించారు. దాంతో జగ్‌మోహన్ గుల్ మహమ్మద్‌షా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి గవర్నర్ పాలన విధించాడు. 1986 చివరి నెలల్లో ఫరూక్ అబ్దుల్లా రాజీవ్‌గాంధీతో ఒప్పందం చేసుకునేదాక జగ్‌మోహన్ గవర్నర్‌గా ఆ రాష్ట్రాన్ని పరిపాలించాడు.

మళ్ళీ అతను 1990లో ఆ రాష్ట్రానికి గవర్నర్‌గా రాబోతాడు. అప్పుడు అతను చేపట్టిన చర్యలకు వినాశకరమైన పర్యవసానం ఉండబోతాయి. కశ్మీర్‌లోని ముస్లింలు దాదాపు మినహాయింపు లేకుండా జగ్‌మోహన్‌ను హిందూ మతోన్మాదిగా భావిస్తారు. ఒక సెక్యులర్ రాజ్యంలో ఎటువంటి పదవి అలంకరించే అర్హతలేని వ్యక్తిగా జగన్‌మోహన్‌ను భావిస్తారు. దీనికి వాళ్లను తప్పు పట్టలేం. అతని చర్యలేకాక అతని రచనలు, ఉపన్యాసాలు కూడా మైనార్టీలకు – అవి మత మైనార్టీలైనా, జాతి మైనార్టీలైనా – ఎటువంటి స్థానమూ లేని సంకుచిత జాతీయవాదాన్ని అతను నమ్ముతాడని రుజువు చేస్తాయి. అతనికి ముస్లింలంటే ఎంత ద్వేషం అంటే శ్రీనగర్‌లోని గవర్నర్ కార్యాలయంలో ఉన్న ముస్లింలదరిని కూడా అతను తొలగించాడు. ముస్లింలకున్న ఉద్యోగ రిజర్వేషన్లు సగానికి తగ్గించాడు. జన్మాష్టమి రోజు గొర్రెలను కోసినట్టయితే అది హిందువుల భావాలను గాయపరుస్తుందని చెప్పి గొర్రెలను కోయడం మీద నిషేధం పెట్టాడు. నిజానికి దేశంలో ఎక్కడా కూడా జన్మాష్టమి రోజు గొర్రెలను కోయడానికి వీల్లేదనే నిషేధం లేదు. ముస్లింలకు కోపం తెప్పించడమే అతని ఉద్దేశం గానీ అయితే అతను దాన్ని సాధించాడు. దక్షిణ కశ్మీర్ మీర్‌వైజ్‌గా పిలవబడే కాజీనిస్సార్ అహ్మద్ జన్మాష్టమి నాడు పెద్ద గుంపును సమీకరించి అనంతనాగ్ పట్టణంలో ఒక గొర్రెను కోశాడు. జగ్‌మోహన్ గవర్నర్‌గా భారత రాష్ట్రపతి కోరిన ఆమోదాన్నిచ్చి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 249ని జమ్మూ కశ్మీర్‌కు విస్తరించడానికి కూడా తోడ్పడ్డాడు. ఆ ఆర్టికల్ ప్రకారం రాజ్యసభ 2/3వ వంతు ఓటుతో జమ్మూ కశ్మీర్‌పైన జాతీయప్రయోజనాల దృష్ట్యా ఏ అంశంమీదనైనా సరే చట్టాలు చేసే అధికారాన్ని పార్లమెంటుకు కల్పించగలదు. ఒక హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు నవ్వుతూ ఏమంటాడంటే ఎప్పుడైనా కశ్మీర్‌కు విముక్తి అంటూ రావడం జరిగితే పాకిస్తాన్ తన దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాన్ని జగ్‌మోహన్‌కు ఇస్తుందని. ఎందుకంటే అతను కశ్మీరీ ముస్లింలకు భారత్‌పట్ల ఉన్న వ్యతిరేకతను అత్యున్నత స్థాయికి తీసుకుపోయాడు కాబట్టి.

ఫరూక్‌అబ్దుల్లా పాలన 1986 నవంబర్ 7న తిరిగి నెలకొనింది. అతను కాంగ్రెస్‌పార్టీకి పూర్తిగా లోబడిపోయి గెలిచినా ఓడిపోయినా వారితో అధికారం పంచుకుంటానని హామీ ఇచ్చిన తర్వాతే మళ్ళీ గద్దెనెక్కగలిగాడు. కశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయదలచుకున్న వాళ్లు న్యూఢిల్లీతో అధికారం పంచుకోకుండా ఏర్పాటుచేయడం సాధ్యం కాదు అని రెండేళ్ళ తర్వాత ఒక జర్నలిస్ట్‌తో ఫరూక్‌అబ్దుల్లా అన్నాడు. ఆ గుణపాఠాన్ని అతను 1986 చివర్లో నేర్చుకున్నాడు. రాజీవ్‌గాంధీతో పదవుల పంపకం ఒప్పందం చేసుకొని తిరిగి ముఖ్యమంత్రి అయ్యాడు. అవమానకరమైన ఈ ఒప్పందాన్ని భారత పత్రికలు గొప్పగా కొనియాడాయి. పత్రికలే కాక ప్రధాన రాజకీయ అభిప్రాయం కూడా దేశంలోని లౌకిక జాతీయవాద శక్తుల ఏకీకరణగా దాన్ని అభివర్ణించింది. అసలు

వాస్తవమేమిటంటే అప్పటివరకు నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఇంకా మిగిలివున్న ప్రజాదరణను ఈ ఒప్పందం పూర్తిగా నాశనం చేసింది. ఆత్మ గౌరవంగల కశ్మీరీలు భారతదేశంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు మనగలవు గాని, జమ్మూ కశ్మీర్‌లో మనజాలవు అని గుర్తించగలిగారు. కశ్మీర్ లోయలో నేషనల్ కాన్ఫరెన్స్ యొక్క ప్రభావాన్ని కాపాడడమే లక్ష్యం అయ్యివుంటే ఫరూక్ అబ్దుల్లాను ఢిల్లీ గద్దె ముందు మోకరిల్లే పద్ధతిలో అవమానపరచడం దానికి పూర్తిగా విరుద్ధమైన చర్య. ఇంత జరిగిన తర్వాత కూడ నేషనల్ కాన్ఫరెన్స్ కశ్మీర్ లోయలో ఎప్పటిలాగ ప్రజాదరణ కలిగి ఉంటుందని భారత పాలకులు భావిస్తున్నారు అంటే కశ్మీర్ ప్రజలపట్ల వారికెంత చులకన భావముందో అర్ధమవుతుంది. అని ఆ ప్రజానీకానికి అవమానకరంగా అనిపించిందంటే ఆశ్చర్యపోవలసింది ఏమి లేదు. అయితే కశ్మీరీల్లోని వైమనస్యాన్ని పూర్తి చేసేటటువంటి ఘటన ఇంకా మిగిలి ఉంది. 1953లో షేక్ అబ్దుల్లాను భర్తరఫ్ చేసి అరెస్ట్ చేయడంతో మొదలైన ఈ చర్యల పరంపర 1987 ఎన్నికలతో ముగిసింది. దానితో కశ్మీరీల వైమనస్యం సంపూర్ణమైంది.

ఈ ఎన్నికలు 1987 మార్చి 23న జరిగాయి. కాంగ్రెస్ నేషనల్ కాన్ఫరెన్స్‌ల కూటమికి వ్యతిరేకంగా జమాతె ఇస్లామీతో కూడుకున్న 13 పార్టీల కలయిక అయిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ పోటీకి దిగింది. పేరును బట్టే ఈ కూటమి మత ప్రాతిపదికన ఏర్పడింది అనేది అర్ధమవుతుంది. కశ్మీర్ లోయ రాజకీయాలలో అటువంటి పోకడ మొదటి నుంచీ ఉండింది. 1930లో మొదలై షేక్ అబ్దుల్లాకు వ్యతిరేకంగా అది సాగుతూనే ఉండింది. కశ్మీర్ యొక్క మతాధిపతులైనటువంటి మీర్‌వైజ్‌లు, అంటే 1931 దాకా మౌల్వీ అహ్మద్‌షా, 1931 నుంచి 1947 దాకా మహ్మద్ యూసుఫ్‌షా, 1962 నుంచి 1980ల దాక మహ్మద్ ఫరూక్ ఈ పోకడ యొక్క ప్రతినిధులుగా ఉన్నారు. మహ్మద్ ఫరూక్ వారసుడైన ఉమర్ ఫరూకీ ప్రస్తుతం ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ అధినేత. మతపరమైన ఈ పోకడకు కశ్మీర్ లోయలో ప్రజాదరణ అసలే లేకుండా పోలేదు గానీ సెక్యులర్ జాతీయవాదం ఆకర్షణతో పోల్చదగ్గ ఆకర్షణ దానికి ఎప్పుడూ లేదు. ఢిల్లీ పాలకులు సంకుచితమైన అణచివేత స్వభావం కలిగిన ఒక చర్యల పరంపర ద్వారా నేషనల్ కాన్ఫరెన్స్ ప్రజాదరణను పూర్తిగా ధ్వంసంచేసి ఆ పార్టీపైన అవమానకరమైన ఒడంబడికలను రుద్దిన క్రమంలోనే కశ్మీర్ రాజకీయాల్లోని ముస్లిం మతోన్మాద పోకడ బలపడింది. ఆ క్రమంలో ఏర్పడిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ 1987 ఎన్నికల్లో మంచి ఫలితాన్ని పొందగలిగింది. వాళ్లు దాదాపు 30% ఓట్లు పొందారు. కాని కేవలం 4 సీట్లలో మాత్రమే వాళ్లు గెలిచినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. కాగా నేషనల్ కాన్ఫరెన్స్‌కు 36 సీట్లను అప్పగించింది. ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అనేకమంది అత్యంత అనుమానాస్పదమైన, స్వల్పమైన తేడాలతో ఓడిపోయింది. ఓట్ల

లెక్కింపులోనే మోసం జరిగిందని చాలామంది భావించారు. కేవలం కశ్మీరీ రాజకీయ వాదులే కాకుండా ఇండియా టుడే వంటి భారత పత్రికలు కూడా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఓట్ల లెక్కింపు గదిలో గెలిచినట్టుగా ప్రకటించబడిన ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులు కొంతమందిని ఆ తర్వాత ఓడిపోయినట్టుగా రిటర్నింగ్ ఆఫీసర్ ప్రకటించడం జరిగింది. జమ్మూ కశ్మీర్‌లోని ఎన్నికల ప్రహసనపు చివరి ఘట్టం అయిన ఈ లెక్కింపు ప్రక్రియలో నష్టపోయినవారు చాలామంది తర్వాత కాలంలో మిలిటెంట్ ఉద్యమానికి నాయకులయ్యారు. వారిలో ప్రముఖుడు షేక్ సలావుద్దీన్. అతను ప్రస్తుతం హిజ్‌బుల్ ముజాహిదీన్ నాయకడు. ఆ ఎన్నికల్లో అతను శ్రీనగర్‌లోని అమీరాకడల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలిచాడు గానీ తర్వాత ఓడిపోయినట్టుగా ప్రకటించడం జరిగింది. ఒక ప్రహసనంగా నిర్వహించిన ఈ ఎన్నికలు కశ్మీరీ యువతరానికి తమ సమస్య పరిష్కారానికి తుపాకీ తప్ప వేరే మార్గమేమీ లేదు అన్న సంకేతాన్ని ఇచ్చాయని కశ్మీర్‌లో అత్యధికులు నమ్ముతారు. అంతకుముందు కూడా కొన్ని సాయుధ చర్యలు జరిగిన మాట వాస్తవమే. జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ కొన్ని హింసాత్మక చర్యలకు పాల్పడిన మాట కూడా వాస్తవమే. ఉదాహరణకు ఇంగ్లాండులోని బర్మింగ్‌హామ్‌లో భారత హై కమీషనర్ రవీంద్ర మాహత్రే హత్య. అయితే 1987 నాటి ఎన్నికల ప్రహసనానికి దారితీసిన చర్యల పరంపరే కశ్మీర్‌లోయలో మిలిటెన్సీ ప్రబల శక్తి కావడానికి దారి తీసింది.

## 3. తిరుగుబాటు - అణచివేత

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కశ్మీర్ స్టడీస్ అనే సంస్థ ప్రకటించిన ఒక రచనలో కశ్మీర్ ఉద్యమాన్ని గురించి ఈ విధంగా చెప్పుకున్నారు. "కశ్మీరీ ప్రజల స్వయం నిర్ణయాధికార ఉద్యమం నాలుగు దశాబ్దాలపాటు అణచివేత, మోసాల మధ్య సాగింది. ఒడిదుడుకులు ఎదుర్కొనింది. కాని ఏది ఏమైనా నిబద్ధత కలిగిన యువకులు, అనుభవజ్ఞులైన పెద్దలు ప్రతిఘటనా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచారు. 1987 నాటికి కశ్మీరీ యువకులు తమకు హామీ ఇవ్వబడిన స్వయం నిర్ణయాధికారం కోసం ఇక ఎప్పటికీ శాంతియుతంగానే పోరాడుతూ ఉండటం సాధ్యం కాదు అనే నిర్ణయానికి వచ్చేశారు. ప్రపంచం అప్పటికి కశ్మీర్ గురించి మరచిపోయింది. ప్రపంచ శక్తులకు మారుతున్న వారి వారి ప్రయోజనాలున్నాయి. వారు ఆ ప్రయోజనాల్లో తలమునకలై ఉన్నారు. దీని ఫలితంగా భారత్ చాలా మొండిగా తయారైంది. ఫలితంగా శాంతియుత మార్గాల ద్వారా తమ జన్మహక్కు అయిన స్వయం నిర్ణయాధికారాన్ని పొందటం సాధ్యంకాదు అన్న నిర్ణయానికొచ్చిన కశ్మీరీ యువకులు సాయుధ పోరాట పంథాను ఎంచుకున్నారు. కాబట్టి ఒత్తిడి వల్లనే స్వయం నిర్ణయాధికార హక్కు కోసం సాగుతున్న ఉద్యమం సాయుధపోరాటంగా మారింది."

ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా ఇది కశ్మీరీలు తమ పోరాటాన్ని అర్థం చేసుకునే పద్ధతి. కశ్మీర్‌లోని అలజడికి సంబంధించిన అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే స్థానిక ప్రజలు దానిని ఇప్పటిదాకా శాంతియుతంగా సాగిన తమ స్వయం నిర్ణయాధికార ఆరాటానికి కొనసాగింపుగా భావిస్తారు. స్వయం నిర్ణయాధికారం అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రాజకీయ హక్కు. అంతేగాక జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేకించి ఒకసారి కాదు, పలుమార్లు ఒక వేదిక నుండే కాదు పలు వేదికల నుండి, ఆ హక్కుకు హామీ ఇవ్వడం జరిగింది. ఇక సాయుధ పోరాటం మాటకు వస్తే మిలిటెన్సీ లేక సాయుధ చర్యలు అనేవి 1987కు ముందే అక్కడక్కడ జరిగాయి. 1960ల కాలం నుంచి కూడా 'అల్‌ఫతా' అనే ఒక టెర్రరిస్ట్ సంస్థ కశ్మీర్‌లోయలో చురుకుగా పనిచేస్తున్నదని భారత్ ఆరోపిస్తూ ఉండింది. 1971 జనవరి 30 నాడు గంగ అన్న పేరున్నటువంటి ఒక ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని ఇద్దరు కశ్మీరీ యువకులు లాహోర్‌కు హైజాక్ చేసారు. వారు తమను తాము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ లేక జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ కార్యకర్తలుగా ప్రకటించుకున్నారు. కాని పాకిస్తాన్ ప్రభుత్వమే కాక జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి అయిన జి.ఎం.సాదిక్ కూడా ఇది భారత ఇంటలీజెన్స్ కుట్ర అని భావించారు. బ్రిటిష్ చరిత్రకారుడు అలిస్టైర్ ల్యాంబ్ అభిప్రాయంలో భారత్ ఈ నాటకం వేయడానికి గల కారణం ఏమిటంటే దీనిని ఆసరా చేసుకుని భారత భూభాగం మీద పాకిస్తాన్ విమానాల ప్రయాణాన్ని నిషేధించాలి" అనేటటువంటి ఆలోచన. అప్పట్లో తూర్పు బంగ్లాలో నడుస్తున్న సంక్షోభంలో అటువంటి నిషేధం పాకిస్తాన్‌పైన చాలా

దుష్ప్రభావం వేయగలదు. వేసింది కూడా. ఆ ఆరోపణలు, ప్రత్యారోపణల నిజానిజాలు ఏవిధంగా ఉన్నా ఈ ఘటనలకు కశ్మీర్‌లోని స్థానిక మిలిటెన్సీతో ఎటువంటి సంబంధం లేదు. అప్పటికి నిజానికి అటువంటి మిలిటెన్సీ ఏదీ కూడా కశ్మీర్‌లో లేదు. 1980లలో కొన్ని సాయుధ మిలిటెంట్ గ్రూపులు భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లోను, పాకిస్తాన్‌లోని జమ్మూ కశ్మీర్‌లోనూ, ఇంగ్లాండులోని ప్రవాస కశ్మీరీల్లోను పుట్టినట్టున్నాయి. అమానుల్లా ఖాన్, మగ్బూల్ భట్‌ల పేర్లు ప్రచారంలో వచ్చాయి. వారి మొదటి హింసాత్మక చర్య ఇంగ్లాండ్‌లో జరిగింది. 1984 ఫిబ్రవరి 6వ తేదీన బర్మింగ్‌హామ్‌లోని భారత అసిస్టెంట్ హై కమీషనర్ రవీంద్ర మహత్రేని హతమార్చారు. అతన్ని ఫిబ్రవరి 3వ తేదీన కిడ్నాప్ చేసి భారత్‌లో ఉన్న కశ్మీర్ ఖైదీలను, వారిలో ఒకడైన మగ్బూల్ భట్‌ను విడుదల చేయాలి అనే పెట్టారు. దాంతోపాటు 10 లక్షల పౌండ్ల రొక్కం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లకు భారత ప్రభుత్వం స్పందించకపోయేసరికి 6వ తేదీన మాత్రేని చంపారు. మక్బూల్ భట్ 1966లో సాయుధ బందిపోటు చర్యలో భాగంగా జరిగిన హత్యకేసులో ముద్దాయి. అప్పుడతన్ని పట్టుకోగా అతను తప్పించుకొని పారిపోయి 1976లో దొరికి విచారణ ఎదుర్కొన్నాడు. అతనికి ఉరిశిక్ష వేసారు. కాని ఉరి తీయలేదు. అప్పటికి జైల్లో ఉన్నాడు. రవీంద్ర మహత్రే హత్య తర్వాత హుటాహుటిన అతన్ని 1984 ఫిబ్రవరి 11వ తేదిన ఉరి తీశారు. ఇది మహత్రే హత్యకు ప్రతీకారంగా జరిగింది అనిపిస్తుంది. కశ్మీర్‌లో దీనికి వ్యతిరేకంగా చాలా నిరసన, ఆందోళన వ్యక్తమైంది. గతంలో భట్‌కు ఉరిశిక్ష వేసిన జడ్జిని కశ్మీర్‌లో మిలిటెన్సీ యొక్క తొలి ఘటనల్లో ఒకటయిన చర్యలో చంపడం జరిగింది. అతన్ని ఉరితీసిన ఫిబ్రవరి 11 ఆ తర్వాత లోయలో ఒక అమరవీరుల దినంగా పాటించబడుతుంది.

ఈ క్రమంలోనే జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ లేక జెకెఎల్ఎఫ్ అనే సంస్థ పేరు, దాని నాయకుడైన పాకిస్తాన్‌లోని జమ్మూ కశ్మీర్ నివాసి అమానుల్లాఖాన్ పేరు ప్రచారంలోకి వచ్చాయి. డిసెంబర్ 1989లో అప్పటి కేంద్ర హోంమంత్రి ముఫ్తి మహమ్మద్ సయీద్ కుమార్తె డా॥రుబియాను జెకెఎల్ఎఫ్ కిడ్నాప్ చేసి జైల్లో ఉన్న తమ 5 గురు కార్యకర్తలను విడిపించుకోవడం జరిగింది. 1992 దాకా కశ్మీర్‌లో మిలిటెన్సీలో జెకెఎల్ఎఫ్‌ది పై చేయిగా ఉంది. అయితే జెకెఎల్ఎఫ్ మాత్రమేకాక అల్లా టైగర్స్, అల్ ఉమర్, అల్‌బర్క్, అల్ జీహాద్, అల్ హదీద్, అల్-ఉమర్-ముజాహిద్దీన్, ముస్లిం బ్రదర్ హుడ్, హిజ్‌బుల్ ముజాహిదీన్, ముస్లిం జాన్‌బాజ్, జమాతులే ముజాహిదీన్, ఇక్వానుల్ ముస్లిమీన్, హర్కతుల్ అన్సార్, ఆల్ ఫరాక్ అనే విభిన్నమైన మిలిటెంట్ సంస్థల పేర్లు వినిపిస్తూ వచ్చాయి. కశ్మీర్ మిలిటెంట్లకు పాకిస్తాన్ ఆయుధాలిస్తోందని, తర్ఫీదు ఇస్తోందని భారత్ ఆరోపిస్తూ ఉంది. ఈ విషయాన్ని కశ్మీర్‌లో ఎవరూ కాదనరు. పాకిస్తాన్ కూడ కేవలం మర్యాద కోసమే కాదంటుంది. గట్టిగా అడిగితే పాకిస్తాన్

ఏమంటుందంటే తూర్పు పాకిస్తాన్‌లోని ముక్తిబాహిని మిలిటెంట్లకు ఇండియా 1971 యుద్ధమప్పుడు తర్ఫీదు ఇచ్చింది. తద్వారా పాకిస్తాన్ దేన్నయితే తూర్పు బెంగాల్ యొక్క వేర్పాటువాదం అంటుందో దానికి భారత్ దోహదపడింది. ఆరోపణలు, ప్రత్యారోపణలే ప్రమాణాలుగా తీసుకుంటే ఈ సమాధానంలో తప్పేమిలేదు. ప్రజాతంత్ర దృక్పథం కలవాళ్ళకు మాత్రం ఈ రెండు ఘటనల్లోను ఉన్నటువంటి విలువ “స్వయం నిర్ణయాధికార హక్కు”. అది భారత పాలకులకు నచ్చినపుడు విముక్తి అనీ నచ్చనపుడు వేర్పాటువాదం అనీ అనడానికి వీలులేదు. అంతేకాక శ్రీలంకకు చెందిన తమిళ పోరాటకారులకు తొలినాడు తర్ఫీదు, ఆయుధాలు ఇచ్చింది భారత్ అనేది కూడా వాస్తవమే. నిజానికి ఇక్కడ ఒక ఆసక్తికరమైన పోలిక ఉంది. ‘ఇండియన్ డిఫెన్స్ రివ్యూ’ అనే పత్రిక ప్రచురించిన ఒక పుస్తకంలోని సమాచారం ప్రకారం కశ్మీర్ మిలిటెంట్లకు శిక్షణనివ్వడానికి పాకిస్తాన్‌లో 37 క్యాంపులున్నాయి. అవన్నీ కూడా భారత్‌లోని కశ్మీర్‌కు కొనసాగింపుగా ఉన్నటువంటి కశ్మీరీ భూభాగమైన ఆజాద్ కశ్మీర్‌లో ఉన్నాయి. అదేవిధంగా ఎల్‌టిటిఇ మిలిటెంట్ల తర్ఫీదు కోసం భారత్‌లో 35 క్యాంపులుండేవి. అవన్నీ కూడ భారత్‌లోని తమిళ భూభాగమైన తమిళనాడులో ఉండేవి. కాబట్టి పాకిస్తాన్‌పై నిందవేసే అర్హత భారత్‌కైతే లేదు. ఇంకా షేక్ అబ్దుల్లా అటువంటి మాట అనడానికి అర్హత కలవాడు. ఎందుకంటే నవంబర్ 1973లో పాకిస్తాన్ నాయకుడు జుల్ఫికర్ అలీభుట్టో భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో బందుకు పిలుపునిచ్చినపుడు, షేక్ అబ్దుల్లా మా ఇంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దు అని అతన్ని బహిరంగంగా వారించాడు.

అదేవిధంగా జెకెఎల్ఎఫ్ నాయకులు కూడా హక్కుల సంఘాల బృందంతో మాట్లాడుతూ పదే పదే ఒక విషయం చెప్పారు. తాము తర్ఫీదు పొందుతున్నది, ఆయుధాలు పొందుతున్నది, సరిహద్దుకు ఆవల ఉన్న తోటి కశ్మీరీల నుండే కాని, పాకిస్తాన్ సైన్యం నుండి కాదు అని. ఇక్కడ అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే సరిహద్దుకు అవతల నుంచి సహాయం ఎప్పుడు రావడం సాధ్యమవుతుందంటే ఇక్కడున్న ప్రజల్లో తీవ్రమైన వైమనస్యం, ఇక్కడి పరిస్థితులపట్ల వ్యతిరేకత ఉన్నపుడు. దానిని గుర్తించి దాన్ని ఏ విధంగా సవరించాలో ఆలోచించడం తెలివైనటువంటి మార్గం అవుతుంది. బల్‌రాజ్‌పురి మాటల్లో చెప్పాలంటే నిజమైన ప్రశ్న, చాలాకాలంగా బలహీనులని, పిరికివాళ్ళని పిలవబడుతున్న కశ్మీరీ జాతికి చెందిన యువకులు తుపాకులు పట్టుకొని శక్తివంతమైన భారత రాజ్యానికి అసాధారణమైన రీతిలో ప్రతిఘటన ఏ విధంగా ఇవ్వగలుగుతున్నారు అనేది. ఈ ప్రశ్న వేసుకుని జవాబు చెప్పడం ఉపయోగకరంగా ఉంటుంది. పాకిస్తాన్‌ను నిందించడం కాదు.

1989లో జరిగిన మిలిటెంట్ చర్యలకు పూర్వరంగం 1988లో కశ్మీర్ లోయలో నెలకొన్న విస్తృతమైన అసంతృప్తి. సరిహద్దు అవతల మిలిటెంట్ల తర్ఫీదు ఆ సంవత్సరమే ప్రారంభమైంది. భారత్ ఇంటెలిజెన్స్ వర్గాల అంచనాల ప్రకారం ఆ సంవత్సరం రెండు వందల నుండి మూడు వందలమంది సాయుధ మిలిటెంట్లు లోయలోకి ప్రవేశించారు. సరిహద్దు జిల్లాల్లో రాత్రి కర్ఫ్యూ విధించడం జరిగింది. సరిహద్దు దగ్గర, సరిహద్దు భద్రతాదళం కాల్పులు జరిపిన సంఘటనలు కూడా చాలా జరిగాయి. జెకెఎల్ఎఫ్ నాయకుడు అమానుల్లా ఖాన్, 1988 జూలై 31న కశ్మీరీల పోరాటం సాయుధ పోరాటరూపం తీసుకుంది అని ప్రకటించాడు. 1988-89 సంవత్సరాలలో కశ్మీర్‌లో అనేక సందర్భాలలో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. 1990లో భారత సైన్యం వాటిని బలంగా, పాశవికంగా అణచిపెట్టేదాక ఇటువంటి ప్రదర్శనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ దశలో ప్రధాన మిలిటెంట్ శక్తిగా జెకెఎల్ఎఫ్ ముందుకొచ్చింది. జెకెఎల్ఎఫ్ మొత్తం జమ్మూ కశ్మీర్ రాష్ట్రం భారత, పాకిస్తాన్‌ల ఆక్రమణ నుండి స్వతంత్రం కావాలి అన్న విషయంలో నిర్ద్వందమైన వైఖరి తీసుకుంది. అమానుల్లాఖాన్ 1990లలో పాకిస్తానీ దినపత్రికలకిచ్చిన ఇంటర్వ్యూలలో ఈ విషయాన్ని స్పష్టం చేశాడు.

అతను మరొక విషయం కూడా స్పష్టం చేశాడు. అదేమిటంటే జెకెఎల్ఎఫ్ ఒక లౌకికవాద సంస్థ అని. ఈ రెండు లక్షణాలు కలిగి ఉండడంవల్ల జెకెఎల్ఎఫ్ కు త్వరలోనే పాకిస్తాన్ మద్ధతు తగ్గిపోయింది. ఎందుకంటే ఆ దేశానికి కావలసింది రెండు జాతుల సిద్ధాంతాన్ని సమర్ధించి జమ్మూ కశ్మీర్ విముక్తి అంటూ అయితే దాన్ని పాకిస్తాన్‌లోకి తీసుకురావడానికి ఇష్టపడే పోరాట సంస్థలు. అటువంటి వాటికే పాకిస్తాన్ సహాయమిస్తుంది. పాకిస్తాన్‌కు చెందిన ఎజాజ్ హైదర్ అనే రచయిత 1994 నవంబర్ 25న 'ది నేషన్' దినపత్రికలో ఈ విధంగా అన్నాడు– "కశ్మీర్ వివాదాన్ని సైనిక వ్యూహ పరంగా విలువైన భూభాగానికి సంబంధించిన వివాదంగా మనం, అంటే పాకిస్తానీలం భావించడం వల్ల కశ్మీర్ జాతి యొక్క స్వయం నిర్ణయాధికారానికి మనమిచ్చే మద్ధతు విషయంలో ఒక విచిత్రమైన పరిస్థితిని మనకు మనం కల్పించుకున్నాం. మనం ఏమంటున్నామంటే కశ్మీరీలకు తమ భవిష్యత్తును ఎంపిక చేసుకునే హక్కు ఇవ్వాలి. కాని అది ఎంతవరకంటే వాళ్ళు భారతీయులను బయటికి తరిమేసేటంత వరకే. తర్వాత మాత్రం వాళ్ళకు స్వతంత్రం కావాలా? పాకిస్తాన్‌లో చేరాలా? అనే విషయంలో స్వేచ్ఛలేదు. పాకిస్తాన్‌లో చేరవలసిందే అనేది మనం వారికి ఇచ్చే మద్ధతు యొక్క సారాంశం. ఈ వైఖరి సాంకేతికంగానైనా, నైతికంగానైనా సమర్ధనీయం కాదు". పాకిస్తాన్ కు ఉన్నటువంటి ఈ వైఖరి కారణంగా ఆ దేశం క్రమంగా తన మద్ధతు జెకెఎల్ఎఫ్ నుండి పాకిస్తాన్ అనుకూల, మతవాదసంస్థ అయిన హిజ్‌బుల్ ముజాహి దీన్‌కు మరల్చింది. అంతేకాకుండా

పాకిస్తాన్ భూభాగంలో ఉన్న జెకెఎల్ఎఫ్ కార్యకర్తలను అణచివేయడానికి పాకిస్తాన్ తటపటాయించలేదు. 1992 ఫిబ్రవరి 11న అంటే మక్బూల్ భట్ మరణించిన దినాన అమానుల్లా ఖాన్ ఆజాద్ కశ్మీర్‌లో బయలుదేరి భారత్‌లోని జమ్మూ కశ్మీర్ వైపు ఊరేగింపుగా ప్రజలతో వచ్చాడు. పాకిస్తానీ ప్రభుత్వం కర్ఫ్యూ విధించి కాల్పులు జరిపి పన్నెండుమందిని చంపింది.

ఈ అణచివేత సాగుతున్నప్పటికీ జెకెఎల్ఎఫ్ తన అభిప్రాయాలు మార్చుకోలేదు. హక్కుల బృందంతో మాట్లాడిన ఆ సంస్థనాయకులు యాసిన్ మాలిక్, అల్తాఫ్ హుస్సేన్‌ఖాద్రీ తమ అభిప్రాయాలను స్పష్టంగానే వ్యక్తం చేశారు. జమ్మూ కశ్మీర్ విముక్తి అంటే మొత్తంగా రాష్ట్రాన్ని పునరేకీకరణ చేయడం, మొత్తంగా రాష్ట్రాన్ని భారత్, పాకిస్తాన్‌ల నుండి విముక్తి చేయడం అని వారి అభిప్రాయం. ఇక లౌకికవాదం మాటకు వస్తే అది కశ్మీరీ సంస్కృతిలో, కశ్మీరీ ఆలోచనా విధానంలో భాగం. అది వేరెవరి నుండి నేర్చుకోవాల్సిన అవసరం లేదు. మరొక విషయం కూడా వారికి స్పష్టంగానే అర్థమయినట్టుంది. అది ఏమిటి అంటే భిన్నజాతుల, భాషల, మతాల సమాహారమైన ఆ రాష్ట్రంలో లౌకిక ప్రజాతంత్ర వ్యవస్థ అంటే ఫెడరల్ వ్యవస్థగా కూడా ఉండక తప్పదు. కాబట్టి వారు భావించుకునే రాష్ట్రం ఫెడరల్ వ్యవస్థగా ఉంటుంది. అందులోని జమ్మూ, లదాక్, పూంచ్, కశ్మీర్, బాల్టిస్తాన్ మొదలైన ప్రాంతాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి ఉంటుంది. శ్రీనగర్‌లోని కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార సాధనాలు అనే అంశాలమీద మాత్రమే అధికారం ఉంటుంది.

ఆసక్తికర విషయం ఏమిటంటే పాకిస్తాన్ జెకెఎల్ఎఫ్ బదులు హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను ప్రోత్సహించడం మాత్రమే కాక జెకెఎల్ఎఫ్ కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించడానికి హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను రెచ్చగొట్టింది. 1991 డిసెంబర్ నెలలో ఇస్లామాబాద్‌లో నిర్వహించిన ఒక పత్రికా విలేఖరుల సమావేశంలో అమానుల్లా ఖాన్ ఈ ఆరోపణ బహిరంగంగానే వేశాడు. అంతేకాకుండా జెకెఎల్ఎఫ్ నాయకత్వం మాత్రమే కాక తటస్థంగా ఉన్నటువంటి పరిశీలకులు, పత్రికా విలేఖరులు కూడా నమ్మేదేమిటంటే భారత్ కూడా జెకెఎల్ఎఫ్ పైన అణచివేతను కేంద్రీకరించి జెకెఎల్ఎఫ్ కార్యకర్తలను ఏరివేయడానికి పరోక్షంగా సహకరించడం ద్వారా హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను ప్రోత్సహించింది. జమ్మూ కశ్మీర్‌లో మిలిటెన్సీ ఆవిర్భవించిన తర్వాత 2 సంవత్సరాలకు 1991 డిసెంబర్‌లో ప్రచురించిన తన రిపోర్ట్‌లో 'కమిటి ఫర్ ఇనిషియేటివ్ ఆన్ కశ్మీర్' ఈ విధంగా చెప్పింది – "గత రెండు సంవత్సరాల చరిత్రను చూస్తే భారత ప్రభుత్వం కశ్మీర్ ప్రజలను పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్ల ఒడిలోకి తోయడానికి కుట్ర పూరితంగా ప్రయత్నం చేస్తున్నది అని అర్థమవుతోంది. దీని లక్ష్యమేమిటి అంటే శత్రువునకు తనకు అనుకూలమైనటువంటి రూపం కల్పించడం. పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్లను విదేశీ ఏజెంట్లని, మతవాదులని ప్రచారం చేయడం భారత్‌కు సులభం. ఆ విధంగా కశ్మీర్‌లో

భారత్ అమలు చేస్తున్న నిర్బంధానికి జాతీయ ఆమోదాన్ని పొందడం కూడా సులభమౌతుంది. జెకెఎల్ఎఫ్ లాగా రెండు ప్రాంతాల్లో స్వతంత్రం కోసం పోరాటం చేసే సంస్థమీద చేసే అణచివేతను సమర్ధించుకోవడం భారత్‌కు కష్టమౌతుంది." ఇది నిజానికి అంతకుముందు కాలంలో నేషనల్ కాన్ఫరెన్స్‌కు వ్యతిరేకంగా జమాతే ఇస్లామీని ప్రోత్సహించిన రాజకీయ పోకడకు కొనసాగింపు మాత్రమే. హిజ్‌బుల్ ముజాహిదీన్ జమాతె ఇస్లామీ యొక్క సాయుధ సైన్యం అనేది అందరికీ తెలిసిన విషయమే. అటువైపు జెకెఎల్ఎఫ్ ఒకనాటి నేషనల్ కాన్ఫరెన్స్ ప్రాతినిధ్యం వహించిన కశ్మీరియత్ సంప్రదాయానికి ప్రతినిధి. కాబట్టి జెకెఎల్ఎఫ్ స్థానంలో హిజ్‌బుల్ ముజాహిదీన్‌ను తన శత్రువుగా నిలబెట్టుకోవడం ద్వారా కశ్మీరీలను కలిపి ఉంచే శక్తి స్థానంలో వారిని విడగొట్టే సంస్థను నిలబెట్టడమే కాక భారత్ యొక్క ప్రచారానికి అనుకూలమైన శత్రువును రూపొందించుకోవటం కూడా జరుగుతుంది. కశ్మీరీ జాతీయవాదాన్ని లక్ష్యంగా కలిగిన సంస్థను నైతికంగా దెబ్బతీయడం భారత్‌కు కష్టం. అటువంటి ఉద్యమంపైన, అటువంటి ప్రజలపైన, భారత్‌చేసే యుద్ధాన్ని ప్రపంచం కళ్ళముందు సమర్ధించుకోవడం కష్టం. కానీ కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలపడం కోసం పోరాడే సంస్థను ఎందుకు తాను అణచివేస్తున్నదో ప్రపంచానికి వివరించడం భారత్‌కు సులభమౌతుంది. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో పాశ్చాత్యదేశాలు ఇస్లామిక్ అతివాదం గురించి భయపడుతున్న తరుణంలో భారత్‌కు అది మరింత సులభమౌతుంది. అందువల్లే భారత్ కశ్మీరీ జాతీయవాద శత్రువు స్థానంలో కశ్మీరీ మతవాద శత్రువును కోరుకుంటుంది. కశ్మీర్ మతవాద శత్రువు స్థానంలో ఇస్లామిక్ మత వాద సంస్థను కోరుకుంటుంది. శత్రువుకు ఆ రూపం కల్పించడానికి తాను చేయగలిగింది చేస్తుంది. పాకిస్తాన్ విధానం కూడా అదే దిశగా నడవడం శత్రువులుగా భావించే ఈ రెండు దేశాల లక్ష్యంలో ఏకత ఉంది అని మనకు చూపిస్తుంది.

1989లో మిలిటెంట్ చర్యలు మొదలయ్యాయి. ఆగస్టు 21 నాడు నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు మహమ్మద్ యూసుఫ్ హల్వాయిని చంపారు. సెప్టెంబర్ 14 నాడు భారతీయ జనతాపార్టీ ఉపాధ్యక్షుడు టికాలాల్ టిప్లును కాల్చి చంపారు. నవంబర్ 4వ తేదీన మక్బూల్ భట్‌కు మరణశిక్ష విధించిన సెషన్స్ జడ్జి నీల్‌కంఠ్ గంజూను కాల్చి చంపారు. డిసెంబర్ 8న ముఫ్తి మహ్మద్ సయీద్ కూతురును డా౹౹ రుబియాను అపహరించి జైల్లో ఉన్న 5 గురు జెకెఎల్ఎఫ్ మిలిటెంట్లను విడిపించుకున్నారు. దాంతో కేంద్రం కఠినచర్యలు తీసుకోవాలని నిర్ణయించుకుంది. గవర్నర్‌గా జగ్‌మోహన్‌ను పంపించింది. అతను జనవరి 1990లో పదవి చేపట్టాడు. తను మే 24న వెళ్ళిపోయే లోపల భయానకమైన పరిస్థితిని కల్పించాడు. జగ్‌మోహన్‌ను గవర్నర్‌గా పంపించగానే ఫరూక్ అబ్దుల్లా నిరసనగా రాజీనామా చేశాడు. ప్రజల్లో ఇంత వ్యతిరేకత ఉన్న వ్యక్తిని

గవర్నర్‌గా పంపడంపట్ల అతని నిరసనను రాజీనామా రూపంలో తెలియజేశాడు. అయితే దీని ఫలితంగా జగ్‌మోహన్ రాష్ట్ర వ్యవహారాలపైన సంపూర్ణ అధికారాన్ని పొందాడు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న జనతాదళ్ ప్రభుత్వం భారతీయ జనతాపార్టీ మద్ధతు పైన అధారపడి ఉండింది. భారతీయ జనతాపార్టీ ప్రోద్బలం మేరకే జగ్‌మోహన్‌ను జమ్ము కశ్మీర్ గవర్నర్‌గా పంపించారు అని చాలామంది నమ్ముతారు. జగ్‌మోహన్ బిజెపి నమూనా మనిషి అనడంలో సందేహం ఏమీ లేదు. అతను కశ్మీర్‌ను 'విషపురుగుల లోయ'గా భావించాడు. ఇవి తాను వాడిన మాటలే, మేం చెప్తున్నవి కాదు. తన కర్తవ్యాన్ని తాను ఏ విధంగా అర్థం చేసుకున్నాడు అనంటే "ఒక మతరాజ్యాన్ని ఈ రాష్ట్రంలో ప్రకటించకుండా అడ్డుకోవడం"అని. రాష్ట్రప్రభుత్వం రాజీనామాతో సంతృప్తి చెందకుండా ఆ రాష్ట్ర అసెంబ్లీని కూడా రుద్దు చేసేశాడు. ఎందుకు చేశావు అన్న ప్రశ్నకు స్పష్టంగా ఏం జవాబు చెప్పాడంటే– "పెద్ద ఎత్తున బలప్రయోగం చేయడానికి నైతిక సాధికారత ఉండాలంటే అసెంబ్లీని రద్దు చేయడం అవసరం" అని. అతని ఉద్దేశ్యాల్ని ఈ విధంగా స్పష్టం చేశాడు.

జగ్‌మోహన్ పదవి చేపట్టగానే భారత సైన్యం, సిఆర్‌పిఎఫ్, బిఎస్ఎఫ్ నిత్యం కశ్మీర్‌లోయలో సోదాలు మొదలుపెట్టాయి. ఈ సోదా చేసే క్రమంలో అరెస్టు అయిన వ్యక్తిని అప్పటికప్పుడే కాల్చి చంపడం అనేది చాలాసార్లు జరిగింది. వాళ్ళను కాల్చి చంపేసి ఎదురుకాల్పుల్లో చనిపోయారని ప్రకటించడం మొదలుపెట్టారు. ఈ సోదాల క్రమంలో స్త్రీలపైన లైంగిక వేధింపులు, అత్యాచారాలు జరిగాయన్న ఆరోపణలు చాలా వచ్చాయి. ఎందుకంటే సోదా జరిగేటప్పుడు మగవాళ్ళందరినీ బయటకు రమ్మని ఒకచోట కూర్చోమనేవారు. ఇన్ఫార్మర్లు వాళ్లను దూరం నుంచి చూసి కావలసిన వాళ్ళను గుర్తించేవారు. ఈ లోపల సైనిక బలగాలు స్త్రీలు మాత్రమే ఉన్నటువంటి ఇళ్ళల్లో సోదాకు పోయేవాళ్ళు. ఈ క్రమంలో చాలామంది స్త్రీలను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలొచ్చాయి. ఆర్మీ పాల్పడిన అత్యాచారాలకు నిరసనగా కశ్మీర్ లోయలో చాలా పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. మొదటి నుంచి కూడా కశ్మీర్ ప్రజలలో భావోద్వేగం కల్గించిన విషయాల గురించి అటువంటి ప్రదర్శనలు జరుగుతూనే ఉన్నాయి. కాని 1988 తర్వాత అవి గుణంలోను, రాశిలోను చాలా పెరిగాయి. ఈ ప్రదర్శనలను జగ్‌మోహన్ బలగాలు విపరీతమైనటువంటి తుపాకీల బలప్రయోగంతో ఎదుర్కొన్నాయి. ఈవిధంగా ఎదుర్కొన్నపుడు జరిగిన హత్యాకాండ చాలా అసాధారణ పరిమాణంలో ఉండింది. శ్రీనగర్‌లో గౌకాడల్ ప్రాంతంలో 1990 జనవరి 21 నాడు నిరసన ప్రదర్శిస్తున్న 20 వేల ప్రజానీకం పైన సిఆర్‌పిఎఫ్ జరిపిన కాల్పుల్లో కనీసం 60

మంది చనిపోయారు. మరుసటిరోజు ఈ కాల్పులకు నిరసనగా మళ్ళీ ప్రదర్శన జరుగగా దానిపై మళ్ళీ సిఆర్‌పిఎఫ్ కాల్పులు జరిపి శ్రీనగర్‌లోని హవాల్ ప్రాంతంలో 8 మందిని చంపింది. 1990 మార్చి 1 నాడు 'ఆజాదీ' డిమాండ్ చేస్తూ దాదాపు 5 లక్షలమంది శ్రీనగర్ పైకి ఊరేగింపుగా వచ్చారు. భారతసైన్యం వారిపైన మూడుచోట్ల (శ్రీనగర్ సిటీలోని దాకురా, టెన్గ్‌పురా, షాలిమార్ ప్రాంతాల్లో) కాల్పులు జరిపి బస్ ప్యాసింజర్‌లతో సహా మొత్తం 33 మందిని చంపింది.

1990 మే 24 నాడు మరొక పెద్ద కాల్పుల ఘటన జరిగింది. ఇది గవర్నర్ పదవి నుండి జగ్‌మోహన్‌ను తొలగించడానికి దారితీసింది. ఈ ఘటనకు ముందు మీర్‌వైజ్ ఫరూక్ హత్య జరిగింది. కశ్మీరీ రాజకీయాల్లో అతను మొదటి నుంచి కూడా సెక్యులర్ జాతీయవాద పోకడకు విరుద్ధమైన సనాతనవాద పోకడకు ప్రతినిధిగా ఉన్నాడని చూశాం. అయితే అతను మిలిటెంట్లు పాల్పడుతున్న హత్యాకాండపట్ల నిరసన కూడా వ్యక్తం చేశాడు. అతన్ని చంపింది ఒక మిలిటెంట్ సంస్థేనని చాలామంది అంటారు. అయితే వాస్తవం ఎవరికీ తెలియదు. అతని మృతదేహాన్ని తీసుకుని ఒక బ్రహ్మాండమైన ఊరేగింపు పోతుండగా సిఆర్‌పిఎఫ్ శ్రీనగర్‌లోని ఇస్లామియా కాలేజ్ దగ్గర ఏ కారణమూ లేకుండా కాల్పులు జరిపి 47 మందిని చంపింది. ఈ కాల్పులు ఘటనను ప్రపంచ వ్యాప్తంగా చాలామంది ఖండించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్‌బుష్ (సీనియర్) కూడా భారత ప్రభుత్వానికి సందేశం పంపుతూ ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలపైన ఇటువంటి పాశవిక హత్యాకాండకు పాల్పడవద్దని చెప్పినట్టు తెలుస్తోంది. దీని ఫలితం జగ్‌మోహన్‌ను గవర్నర్ పదవి నుండి తొలగించి గిరీష్ సక్సేనాను తీసుకురావడం. జగ్‌మోహన్‌కు ఉన్నటువంటి సంకుచిత హైందవవాద దృక్పథం కశ్మీర్ లోయలో చేసినటువంటి హాని గురించి ఇప్పటికే చెప్పాం. అయితే ఇది కేవలం ఒక జగ్‌మోహన్‌కే ప్రత్యేకం అని అనుకోవాల్సిన పనిలేదు. భారత రాజ్యాంగ యంత్రంలో ఈ వైఖరి విస్తృతంగా ప్రచారమై ఉంది. అది పాలనా యంత్రాంగంలోనైనా కావచ్చు, సైనిక యంత్రాంగంలోనైనా కావచ్చు. ఒక కశ్మీర్ విషయంలో మాత్రమే కాదు మొత్తంగానే భారతదేశంలో పాలనాయంత్రాంగం, సైనిక యంత్రాంగం, హైందవ దృక్పథాన్ని కాలక్రమంలో అలవర్చుకుంటున్నాయన్న విషయం పౌరహక్కుల ప్రజాస్వామ్య సంఘాలు మత ఘర్షణలపైన ఇచ్చిన రిపోర్టులో గడచిన దశాబ్దకాలంలో చాలాసార్లు ప్రస్తావించాయి. జమ్మూ కశ్మీర్‌లోని పాలన యంత్రాంగం, భద్రతాదళాలు దానికి మినహాయింపు కాదు. కమిటీ ఫర్ ఇనిషియేటివ్ ఆన్ కశ్మీర్, ఇతర హక్కుల సంఘాలు వెలువరించిన నివేదికల్లో కశ్మీర్ ముస్లింలను భారత సైనికులు మతపరమైన పరిభాషలో అవమానపరచిన అనేక ఘటనలను వివరించారు. ఈ దృక్పథంలో కశ్మీరీలు ముస్లింలు, కశ్మీరీలకు భారత్ అంటే ద్వేషం, వారు పాకిస్తాన్ ఏజెంట్లు, వారు వేర్పాటువాదులు, వారు కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో కలపడానికి కృషిచేస్తారు అనేవి ఒకదానికీ మరొక దానికీ ఏ భేదములేని విషయాలు. హైందవ జాతీయవాద ఆలోచనా రీతిలో ఇవన్నీ అవిభాజ్యమైనటువంటి అంశాలు.

కశ్మీరీ ముస్లింలు యొక్క ఆలోచనా రీతిపైన మతవాద ప్రభావం చాలా ఉందని పైన చెప్పాం. అయితే ఇప్పటికీ కూడా దానిది కశ్మీర్‌లో పై చేయి కాదు అనే అన్పిస్తుంది. నిజ నిర్ధారణ కమిటీలతో మాట్లాడిన వాళ్ళలో అత్యధికులు ఆ విషయమే అన్నారు. అభిప్రాయాలు చెప్పినవాళ్ళకు వారి వారి దృక్కోణాలుండవచ్చును. కొంతమంది నిర్దిష్టమైన కశ్మీర్ సంప్రదాయాలపట్ల పక్షపాతం కలిగినవారు కావచ్చు. మరికొందరు సనాతనవాద ముస్లిం ఆలోచనలు కలిగినవారు కావచ్చు. అయితే చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే వీరిలో మొదటి కోవకు చెందినవాళ్ళు నిర్ద్వందంగా, నిస్సంకోచంగా ఏమంటారంటే ఈనాడు కూడా కశ్మీరీల సంస్కృతినీ, ఆలోచనారీతినీ చారిత్రకంగా ఆ లోయలో వస్తున్నటువంటి పీర్ల దర్గాలను ఆవరించి ఉన్నటువంటి కశ్మీరియత్ అనే భావజాలం ప్రభావితం చేస్తుంది అని. సనాతనవాద ఆలోచనారీతి బలంగా ఉన్నట్టు కన్పించడానికి కారణం పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్ల తుపాకులు దానికి అండగా ఉండడమేనని వీరంటారు. కశ్మీరి జాతీయవాద ఆలోచనను విశ్వసించేవారు ఈ విషయంలో నిస్సంకోచంగా మాట్లాడుతూ ఉండగా, సనాతనవాద ఆలోచనలను, పాకిస్తాన్ అనుకూల ఆలోచనలను సమర్ధించేవాళ్ళు అంత నిస్సంకోచంగా, నిర్ద్వంద్వంగా తామే ప్రస్తుత కశ్మీరీల ఆలోచనకు ప్రతినిధులము అని చెప్పుకోరు. ఒక ప్రముఖ హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు, మతవాద మేధావి, భారత్ నుండి స్వతంత్రమైతే కశ్మీర్ భవితవ్యం ఏ విధంగా ఉంటుంది, అది మతరాజ్యంగా ఉంటుందా, లౌకిక రాజ్యంగా ఉంటుందా అంటే సంకోచిస్తూ “అది మేం చెప్పలేం ప్రజలు నిర్ణయం తీసుకోవాలి” అని అంటాడు. ఇవన్నీ చెప్పడంలో ఉద్దేశం ఒక్కటే. భారత్ చేపట్టే ప్రచారంలో చూడడానికి, చెప్పడానికి నిరాకరించే ఒక సత్యాన్ని తెలియజేయడం. ఒకవేళ కశ్మీరీలు గానీ మత ప్రాతిపదికన పాకిస్తాన్‌లో కలవాలని కోరుకుని ఉంటే వారికి ఆ స్వేచ్ఛ ఇవ్వకూడదు అని చెప్పడం ఉద్దేశం కాదు. అటువంటి కోరికగాని వారిలో ఉంటే వారిని అవమానపరచడం, వారి ఆకాంక్షలను అణచివేయడం సమర్ధనీయం అని చెప్పడం ఉద్దేశం కాదు. అయితే హైందవ జాతీయవాద దృక్పథానికి కశ్మీరీ ప్రజానీకం యొక్క ఆకాంక్షను మతపరమైన ఆకాంక్షగా చూపించడమే అనుకూలమైన విషయం. ఎందుకంటే అప్పుడు దానిని నిరాకరించడాన్నీ, పాశవికంగా అణచివేయడాన్నీ భారత ప్రజానీకం ఎదుటనయినా, అసలే ఇస్లాం అంటే భయపడి చస్తున్న పాశ్చాత్యదేశాల ఎదుటనయినా, సమర్ధించుకోవడం భారత్‌కు సులువవుతుంది. ఈ దృక్పథం వాస్తవికతను కూడా తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుంది. దీనికి సంబంధించిన అనేక కోణాలను ఇప్పటికే ప్రస్తావించి ఉన్నాం ఇప్పుడు మరొకటి చూద్దాం.

టికాలాల్ టిప్లు, నీల్‌కంఠ్ గంజుల హత్యల అనంతరం మరికొంతమంది కశ్మీరీలను కూడా లోయలో చంపడం జరిగింది. మిలిటెంట్లేమంటారంటే కేవలం ప్రభుత్వ

ఏజెంట్లను, ఇన్ఫార్లరను మాత్రమే తాము చంపామని. అయితే కశ్మీర్ పండిట్లు మొత్తంగానే అభద్రతకు లోనైన మాట వాస్తవం. వారిలో కొంతమంది లోయను విడిచిపెట్టి వెళ్ళిపొమ్మని బెదిరింపులు కూడా వచ్చాయి. ఈ దశలో గవర్నర్ జగ్‌మోహన్ లోయలో ఎక్కడెక్కడో ఉంటున్న పండిట్లకు రక్షణ కల్పించడం సైనిక బలగాలకు సాధ్యం కాదని ప్రకటించి, వారందరినీ లోయ నుండి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చాడు. వెళ్ళిపోవడానికి అవసరమైన సహాయం ఇస్తామని హామీ ఇచ్చాడు. సహాయం ఇచ్చాడు కూడా. వారిలో చాలామంది వలస వెళ్ళిపోయారు. ఒక మొత్తం ప్రజావర్గానికి రక్షణ కల్పించడం పాలనా వర్గానికి సాధ్యం కాదు అన్న వాదన వినడానికి హేతుబద్ధంగానే ఉంటుంది గానీ జగ్‌మోహన్ మనసులో వేరే ఆలోచనలు ఉన్నాయి. కశ్మీర్ పండిట్లందరూ వెళ్ళిపోతే కశ్మీర్‌లో జరుగుతున్న పోరాటానికి మతం రంగు వస్తుంది. దానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న ప్రచారానికి అది తగిన రంగు. జగ్‌మోహన్ మనసులో ఇదే ఉంది అని భావించడానికి కారణం, హిందూ ముస్లింల మధ్య విభేదాలు తగ్గించడానికీ వారిని దగ్గరకు తీసుకురావడానికీ కొంతమంది ప్రముఖులు చేసిన ప్రయత్నంపట్ల అతను స్పందించిన తీరు. బల్‌రాజ్‌పూరి 1990 మార్చిలో కశ్మీర్ లోయకు వెళ్ళి చాలామంది ముస్లింలతో మాట్లాడారు. వారిలో చాలామంది పండిట్లు మొత్తం వెళ్ళిపోవడం చాలా బాధాకరం అని ప్రకటించారు. రెండు మతవర్గాల ప్రతినిధులూ సంతకాలు చేసిన ఒక ప్రకటన అప్పుడు విడుదల చేసారు. ముస్లింల పక్షాన జమ్మూ కశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన ముఫ్తి బహావుద్దీన్ ఫరూకీ, హిందువుల పక్షాన కశ్మీర్ పండిట్ల నాయకుడైన హెచ్.ఎన్.జట్టో ఆ ప్రకటనపై సంతకం చేశారు. వలసలను ఆపడం ఆ ప్రకటన ఉద్దేశం. చాలామంది ముస్లింలు కూడా లోయను విడిచిపెట్టి పోవద్దని కశ్మీర్ పండిట్లకు విజ్ఞప్తులు చేశారు. పండిట్లలోని అభద్రతా భావాన్ని పోగొట్టడానికి ఈ ప్రకటనలు సరిపోతాయా అనేది వేరే విషయం. ఇక్కడ ఏది ప్రస్తుతం అంటే ఈ ప్రయత్నం సఫలం కాకుండా జగ్‌మోహన్ తీసుకున్న చర్యలు. హెచ్.ఎన్.జట్టోకు ఒక పోలీసు అధికారి ద్వారా జమ్మూకు వెళ్ళిపోవడానికి విమానం టికెట్, విమానాశ్రయానికి తీసుకుపోవడానికి జీపు పంపించి జమ్మూలో నీకు ఒక నివాసం ఇస్తాను వెంటనే వెళ్ళిపో కశ్మీర్ నుంచి అని అతన్ని పంపించి వేశాడు. ఎందుకు ఈ పని చేశావని బల్‌రాజ్‌పూరి, జగ్‌మోహన్‌ను అడగ్గా ఆయన దానికి ఏం కారణం చెప్పాడంటే, కశ్మీరీ గుర్తింపు ఉన్నంతకాలం దాన్ని అమెరికా, పాకిస్తాన్ వాడుకుంటాయి. హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి బ్రతికితే అది సైనిక బలగాల అత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ రెండు అభిప్రాయాలు కూడా ఆసక్తికరమైనవి. కశ్మీరీ గుర్తింపును ధ్వంసం చేయాలి. దాని స్థానంలో ఒక ముస్లిం గుర్తింపును నిలబెట్టాలి. అప్పుడు దాన్ని అణచివేత ద్వారా దుష్ప్రచారం ద్వారా

ఎదుర్కోవడం భారత్‌కు సులభమవుతుంది. హిందువులు, ముస్లింలు దగ్గర కావడాన్ని నివారించాలి. అప్పుడు మూర్ఖులైన ముస్లింలుగా కశ్మీరీ ఉద్యమకారులను చూపించి, వాళ్ళను చంపడానికి సైన్యాన్ని రెచ్చగొట్టడం సులభమవుతుంది. వారు స్వయం నిర్ణయాధికారం కోరుకుంటున్న కశ్మీరీలుగానే సైనిక బలగాలకు కనిపిస్తే అణచివేత అంత సులభం కాకపోవచ్చు.

1995 ప్రాంతంలోనే ఇండియన్ డిఫెన్స్ రివ్యూ అనే ఒక ప్రచురణ సంస్థ, ఒక హైందవ మతవాద సంస్థ కలిసి, కశ్మీర్‌పైన ఒక పుస్తకాన్ని తీసుకొచ్చాయి. ఆ ప్రచురణ వ్యవస్థాపకుడు ఒక మాజీ సైనికాధికారి. దాని సంపాదకుడు మరొక మాజీ సైనికాధికారి. ఈ పుస్తకం తీసుకురావడంలో సైన్యం పూర్తిగా సహకరించింది. ఎందుకంటే వేరే ఎవ్వరికి దొరకని సమాచారం ఆ పుస్తకంలో చాలా ఉంది. ఆ పుస్తకం పేరు "కశ్మీర్ : సందిగ్ధ సరిహద్దు." దీని ప్రచురణను ఆర్థికంగా సాధ్యం చేసింది శ్యాంప్రసాద్ ముఖర్జీ ఫౌండేషన్ అనే మతవాద సంస్థ, దాని పనంతా చేసింది ఇండియన్ డిఫెన్స్ రివ్యూకు సంబంధించిన బృందం. వారికి సహకరించిన వ్యక్తి ఒక రిటైర్డ్ మేజర్ జనరల్. ఆయన పేరు అఫ్సర్ కరీం. ఇంతా చేసి అతను ఆ ఇండియన్ డిఫెన్స్ రివ్యూ యొక్క సంపాదకుడు. తానే సంపాదకుడిగా ఉంటూ తాను ఆ ప్రచురణను తీసుకొచ్చిన టీంలో భాగం కాకుండా సహాయం చేసిన వ్యక్తిగా విడిగా ఎందుకున్నాడో స్పష్టమే. ఎందుకంటే అతను ముస్లిం. ఒక ముస్లిం దీనికి కర్త అని చూపించడం ఆ పుస్తకం యొక్క స్వభావం రీత్యా వారికి చాలా అనుకూలం.

ఈ పుస్తకం సంపాదకులు ఏమంటారంటే జాతీయ గుర్తింపు అనేది వ్యక్తి యొక్క గుర్తింపును, సమాజం యొక్క గుర్తింపును, అత్యున్నత స్థాయికి తీసుకుపోతుంది. వ్యక్తికి దేశం లేక జాతి అనేది తన గుర్తింపు యొక్క అత్యున్నత వ్యక్తీకరణ. వ్యక్తి యొక్క సంపూర్ణ అస్తిత్వానికి జాతి లేక దేశం కేవలం ఒక నిర్వచనం మాత్రమే కాదు. ఆ వ్యక్తి యొక్క అన్ని భాగాల సమాహారం జాతి. మరి వ్యక్తికి అన్నీ అయినటువంటి ఈ జాతికి ప్రతీక ఏమిటి? ఆ జాతికి నిర్వచనం ఏమిటి? ఆ జాతి లేక ఆ దేశం యొక్క భౌతిక స్వరూపం దానిలో అతి ముఖ్య అంశమని ఈ పుస్తకం ప్రచురణకర్తలు అంటారు. తమ జాతిని పౌరులు దేనితో పోల్చుకుంటారు అంటే తమ మనసుల్లో ఉన్నటువంటి చిత్రంతో పోల్చుకుంటారు. సులభంగా చెప్పాలి అంటే స్కూలు దినాల నుంచి చూస్తున్నటువంటి చిత్రపటంతో పోల్చుకుంటారు. జాతి యొక్క సరిహద్దులు, ఏది దాంట్లో భాగము, ఏది దానికి వెలుపల అనేది ఈ చిత్రపటం నుంచే వస్తుంది. చిన్నప్పటి నుంచి చూసినటువంటి ఈ దేశ చిత్రపటం, అది నిర్వచించే జాతీయతా, జాతీయభావం అనే దానికి కేంద్రమైన విషయం. అన్ని ఆశలు, అన్ని ఆకాంక్షలు దానిచుట్టూ అల్లుకుంటాయి.

వేరెవరైనా ఈ మాటలు మాట్లాడితే దానిని అతివాద దేశభక్తి అని కొట్టి పారేయవచ్చు. కాని భారత సైన్యానికి చాలా దగ్గరి వారైన వ్యక్తుల అభిప్రాయం ఇది అని గుర్తించటం అవసరం. జాతి నిర్వచనానికి కేంద్రం దాని చిత్రపటమైనపుడు ఇక జాతి లోపల, లేక దేశం లోపల స్వయం నిర్ణయాధికారం అనేది ఏది ఉండదు. వేర్పాటువాదం మాత్రమే ఉంటుంది అనేది స్పష్టం. అంతేకాకుండా ఆ దేశంలో లేక జాతిలో ఉన్న మెజారిటీ వర్గం సంస్కృతికీ సామాజిక నీతికీ తప్ప వేరే దేనికీ చోటుండదు. అది జాతిపరమైన మైనార్టీ గానీ, భాషాపరమైన మైనార్టీ గానీ, మతపరమైన మైనార్టీ గానీ దేనికీ చోటుండదు. ఈ దృష్టితో చూసినపుడు వారికి జమ్మూ కశ్మీర్ సమస్య ఏ విధంగా కనిపించిందో దిగువ చూద్దాం. బహుశా భారత సైనిక బలగాల తర్ఫీదు ఈ కోణం నుంచే జరుగుతూ ఉంటుందని భావించవచ్చు. వారు ఈ పుస్తకంలో ఒక నాలుగు ముఖ్యమైన విషయాలు చెప్పారు. (1) జమ్మూ కశ్మీర్ యొక్క భూభాగం, దాని నైసర్గిక స్వరూపం, స్వయం ప్రతిపత్తికి గాని స్వతంత్ర రాజ్యానికి గాని వ్యతిరేకమైనది. (2) భౌగోళిక వ్యూహాత్మక ప్రాముఖ్యత దృష్ట్యా భారత్ జమ్మూ కశ్మీర్‌ను వదులుకోలేదు. (3) లోయలోని ప్రజల యొక్క వైమనస్యాన్నీ వేర్పాటువాదాన్ని వేరుచేసి చూడడం భారతీయులు నేర్చుకోవాలి. అయితే జమ్మూ కశ్మీర్‌లో పెరుగుతున్న మిలిటెన్సీకి కారణం ఆర్థిక అభివృద్ధి లేకపోవడమూ కాదు. ఏ రకమైన లేమీకాదు. పాకిస్తాన్ మద్దతు ఇస్తున్నటువంటి టెర్రరిజం, మతవాద ప్రచారం దానికి కారణం. లోయలోని ప్రజానీ కానికీ, సమాజానికీ మరింత డబ్బునిచ్చి, మరింత అభివృద్ధి సాధించాలని ప్రయత్నం చేస్తే అది మరింతగా టెర్రరిజాన్నీ, తిరుగుబాటునూ పెంచుతోంది. (4) కొన్ని రంగాలలో మంచి మాటలు పనిచేయనప్పుడు ఒత్తిడి పెట్టక తప్పదు. ప్రభుత్వంతో సహకరించే వాళ్ళకు మెరుగైన జీవిత పరిస్థితులు లభిస్తాయనీ ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయనీ స్పష్టమైన సందేశం ఇవ్వడం కూడా అవసరం.

ఈ నాలుగే కాక అణచివేత స్వభావం, నయవంచన స్వభావం కలిగిన అనేక ఇతర అభిప్రాయాలు కూడా ఈ పుస్తకంలో ఉన్నాయి. అవి ఏవిధంగా కశ్మీరీల మనసు లను గెలుచుకోవాలో చెప్తాయి. అయితే పై నాలుగు అంశాలను అర్థం చేసుకుంటే ఈ పుస్తకం దృక్పథం అర్థమవుతుంది. ఈ పుస్తకాన్ని రాయడానికి సహకరించిన, దానిలోని భావాలకు ప్రతినిధులైన భారత సైనిక అధికారుల దృక్పథం కూడా స్పష్టంగా అర్థమ వుతుంది.

## ఆట విడుపులేని లోయ

ప్రజలు సాయుధ బలగాలకు, సాయుధ మిలిటెంట్లకు మధ్య ఇరుక్కున్నారని అనడం పరిపాటి. మొత్తం మీద తమ పరిస్థితిని ఈవిధంగా వర్ణించడాన్ని కశ్మీర్ ప్రజానీకం అనుమతించక పోవచ్చు. కశ్మీర్ ప్రజానీకం ఎందుకంటే వారికి మిలిటెంట్లపట్ల ఏ

విమర్శ ఉన్నా, అసంతృప్తి ఉన్నా వారిని తమ స్వాతంత్ర్య పోరాట యోధులుగా చూస్తారు. ఆ స్వాతంత్ర్యం ప్రతి కశ్మీరీ మనసులోని ప్రగాఢమైన కోరిక. కాగా భారత సైనిక బలగాలను శత్రువుగా, తమను అణచివేస్తున్న శక్తిగా చూస్తారు. అయితే కొన్ని మిలిటెంట్ గ్రూపుల కొన్ని చర్యలు సైనిక బలగాల చర్యలతో కలిసి ప్రజలకు సాధారణ సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని లేకుండా చేసిన సందర్భాలు, సాధారణ పౌరస్వేచ్ఛను లేకుండా చేసిన సందర్భాలు ఉన్న మాట వాస్తవం. ఉదాహరణకు చాలా ప్రాంతాలలో సైనిక బలగాలు, పారామిలిట్రీ బలగాలు పాఠశాల భవనాలను తమ క్యాంపులుగా మార్చుకున్నాయి. వారి క్యాంపులుగా ఉన్నాయి కాబట్టి మిలిటెంట్లు వాటిమీద దాడిచేసి వాటిని ధ్వంసం చేస్తున్నారు. లేదా మిలిటెంట్లే పాఠశాల భవనాలను తమ స్థావరాలుగా మార్చుకోవడంవల్ల సైన్యం వాటిని పేల్చివేయడం లేక తగులబెడుతూ వున్నారు. ఇవి రెండు కలిసి కశ్మీర్ లోయలో విద్యావ్యవస్థను ధ్వంసం చేశాయి. 1995 మార్చి 22 నాడు ప్రచురించిన ఒక రిపోర్టులో కశ్మీర్ టైమ్స్ దినపత్రిక గడచిన అయిదు సంవత్సరాలలో కశ్మీర్ లోయలో 300 పాఠశాలలు అగ్నికి ఆహుతి అయ్యాయని రాసింది. అందులో 106 ప్రాథమిక పాఠశాలలు, 65 ప్రాథమికోన్నత పాఠశాలలు, 72 హైస్కూళ్ళు, 27 హయ్యర్ సెకండరీ స్కూళ్ళు వున్నాయి...........లేవు.

కశ్మీర్ లోయలో సినిమా హాళ్ళు లేవు. ఇస్లామిక్ సనాతనవాదాన్ని ఆమోదించే మిలిటెంట్లు వాటిపై నిషేధం విధించారు. కొన్ని సందర్భాలలో సినిమా హాళ్ళను తగలబెట్టడం లేదా పేల్చివేయడం జరిగింది. మిగిలిన సినిమా హాళ్ళను సైన్యం ఆక్రమించుకుని తన క్యాంపులుగాను, విచారణ కేంద్రాలుగాను మలచుకుంది. కశ్మీర్‌లో ఒకప్పుడు చాలా శక్తివంతమైన గ్రామీణ నాటక సంప్రదాయం ఉండేది. జమాతే ఇస్లామీ భావాలకు అనుకూలంగా ఉన్నటువంటి గ్రామీణ అధ్యాపకులు, గ్రామీణ ప్రాంత విద్యావంతులు, ఈ నాటకరంగాన్ని వ్యతిరేకించేవారు. అయితే వారు దాన్ని పూర్తిగా ధ్వంసం చేసే ప్రయత్నం చేయలేదు. కాని మిలిటెన్సీ మొదలయిన తరువాత అటువంటి సాంస్కృతిక కార్యకలాపాలు మొత్తంగా ఆగిపోయాయి. కర్ఫ్యూ అనేది అధికారికంగా ప్రకటించినా, ప్రకటించకున్నా చీకటిపడ్డ తర్వాత ఎటువంటి ఆటంకం లేనటువంటి యుద్ధభూమి ఉండాలని ఇటు భద్రతాదళాలు అటు మిలిటెంట్లు కూడా కోరుకుంటారు. చీకటిపడ్డ తర్వాత బయటికొచ్చే సాహసం చేసే వారెవరైనా ఏ తూటాకో, ఏ గ్రేనేడ్‌కో బలి అయ్యే ప్రమాదం ఉంటుంది. అందువల్ల రాత్రిపూట నాటకాల ప్రదర్శన సాధ్యంకాదు. ఈవిధంగా ప్రజల యొక్క సామాజిక సాంస్కృతిక జీవితాన్ని మొత్తంగా బంద్ చేయడం వారి దీర్ఘకాల అభివృద్ధి మీద చెడు ప్రభావాన్ని వేయగలుగుతుంది అని పెద్దగా వివరించి చెప్పనవసరం లేదు.

ఒకవైపు మిలిటెంట్లు, మరొకవైపు భారత సాయుధ బలగాల ఒత్తిడి మధ్యన నలిగిపోతున్న సామాజిక వ్యవస్థల్లో పత్రికారంగం ఒకటి. 1990లో జగ్‌మోహన్ గవర్నర్‌గా ఉన్నపుడు పత్రికారంగం గొంతునొక్కడానికి టీవి ఛానల్స్ మీద పూర్తిగా నిషేధం విధించడానికి ప్రయత్నం చేశాడు. కశ్మీర్ నుండి ఏ వార్తలు బయటికి పోవాలి అనేది అతను నిర్ణయించేవాడు. 1990 జనవరి 26న విదేశీ జర్నలిస్టులందరిని కూడా కశ్మీర్ లోయ నుంచి బయటికి పంపించేశారు. ఏప్రిల్ 16 నాడు అఫ్తాబ్, ఆజాన్, అల్‌సఫా అనే మూడు ఉర్దూ దినపత్రికలను మూసేయమని ఆదేశం జారీ చేశారు. జూన్ 1990లో బి.బి.సి. శ్రీనగర్ రిపోర్టర్ యూసుఫ్ జమీల్‌ను సైనిక బలగాలు ఒకరోజు అపహరించి తీసుకుపోయారు. ఆ తర్వాత 1992 ఫిబ్రవరి 18న, మళ్ళీ మార్చి 31న అతని ఆఫీసు మీద గుర్తు తెలియని వ్యక్తులు గ్రనేడ్స్ వేశారు. 1995లో అతని ఆఫీసులో ఒక పార్శిల్ బాంబు పేలి అతనికీ మరో ఇద్దరు సహచరులకూ గాయాలైనట్టుగా వార్తలొచ్చాయి. 1991 ఏప్రిల్ 23న అల్‌సఫా పత్రిక సంపాదకుడు మహ్మద్ షాబాన్ వకీల్‌ను హత్య చేశారు. ప్రభుత్వం హత్య చేయించిందని మిలిటెంట్లు, మిలిటెంట్లు చేయించారని ప్రభుత్వం పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. మిలిటెంట్ గ్రూపులు తమ ప్రకటనలు సక్రమంగా రావడం లేదనో, లేదా తమను విమర్శించే వార్తలు వస్తున్నాయనో అల్‌సఫా, శ్రీనగర్ టైమ్స్, అఫ్తాబ్ అనే మూడు ఉర్దూ పత్రికలను బలవంతంగా మూసేయించారు. 1995లో జూలై 10 నుంచి ఆగష్టు 3 దాకా శ్రీనగర్‌లోని పత్రికలన్నీ ప్రచురణను ఆపేశాయి. ఈ సమస్యకు మూలం ఏమిటంటే కుకాపరే నాయకత్వంలోని ఇఖ్వానుల్ ముస్లిమూన్ అనే సంస్థ తన ప్రకటనలను పత్రికలు సక్రమంగా ప్రచురించడం లేదని కినుక వహించడమే. అప్పుడప్పుడే ఉనికిలోకి వచ్చిన ఈ సంస్థ సైనిక బలగాల పోషణలో ఉందని అందరు గుర్తించారు. ఈ సంస్థకు చెందిన మిలిటెంట్లు నలుగురు జర్నలిస్టులను కిడ్నాప్ చేశారు. వీరు గ్రేటర్ కశ్మీర్ పత్రికకు చెందిన భషీర్ మన్సర్, కాజీమొసుర్, షఫాత్ మట్టూ, నిదాయిమష్రిక్ పత్రికకు చెందిన అబ్దుల్ రషీద్. వారిని జూలై 6వ తేది సాయంత్రం గం॥8.30 ని॥ల సమయంలో శ్రీనగర్ నడిబొడ్డున ఉన్న ప్రతాప్ పార్క్‌లోని వారి కార్యాలయాల నుంచి కిడ్నాప్ చేయడం జరిగింది. వారినొక వ్యాన్‌లో బారముల్లా జిల్లాలోని హజమ్ గ్రామానికి తీసుకుపోయారు. శ్రీనగర్‌లో కాని దారిలో ఎక్కడా కూడా ఏ చెక్‌పోస్ట్ దగ్గర కూడా వ్యాన్‌ను సైనిక బలగాలు ఆపకపోవడాన్ని గమనించి కిడ్నాప్ అయిన జర్నలిస్టులు ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత వారిలో ఇద్దరిని ఒక పత్రికా ప్రకటన చేతిలో పెట్టి వెనకకు పంపించారు. ఆ పత్రికా ప్రకటన అన్ని పత్రికల్లో పూర్తిగా ప్రచురించాలనీ లేకపోతే మిగిలిన ఇద్దరినీ చంపేస్తామనీ అన్నారు. వారు ఆశించినట్టే ఆ ప్రకటనను పూర్తిగా అన్ని పత్రికలూ

ప్రచురించాయి. పత్రికా విలేకరులను వారు విడుదల చేశారు. దీనికి నిరసనగా జూలై 10 నుంచి ఆగస్టు 3 వరకు లోయలోని అన్ని పత్రికలూ బంద్ పాటించాయి.

జమ్మూ కశ్మీర్‌లో భారత రాజ్యం, ఒకప్పుడు పంజాబ్‌లో ఉపయోగించిన వికృతమైన అణచివేత ప్రయోగాన్ని చేపట్టింది. సైనిక బలగాలకు లోబడి వారికి అనుకూలంగా వ్యవహరించిన సాయుధ ముఠాలను స్థానిక సమాజం నుంచే తయారుచేసింది. వాటిలో అతి పెద్దది కుకాపరే నాయకత్వంలోని ఇఖ్వానుల్ ముస్లిమూన్. కుకాపరే ఒకప్పుడు వృత్తిరీత్యా గాయకుడు. ఆలిండియా రేడియోలో అతని పాటలు వినిపించేవారు. అతని రికార్డులిప్పటికీ ఆలిండియా రేడియోలో ఉన్నాయని అంటారు. 1995 నాటికి అతను సైనిక అనుకూల మిలిటెంట్ అయ్యాడు. లోయలోని ప్రధాన మిలిటెంట్ గ్రూపు అయిన హిజ్‌బుల్ ముజాహిదీన్‌కు తనను తాను శత్రువుగా ప్రకటించుకున్నాడు. హిజ్‌బుల్ ముజాహిదీన్ తన ప్రధాన శత్రువు అనీ, భారతసైనిక బలగాలతో తనకు ఏ శత్రుత్వము లేదు అనీ అతను చెప్పుకున్నాడు. అతని సంస్థ బలంగా ఉన్నది బారముల్లా జిల్లాలో. అక్కడ ఇఖ్వానుల్ ముస్లిమూన్ మిలిటెంట్లు బహిరంగంగానే బలవంతపు వసూళ్లకు, బెదిరింపులకు పాల్పడుతుంటారనీ సైనిక బలగాలు చూసి చూడనట్టు పోతుంటాయనీ ప్రజలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఆశ్రయమిచ్చి ప్రభుత్వానికి ప్రధాన శత్రువైన మిలిటెంట్ గ్రూపులపైన దాడులు చేయడానికి స్వేచ్ఛ పొందిన ఒక పౌర బృందం సమాజంలో ఉండటం చాలా ప్రమాదకరమైన విషయం. పంజాబ్‌లో ఇటువంటి ఎత్తుగడలను భారతసైనిక బలగాలు ప్రయోగించారు. దాని దుష్ఫలితాలు బాగా చూశాం. ప్రభుత్వం ఆశ్రయమిచ్చిన బృందం ఒక నేరస్తుల ముఠాగా మారి ప్రజలకు చాలా హాని చేయగలదు. అటువంటి బృందాలను సైనిక బలగాలు తమకు ఇబ్బందికరమైన వ్యక్తులను, ఉదాహరణకు మానవహక్కుల కార్యకర్తలను చంపడానికి వాడుకోవడం కూడా జరుగగలదు. సైన్యమే ఇటువంటి కార్యకర్తలను చంపితే చాలా గగ్గోలు అవుతుంది. కాబట్టి వీరిని వాడుకుని చంపడం అనుకూలంగా ఉంటుంది. ఇటువంటి ఒక ఉదాహరణ కుప్వారా జిల్లాలోని కోటర్‌ఖండ్ గ్రామంలో డివిజన్ ఫారెస్ట్ ఆఫీసర్ మహమ్మద్ అష్రాఫ్ దార్ హత్య. ఇతను చాలా నిజాయితీ గల ఆఫీసరనీ, స్థానిక అడవుల్లో కొందరు తుపాకులు పట్టుకున్న వ్యక్తులు సైనిక బలగాలు చూస్తుండగా కలపను తీసుకుపోయి అమ్ముకుంటున్న వైనాన్ని పై అధికారులకు ఫిర్యాదు చేశాడనీ అంటారు. కుప్వారా జిల్లా ఎస్పీ, కలెక్టరు అటవీశాఖ డివిజినల్ కమీషనర్ అతనితో కూర్చొని అతనిచ్చిన ఫిర్యాదులపై మాట్లాడారట. ఆ తర్వాత కొద్ది రోజులకు, 1995 ఏప్రిల్ 5వ తేదీనాడు కుకాపరే గ్రూపుకు చెందిన కొందరు గుర్తు తెలియని సాయుధ దుండగులు మహమ్మద్ అష్రాఫ్ దార్‌ను చంపారు. ఇటువంటి గ్రూపులు మొత్తం ఆరు 1995 నాటికి భారతసైన్యం పోషణలో లోయలో ఉన్నాయి. భారతదేశానికి చెందిన

పత్రికలు కూడా సైన్యం ఈ విధంగా సాయుధ గ్రూపులను పోషిస్తూ ఉంది అనే విషయాన్ని ధృవీకరించాయి.

1995 సెప్టెంబర్ 3 నాటి సంచికలో బిజినెస్ స్టాండెర్డ్ ఈ విధంగా అంటుంది. : "ఇఖ్వానుల్ ముస్లిమూన్‌కు ప్రభుత్వం మద్ధతు ఉంది. గత కొద్దినెలల్లో సైనిక బలగాలకు చేదోడు వాదోడుగా చెప్పుకోదగ్గ పరిమాణంలో తన సంఖ్యను పెంచుకుంది. వీరికీ, సైన్యానికీ లంకె ఉందనేది చాలా స్పష్టమైన విషయం. గత బుధవారం నాడు లార్ గ్రామం నుంచి ఇద్దరు సైనిక జవాన్ల సరసన కొంతమంది యువకులు తుపాకులు పట్టుకొని నడచిపోతూ ఉండడం మా విలేఖరి కళ్ళారా చూశాడు." ఇదే విషయం మీద 1995 నవంబర్ 3 నాటి సంచికలో 'ఫ్రంట్‌లైన్' ఈ విధంగా చెప్పింది : "అనంత్‌నాగ్ పోయే దారిలోనే మేము మా వాహనాల్లో పోతూ ఉండగా చాలామంది ప్రజలు కుకాపరే గురించి మాకు చెప్పారు. కిందటి రాత్రి సైన్యం సోదా నిర్వహించిందని కుకాపరే మనుషులొచ్చి మా పిల్లవాళ్ళను తీసుకుపోయారు అని చాలామంది చెప్పారు. దీన్నిబట్టి సోదా చేసేటప్పుడు సైనిక బలగాలకు ఈ సాయుధ బృందం కూడా తోడుగా వ్యవహరిస్తుందని అర్ధమవుతుంది." హోంశాఖకు చెందినటువంటి ఒక సీనియర్ అధికారి దీన్ని వివరిస్తూ అవుట్‌లుక్ పత్రికలో చేసిన వ్యాఖ్యను ఆ పత్రిక 1995 అక్టోబర్ 18 నాడు ప్రచురించింది. "ఇన్నాళ్ళు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ కశ్మీర్‌లో పరోక్ష యుద్ధం చేయడానికి డబ్బులు, ఆయుధాలు పౌరులకిస్తూ ఉంది. మేము అదే మార్గాన్ని అనుసరించాలని ఎంచుకున్నాము. దేశ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని కాపాడడానికి ఇది చిన్న మూల్యం మాత్రమే" అని ఆయన అన్నాడు.

భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కొందరు మిలిటెంట్లు సాధారణ ప్రజలపైన అత్యాచారాలకు పాల్పడినట్లు కొన్ని ఘటనలు కూడా పత్రికలు ప్రచురించాయి. స్త్రీలను రేప్ చేసినట్టు, బలవంతపు వసూళ్ళు చేసినట్టు, చంపినట్టు కూడా పత్రికలు రాశాయి. వీటి గురించి ప్రజలతో మాట్లాడగా అత్యాచారాలకు సంబంధించిన వార్తలు అతిశయోక్తులు గాని మిగిలినవి జరుగుతున్నాయని ప్రజలు అన్నారు. కశ్మీర్ లోయలోని హిందువులు ఆ లోయలో పెరుగుతున్న మిలిటెన్సీ బాధితుల్లో ఒకరు. కశ్మీర్ జనాభాలో పెద్ద సంఖ్యలో ఎప్పుడూ లేరుగానీ కశ్మీరీ సామాజిక జీవితంలో వారి ప్రాముఖ్యం వారి జనాభా దామాషాను మించి ఉండింది. 1981 జనాభా లెక్కల ప్రకారం కశ్మీర్ లోయలో పండిట్ల జనా 3.95 శాతం, ముస్లింలు 94.96 శాతం. వారి జనాభా దామాషా ఇంతకంటె ఎక్కువ ఎప్పుడు లేదు. ఇంత తక్కువ జనాభా ఉన్నప్పటికీ లోయలోని తెల్లబట్టల ఉద్యోగాల్లోనూ, అధ్యాపక ఉద్యోగాల్లోనూ వీరి సంఖ్య

గణనీయంగా ఉండింది. అంతేకాకుండా చెప్పుకోదగ్గ సంఖ్యలో భూస్వాములు ఉండేవారు. అయితే సాధారణ రైతాంగం కూడా వారిలో కొందరుండేవారు. ప్రస్తుతం జరిగిన వలసవల్ల అత్యధికంగా భాదితులైన వాళ్ళు గ్రామీణ ప్రాంతాల సాధారణ పండిట్ రైతాంగం. పండిట్‌లకు కశ్మీరీ జాతీయ ఉద్యమంపట్ల మొదటి నుండి కూడా ఒక ద్వంద్వ వైఖరి ఉండిందని పైన చూశాం. వారిలో చాలామంది షేక్ అబ్దుల్లా చేపట్టిన సామాజిక ఆర్థిక సంస్కరణలపట్ల వ్యతిరేక వైఖరి తీసుకున్నట్లు కూడా చూశాం. కాలక్రమంలో వారిలో తమకు అన్యాయం జరుగుతూ ఉందనీ ఉద్యోగాలు, ఇతర సౌకర్యాల విషయంలో తమ న్యాయబద్ధమైన వాటా తమకు దక్కడం లేదనీ నిరసన పెరిగింది. ఇవన్నీ కూడా ముస్లింలు తీసేసుకుంటున్నారని వారు భావించారు. నిజానికి చెప్పుకోదగ్గ విషయం ఏందంటే కశ్మీరీ నాయకత్వం ముస్లింలను తీవ్రమైన సామాజిక అన్యాయం నుంచి పైకి తీసుకురావడానికి ప్రయత్నం మొదలు పెట్టిన 40 సంవత్సరాల తర్వాత కూడా వారు సాపేక్షంగా పండిట్ల కంటే వెనుకబడి ఉండిపోయారు. ఉదాహరణకు 1981 జనాభా లెక్కల ప్రకారం జమ్మూ కశ్మీర్ రాష్ట్రం మొత్తం మీద ముస్లింలు 64.19 శాతం, హిందువులు 32.24 శాతం ఉన్నారు. అయితే ఉద్యోగాల విషయం తీసుకుంటే 1987 లెక్కల ప్రకారం ముస్లింలు గెజిటెడ్ ఆఫీసర్లలో కేవలం 41.71 శాతం, గ్రూప్ – , గ్రూప్ – ఉద్యోగాలలో 56.24 శాతం ఉన్నారు. కేవలం గ్రూపు – సిబ్బందిలో మాత్రమే ముస్లింలు తమ జనాభా దమాషా కంటె ఎక్కువగా, 65.52 శాతం ఉన్నారు.

అయితే పండిట్లలో తమ భూమి, తమ ఉద్యోగాలు ముస్లింలు తీసేసుకుంటున్నారని కొంత నిరసన ఉన్నప్పటికీ మొత్తం మీద కశ్మీరీ సంప్రదాయమైన సహనము, శాంతి, సహజీవనం అనేవి సామాజిక శాంతిని కాపాడడానికి ఉపయోగపడ్డాయి. పైన చెప్పినట్టు కశ్మీర్‌లో ఎప్పుడూ కూడా మత ఘర్షణలు జరగలేదు. తక్కిన ఉపఖండమంతటా కూడా పెద్ద ఎత్తున ఘుర్షణలు జరగలేదు. తక్కిన ఉపఖండమంతటా కూడా పెద్ద ఎత్తున ఘర్షణలు జరుగుతున్నప్పుడు కూడా కశ్మీర్ ప్రశాంతంగానే ఉంది. 1986లో మొట్టమొదటసారిగా అనంత్‌నాగ్ జిల్లాలో మతఘర్షణలు జరిగాయి. కొన్ని దేవాలయాల విధ్వంసం కూడా జరిగింది. ఇదంతా కూడా లోయలోని కాంగ్రెస్ అనుకూల రాజకీయ కుట్రలు అని కశ్మీరీలు అంటారు. అయితే చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే శాంతి నెలకొల్పడానికి చేసిన ప్రయత్నాలు కొంతమేరకు ఫలించి హిందువుల్లోని అభద్రతాభావం తగ్గింది. ఈ వాతావరణంలోనే 1989–90లలో కశ్మీర్‌లోయలో మిలిటెన్సీ ముందుకొచ్చింది. పైన చూసినట్టు కొంతమంది ప్రముఖ హిందువులను చంపడం జరిగింది. ఆజాదీ కోసం అంటే

స్వాతంత్ర్యం కోసం జరిగిన భారీ ఊరేగింపులలో కొద్దిమంది మత స్వభావం కలిగిన నినాదాలిచ్చిన విషయం కూడా చూశాం. మిలిటెంట్లు తాము ఎవ్వరినీ కేవలం హిందువులైనందుకు చంపలేదనీ ప్రభుత్వ ఏజెంట్లు, ఇన్ఫార్మర్లను మాత్రమే చంపడం జరిగిందనీ అన్నారు. 1995కు పూర్వం కేవలం హిందువులు కాబట్టి చంపిన ఒకే ఒక ఘటన 1993 ఆగస్టు 14న జరిగింది. జమ్మూకు పోతున్న ఒక బస్సు నుంచి 15 మంది హిందూ ప్రయాణీకులను కిందికి దించి కాల్చి చంపటం జరిగింది. అయితే ఆ హత్యను హిజ్‌బుల్ ముజాహిదీన్, జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ రెండూ కూడా ఖండించాయి. బహిరంగ ప్రదేశాల్లో బాంబులేసి అమాయకులను చంపిన ఘటనలు కూడా జమ్మూ ప్రాంతంలో జరిగాయి తప్ప కశ్మీర్ లోయలో అప్పటికి జరగలేదు. అయినప్పటికీ కొంతమంది పండిట్లను చంపడమంటూ జరిగింది కాబట్టి మొత్తంగా ఆ వర్గం మనుషుల్లో అభద్రతాభావం నెలకొన్న మాట వాస్తవం. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, మిలిటెంట్లచే చంపబడ్డ వారి విషయంలో పండిట్ల సంఖ్య కంటె ముస్లింల సంఖ్య చాలా రెట్లు ఎక్కువ ఉంది. వాళ్ళను కూడా ప్రభుత్వ ఏజెంట్లు అని చెప్పి మిలిటెంట్లు చంపారు. ఏమైతేనేం పండిట్ల మనసుల్లో ఉన్న నిజమైన అభద్రతాభావాన్ని పాలనా యంత్రాంగం తన ప్రచార ప్రయోజనాల కోసం వాడుకుంది. వాళ్ళందరినీ లోయ నుంచి బయటకి పంపించే ఏర్పాట్లు చేసింది. పైగా వాళ్ళకు ఏం చెప్పారంటే కొన్ని వారాల గడువులో మిలిటెన్సీని అణచివేయడం జరుగుతుందనీ వాళ్ళంతా తిరిగి వచ్చేయవచ్చుననీ హామీ ఇచ్చారు. ఎంతమంది ఈవిధంగా వలసపోయారు అన్న విషయం వివాదాస్పదంగానే ఉంది. 1990లో మొత్తంగా లోయలో హిందువుల జనాభా 1.6 లక్షలకంటె ఎక్కువ ఉండడానికి వీలులేదని గణాంక వివరాలు చెబుతూ ఉండగా దాదాపు రెండున్నర లక్షలమంది పండిట్లు వలస వెళ్ళారని చాలామంది అంటూ ఉన్నారు. దానికి వాళ్ళు చెప్పే కారణం ఏమిటంటే 1981 జనాభా లెక్కలు సరైనవి కావు అని.

భారత రాజ్యాంగ యంత్రం కశ్మీర్ సమస్యను మతపరమైనదిగా చెయ్యెత్తి చూపించడంలో విజయం సాధించిందని చెప్పడానికి ఒక తార్కాణం, జమ్మూలోని కాందిశీకుల శిబిరాలలో ఉంటున్న పండిట్లలో పనిచేస్తున్న పనూన్ కశ్మీర్ సంస్థ ప్రతినిధుల వైఖరి. కశ్మీర్ ముస్లింలకు, కశ్మీరీ సంప్రదాయానికి మధ్య ఎడబాటు ఎప్పుడు వచ్చిందని ఒక పనూన్ కశ్మీర్ కార్యకర్తను అడుగగా ఆయన "ప్రవక్త మహ్మద్ పుట్టుకతోనే సమస్య ప్రారంభమైంద"ని జవాబు చెప్పాడు. మరొకవైపు జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ పండిట్లందరూ కూడా భవిష్యత్ కశ్మీర్ రాజ్యంతో సమాన పౌరులుగా ఉండాలని అంటూనే ఉంది. వారిని తిరిగి లోయలోకి రమ్మని పిలుపునిస్తూనే ఉంది. వలస వెళ్లేటటువంటి

పండిట్లలో కొంచెం బాగున్న పట్టణ ప్రాంతాలవాళ్ళు జమ్మూలోను, ఇతర ప్రాంతాల్లోను ఉద్యోగాలలో లేక వ్యాపారాలు పెట్టుకుని బతుకుతున్నారు. ఎక్కువ భాగం గ్రామీణ రైతాంగమైన ఒక పదివేల కుటుంబాలు 1995 నాటికి జమ్మూ నగరంలో క్యాంపులలో నివసిస్తున్నారు. అక్కడ వారి జీవితాలు దుర్భరంగా ఉన్నాయి. లోయలో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నవాళ్ళకు ఇక్కడ జీతాలిస్తున్నారు. ఇతరులకు కుటుంబానికి నెలకు 1500 రూపాయలు దాంతోపాటు కొంత తక్కువ ధరకు బియ్యము ఇవ్వడం జరుగుతుంది. భారతదేశంలో కాందీశీకులెవ్వరినీ కూడా ఈ మాత్రం బాగా కూడా చూసుకున్నది లేదు. ఉదాహరణకు మిలిటెంట్ల బెదిరింపులవల్ల లోయ నుంచి బయటికి వలస వెళ్ళిపోయిన ఎనిమిది వందల ముస్లిం కుటుంబాల బాగోగుల గురించి కానీ వారు ఎక్కడ ఉన్నారనే విషయం గానీ ఎవరికి తెలియదు. అయితే జమ్మూలోని కాందీశీకుల శిబిరాలలోని జీవిత పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. ముఠా క్యాంపులో కుటుంబాలకు కుటుంబాలు అప్పట్లో ఒకే ఒక గదిలో నివసిస్తున్నాయి. తాగేనీటి వసతి గాని, విద్యా వైద్య వసతి గాని వారికి లేవు. జమ్మూలోని మధ్యతరగతి ఈ కాందీశీకులపట్ల ఏమంత స్నేహభావాన్ని వ్యక్తం చేయడం లేదు. జమ్మూలోని పాలనా యంత్రాంగం కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తూ ఉంది.

## హింస రచన

కశ్మీర్ లోయలోని హింస పరిమాణం ఊహించడం కూడా కష్టం. 1947 తర్వాత భారతదేశంలో అత్యధికంగా రాజ్యహింసను, అత్యాచారాలను అనుభవించిన ప్రాంతం కశ్మీర్ అని హక్కుల ఉద్యమంతో అనుభవజ్ఞులైన వారెవరయినా ఒప్పుకుంటారు. ఇక్కడ అణచివేత లేక నిర్బంధం అనేది కొద్దిమందిగా ఉన్న మిలిటెంట్లను అణచివేయడం కోసం కాదు. మిలిటెంట్లకు మద్దతు ఇస్తున్న ఒక విశాలమైన ప్రజా బాహూళ్యాన్ని అణచడం కోసం. కేవలం కశ్మీరీ అయినందుకే ప్రతీ కశ్మీరీ కూడా ఈ అణచివేతకు గురికావడం జరుగుతుంది.

ప్రాణ నష్టం ఎంతగా జరిగిందో చూపించడానికి మచ్చుతునకగా ఇక్కడొక పట్టిక ఇస్తున్నాం. ఇది 1995 సెప్టెంబర్ నెలలో కశ్మీర్‌లో పర్యటించిన హక్కుల సంఘాల బృందం సేకరించినది. ఆ సంవత్సరం మొదటి 7 నెలల్లో కశ్మీర్‌లో జరిగిన హత్యల గణాంకాలు ఈ పట్టిక తెలియజేస్తుంది. ఆ 7 నెలల్లో మొత్తం 2230 మంది హతమయ్యారు.

| నెల | సైనికబలగాలు చంపినవారి సంఖ్య | మిలిటెంట్లు చంపినవారి సంఖ్య | మొత్తం |
|---|---|---|---|
| జనవరి | 146 | 43 | 189 |
| ఫిబ్రవరి | 200 | 48 | 248 |
| మార్చి | 188 | 38 | 226 |
| ఏప్రిల్ | 379 | 18 | 397 |
| మే | 298 | 80 | 378 |
| జూన్ | 343 | 58 | 401 |
| జూలై | 231 | 160 | 391 |
| మొత్తం | 1785 | 445 | 2230 |

1989 నుండి లెక్కిస్తే 1995 నాటికి 20,000 మంది చనిపోయారని అంచనా. ఇది ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వేసిన అంచనా. హురియత్ కాన్ఫరెన్స్ వంటి కశ్మీరీ సంస్థలు మృతుల సంఖ్యను 40,000 అని అంచనా వేసాయి. అందులో అత్యధికం సైన్యం చేతిలో చనిపోయినవారేనని పై పట్టిక సూచిస్తుంది. సైన్యం చేతిలో జరిగే మరణాలలో కస్టడీ మరణాలు, ఎదురు కాల్పులలో మరణాలు, ప్రదర్శనలపైన జరిపిన కాల్పులలో సంభవించే మరణాలు అనేవి స్థూలంగా మూడు రకాలు.

'కశ్మీర్ మానిటర్' అనే స్థానిక హక్కుల సంస్థ ప్రచురణను, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రచురించిన గణాంకాలనూ జతచేసినట్టయితే 1990 నుండి 1995 ఏప్రిల్ దాకా మొత్తం 809 మంది సైన్యం కస్టడీలో మృతిచెందినట్టు తెలుస్తుంది. సంవత్సరం వారీగా గణాంకాలు ఈవిధంగా ఉన్నాయి.

| సంవత్సరం | కస్టడీ మరణాల సంఖ్య |
|---|---|
| 1990 | 37 |
| 1991 | 47 |
| 1992 | 248 |
| 1993 | 253 |
| 1994 | 176 |
| 1995 (ఏప్రిల్ దాకా) | 54 |
| మొత్తం | 809 |

INSTRUMENT OF ACCESSION OF ....JAMMU AND KASHMIR STATE

WHEREAS the Indian Independence Act, 1947, provides that as from the fifteenth day of August, 1947, there shall be set up an independent Dominion known as INDIA, and that the Government of India Act, 1935, shall, with such omissions, additions, adaptations and modification as the Governor-General may by order specify be applicable to the Dominion of India;

AND WHEREAS the Government of India Act, 1935, as so adapted by the Governor-General provides that an Indian State may accede to the Dominion of India by an Instrument of Accession executed by the Ruler thereof:

NOW THEREFORE

I Shriman Inder Mahander Rajrajeshwar Maharajadhiraj Shri Harisinghji Jammu Kashmir Naresh Tatha Tibbet adi Deshadhipati

Ruler of.......JAMMU....AND...KASHMIR...STATE............ in the exercise of my sovereignty in and over my said State Do hereby execute this my Instrument of Accession and

1. I hereby declare that I accede to the Dominion of India with the intent that the Governor-General of India, the Dominion Legislature, the Federal Court and any other Dominion authority established for the purposes of the Dominion shall, by virtue of this my Instrument of Accession, but subject always to the terms thereof, and for the purposes only of the Dominion, exercise in relation to the State of ..JAMMU..AND...KASHMIR (hereinafter referred to as "this State") such functions as may be vested in them by or under the Government of India Act, 1935, as in force in the Dominion of India on the 15th day of August 1947 (which Act as so in force is hereinafter referred to as "the Act").

2. I hereby assume the obligation of ensuring that due effect is given to the provisions of the Act within this State so far as they are applicable therein by virtue of this my Instrument of Accession.

3. I accept the matters specified in the Schedule hereto as the matters with respect to which the Dominion Legislature may make laws for this State.

4. I hereby declare that I accede to the Dominion of India on the assurance that if an agreement is made between the Governor-General and the Ruler of this State whereby any functions in relation to the administration in this State of any law of the Dominion Legislature shall be exercised by the Ruler of this State, then any such agreement shall be deemed to form part of this Instrument and shall be construed and have effect accordingly.

5. The terms of this my Instrument of Accession shall not be varied by any amendment of the Act or of the Indian Independence Act, 1947 unless such amendment is accepted by me by an Instrument supplementary to this Instrument.

6. Nothing in this Instrument shall empower the Dominion Legislature to make any law for this State authorising the compulsory acquisition of land for any purpose, but I hereby undertake that should the Dominion for the purposes of a Dominion law which applies in this State deem it necessary to acquire any land, I will at their request acquire the land at their expense or if the land belongs to me transfer it to them on such terms as may be agreed, or, in default of agreement, determined by an arbitrator to be appointed by the Chief Justice of India.

7. Nothing in this Instrument shall be deemed to commit me in any way to acceptance of any future constitution of India or to fetter my discretion to enter into arrangements with the Government of India under any such future constitution.

కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేస్తూ కశ్మీర్ పాలకుడు హరిసింగ్ సంతకం చేసిన ఒప్పంద పత్రం.



సంప్రదాయ దుస్తుల్లో కశ్మీర్ గిరిజన స్త్రీలు




పడవలో పాలు తీసుకెళుతున్న స్త్రీ



ప్రకృతి జాడ : అందాల మధ్య కశ్మీర్ గ్రామం



బతుకు ఓడ : 'లే' సరస్సులో కూరగాయల వ్యాపారం



మక్బూల్ భట్ :
అసిస్టెంట్ హైకమిషనర్ హత్యకేసులో దోషిగా ఉన్న
ఇతన్ని 1984లో భారత ప్రభుత్వం ఉరితీసింది.



భారత భద్రతా దళాల చేతిలో మరణించిన మిలిటెంట్ నాయకుడు, తన
కుమారుడైన షరీక్ భక్షి ఆత్మశాంతి కోసం ప్రార్థిస్తున్న తండ్రి, ఇతర ముస్లింలు.



అనంతనాగ్ ప్రాంతంలో జరిగిన గ్రనేడ్ పేలుడులో గాయపడిన వ్యక్తిని శ్రీనగర్ ఆసుపత్రిలోకి తీసుకెళుతున్న పోలీసు (1994, జూలై)



గాయపడిన వ్యక్తికి ఆసుపత్రిలో సహాయం చేస్తున్న వైద్య సిబ్బంది




జైళ్లలో మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా
శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న లాయర్లు



శ్రీనగర్ దాల్ సరస్సు వద్ద పహారా కాస్తున్న సైనికుడు



*గుండె పగిలి చీకట్లో....*

భూకంప తాకిడికి కూలిపోయిన ఇంటివద్ద దీనంగా నిలిచున్న మహిళ



*గూడు చెదిరి వాకిట్లో...*

భూకంప బీభత్సంలో సర్వం కోల్పోయి సహాయ శిబిరాల వద్దకు చేరిన బాధితులు



రోధిస్తున్న భషీర్ అహమ్మద్ మీర్ (మిలిటెంట్) తల్లి



జావెద్ గిలానీ




శవాగారం : శ్రీనగర్‌లో ముస్లింల సమాధులు



పుణ్య క్షేత్రం : అమర్‌నాథ్ గుహల్లో ప్రసిద్ధి గాంచిన హిమలింగం



విఘూ వీడలో సాగుతున్న నేషనల్ కాన్ఫరెన్స్ ర్యాలీని గమనిస్తున్న మిలటరీ పోలీసు





'పాకిస్తాన్‌లో కలవడమే కశ్మీర్ సమస్యకు పరిష్కారము' అని నమ్మే
'దుఃఖ్ తారని-మిల్లత్' ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణా తరగతులు.




కశ్మీర్ లోయ నుండి లదాక్ వెళ్ళే రహదారి




సరస్సులోని పడవ ఇండ్లు



"కశ్మీర్ పవిత్ర యుద్ధంలో పాల్గొంటే నువ్వు హీరోగా గుర్తించబడతావు" -
ఇజాజ్ అహ్మద్ భట్ (స్వతంత్ర కశ్మీర్ ఉద్యమకారుడు)



శాంతి వికసించేనా?.... కశ్మీర్ వీధుల్లో గస్తీ తిరుగుతున్న సైనికులు

ఈ కస్టడీ మరణాలకు కారణం అతిక్రూరమైన చిత్రహింసలు. కరెంటు షాకులు ఇవ్వడం సైన్యం చాలా తరచుగా ప్రయోగించే హింస. పురుషాంగానికి, కాలిపాదాలకు, చేతివేళ్లకు, నాలుకకు, చెవులకు, కణతలకు కరెంటు షాక్ ఇస్తారు. శరీరభాగాన్ని సిగరెట్లతో కాలుస్తారు. స్టౌవ్ వెలిగించి దానిమీద చేతులు, కాళ్లు 'రోస్ట్' చేస్తారు. వేడి ఇస్త్రీ పెట్టెతో వీపుమీద, పొట్టమీద ఒత్తుతారు. సలసల కాగుతున్న నీళ్లు, మిరపపొడి కలిపిన నీళ్లు, కాలువలలోని మురికి నీళ్లు బిందెల కొద్దీ బలవంతంగా తాగిస్తారు. కళ్లలో మిరపపొడి కలిపిన పేస్ట్ రుద్దుతారు. నిలువుగానో, తలక్రిందులుగానో వేళాడదీసి మోచేతి మీద, మోకాలి మీద, ఇతర శరీర భాగాల మీద తుపాకి మడమలతోను, కర్రలతోను గంటల కొద్దీ బాదుతారు. తొడలవద్ద ఉన్న కండ చిన్న ముక్కలుగా కోస్తారు. ముడ్డిలోకి కర్రగానీ ఇనుపకడ్డీగానీ ఒక్కొక్కసారి కారం పట్టించి గట్టిగా దోపుతారు. చిన్న ప్లాస్టిక్ సంచిలో కారంపొడి దట్టించి దానిని పురుషాంగానికి కడతారు. చలికాలంలో నగ్నంగా ఉంచుతారు. బట్టలు, చెప్పులు లేకుండా దట్టమైన మంచుమీద పరుగెత్తిస్తారు. మతాచార చిహ్నంగా గడ్డం పెంచి ఉంటే ఒక్కొక్క వెంట్రుక పీకుతారు.

'రోకలిబండలెక్కించడం' దేశంలో అన్ని ప్రాంతాలలోనూ పోలీసులు ప్రయోగించే హింసే. అయితే కశ్మీర్‌లో సైన్యం దానిని ఎంత దూరం తీసుకుపోయిందంటే, బాధితుల మూత్రపిండాలు స్తంభించిపోవడం తరచుగా జరుగుతుంది. మనిషిని కిందపడేసి బరువయిన రాడ్లు శరీరానికి అడ్డంగా వేసి దానిపైన నలుగురైదుగురు సైనికులు ఎక్కి తొక్కుతూ కర్రలతో బాదుతారు. దీనివల్ల కండరాలు నలిగిపోయి మూత్రపిండాలకు అవసరమయిన టాక్సిన్‌లు నిలిచిపోతాయనీ దానివల్ల రీనల్ ఫెయిల్యూర్ సంభవిస్తుందని శ్రీనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు అంటారు. వారిలో ఒకతను ఈ వైపరీత్యాన్ని గురించి ఒక అంతర్జాతీయ వైద్య పత్రికలో వ్యాసం రాస్తూ, ఈ రకమైన రీనల్ ఫెయిల్యూర్ గురించి ఇంత సమాచారం అందిచ్చి వైద్య పరిశోధనకు మేలు చేసిన ఘనత కశ్మీర్‌కే దక్కింది అని వెక్కిరింతగా అన్నాడు.

కస్టడీలోకి తీసుకున్న వారిని చంపే విషయంలో సైన్యం ఎంత క్రూరంగా వ్యవహరించగలదన్న దానికొక నిదర్శనం : 1995 జూన్ 13న అనంత్‌నాగ్ జిల్లా హత్మూరాలో రాష్ట్రీయ రైఫిల్స్‌వారు హిలాల్ అహ్మద్ నస్తీ, గులాం రసూల్, రంజా అలీష్, ఫరూక్ అహ్మద్ వానీ అనే నలుగురిని అరెస్టు చేసారు. నలుగురినీ క్యాంపుకు తీసుకుపోయి మొదట నస్తీని చంపి ముక్కలుముక్కలు చేసి ఒక సంచిలో వేసి గులాం రసూల్‌కు ఇచ్చి జీలం నదిలో వేసి రమ్మన్నారు. అతను ఆ పనిచేసి రాగానే అతనిని ముక్కలుగా నరికి సంచిలో వేసి రంజా అలీష్‌కు ఇచ్చి నదిలో పడేసి రమ్మన్నారు. అతను తిరిగి రాగానే అతనిని నరికి ఫరూక్ అహ్మద్ వానీకి అప్పగించారు. ఫరూక్

సంచితోపాటు తాను కూడ నదిలోకి దూకి ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు పోయి ప్రాణం దక్కించుకున్నాడు. అనంత్‌నాగ్‌లో ఒక మెజిస్ట్రేట్ వద్ద హాజరయి ఈ ఘోరమైన ఉదంతాన్ని వివరిస్తూ వాంగ్మూలం ఇచ్చాడు.

సైనిక బలగాల కాల్పులలో నిరాయుధులయిన పౌరులు చనిపోయినప్పుడు మిలిటెంట్లపైన జరిపిన కాల్పుల్లో వారు మధ్యలో చిక్కుకున్నారనీ, చనిపోయారనీ అంటుంటారు. చాలా సందర్భాలలో మిలిటెంట్లు పాల్పడిన ఏదో ఒక చర్యకు ప్రతీకారంగా పౌరులపైన కాల్పులు జరిపి ఈ ఎదురు కాల్పుల కథ అల్లుతుంటారు.

1995 ఫిబ్రవరి 10 నాడు శ్రీనగర్‌లోని జైనాకదల్‌లో మిలిటెంట్లు బిఎస్ఎఫ్ జవాన్లపైన దాడిచేసి ఒకరిని చంపారు. తక్కిన జవాన్లు ప్రతీకారానికి దిగారు. అదొక రద్దీగా ఉండే బజారు. జవాన్లు దుకాణందార్లను గుంజుకొచ్చి చంపారు. గల్లీలలోకి కాల్పులు జరిపి చంపారు. సలీం హమీద్, పీర్‌బషీర్ అహ్మద్‌షా అనే దుకాణందార్లను, ముస్తాక్ అహ్మద్‌ఖాన్ అనే వాచ్ రిపైరర్‌ను రోడ్లోకి గుంజుకొచ్చి కాల్చి చంపారు. వారు విచ్చలవిడిగా జరుపుతున్న కాల్పులకు అడ్డుపోయిన హాజీ గులాంనబీ అనే 60 సంవత్సరాల దుకాణందారును కాల్చి చంపారు. కాల్పులను తప్పించుకొని పారిపోజూసిన జావేద్ అహ్మద్ షెహ్రీ, అబ్దుల్ రషీద్ అనే ఇద్దరిని, ఒక పేరు తెలియని రిక్షా కార్మికుడిని కాల్చి చంపారు. అంతా అయిపోయిన తరువాత, మిలిటెంట్లతో జరిగిన ఎదురు కాల్పులలో వీరంతా చిక్కుకొని చనిపోయారని ప్రకటించారు.

గ్రామాలలో సైనిక బలగాలు సోదా జరిపేటప్పుడు స్త్రీలపైన అత్యాచారాలకు పాల్పడ్డారన్న ఆరోపణ కశ్మీర్‌లో తరచుగా వినపడుతుంటుంది. సోదా చేసేటప్పుడు సైనిక బలగాలు అనుసరించే పద్ధతి ఏమిటంటే మగవాళ్లందరినీ వచ్చి బయట ఒకచోట కూడమంటారు. దూరం నుండి ఇన్‌ఫార్మర్లు వారిని చూసి సైనిక అధికార్లకు వారి గురించి సమాచారం ఇవ్వాలి. ఈలోగా జవాన్లు స్త్రీలు మాత్రమే ఉండే ఇళ్లు సోదా చేస్తారు. తరచుగా ఆ క్రమంలో లైంగిక వేధింపు, లైంగిక హింస చోటు చేసుకుంటాయి. 1991 ఫిబ్రవరి 23 రాత్రి కుప్వారా జిల్లాలోని కునన్ పోష్‌పోరాలో జరిగిన ఘటనపైన పలు విచారణలు జరిగిన కారణంగా అది బాగా ప్రచారం అయింది. వందల సంఖ్యలో సైనికులు ఆ గ్రామంపైన పడి మగవాళ్లందరినీ ప్రశ్నించడానికని బయటకు పిలిచి ఇళ్లమీద పడ్డారు. చాలామంది స్త్రీలను గ్యాంగ్ రేప్ చేసారు. 23 మంది అత్యాచారానికి గురయ్యారని ఒక నివేదిక, 53 మంది అని మరొక నివేదిక తెలిపాయి. తనంతట తాను ఆ గ్రామానికి పోయి విచారణ జరిపిన కుప్వారా జిల్లా మెజిస్ట్రేటు ఎస్.ఎం. యాసీన్ "సైనిక బలగాలు పశువులలాగ ప్రవర్తించారు. వారి ప్రవర్తన గురించి రాయడానికి నాకు సిగ్గనిపిస్తున్నది" అన్నాడు.

ఊరేగింపుల మీద, ప్రదర్శనల మీద కాల్పులకు సంబంధించిన కొన్ని ఉదంతాలు పైన ఉదహరించాము. అవన్నీ 1990 ప్రథమార్థంలో, జగ్‌మోహన్

గవర్నర్‌గా వచ్చిన తొలి దినాలలో జరిగిన ఘటనలు. మరొక రెండు పెద్ద ఘటనలనిక్కడ ప్రస్తావిస్తున్నాము. 1991 మే 5న పాకిస్తాన్‌లో తర్ఫీదయి వస్తున్న మిలిటెంట్లు 73 మందిని సరిహద్దు వద్ద చంపినట్టు సైన్యం ప్రకటించింది. వారిలో చాలామంది శ్రీనగర్‌వాసులు. మే నెల 8వ తేదీన వారి అంతిమయాత్ర శ్రీనగర్‌లో జరిగింది. ఆ యాత్రలో జనం తీవ్ర స్వరాలతో నినాదాలిచ్చారు. సైనిక బలగాలు ఆ అంతిమయాత్రపైన కాల్పులు జరిపి 14 మందిని చంపారు. సైన్యంవల్ల 'తప్పు జరిగింది' అని ఈ సందర్భంగా జమ్మూ కశ్మీర్ గవర్నర్ సక్సేనా సహితం ఒప్పుకున్నట్లు పత్రికలు రాసాయి.

1993 అక్టోబర్ నెలలో శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్‌లో కొందరు రక్షణ తీసుకున్న విషయం గమనించిన సైనిక బలగాలు వారిని బయటకు రప్పించే ప్రయత్నం మొదలుపెట్టారు. దానికోసం హజ్రత్‌బల్‌ను దిగ్బంధనం చేసారు. పవిత్రమైన ఆ దర్గా అపవిత్రమయి పోయిందంటూ ప్రజలు బిజ్‌బెహారాలో పెద్ద ఊరేగింపు తీసారు. ఈ ఊరేగింపు పైన బిఎస్ఎఫ్ కాల్పులు జరిపి 47 మందిని చంపింది.

ఊరేగింపులపైన పోలీసు కాల్పులు, పారామిలిటరీ బలగాల కాల్పులు మనకు కొత్తకాదు కానీ అవి కశ్మీర్‌లో లాగ అన్నిచోట్లా ఊచకోత రూపం తీసుకోవు. బిజ్‌బెహారా కాల్పులపైన మెజిస్టేరియల్ విచారణ, బిఎస్ఎఫ్ వారి ఆంతరంగిక విచారణ కూడా జరిగాయి. కాల్పులు అనవసరంగా జరిపారని రెండు విచారణలూ నిర్ధారించాయి. 14 మంది సిబ్బందిని అందుకు బాధ్యులుగా గుర్తించడం కూడ జరిగింది. అయినప్పటికీ వారిపైన ఏ చర్య తీసుకోలేదు.

అణచివేత ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ కశ్మీరీలు 'మా స్వయం నిర్ణయాధికార హక్కు నిరాకరించడం అన్నిటికంటె తీవ్రమైన మానవహక్కుల సమస్య. కస్టడీ మరణాలు, కాల్పులు, చిత్రహింసలు దాని తరువాతే' అన్నారు. ఈ స్వయం నిర్ణయాధికారాన్ని నిరాకరించడమే 'కశ్మీర్ సమస్య' అని ఒప్పుకోవడానికి భారత ప్రభుత్వం ఇష్టపడదు గానీ పౌరులుగా మనం కళ్లు మూసుకోవడానికి వీలులేదు. ఈ స్వయం నిర్ణయాధికార కాంక్షకు మతం రంగు పులమడం తరచుగా జరుగుతుంటుందిగానీ కశ్మీరీలలో అది ప్రధానంగా స్వేచ్ఛను కోరుకునే జాతీయ కాంక్ష. 1995లో అవుట్‌లుక్ దినపత్రిక కశ్మీర్‌లో జరిపిన ఒక సర్వేలో 72 శాతం స్వతంత్ర కశ్మీర్‌ను కోరుకోగా 19 శాతం పాకిస్తాన్‌లో కలవాలని కోరుకున్నారనీ 84 శాతం కశ్మీర్ సమస్యకు భారత రాజ్యాంగం పరిధిలో పరిష్కారం లేదని చెప్పారనీ 66 శాతం కశ్మీర్‌లో పెరుగుతున్న ఇస్లామిక్ మతవాదాన్ని నిర్ద్వంద్వంగా ఖండించారనీ ప్రకటించింది. ఈ గణాంకాలు కశ్మీరీల మనోభావాలకు చక్కగా అద్దం పడతాయి.

ఎన్నికలలో పాల్గొనే రాజకీయ పార్టీలన్నీ భారత రాజ్యాంగానికి లోబడి వ్యవహరిస్తాయి కాబట్టి అవి ఈ స్వేచ్ఛా కాంక్షకు ప్రాతినిధ్యం వహించలేవు. ప్రాతినిధ్యం వహించగల సంస్థలు వేరే ఉన్నాయి. వాటి మధ్య అనేక విషయాలలో అభిప్రాయభేదాలున్నప్పటికీ అవన్నీ కూడా భారత్‌లో జమ్మూ కశ్మీర్ విలీనం ఇంకా ప్రజామోదం పొందలేదనీ అదే 'కశ్మీర్ సమస్య' అనీ నమ్ముతాయి. ఈ సమస్యకు భారత రాజ్యాంగం పరిధిలో పరిష్కారం లేదని నమ్ముతాయి. అంతిమ నిర్ణయం జమ్మూ కశ్మీర్ ప్రజలదే కావాలని విశ్వసిస్తాయి.

ఇటువంటి 32 సంస్థల ఉమ్మడి వేదికగా ఆల్‌పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ ఏర్పడింది. హురియత్ కాన్ఫరెన్స్‌లో ఎన్నో తేడాలున్నాయి. స్వతంత్ర కశ్మీర్‌ను కోరుకునే సెక్యులర్ ప్రజాతంత్ర దృక్పథానికీ పాకిస్తాన్‌లో విలీనం కోరుకునే మతవాద దృక్పథానికీ మధ్యనున్న తేడా వీటిలో ముఖ్యమైనది. సాయుధ పోరాటమే నిర్ణయిస్తుందని నమ్మే వారికీ రాజకీయ పరిష్కారం ఆవశ్యం అని నమ్మే వారికీ మధ్యనున్న తేడా ఇంకొకటి. అయినప్పటికీ హురియత్ కాన్ఫరెన్స్ ఒక తాటి మీద నిలబడి, త్రైపాక్షిక చర్చలు అనే రాజకీయ పరిష్కార మార్గాన్ని బలంగా ప్రతిపాదిస్తున్నది. భారత పాకిస్తాన్ ప్రభుత్వాలు, జమ్మూ కశ్మీర్ ప్రజల ప్రతినిధులు సమస్థాయిలో కూర్చొని చర్చించుకోవడం ద్వారానే 'కశ్మీర్ సమస్య' అనే దానికి పరిష్కారం దొరకగలదని అంటున్నది.

హురియత్ కాన్ఫరెన్స్ మీద కశ్మీర్‌లో విమర్శ లేకపోలేదు. హురియత్ నాయకులలో అధిక భాగం సంపన్న వర్గాలకు చెందినవారు. వాళ్లు శ్రీనగర్‌లోని సంపన్న ప్రాంతంలో నివసిస్తారు. 'వాళ్లు, వాళ్ల పిల్లలు బాగానే ఉంటారు. మా పిల్లలు మాత్రం ఆజాదీ కోసం చావాలి' అన్న నిరసన అప్పుడప్పుడు వ్యక్తం అవుతుంది. రెండవది, కశ్మీరీ ప్రజాభిప్రాయం సెక్యులర్ ప్రజాతంత్ర భావాలవైపే మొగ్గు చూపుతుండగా హురియత్ కాన్ఫరెన్స్‌లో ఇస్లామిక్ మతవాదులదే ప్రాబల్యం. ముఖ్యంగా జమాతె ఇస్లామీ గొంతే ఎక్కువ వినిపిస్తుంది. ప్రజాభిప్రాయం ఎలాగున్నా మిలిటెంట్ సంస్థలలో హిజ్‌బుల్ ముజాహిదీన్‌దే ప్రథమస్థానం కావడం, హిజ్‌బుల్ ముజాహీదీన్ జమాతె ఇస్లామీ సాయుధ దళం కావడం దీనికి కారణం కావచ్చు.

ఏది ఏమైనా కశ్మీరీ పోరాటానికి రాజకీయ ముఖం హురియత్ కాన్ఫరెన్స్. వారిని పక్కన పెట్టి భారత ప్రశాసనాన్ని అంగీకరించే పార్లమెంటరీ పార్టీలతో మాత్రమే వ్యవహరించడం సమస్య పరిష్కారానికి ఏ రకంగానూ తోడ్పడదు.

# 4. సర్కారీ మిలిటెంట్ల సాయంతో మళ్ళీ ఎన్నికలు

1996లో దేశంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మే 27,30 తేదీల్లో కశ్మీర్‌లోని మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఎన్నిక జరిగింది. ఇది 9 సంవత్సరాల తర్వాత కశ్మీర్‌లోయలో జరిగిన మొట్టమొదటి ఎన్నిక. ఎన్నిక నిర్వహించడాన్ని సమర్థించడానికి భారత ప్రభుత్వం చెప్పిన కారణం న్యాయమైనదిగా సహజమైనదిగా, కన్పిస్తుంది. కశ్మీర్ ప్రజలకు తమ ప్రతినిధులను పార్లమెంటుకు ఎంపికజేసి పంపించడానికి అవకాశం ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అనీ, మిలిటెంట్లు తుపాకుల బెదిరింపులున్నంత మాత్రాన తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రజాస్వామిక హక్కుకు భంగం కలగడానికి వీలులేదనీ, మొదట పార్లమెంటుకూ ఆ తర్వాత రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించడం జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ ప్రక్రియను ప్రారంభించడానికి నాంది అనీ ఎన్నికలను వ్యతిరేకించేవాళ్ళు ఆ రాజకీయ ప్రక్రియలో పాల్గొనదలచుకోని వారినీ, రాజకీయ పరిష్కారంపట్ల విశ్వాసం లేనివారినీ భారత ప్రభుత్వం అనింది. ప్రభుత్వమే కాదు భారతదేశంలోని మేధావి వర్గంలో చాలామంది అభిప్రాయం ఇదే. ఈ వాదనలను జమ్మూ కశ్మీర్‌లోని వాస్తవ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. జమ్మూ కశ్మీర్‌లోని అసలు సమస్య ఏమిటంటే భారత్‌లో ఆ భూభాగం విలీనమైన ఘటనే వివాదాస్పదమైనది. 1947లో జరిగినటువంటి ఆ విలీనానికి ముందు షరతులు రెండు. ఒకటి భారతదేశంలో ఉన్నంతకాలం ఆ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి ఉంటుంది. రెండు, భారతదేశంలో ఉండదలుచుకున్నదీ లేనిదీ నిర్ణయించుకోవడానికి అక్కడి ప్రజానీకానికి ప్లెబిసైట్ ద్వారా అవకాశం ఇవ్వడం జరుగుతుంది. అయితే అప్పటి నుండి ఆ రాష్ట్రంలో అసెంబ్లీకి పార్లమెంటుకూ ఎన్నికలు ఎప్పుడు జరిగినా భారత పాలకులు ఈ రెండు షరతులనూ వమ్ము చేయడానికి దానిని వాడుకుంటూ వచ్చారు. జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఎన్నికలను ఎప్పుడూ కూడా న్యాయబద్ధంగా కానీ, స్వేచ్ఛాయుతంగా కానీ జరగనివ్వలేదు. కుట్రల ద్వారా ఢిల్లీకి ఆ రాష్ట్రం యొక్క స్వయం ప్రతిపత్తిని తాకట్టు పెట్టడానికి ఉపయోగపడే పాలకులను మాత్రమే ఎన్నిక కానిచ్చారు. అంతేకాకుండా ప్రజలు ఎన్నికల్లో పాల్గొంటున్నారు అంటేనే తమ రాష్ట్రం భారత్‌లో విలీనమైపోయిందని అంగీకరించినట్టేనని భారత్ వాదిస్తూ వచ్చింది. కాబట్టి ఇక ప్లెబిసైట్ పెట్టడం అనవసరం అంటూ వచ్చింది. ఈ నేపథ్యంలో పార్లమెంటుకు ఎన్నికలు జరపడము అంటే ప్రజలకు తమ ప్రతినిధులను ఎన్నుకోవడానికి అవకాశం ఇవ్వడం కోసం కాదు, కశ్మీరీలు మరొక్కసారి పార్లమెంటుకు ఓటు వేయడం ద్వారా తాము భారత్‌లో భాగమైపోయామని ప్రకటించారని మరొకసారి చెప్పడానికి భారత ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడం కోసమే. ఇది ఎన్నికల నిర్వహణకు అక్రమ కారణం. కానీ భారత ప్రభుత్వం ఈ కారణం కోసమే ఎన్నికలు నిర్వహించింది.

అంతేకాక, భారత పాలకులు కశ్మీర్ ప్రజానీకాన్ని ఎన్నికల్లో పాల్గొనేటట్టు చేయడానికి బలప్రయోగానికి పాల్పడతారనే అనుమానం కూడా విస్తృతంగా ఉండింది. దాంట్లో భాగంగా ప్రభుత్వ అనుకూల సాయుధ బలగాలను ప్రయోగించి ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రజలు ఓటు వేసేటట్టు బలవంతం చేయబోతారన్న అనుమానం కూడా ఆ ఎన్నికలకు ముందు విస్తృతంగా వ్యక్తమయింది. రాజకీయ ప్రక్రియగా ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నాము అని చెప్పుకున్న భారత ప్రభుత్వం రెనెగేడ్లు లేక సర్కారీ మిలిటెంట్లు అని పిలువబడే ప్రభుత్వ అనుకూల సాయుధ బలగాలను ఆ ఎన్నికలను విజయవంతం చేయడం కోసం వినియోగించిన తీరు పైన పేర్కొన్న సందేహాలనూ అభిప్రాయాలనూ నిజం చేసింది. ఈ ప్రభుత్వ సాయుధ బలగాలను ఏ విధంగా అర్థం చేసుకోవాలి అనేది చూసేవాళ్ళను బట్టి ఉంటుంది. సైనిక ప్రతినిధులు వారిని సంస్కరించబడిన మిలిటెంట్లు అంటారు. వారు ఎందుకు సైన్యానికి సన్నిహితంగా మెలుగుతారు అని అడిగితే, మిలిటెన్సీ యొక్క నిజస్వరూపాన్ని గుర్తించిన మాజీ మిలిటెంట్లు వేర్పాటువాదం అవివేకం అని గ్రహించి మంచి భారత పౌరులుగా జీవించదలుచుకున్నారనీ, అయితే వారి పూర్వపు సహచరులు, పాకిస్తానీ శిక్షణా సంస్థలు, వారిని బెదిరిస్తున్నారనీ అంటారు. అందువల్లనే వారికి ఆత్మరక్షణార్థం ఆయుధాలు ఇవ్వడం జరిగిందని, భారత సైన్యం యొక్క అండదండలు ఇవ్వడం జరిగిందని ఇది ప్రాణాపాయమున్న ఏ పౌరునికైనా ప్రభుత్వం, ప్రభుత్వ బలగాలు చేసే సహాయమేనని వారంటారు. ఇది చూడడానికి, వినడానికి అందంగా కనిపించే చిత్రం. కాని ఇది ఒక అబద్ధపు చిత్రం. నిజమే, మిలిటెన్సీ వదిలిపెట్టి ఒక సాధారణ జీవితం గడపాలని నిర్ణయించుకున్న మిలిటెంట్లు ఉంటారు. వారిలో కొంతమంది భారత్‌కు అనుకూలంగా, అంటే కశ్మీర్ భారత్‌లో విలీనం కావడానికి అనుకూలంగా, మారి ఉన్నా ఉండవచ్చు. అటువంటి వారుగాని వేరే భారత పౌరులెవరైనా గాని టెర్రరిస్టుల నుంచి ప్రమాదం ఎదుర్కొంటే వారికి రక్షణ కల్పించే బాధ్యత తప్పనిసరిగా ప్రభుత్వానికి ఉంది. వారు కోరుకుంటే వారికి ఆయుధాల లైసెన్స్ ఇవ్వడంగాని, లేదా వారికి పోలీసు రక్షణ కల్పించడంగాని ప్రభుత్వ బాధ్యత అవుతుంది. కాని కశ్మీర్‌లో జరుగుతున్నది ఇది కాదు. సరెండరైన మిలిటెంట్లు పట్టుకొని తిరుగుతున్నటువంటివి లైసెన్స్ ఉన్న ఆయుధాలు కావు. తాము మిలిటెంట్లుగా ఉన్న కాలం నుంచి తమ దగ్గరే ఉంచుకున్న లైసెన్సు లేని ఆయుధాలు, లేదా సాయుధ బలగాలతోపాటు దాడిచేసి అరెస్టు చేసిన లేక చంపిన మిలిటెంట్ల నుండి స్వాధీనం చేసుకున్నటువంటి ఆయుధాలు. ఈ ఆయుధాలను వారు ఆత్మరక్షణార్థం వాడుకోవడం లేదు. అది నిజమైతే అభ్యంతరం ఉండదు. ఎందుకంటే ఆత్మరక్షణ ప్రతి ఒక్కరి హక్కు. కాని ఆ ఆయుధాలను వాళ్ళు భారత ప్రభుత్వం యొక్క శత్రువులను వేటాడటానికి వాడుకుంటున్నారు. శత్రువులు సాయుధ మిలిటెంట్లు కావచ్చు. జమాతె ఇస్లామీ వంటి

సంస్థల కార్యకర్తలు కావచ్చు. పత్రికా విలేకర్లు కావచ్చు, మానవహక్కుల కార్యకర్తలు కావచ్చు. కశ్మీర్ స్వయం నిర్ణయాధికార ఆకాంక్షను సమర్థించే మేధావులు కావచ్చు. లేక కశ్మీర్‌లో భారత పాలకులు పాల్పడుతున్న అణచివేతను విమర్శించే మేధావులు కావచ్చు. వీరందరిని వేర్పాటు వాదులు అంటూ వేటాడటం ఈ ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు చేసే పని. అక్కడితో ఆగకుండా ప్రజలను దోచుకుంటారు, బస్సులను ఆపి లూటీ చేస్తారు, హిమాలయ పర్వతాల అడవుల నుంచి విలువైన కలపను దొంగతనంగా తీసుకుపోతారు. సాయుధ బలగాల సైనికులు తప్పనిసరిగా వారి పక్కనే ఉంటారు. వారిని మిలిటెంట్ల దాడుల నుంచి కాపాడడం కోసం కాదు. వారు చంపుతూ లూటీ చేస్తూ దోచుకుంటూ ఉంటే వారికి అధికారికంగా రక్షణ కల్పించడం కోసం.

1996లో పెద్ద ఎత్తున పెరిగిన ఈ దుష్ట పరిణామాలను అర్థంచేసుకోవడానికి కొన్ని ఉదాహరణలు చెప్పుకుంటే బాగుంటుంది. మే 23వ తేదీ మొదటి దశ పార్లమెంటు ఎన్నికలు జరిగిన తర్వాత రెండు రోజులకు అంటే మే 25వ తేదీన శ్రీనగర్‌లోని రజోరి కడల్ ప్రాంతంలో ఆయుధాలు పట్టుకున్న ఈ ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు రిక్షాలో పోతున్న ఒక స్త్రీ దగ్గర ఉన్న బంగారం దోచుకోవడానికి ప్రయత్నం చేశారు. జనం గుమిగూడి ఆ దొంగలను పట్టుకోవాలని ప్రయత్నించారు. వారు పారిపోయి పక్కనే ఉన్న ఒక బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ( BSF) బంకర్‌లో తల దాచుకున్నారు. భారత సైనిక బలగాల బంకర్లలో నేరస్తులకు చోటు ఉండదనే మనం అనుకుంటాం గానీ ఈ నేరస్తులకు ఒక్కడ చోటు దొరికింది. జనం ఆ బంకర్ చుట్టూ గుమిగూడేసరికి బంకర్‌లో నుండి బిఎస్ఎఫ్ జవాన్లు కాల్పులు జరిపారు. యూసుఫ్ అనే 15 సంవత్సరాల బాలుడు చనిపోయాడు. ఆ ప్రాంతమంతా కూడా నిరసన వెల్లువెత్తింది. దుకాణందారులు దుకాణాలు మూసేసి దాదాపు 8వేల మంది జనం ఆ పిల్లవాడి శవాన్ని ఊరేగింపుగా తీసుకుపోయారు. ఆ జనం ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు, స్వాతంత్ర్య నినాదాలు ఇవ్వసాగారు. వారిపైన బిఎస్ఎఫ్ జవాన్లు మళ్లీ కాల్పులు జరిపి చనిపోయిన యూసుఫ్ తమ్ముడు తాహిర్‌ను కాల్చి చంపారు. ఇతని వయసు 14 సంవత్సరాలు. మరొక ఉదాహరణ : రెహనుమా–ఇ–కశ్మీర్ అనే ఉర్దూ దినపత్రిక, శాఫ్రన్‌టైమ్స్ అనే ఒక ఆంగ్ల దినపత్రికల సంపాదకుడు, షేక్ గులాం రసూల్ ఆజాద్ అనే పత్రికా విలేఖరి ఉండేవాడు. అతను శ్రీనగర్ నివాసి. 1996 మార్చి నెలలో అతని పత్రికలో ఒక వార్త ప్రచురించాడు. సైనిక బలగాల మద్దతు ఉన్నటువంటి కొందరు సాయుధులు ఒక గ్రామాన్ని దహనం చేశారు అని వ్రాసాడు. మార్చి 20వ తేదీన ఆ సాయుధ యువకులే అతని ఇంటికి వచ్చి వార్త ప్రచురించినందుకు అతన్ని తిట్టి తీసుకుపోయారు. 20 రోజుల తరువాత అంటే ఏప్రిల్ 10వ తేదీన అతని శం జీలం నదిలో దొరికింది. అన్నిటికంటే బాధాకరమైన ఘటన హైకోర్టు న్యాయవాది,

మానవహక్కుల కార్యకర్త అయిన జలీల్ అంద్రబీ హత్య. అతనికి మానవహక్కుల విషయంలో నిబద్ధత బలంగా ఉండటం మాత్రమే కాకుండా చాలా నిర్దిష్టమైన పరిశీలన కూడా ఉంది అని స్టేట్స్‌మెన్ దినపత్రికలో రాస్తూ ప్రముఖ రచయిత ఏజి నూరాని ప్రశంసించాడు. అతను అంతకుముందు సంవత్సరం ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కాన్ఫరెన్స్‌కు కూడా హాజరయ్యాడు. 1996 మార్చి 18న మరొక అటువంటి కాన్ఫరెన్స్‌కు పోవడానికి తయారవుతున్నాడు. అయితే మార్చి 8వ తేదీన అతని భార్య, న్యాయవాది అయిన రఫత్ ఆరాతో కారులో పోతుండగా సాయంత్రం 5.15 ని॥ల సమయంలో కొంతమంది సాయుధులైన ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు అతని కారును ఆపి అతన్ని దించి పక్కనే ఉన్న రాష్ట్రీయ రైఫిల్స్ వాహనం దగ్గరకు తీసుకెళ్ళారు. మళ్ళీ అతను కనబడలేదు. అతని ఆచూకి గురించి పెద్ద ఆందోళన జరిగింది. అతని భార్య కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేసింది. ఇదేదీ కూడా అతని ప్రాణాన్ని కాపాడలేదు. 27న అతని మృతదేహం శ్రీనగర్‌లోని రాజ్‌బాగ్ వద్ద జీలం నదిలో దొరికింది. అతని నుదుటిమీద ఒక బుల్లెట్ గుర్తు ఉండింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే జలీల్ అంద్రబీని అపహరించి తీసుకుపోయి చంపడానికి సహకరించిన ఆ రెనెగేడ్లు లేక ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు ఎక్కువ కాలం బతకలేదు. ఏప్రిల్ 5వ తేదీన 5 గుర్తు తెలియని శవాలు పుల్వామా జిల్లాలోని పాంపోర్ సమీపంలో కన్పించాయి. వారు అంతకుముందు నెల జలీల్ అంద్రబీని అపహరించి రాష్ట్రీయ రైఫిల్స్‌కు అప్పగించడానికి ఉపయోగపడిన రెనేగేడ్లే అని పత్రికలు రాశాయి. అంద్రబీ హత్య దేశంలోనే కాదు అంతర్జాతీయంగా కూడా పెద్ద ఎత్తున ఆందోళనకు దారితీసింది. శ్రీనగర్ హైకోర్టు ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను నియమించి అతని మరణం మీద విచారణకు ఆదేశించింది. ఈ కారణంగా ఇక అతని అపహరణకు, హత్యకు, సహకరించిన రెనెగేడ్లు బతికి ఉంటే తమ బండారం బయటపడుతుందని సైనిక అధికారులు అనుకున్నట్లున్నారు. వారిని ఏప్రిల్ 5న చంపేశారు.

ఈ ప్రభుత్వ అనుకూల మిలిటెంట్ల ప్రధాన శత్రువు జమాతె ఇస్లామి. అప్పటికి మూడు నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమైన గ్రూపుగా ఉన్న హిజ్‌బుల్ ముజాహిదీన్ జమాతె ఇస్లామి యొక్క సాయుధ బలగమనేది అందరూ ఒప్పుకునే విషయమే. సైనిక రక్షణలో ఉన్నటువంటి రెనెగేడ్లు ప్రధానంగా దాడి చేసేది హిజ్‌బుల్ ముజాహిదీన్ పైన, జమాతె ఇస్లామి పైన, ఈ సంస్థలకు సానుభూతిగా ఉండే వ్యక్తులపైన. హిజ్‌బుల్ ముజాహిదీన్ కార్యకర్తల చేతుల్లో ఆయుధాలుంటాయి కాబట్టి వారు తమను తాము రక్షించుకోగలరు కానీ జమాతె ఇస్లామి కార్యకర్తల వద్దగాని, ఇతర ఇస్లామిక్ సంస్థల కార్యకర్తల వద్దగాని ఆయుధాలుండవు. కనుక వారికి రక్షణ లేకుండా పోయింది. భారత ప్రభుత్వం పెంచి పోషిస్తున్న ఈ ప్రభుత్వ అనుకూల నేరగాళ్ళ ముఠాల వల్ల అత్యధికంగా నష్టపోయింది వీరే.

పీపుల్స్ రైట్స్ ఆర్గనైజేషన్ అనే ఢిల్లీకి చెందిన సంస్థ "కశ్మీర్ కౌంటర్ ఇన్సర్జెన్సీ" అనే శీర్షికతో ప్రచురించిన రిపోర్టులో ఈ విధంగా చెప్పింది. "ఈ ముఠాలు ప్రధానంగా దాడి చేసేది ఎవరి మీద అంటే ఏ సాధారణ పౌరులైతే మిలిటెంట్లకు ఆశ్రయము, తిండి పెడుతున్నారో వారిపైన. ముఖ్యంగా జమాతె ఇస్లామి కార్యకర్తలపైన. వేలమంది స్థానికులను జమాతె ఇస్లామి కార్యకర్తలు అని చెప్పి, సానుభూతిపరులు అని చెప్పి, వారి ఇండ్ల నుంచి ఈ ముఠాలు తరిమేశాయి. వారి ఆస్తులను ఆక్రమించుకుని ధ్వంసం చేయడం, అమ్ముకోవడం చేశాయి. జమాతె ఇస్లామి కార్యకర్తలకు చెందిన 350 ఇళ్లను వీరు ధ్వంసం చేసారు అని అంచనా. "హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు అబ్దుల్ గనీలోన్ ఇచ్చిన ఒక ప్రకటన ప్రకారం ఈ ప్రభుత్వ అనుకూల నేరగాళ్ళ ముఠాలు బస్సులెక్కి గడ్డం ఉన్న మగవాళ్ళను "మీరంతా జమాతె ఇస్లామి సానుభూతిపరులు' అని చెప్పి గడ్డం పట్టుకుని లాగడం, అవమానపరచడం, వాళ్ళ దగ్గర డబ్బులేమైనా ఉంటే బలవంతంగా తీసుకోవడం నిత్యకృత్యమైపోయింది. లోయలో ఎక్కడ చూసినా ఉన్న సైనిక సిబ్బంది ఈ దౌర్జన్యాలను చూసీ చూడనట్టు పోతుంటారు. ఇక్కడ నొక్కి చెప్పాల్సిన విషయం ఏంది అంటే ఈ ప్రభుత్వ అనుకూల నేరగాళ్ళ ముఠాలకు కేవలం పరోక్షంగానో వెనుకనుంచో సైన్యం సహాయం చేయడం లేదు. భౌతికంగా వారి సరసన ఉంటారు. కేవలం జమాతె ఇస్లామి వంటి సంస్థలు మాత్రమే కాదు. ఇస్లాం పేరు మీద నడిచే అన్ని సంస్థల యొక్క కార్యకర్తలకు వీరి నుంచి ప్రమాదం ఉంది.

ఇక అసహనం మాటకొస్తే అటువైపు ఉన్న హిజ్‌బుల్ ముజాహిదీన్ గాని, జమాతె ఇస్లామి కాని వీరికంటె ఏమంత మెరుగైనవారు కారు. గత కొన్ని సంవత్సరాలుగా వారు కేవలం తమ రాజకీయాలకు వ్యతిరేకులు అన్న కారణంగా చాలా మందిపై దాడులు చేశారు, చంపారు. అయితే హింసాత్మకమైన అసహనం ఎవరు వ్యక్తం చేసినా దానిని తప్పనిసరిగా ఖండించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వ మద్దతు, ప్రభుత్వం యొక్క అండదండలున్న నేరగాళ్ల ముఠాలు ప్రభుత్వ వ్యతిరేక అభిప్రాయాలు, ప్రభుత్వ వ్యతిరేక రాజకీయాలు, కార్యాచరణ కలిగి ఉన్నవారిని అంతం చేయడానికి పూనుకుని నడుచుకోవడం మరింత తీవ్రంగా వ్యతిరేకించవలసిన విషయం. అయితే ఈ ప్రభుత్వ అనుకూల నేరగాళ్ల ముఠాలు కేవలం జమాతె ఇస్లామి, దాని సోదర సంస్థల మీద మాత్రమే దాడులు చేయడం లేదు. జలీల్ అంద్రబీ వంటి మానవహక్కుల కార్యకర్తల పైన కూడా దాడి చేశారు. జలీల్ అంద్రబీ జమాతె ఇస్లామి కార్యకర్త కాదు. వారితో ఏకీభవించేవాడు కూడా కాదు. పత్రికా సంపాదకుడు షేక్ గులామ్ ఆజాద్ హత్య గురించి కూడా పైన ప్రస్తావించాం. జఫర్ మెహరాజ్ అనే జీటీవి ప్రతినిధి 1995 డిసెంబర్ 8 నాడు ప్రముఖ రెనెగెడ్ నాయకుడు కుకా పరేని ఇంటర్వ్యూ చేసి వెనక్కు వస్తుండగా అన్ని మరికొంతమంది రెనెగేడ్లు అపహరించారు. అతనిపై కాల్పులు జరిపి

తీవ్రంగా గాయపరచి రోడ్డు పక్కన పడేశారు. అదృష్టవశాత్తు అతని ప్రాణం దక్కింది. కాబట్టి జమాతె కార్యకర్తలైనా, కాకపోయినా ఈ ప్రభుత్వ అనుకూల రెనెగేడ్ ముఠాలు తమ శత్రువులుగా ఎంచుకున్న వాళ్ళందరికీ సామాన్యంగా ఉన్న లక్షణం ఏమిటి అంటే కశ్మీర్ ప్రజల యొక్క స్వయం నిర్ణయాధికారాన్ని సమర్ధించడం, లేదా కశ్మీర్ లోయలో భారత ప్రభుత్వం వల్ల జరుగుతున్న మానవహక్కుల అణచివేతను తీవ్రంగా విమర్శించడం, అంటే భారత ప్రభుత్వానికి కంటగింపుగా తయారుకావడం. స్వయం నిర్ణయాధికారం స్వభావాన్ని గురించి, కశ్మీర్ ప్రజానీకం పోరాటాన్ని గురించి వారిలో వారికి ఎన్ని తేడాలున్నా ఈ సామాన్య లక్షణాలున్న వారందరినీ కూడా ప్రభుత్వ అనుకూల రెనెగేడ్ ముఠాలు తమ శత్రువులుగా ఎంచుకున్నాయి. ముఖ్యంగా కశ్మీరి పోరాటంలో భాగంగా ఉన్న మేధావులను ఏరివేయడం అనేది భారత పాలకుల లక్ష్యాలలో ఒకటి. కానీ ఆ పని సైన్యమే నేరుగా చేపడితే చాలా చెడ్డపేరు వస్తుంది, కాబట్టి సైన్యానికి మద్దతుగా ఉన్న ఈ కిరాయి ముఠాలను వాడుకోవడం భారత పాలకులకూ సైన్యానికీ చాలా అనుకూలం అయిపోయింది. కశ్మీర్ విశ్వవిద్యాలయంలోని చాలా మంది మేధావులు క్యాంపస్ నాలుగు గోడలు దాటి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఆ నాలుగు గోడల మధ్య కూడా దాదాపు గుసగుసలుగా మాట్లాడుకునే పరిస్థితి ఏర్పడింది. కశ్మీర్ విశ్వవిద్యాలయానికి వెళ్ళిన హక్కుల సంఘాల బృందంతో ఒక ప్రొఫెసర్ మాట్లాడుతూ "మీతో నేను మాట్లాడుతున్నట్లు వారికి తెలిస్తే నాపై దాడి జరుగగలదు" అని అన్నారు. విశ్వవిద్యాలయంలోని రిసెర్చ్ స్కాలర్లు కూడా చాలా ఆవేదనలో ఇదే మాట అంటూ బయటి నుంచి వచ్చిన హక్కుల సంఘాల కార్యకర్తలను కూడా మేం సందేహించాల్సిన అవసరం ఏర్పడుతుంది అని అన్నారు.

ఈ ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లను ప్రయోగించడం అనేది కేవలం సైన్యానికీ, భారత పాలకులకూ చెడ్డపేరు రాకుండా, కాగల కార్యాన్ని ముగించడానికి మాత్రమే కాక వేరే రకంగా కూడా అనుకూలమైనది. ఎందుకంటే వారు కశ్మీరీలు, స్థానికులు, తాము దాడి చేయదలుచుకున్న, లేక చంపదలుచుకున్న వ్యక్తుల యొక్క అలవాట్ల గురించి స్థానిక పరిస్థితుల గురించి అవగాహన ఉన్నవారు. పైగా కశ్మీరీలు కావడం వల్ల సులభంగా ఎవరి దగ్గరకైనా పోయి సన్నిహితంగా మెలగగలరు. మాట్లాడగలరు. ఈ అన్ని కారణాల వల్ల ఈ దుర్మార్గమైన సృష్టి భారత పాలకులకు చాలా అనుకూలమైన విషయంగా తోచింది. వీరిని కశ్మీరీలు మినహాయింపు లేకుండా రెనెగేడ్లు, అంటే విద్రోహులు అని అంటారు. వారంటే కశ్మీర్‌లో అందరికి విపరీతమైన ద్వేషం. చెప్పుకోదగ్గ విషయం ఏదంటే వీరిని విద్రోహులు అని వర్ణించేది కేవలం హురియత్ నాయకులు, లేక జమాతె ఇస్లామి కార్యకర్తలు, లేక కశ్మీర్ స్వతంత్రం కావాలి అని కోరుకునేవారు

మాత్రమే కాదు. కశ్మీర్ భారత్‌లో శాశ్వతంగా భాగం అని నమ్మే కాంగ్రెస్ వాళ్ళు కూడా వీరిని విద్రోహులు అనే అంటారు. భారత్‌లో కశ్మీర్ భాగంగా ఉండాలా లేదా అనే విషయంలో అభిప్రాయ భేదాలున్నప్పటికీ భారత పాలకులతో చేరేవాళ్ళపై సార్వజనీనంగా కశ్మీర్‌లో ద్వేషం ఉంది.

అధికార గణాంకాల ప్రకారం 1995 చివరి నాటికి 624 మంది మిలిటెంట్లు లొంగిపోయారు. 1996లో లొంగుబాట్ల సంఖ్య పెరిగింది. ఏప్రిల్ నెల నాటికి మరొక 300 మంది లొంగిపోయారు. వీరందరు కూడా రెనెగేడ్లుగా, అంటే ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లుగా మారలేదు. కొంతమంది సాధారణ జీవితం జీవిస్తుండవచ్చు. న్యూఢిల్లీకి చెందిన పీపుల్స్ రైట్స్ ఆర్గనైజేషన్ రెనెగేడ్ గ్రూపుల గురించి చాలా సమాచారాన్ని సేకరించి ఒక రిపోర్టును 1996లోనే ప్రచురించింది. 8 రెనెగేడ్ గ్రూపులను ఈ రిపోర్టు గుర్తించింది. జంషెడ్ సిరాజి ఉరఫ్ కుకాపరే నాయకత్వం వహించినట్టి అతిపెద్ద రెనెగేడ్ బృందం ఇఖ్వానుల్ ముస్లిమూన్. ఇది లోయలో అంతటా ఉందికాని అనంత్‌నాగ్. బారాముల్లా జిల్లాలలో ప్రధానంగా ఉంది. గులాంనబి ఆజాద్ నాయకత్వంలోని ముస్లిం ముజాహిదీన్ ప్రధానంగా అనంతనాగ్ జిల్లాలో ఉంది. చౌదరి జలాలుద్దీన్ నాయకత్వంలోని ముస్లిం లిబరేషన్ ఆర్మీ కూడా ప్రధానంగా అనంతనాగ్ జిల్లాలోనే ఉంది. అదే విధంగా లియాకత్‌అలీ ఉరఫ్ హిలాల్ హైదర్ ఏర్పాటుచేసిన జమ్మూ కశ్మీర్ ఇఖ్వాన్ కూడా అదే జిల్లాలో ప్రధానంగా ఉంది. ఇండియన్ అల్‌బుర్క్ అనే గ్రూపు కుప్వారా జిల్లాలో, హుస్సేని కమాండోస్ బడ్గాం జిల్లాలో, తాలిబన్ శ్రీనగర్ జిల్లాలో పనిచేస్తున్నాయి. కశ్మీర్ లిబరేషన్ జిహాద్ ఫోర్స్ మరొక రెనెగేడ్ సంస్థ. భారతసైన్యం ఈ నేరగాళ్ళయిన మాజీ మిలిటెంట్ల సహాయ సహకారాల్ని ఏ విధంగా సంపాదించుకుంటుందో పైన చెప్పిన రిపోర్టు వివరంగా విశ్లేషించింది. మిలిటెంట్ గ్రూపులు అయిన హిజ్‌బుల్ ముజాహిదీన్, ఇఖ్వానుల్ ముస్లిమూన్ వంటి సంస్థల్లో అంతర్గతమైన కొట్లాటలను, ఆ సంస్థల పరస్పర ఘర్షణలను వాడుకుని ఆ ఘర్షణలను పెంచగల వ్యక్తులను కోవర్టులుగా ఆ సంస్థలలో చొప్పించి మిలిటెన్సీని నేరపూరితంగా తయారుచేయడానికి ప్రయత్నం చేయడం, ఆ క్రమంలో తయారైన మాజీ మిలిటెంట్ నేరగాళ్ళను రెనెగేడ్ బృందాలుగా రూపొందించడం భారత సైన్యం ఒక పద్ధతిగా చేస్తుంది.

ఈ రెనెగేడ్ గ్రూపుల్లో చాలా వాటికి, చాలా విలువైనటువంటి హిమాలయ అడవుల కలప దొంగతనం ఒక ప్రధాన ఆదాయ మార్గం. దాంతోపాటు సాధారణ ప్రజానీకాన్ని దోచుకోవడం, బలవంతపు వసూళ్ళు, వారికి ఆదాయ మార్గాలు. భారత సైన్యానికి ఈ విషయాలు బాగానే తెలుసు కాని వారు చూసీ చూడనట్టు పోతారు. భారత రాజ్యానికి వారు చేస్తున్న సహాయానికి ఇది భారత రాజ్యం వారికి ఇస్తున్న వేతనం. ఈ అవకాశం,

అంటే దోచుకొని డబ్బు సంపాదించే అవకాశం ఉండటం కూడా రెనెగేడ్ గ్రూపుల్లో చేరడానికి ఒక ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. అనైతికము, చట్ట వ్యతిరేకము, అప్రజాస్వామికము, అయిన ఈ విధానం కశ్మీర్ లోయలో అరాచక నేర ప్రవృత్తిని విపరీతంగా పెంచుతుంది అని భారత ప్రభుత్వానికి బాగానే తెలుసు. కశ్మీరీలు భారత్‌ను ఈ కారణంగా మరింత ద్వేషిస్తారని కూడా తెలుసు. అయినప్పటికి భారత్ పట్టించుకోదు. ఎందుకంటే తుపాకియే కశ్మీర్ సమస్యను పరిష్కారం చేస్తుందని వారు నమ్ముతున్నారు.

ఈ రెనెగేడ్ గ్రూపుల తయారీలో ప్రధాన పాత్ర భారత సైన్యంలో భాగమైన రాష్ట్రీయ రైఫిల్స్‌ది. ఇది నేరుగా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు జవాబుదారీ అయిన మిలిటెంట్ వ్యతిరేక సైనిక శాఖ. పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైన ఒక కశ్మీరీ కాంగ్రెస్‌వాది మాటల సందర్భంగా నోరుజారి రాష్ట్రీయ రైఫిల్స్ ఒక నేరగాళ్ల ముఠా అని అంటాడు. అయితే రాష్ట్రీయ రైఫిల్స్‌లో లెఫ్టినెంట్‌లు, అంతకంటే పైన ఉన్న ఆఫీసర్లు పెద్ద మనుషులే గాని కింది మనుషులు అంటే సాధారణ సైనికులు నేరగాళ్లు అని అంటాడు. ఇది అసాధ్యమని వేరే చెప్పనవసరం లేదు. ఆఫీసర్లు అందరూ పెద్దమనుషులైతే జవాన్లు నేరగాళ్లు కావడానికి వీలులేదు. వాస్తవమేమిటంటే భారత రాజ్యం ఉద్దేశపూర్వకంగా పనిగట్టుకొని నడుపుతున్న మిలిటెంట్ వ్యతిరేక వ్యూహంలో అంతర్భాగంగానే రాష్ట్రీయ రైఫిల్స్ ఈ నేరగాళ్ల ముఠాలను తయారుచేస్తున్నది. ఇఖ్వానుల్ ముస్లిమూన్ సభ్యులు నేరాలు చేస్తూ దోచుకుంటూ హత్యలు చేస్తూ తిరుగుతూ ఉన్నప్పుడు రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు వారితోపాటు ఉంటారు. దీన్ని పెద్దగా దాచిపెట్టుకోవడానికి రాష్ట్రీయ రైఫిల్స్ అధికారులు ప్రయత్నం చేయడం లేదు. ఒక రాష్ట్రీయ రైఫిల్స్ అధికారి హక్కుల సంఘాలతో మాట్లాడుతూ "అవును నిజమే. సరెండరైన మిలిటెంట్లను డబ్బులిచ్చి, తాగించి మేము దిగజార్చడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు అయిపోయేదాక వారు ఉపయోగపడ్డారు. ఆ తరువాత వారి ఆయుధాలు స్వాధీనం చేసుకుంటాం, లేదా వారిని చంపేస్తాం". ఈ మాట అనడానికి అధికారి మొహమాటం కూడా పడలేదు. కశ్మీర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఒక ప్రొఫెసర్ కూడా ఇదే మాట అంటాడు. ఒకసారి వారి అవసరం తీరిన తరువాత లేదా వారు సైన్యం అదుపు దాటి మరీ పెరిగిపోయిన తరువాత వాళ్ళను చంపేస్తారు.

లొంగిపోయిన ఈ మిలిటెంట్లను సమ్మెలు, బందులు విఫలం చేయడానికి వాడుకోవడం కూడా జరుగుతుంది. మూసేసిన దుకాణాల తలుపులను బలవంతంగా వారు తెరిపిస్తారు. తుపాకులతో తాళాలను కాల్చి మరీ తెరిపిస్తారు. బారముల్లాలో విన్నది ఏమిటంటే జమాతె ఇస్లామికి సానుభూతిపరులుగా పేరున్న దుకాణందారుల దుకాణాలను మొట్ట మొదటగా బలవంతంగా తెరిపిస్తారు. ఇది వారిని కించపర్చడం కోసం, మిలిటెంట్లపైన సైన్యం యొక్క విజయాన్ని ప్రదర్శించడం కోసం చేసే పని. ఈ చర్యలన్నిట్లోను సైనిక బలగాలు, సైన్యానికి అనుకూలమైన లొంగిపోయిన మిలిటెంట్లు కలిసి పనిచేస్తారు. 1995 నవంబర్‌లో పాంపోర్ పట్టణంలో ఒక ఘటన జరిగింది.

హిజ్‌బుల్ ముజాహిదీన్ పిలుపు ఇచ్చిన బంద్ సందర్భంగా ఇఖ్వానుల్ ముస్లిమూన్‌కు చెందిన రెనేగేడ్లు బలవంతంగా దుకాణందార్లను బెదిరించి దుకాణాలు తెరిపించే ప్రయత్నం చేసారు. దుకాణందార్లు ప్రతిఘటించగా ఇఖ్వానుల్ ముస్లిమూన్ కార్యకర్తలు కాల్పులు జరిపారు. వారికి తోడుగా సైన్యం కూడా రంగంలోకి దిగి ఇద్దరూ కలిసి కాల్పులు జరిపారు. దుకాణాలు తగులబెట్టారు. ఇద్దరు స్త్రీలతో సహా ఆరుగురు పౌరులు చనిపోయారు. ముప్పైఇళ్ళు, దుకాణాలు కోట్లాది రూపాయల విలువగల వస్తువులు దహనమైనాయి. గడచిన సంవత్సరం హిజ్‌బుల్ ముజాహిదీన్ ఇచ్చిన పిలుపు మేరకు అనంత్‌నాగ్ పట్టణంలో బంద్ పాటించిన దుకాణాలను మళ్ళీ తిరిగి తెరవడానికి వీలు లేదని జమ్మూ కశ్మీర్ ఇఖ్వాన్ అనే మరొక రెనెగేడ్ సంస్థ ఆదేశించింది. దీంతో మొత్తంగా అనంత్‌నాగ్ పట్టణంలోని వ్యాపారస్తులందరూ హర్తాల్ ప్రకటించి రెండు నెలలపాటు మొత్తంగా ఊరు బంద్ పాటించారు. రాజీ చేయడానికి హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు అబ్దుల్ గనీలోన్, షబీర్ అహ్మద్‌షా ప్రయత్నం చేయగా వారి రాజీ ప్రయత్నాలను ఆహ్వానించే బదులు రెనెగేడ్లు లోన్‌ను అపహరించి, బెదిరించి, ఆ తరువాత వదిలిపెట్టారు.

కశ్మీర్ లోయలో ఆనాడు ఎన్నికలు నిర్వహించడం సబబే అని చెప్పడానికి ప్రభుత్వం చూపించిన వాదనల్లో ఒకటి ఏమిటి అంటే, ఆ లోయ క్రమంగా శాంతియుత పరిస్థితులకు వస్తున్నదని. ఇది ఎంతవరకు వాస్తవమో పరిశీలించవలసిన అవసరం ఉంది. భారత సైన్యం మిలిటెంట్లను కొద్దిమేరకు వెనక్కు నెట్టగలిగింది అనేది వాస్తవము. దీని అర్థం శాంతియుత పరిస్థితులు నెలకొన్నట్టు కాదు. ఎన్నికలకు ముందు హింసాత్మక ఘటనల స్థాయి గడిచిన కొన్ని సంవత్సరాలుగా ఎంత ఉందో అంతే ఉంది. 1995 జనవరి, జూలై మధ్యకాలంలో నెలకు 300ల హత్యల దాకా జరిగాయని అందుబాట్లో ఉన్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. 1996లో జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ముందు సరిగ్గా అదే స్థాయిలో హత్యలు జరిగాయి. 1996 ఏప్రిల్ 1 నుంచి మే 23 వరకు మొత్తం 53 రోజుల్లో జరిగిన హత్యల గణాంకాలు ఈ విధంగా ఉన్నాయి. సైనిక బలగాల వారి చేతిలో చనిపోయినవారి సంఖ్య 321, మిలిటెంట్ల చేతిలోను, లొంగిపోయిన మిలిటెంట్ల చేతిలోను చనిపోయినవారి సంఖ్య 186, నిజమైన ఎదురుకాల్పుల్లో చనిపోయినవారి సంఖ్య 2, ఏ విధంగా చనిపోయారో తెలియకుండా, అయితే హింసాత్మకంగా, ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 21 అంటే మొత్తం 530. 53 రోజుల్లో 530 మరణాలంటే రోజుకు 10, నెలకు 300 అని అర్థం.

ఈ లెక్కలు, గణాంకాలు, అటు ఉంచి ప్రతి రోజూ సాయుధ సంఘర్షణలో 10 ప్రాణాలు పోతున్న పరిస్థితులు ఎన్నికలు అనే ప్రజాస్వామిక ప్రక్రియను నిర్వహించడానికి తగినటువంటి పరిస్థితులేనా? మరొక చెప్పుకోదగ్గ విషయం ఏంటంటే ఎన్నికలు దగ్గర పడే కొద్దీ సైనిక బలగాల చేతిలో చనిపోతున్న వారిలో విదేశీ మిలిటెంట్లు అని

పిలవబడుతున్న వారి సంఖ్య ఎక్కువైంది. ఏప్రిల్ 14న 8 మంది విదేశీ మిలిటెంట్లు, ఏప్రిల్ 15న అయిదుగురు, ఏప్రిల్ 16న 8 మంది, ఏప్రిల్ 20న 12 మంది, ఏప్రిల్ 21న 16 మంది మొత్తం మే 23 నాటికి 106 మంది విదేశీ మిలిటెంట్లు చనిపోయినట్టు సైన్యం చెప్పింది. మే 17 ఒక్కరోజే 18 మంది విదేశీ మిలిటెంట్లు చనిపోయినట్టు సైన్యం ప్రకటించింది. ఈ సమాచారాన్ని వ్యాఖ్యానిస్తూ సరిహద్దు భద్రతాదళం (బిఎస్ఎఫ్) ఇన్స్పెక్టర్ జనరల్ అప్పా సహిబ్ అహిర్ ఏమంటారంటే పాకిస్తాన్ ఎన్నికలను అడ్డుకోవడానికి దాదాపు 400 నుంచి 500 దాకా విదేశీ కిరాయి సైనికులను పంపించింది అనీ, ఎన్నికలు సమీపిస్తుండగా సైన్యం చేతిలో చనిపోయిన మిలిటెంట్ల సంఖ్యలో విదేశస్థుల సంఖ్య ఎక్కువుండటం దీనికి సూచిక అనీ అంటాడు. ఇది నిజమా, లేక చనిపోయిన మిలిటెంటు విదేశీయుడా కాదా అని నిర్ధారించగల స్వతంత్ర సంస్థ ఏదీ కశ్మీర్‌లో లేదు కాబట్టి పాలనా యంత్రాంగం పాకిస్తాన్ మీద వేసిన అభియోగాన్ని రుజువు చేసుకోవడం కోసం చనిపోతున్న వాళ్ళలో విదేశీయులు ఎక్కువగా ఉన్నారు అనే కల్పన ప్రచారం చేసిందా? ఈ రకమైన అనుమానం వ్యక్తం చేస్తే భారత ప్రభుత్వ అధికారులకు కోపం వస్తుంది. కాని దీనికి బాధ్యత వారిదే. ఎందుకంటే జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న సైనిక చర్యలకు సంబంధించి ఏ రకమైన స్వతంత్ర పర్యవేక్షణనూ వాళ్ళు అనుమతించరు.

హింస పరిమాణాన్ని అటుంచి, ఎన్నికల నేపథ్యంలో 'మూడు తుపాకుల మధ్య మేం నలిగిపోతున్నాం' అని ప్రజలు తరుచుగా అనడం గమనార్హం. ఆ మూడు (1) భారత సైనిక బలగాల తుపాకి (2) హిజ్బుల్ ముజాహిదీన్ వంటి మిలిటెంట్ సంస్థల తుపాకి (3) రెనెగేడ్ల తుపాకి. ఎన్నికల్లో ఈ తుపాకులు ఏ విధంగా ప్రజలపైన ఒత్తిడి పెట్టాయి అనే విషయాన్ని చెప్పేముందు మరొక విషయాన్ని స్పష్టం చేయవలసి ఉన్నది. కశ్మీర్‌కు సంబంధించి భారత ప్రభుత్వం చేసిన ప్రచారంలో ఒక అంశమేమిటంటే కశ్మీరీలు సాయుధ పోరాటంతో విసిగిపోయి ఉన్నారు, నిరాశ చెంది ఉన్నారు, అలసిపోయి ఉన్నారు, అందువల్ల వాళ్ళు ఎన్నికల్లో పాల్గొని భారత రాజకీయాల జనజీవన స్రవంతిలోకి రాదలచుకున్నారు అని. భారత ప్రభుత్వం ఆదేశాలకు తగినట్టు నడుచుకోవడాన్ని జన జీవన స్రవంతి అని పిలవడం అభ్యంతరకరం అనే విషయాన్ని పక్కన పెట్టినా కశ్మీరీ ప్రజల మానసిక స్థితి గురించి భారత ప్రభుత్వం ఇస్తున్న అంచనా ఎంతవరకు వాస్తవమైంది అని చూడవలసిన అవసరం ఉంది. ఎందుకంటే ఎన్నికల నిర్వహణ సరైనదే. సబబైనదే అని చెప్పుకోవడానికి భారత ప్రభుత్వం దాన్ని కారణంగా చూపించింది కాబట్టి. ఆ రోజుల్లో ప్రజలు తరచుగా నిరాశ, నిస్పృహలు వ్యక్తం చేసిన మాట వాస్తవమే. అప్పటికి ఏడు సంవత్సరాలుగా సాగుతున్న పోరాటంలో విజయం సంభవమా అనే అనుమానం తరుచుగా వ్యక్తం అయిన మాట వాస్తవమే. గతంలో కంటే మిలిటెంట్ల చర్యలపట్ల మరికొంత ఎక్కువ విమర్శ వ్యక్తం కావడం మొదలయింది. 'భారత ప్రభుత్వం

చెప్తున్నట్టు మిలిటెన్సీ తగ్గిపోతున్నమాట వాస్తవమేనా?' అని ప్రశ్నించినపుడు కశ్మీర్ విశ్వవిద్యాలయంలోని ఒక రీసెర్చ్ స్కాలర్ చాలా జాగ్రత్తగా ఈ మాట అంటాడు, పరిమాణంలో కొంతవరకు తగ్గిన మాట వాస్తవమేనని. దాని భావాన్ని వివరించమని కోరగా, నిజాయితీ లేనటువంటి, నిబద్ధత లేనటువంటి, కార్యకర్తలు పక్కకుపోయి గుణంరీత్యా సరైన కార్యకర్తలు మాత్రమే మిగిలారు అని అంటాడు. భౌతిక పరిమాణం తీసుకుంటే మిలిటెన్సీ యొక్క స్థాయి తగ్గింది కానీ, స్వాతంత్ర్యం కావాలనే సాధారణ ప్రజాకాంక్ష తగ్గలేదు అనేది కూడా అతని భావం కావచ్చు. ఈ రెండవ అంశాన్ని ఒక ఆటోరిక్షా డ్రైవర్ శ్రీనగర్‌లో మరికొంత స్పష్టంగా అన్నాడు. తన జీవనాధారాన్ని తనకు లేకుండా చేస్తున్న నిరంతరాయమైన ఈ సంఘటనలపట్ల ఆయన విసిగిపోయి ఉన్నాడు. అర్ధరాత్రి కూడా తనకు గిరాకీ దొరికిన రోజులు తిరిగి రావాలని కోరుకుంటున్నాడు. భారత ప్రభుత్వం మిలిటెంట్లతో మాట్లాడదు, మిలిటెంట్లు భారత ప్రభుత్వంతో మాట్లాడరు కాబట్టి స్వాతంత్ర్యం అనే ఈలక్ష్యం సాధ్యమా అసలు? అని సందేహిస్తున్నాడు. మిలిటెంట్లు విజయం సాధించగలరా అనే విషయంలో చాలా నిరాశ, నిస్పృహలకు గురై ఉన్నాడు. అయితే ఒకవేళ సాధ్యమంటూ అయితే స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నాడా అంటే నూటికి నూరు శాతం కోరుకుంటున్నాను అని మాత్రం జవాబిస్తాడు.

కశ్మీరీల్లో కనిపించే అలసట, నిరాశ అనేవి తమ లక్ష్యానికి సంబంధించినవి కావు. ఆ లక్ష్యం ఎంతమేరకు సాధ్యమవుతుంది అనే విషయాలకు సంబంధించినవి. ఈ వాస్తవాన్ని భారత ప్రభుత్వము గ్రహించదు. మన పత్రికల్లో ప్రతిరోజూ పుంఖానుపుంఖాలుగా కశ్మీర్‌పైన వ్యాసాలు రాసే రచయితలు గ్రహించరు. పైగా ఆ ప్రజల్లో నిరాశ,నిస్పృహలు ఉండడానికి ప్రధాన కారణం భారత ప్రభుత్వం యొక్క క్రూరమైన అణచివేత విధానం. అంతే తప్ప తమ లక్ష్యమే ఒక తెలివి తక్కువ లక్ష్యమని వారు గ్రహించారని మన పత్రికా సంపాదకులు చెబుతున్నది వాస్తవం కాదు. స్వయం నిర్ణయాధికారం కావాలన్న లక్ష్యం పట్ల ఉత్సాహం ఏమీ తగ్గలేదు. కశ్మీరీలను నిరాశ, నిస్పృహల స్థాయికి భౌతికంగా అణగదొక్కిన భారత ప్రభుత్వం, వాళ్ళు అలసిపోయారు అని గర్వంగా ప్రపంచానికి అంతా చెప్తూ,వారు జన జీవన స్రవంతిలోకి వచ్చేస్తున్నారు, అంటే స్వయం నిర్ణయాధికార ఆకాంక్షను వదిలిపెడుతున్నారు. అని ప్రకటించుకోవడం సిగ్గుమాలిన విషయం.

ఏ నిర్బంధమైతే నిరాశ, నిస్పృహలకు దారితీసిందో దానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. పుల్వామా జిల్లాలోని త్రాల్ ప్రాంతంలో మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాలకు బాధ్యత వహిస్తున్న ఒక కల్నల్ ఏమన్నాడంటే గ్రామాలలో ఇళ్లను సోదా చేసే క్రమంలో జరిగిన కాల్పులు, ఎదురు కాల్పుల్లో చాలా మంది అమాయక ప్రాణులు చనిపోయారు. అందువల్ల మిలిటెంట్లకు గతంలోలాగా ఆశ్రయమివ్వడానికి ప్రజలు సందేహిస్తున్నారు అని.

ఈ సోదా ప్రక్రియలో సైనిక బలగాలు మిలిటెంట్లకు ఆశ్రయమిస్తున్నట్టు అనుమానించే ఇళ్లకు చెందిన యువకులను తీసుకుపోతారు. వాళ్ళను చిత్రహింసలకు గురిచేయడము, కాల్చి పారేయడము జరుగుతుంది. అతి క్రూరమైన ఈ పద్ధతిలోనే భారత ప్రభుత్వం కశ్మీరీల సంకల్పాన్ని అణగదొక్కింది. ఈ ఘనకార్యం సాధించినందుకు భారత సైన్యాన్ని కశ్మీర్ గవర్నర్ జనరల్ అయిన జనరల్ క్రిష్ణారావు మాత్రమే కాక మన పత్రికల సంపాదకులు, పత్రికలలో వ్యాసాలు రాసేవారు కూడా గొప్పగా మెచ్చుకుంటున్నారు. మళ్ళీ వాళ్ళు ఏ కొంచెం అవకాశం దొరికినా నీతులు మాట్లాడడానికి వెనుకాడే మనుషులు కారు.

ఈ అణచివేత విధానానికి తోడుగా ఎన్నికల ముందు తొమ్మిది లేక పది నెలల్లో ప్రజలపైకి రెనెగేడ్లను వదిలిపెట్టే విధానం ఒకటి వచ్చి చేరింది. ఈ సాధనాన్ని ఉపయోగించుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి వాళ్ళ సంకల్పాన్ని మెత్తబరచి ఎన్నికల్లో పాల్గొనడానికి వాళ్ళను తయారుచేయడం భారత సైన్యం యొక్క ఉద్దేశ్యం. ఇఖ్వానుల్ ముస్లిమూన్ ఉప కమాండరయిన గులాం అహ్మద్‌లోన్ ఉరఫ్ పాపాకిష్ట్ వారిని ఎన్నికలకు రెండు రోజులు ముందు హక్కుల సంఘాల వాళ్లు కలిసినప్పుడు 'తుపాకుల వల్లనే కశ్మీర్‌లో ఎన్నికలు, ప్రజాస్వామ్యం సాధ్యమయ్యాయి అని అతను గర్వంగా ప్రకటించుకున్నాడు. ఇతను గవర్నర్ క్రిష్ణారావుకంటే, ఇతర అధికార ప్రతినిధులకంటే నిర్మొహమాటంగా మాట్లాడాడు అని చెప్పుకోవచ్చు. అతని అధినేత అయిన కుకాపరే అభిప్రాయంలో ఎన్నికలు, ప్రజాస్వామ్యం మాత్రమే కాదు. భారతదేశం యొక్క సార్వభౌమత్వం, పాకిస్తాన్‌లో ఉన్న జమ్మూకశ్మీర్‌ను తిరిగి మళ్ళీ భారతదేశంలోకి కలిపేసుకోవడం అనే ఆ చివరి కర్తవ్యం కూడా ఇఖ్వానుల్ ముస్లిమూన్ రెనెగేడ్ల తుపాకుల ద్వారా సాధ్యమవుతాయి. 'నాకు మూడు నెలల స్వేచ్ఛ ఇవ్వండి, లోయలో ఒక్క తుపాకి లేకుండా చేస్తాను. ఆ తరువాత ఒక్క నెల సమయం ఇవ్వండి. ఆజాద్ కశ్మీర్‌ను విముక్తి చేసి భారత్‌లో కలిపేస్తాను' అని 1996 ఏప్రిల్ 21 నాడు ఒక బహిరంగసభలో ఇచ్చిన ఉపన్యాసంలో కుకాపరే అన్నాడు. అతను కోరుకుంటున్న స్వేచ్ఛ ఏమిటో ఊహించడం కష్టం కాదు.

ఈ నేపథ్యంలో కశ్మీర్‌కు పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఎనిమిది మిలిటెంట్ సంస్థలు ఎన్నికల బహిష్కరణ పిలుపిచ్చాయి. ఎన్నికలను అడ్డుకోవడానికి హింసాత్మక చర్యలకు పాల్పడడానికి వెనుకాడబోమని ప్రకటించాయి. అభ్యర్థులనూ వారి ప్రచారకులనూ దాడులకు గురిచేస్తామని బెదిరించాయి. ఏప్రిల్ 23న బారాముల్లాలోని కాంగ్రెస్ అభ్యర్థి గులాం రసూల్ ఖాన్ ప్రచారంపైన దాడి జరిగింది. అటువంటి ఘటనలు మరికొన్ని కూడా జరిగాయి. బహిరంగసభలు పెద్దగా ఎక్కడా జరుగలేదు. వీధి చివరలో చిన్న చిన్న గుంపులతో అభ్యర్థులు మాట్లాడిపోవడం జరిగింది. ఎన్నికల ప్రకటన

వెలువడగానే రెనెగేడ్ మిలిటెంట్లు తమ సొంత రాజకీయ సంస్థలను ఏర్పాటు చేశారు. కుకాపరే నాయకత్వంలోని ఇఖ్వానుల్ ముస్లిమూన్ జమ్మూ కశ్మీర్ అవామీలీగ్ అనే పార్టీని స్థాపించి లోయలోని మూడు నియోజకవర్గాల్లో ముగ్గురు అభ్యర్థులను నిలబెట్టింది. హిలాల్ హైదర్ నాయకత్వంలోని జమ్మూ కశ్మీర్ ఇఖ్వాన్ జమ్మూ కశ్మీర్ అవామీ కాన్ఫరెన్స్ అనే పార్టీని స్థాపించి అనంత్‌నాగ్ సీటును ఒక అభ్యర్థిని నిలబెట్టింది. గులాంనబి ఆజాద్ నాయకత్వంలోని ముస్లిం ముజాహిదీన్ పీపుల్స్ పేట్రియాటిక్ ఫ్రంట్ అనే పార్టీని స్థాపించి అనంత్‌నాగ్‌కు ఒక అభ్యర్థిని నిలబెట్టింది. ఇతర రెనెగేడ్లు రాజకీయ పార్టీలు స్థాపించకుండా వివిధ స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇచ్చారు. ఇది వారి నిర్ణయం కాదనీ సైన్యం యొక్క ఆలోచన అనీ శ్రీనగర్‌లో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి గులాం అహ్మద్ మగామీ స్వయంగా అన్నారు. వారు ఎన్నికల్లో పాల్గొన్నట్టయితే ఎన్నికలను విజయవంతంగా నిర్వహించవచ్చునని సైన్యం నిర్ణయించింది అని ఆయన అన్నాడు. మాగామీ ఆ ఎన్నికల్లో శ్రీనగర్ నుండి పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యాడు. అనంత్‌నాగ్ నియోజకవర్గంలో కుకాపరే పార్టీ యొక్క జెండాను రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు ఎగురవేశారని ఆయన అన్నాడు. సైన్యం అనుసరించిన ఈ పథకం లక్ష్యం ఎన్నికల రాజకీయాల్లోకి ఒక నేరపూరిత రాజకీయ శక్తిని ప్రవేశపెట్టడం. అటువంటి శక్తి ఎన్నికల బహిష్కరణను విజయవంతంగా ప్రతిఘటించగలుగుతుంది అని సైన్యం నమ్మింది. సైన్యం తుపాకులూ, రెనెగేడ్ల తుపాకులూ కలిసి చెప్పుకోదగ్గ మోతాదులో ఓట్లుపడేటట్లు చూడగలిగితే, ఏదో ఒక రకంగా ఎన్నికలు నిర్వహించి ప్రపంచానికి ఇక్కడ ప్రజాస్వామ్యం ఉందని చూపించే అవకాశం భారత ప్రభుత్వానికి ఇస్తే, ఆ తరువాత అసెంబ్లీకి కూడా ఎన్నికలు పెట్టి భారత రాజ్యానికీ, రాజ్యాంగానికీ కశ్మీర్‌పైన పూర్తిగా పట్టుఉందని ప్రదర్శించుకోవచ్చు.

అంటే ఎన్నికల నిర్వహణ అనే దానికి కశ్మీరీల మనోభావాలకు రాజకీయ వ్యక్తీకరణ ఇవ్వడం అనే ప్రజాస్వామ్య ప్రక్రియతో ఏమీ సంబంధం లేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికలకు ఉండగల లక్ష్యం అదే. కాని కశ్మీర్‌లో జరిగింది అది కాదు. పాకిస్తాన్ కుట్రలుగా చెప్పబడుతున్న వాటిపైన విజయాన్ని సాధించడానికి, వేర్పాటువాదుల వ్యూహాలను అధిగమించడానికి, హురియత్ కాన్ఫరెన్స్ యొక్క కార్యకలాపాలను అడ్డుకోవడానికి, ఇటువంటి లక్ష్యాలతో భారత ప్రభుత్వానికి అనుకూలమైన వాతావరణాన్ని కలిగించడం కోసం ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక ప్రజల యొక్క ఆకాంక్షలపైన చేస్తున్న యుద్ధంలో భాగంగా దాంట్లో వ్యూహాత్మకంగా విజయం సాధించడం కోసం ఆ ప్రజల జీవితాన్నే నేరపూరితం చేయడం అనేది చాలా దుర్మార్గమైన విషయం. ఇదంతా కూడా పొరుగుదేశం యొక్క అభ్యంతరకమైన కుట్రపేరు మీద చేస్తూ ఉండవచ్చుగాక. అంతమాత్రాన ఇది అభ్యంతరకరం కాకుండా పోదు. నేరపూరితం కాకుండా పోదు. ఎన్నికల దగ్గరపడే కొద్దీ ఒక విచిత్రమైన దృశ్యం కశ్మీర్‌లో ప్రజలు చూడసాగారు. అభ్యర్థులు ఓట్ల కోసం ప్రజలను అడుగుతూ తిరుగుతూ ఉంటే వాళ్ళ పక్కన నేరచరిత్ర ఉన్న యువకులు తుపాకులు పట్టుకొని తిరుగుతూ ఉన్నారు.

వారి చేతుల్లో ఉన్నవి లైసెన్స్ లేని తుపాకులు. ఇంకొంచెం దూరంలో యూనిఫారం వేసుకున్న సైనికులు అభ్యర్థులనూ, ఈ యువకులనూ కూడా తుపాకులతో రక్షిస్తూ ఉన్నారు. అదే రోజు సాయంత్రం అదే యువకులు ఒక జమాతె ఇస్లామి కార్యకర్తను, మరొక హిజ్‌బుల్ ముజాహిదీన్ మద్దతుదారును, అపహరించి చంపటం కూడా జరగవచ్చు. అనంత్‌నాగ్ పార్లమెంట్ నియోజకవర్గంలో కుకాపరే పార్టీ అయిన జమ్మూ కశ్మీర్ అవామీలీగ్ అభ్యర్థిగా పోటీ చేసిన శుభన్ కిషన్ టిక్కు ప్రచారానికి పర్యవేక్షకుడిగా ఉండిన ఇఖ్వానుల్ ముస్లిమూన్ ఉప కమాండర్ పాపాకిష్ట్ వారి హక్కుల సంఘాల బృందంతో ఏమన్నాడంటే, “నేను పగలు ప్రచారం చేస్తాను, రాత్రి కార్యకలాపాలు చేపడతాను” తమ దగ్గర 32 మంది సాయుధ రెనెగేడ్లు ఉన్నారనీ వారు ఎన్నికల రోజు వివిధ బూత్‌లకు పోయి ఓటు వేయడానికి ప్రజలకు ధైర్యం ఇస్తారనీ అన్నాడు. వినడానికి అది బాగానే ఉంది కానీ ఒక మాజీ మిలిటెంటు తుపాకీ పట్టుకుని ఇంటికొచ్చి, వెనకాల ఒక యూనిఫారంలోని జవాన్ తొంగిచూస్తూ ఉండగా, బయటకొచ్చి ఓటు వెయ్య లేకపోతే ఏమవుతుందో చూసుకో అంటే దాని అర్థం ఏమిటో ఊహించడం కష్టం కాదు. వారు ఉపయోగించిన పద్ధతుల్లో ఒకటి రాష్ట్ర ఆర్‌టిసి బస్సులను తుపాకులతో ఆపి ప్రయాణికులను దించి వారిని ప్రేక్షకులుగా మార్చుకుని ఎన్నికల సభలు పెట్టుకోవడం.

కాంగ్రెస్ అభ్యర్థులకు త్వరలోనే ఒక సందేహం వచ్చింది. అది ఏమిటంటే కాంగ్రెస్ అభ్యర్థిలో, మరొక పార్టీ అభ్యర్థిలో కాకుండా ఈ రెనెగేడ్ల అభ్యర్థులే గెలవడం ఆర్మీకి ఇష్టమేమోనని. నిజానికి కశ్మీర్ లోయలో చాలా మంది అభిప్రాయం ఏమిటంటే శ్రీనగర్‌లో చివరికి ఒక రెనెగేడ్ల ప్రభుత్వాన్ని నెలకొల్పడం ఆర్మీ యొక్క ఉద్దేశ్యం అని. దానికి ఒక రిహార్సల్‌గానే పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను ఈ పద్ధతిలో సైన్యం నిర్వహించింది అని. బారాముల్లాలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన గులాం రసూల్ కార్ ఆ ఎన్నికలను సైన్యం అభ్యర్థులకూ కాంగ్రెస్ అభ్యర్థులకు మధ్య పోటీ అని వర్ణించాడు. చివరికి కాంగ్రెస్ నాయకుడు సైన్యం అభ్యర్థిని ఓడించిన మాట వాస్తవమే. కాని ఆమాట అన్న వ్యక్తి, అతని పార్టీ, కేవలం ఎన్నికల్లో తమ గెలుపు ఓటముల గురించే కాకుండా సైన్యం ఈ రకమైన పాత్ర పోషించడం ఎంతవరకు సబబు అని ఆలోచించి ఉండవలసింది. అయితే వారి ఆలోచన అంత దూరం పోలేదు. నిజానికి కార్ ప్రచారానికి కూడా కొంత మంది మాజీ మిలిటెంట్లు సహకరించారని వినికిడి. బారాముల్లాలో అతను నిర్వహించిన మొట్టమొదటి బహిరంగసభ కొంతమంది మాజీ మిలిటెంట్ల సహకారంతో జరిగిందని మే 20న కుప్వారాలో జరిగిన సభలో 20 లేక 30 మంది తుపాకులు పట్టుకున్న యువకులు ఉన్నారని పత్రికలు రిపోర్టు చేశాయి. అదే కాంగ్రెస్ పార్టీ అనంత్‌నాగ్‌లో నిలబెట్టిన తాజ్ మొహియుద్దీన్ విపరీతమైన నిస్పృహకు గురై ఏప్రిల్ 15న

దయాల్‌గాంలో జరిగిన అతని బహిరంగ సభపైన రెనెగేడ్లు తుపాకులతో కాల్పులు జరిపిన తరువాత రెనెగేడ్లందరిని కూడా నిరాయుధీకరించకపోతే తాను ఎన్నికల నుంచి తప్పుకుంటానని ప్రకటించాడు. వాళ్ళందరినీ జైల్లో పెట్టాలని లేకపోతే శ్రీనగర్‌లో లాల్‌చౌక్‌లో ఆత్మాహుతి చేసుకుంటానని కూడా బెదిరించాడు.

రేపు అసెంబ్లీ ఎన్నికలు గాని జరిగితే ఈ రకమైన చిత్రం మరింత వికృతంగా కనిపించే ప్రమాదం ఉందని ప్రధాన పార్టీలవారే ఆందోళన చెందారు.ఒక పోలిక చెప్పుకుంటే దీని భావం స్పష్టమవుతుంది. బొంబాయివంటి నగరంలో మాఫియాలు తమను తాము రాజకీయ పార్టీలుగా ప్రకటించుకుని అభ్యర్థులను ఎన్నికల్లో నిలబెట్టి బహిరంగంగా హింసనూ భయోత్పాతాన్నీ ఉపయోగించుకుంటూ ఉంటే పోలీసులు చూస్తూ ఉంటే ఏవిధంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇది ముంబాయిలో జరిగితే దాన్నెవరు ప్రజాస్వామ్యం అనరు. కాని కశ్మీర్‌లో జరిగితే దాన్ని ప్రజాస్వామ్యమని మాత్రమే కాదు ప్రజాస్వామ్య విజయం అని అంటారు.

ఇక సైనిక బలగాలు ఎన్నికల్లో పాల్గొనడానికి ప్రజలపైన పెట్టిన ఒత్తిడిని వివరంగా చెప్పుకోవాలి. ఆర్మీ ప్రతినిధులు ప్రకారమే 450 కంపెనీల జవాన్లు,అంటే దాదాపు 50 వేల మంది జవాన్లు లోయలోకి వచ్చారు.అంతకు ముందే దాదాపు 3 లక్షల బలగాలు లోయలో ఉన్నాయి. సైనిక బలగాలు తమకు తాము పెట్టుకున్న మొట్టమొదటి కర్తవ్యం ఎన్నికలను వ్యతిరేకిస్తున్న వాళ్ళ నోర్లు మూసేయడం. కశ్మీర్‌లో పత్రికారంగం మొత్తం మీద స్వయం నిర్ణయాధికార ఆకాంక్షకు సానుభూతిగా ఉంటుంది. మిలిటెంట్ సంస్థల యొక్క ప్రకటనలకు తగు ప్రాధాన్యం ఇస్తుంది. సైనికులు, సైనిక బలగాలు పాల్పడే అత్యాచారాలను కూడా రిపోర్టు చేస్తుంది. అందువల్ల ఎన్నికలు దగ్గరపడేసరికి జమ్మూ కశ్మీర్ పాలనా యంత్రాంగం పత్రికల నుద్దేశించి ఒక తాఖీదు జారీచేసింది. అందులోని అంశమేమిటంటే అభ్యంతరకరమైన విషయాలు ప్రచురించకూడదు అని. అభ్యంతరకరమైన విషయాలు అంటే అర్థం ఎన్నికల ప్రక్రియను విమర్శిస్తూ మిలిటెంట్లుగాని మరెవరుగాని యిచ్చే ప్రకటనలు. దీనికి బదలాగా హిజ్‌బుల్ ముజాహిదీన్ పాలనా యంత్రాంగం ఇచ్చే ప్రకటనలుగాని, చివరికి వారి అడ్వర్టయిజ్‌మెంట్లు కాని ప్రచురించవద్దని తాఖీదు జారీచేసింది. ఈ రెండు ఒత్తిళ్ళ కారణంగా కశ్మీర్‌లో పత్రికారంగం మొత్తంగానే ప్రచురణ నిలిపివేయాలని నిర్ణయించుకుంది. ఏప్రిల్ 21 నుంచి అన్ని పత్రికలు ఆగిపోయాయి. బయటి నుంచి అంటే కశ్మీర్ లోయ బయటి నుంచి పత్రికలు వచ్చాయి గాని అవన్నీ కూడా విమానం ద్వారా శ్రీనగర్‌కు వస్తాయి కాబట్టి పాలనా యంత్రాంగం వాటిని మొత్తంగానే అక్కడే పరిశీలించి అభ్యంతరకరమైన

అంశాలుగా తాను భావించే వాటిని ప్రచురించిన పత్రికలను అక్కడే ఆపేయడం మొదలుపెట్టింది. మే 11 నాడు అవామ్ అనే ఉర్దూ పత్రికను ఆవిధంగా ఆపేశారు. మే 12 నాడు కశ్మీర్‌టైమ్స్, డైలీ కశ్మీర్ టైమ్స్ అనే పత్రికలను, మే 18 నాడు ట్రిబ్యూన్ పత్రికను విమానాశ్రయంలోనే స్వాధీనం చేసుకున్నారు. చండీగడ్ నుండి ప్రచురితమయ్యే ట్రిబ్యూన్ పత్రికను జమ్మూ కశ్మీర్‌లోనే గాక బయటకూడా చదువుతారు కాబట్టి ఆ పత్రిక ప్రతులను స్వాధీనం చేసుకుంటే గొడవ అవుతుందేమో అనుకుని డబ్బులిచ్చి మొత్తం కొనేసుకున్నారు. ఏ పద్ధతి అనుసరిస్తేనేమి అధికార యంత్రాంగం చేయదలుచుకున్నది ఏమిటీ అంటే కశ్మీర్‌లో బలప్రయోగంతో, బలవంతంగా, ఎన్నికలు నిర్వహించడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని విమర్శించే ప్రచురణలను ఆపేయడం.

ఆ తరువాత చర్య కశ్మీరీ ప్రజానీకం తమ నిరసనను, ఎన్నికలపట్ల తమకుండే వ్యతిరేకతను వ్యక్తం చేయడానికి చేసే ప్రతీ ప్రయత్నాన్ని విఫలం చేయడం. మే 13 నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను లాకౌట్ చేయాలని మిలిటెంట్లు పిలుపు ఇచ్చారు మే21 నుంచి లోయలో సంపూర్ణమైన హర్తాల్‌కు పిలుపు ఇచ్చారు. లాకౌట్, హర్తాల్ మే 30 దాకా అంటే ఎన్నికలు ముగిసేదాక కొనసాగాలని మిలిటెంట్లు పిలుపిచ్చారు. అంతటి సుదీర్ఘమైన బంద్ సాధారణ ప్రజానీకానికి, ముఖ్యంగా దినవేతనాల మీద బ్రతికేవాళ్లకు, స్వయం ఉపాధి మీద బ్రతికేవాళ్ళకు, చిన్న చిన్న వ్యాపారస్తులకు, చాలా ఇబ్బందికరమైంది. ఈ విషయం హురియత్ కాన్ఫరెన్స్ నాయకులను అడిగితే లక్ష్యం కోసం ప్రజలు కష్టాలు అనుభవించక తప్పదు అని అంటారు. అయితే కొంతమంది ప్రజలే ఎక్కువ కష్టాలు అనుభవిస్తున్నట్లు అర్థమవుతూనే ఉంది. ఏమయినప్పటికీ ఒక ప్రహసనంగా తయారైన ఈ ఎన్నికలపట్ల తమ నిరసన తెలియచేయాలని కశ్మీర్ ప్రజానీకంలో ఉన్న సంకల్పాన్ని కాదనలేం. ఏకరకంగానైనా, ఏ విధంగానైన ఎన్నికలు నిర్వహించి తీరుతాము అన్న భారత ప్రభుత్వం యొక్క మొండితనంపట్ల ప్రజల్లో నిరసన ప్రధానమైన విషయంగా పరిశీలకులకు కనిపించింది. అందువల్ల అంత సుదీర్ఘమైన బంద్ దాదాపు పూర్తిగా విజయవంతమైంది. ప్రతిరోజూ లోయలో అన్ని ప్రాంతాల్లోను భారత సైనిక బలగాలు, రెనెగేడ్లు దుకాణాలు తెరిపించడానికి, ఉద్యోగులు కార్యాలయాలకు హాజరయ్యేటట్టు చూడటానికి అనేక రకాల ప్రయత్నాలు చేశారు. దీనికి వారు చూపించుకున్న సాకు ఏమిటంటే మిలిటెంట్లు తుపాకులతో బెదిరించి బంద్ నిర్వహిస్తున్నారని. నిజమే బంద్‌కుగాని, హర్తాల్‌కు గాని వ్యతిరేకంగా ఎవరన్నా వ్యవహరిస్తే మిలిటెంట్లకు ఆగ్రహం వచ్చి ఉండేది. దాడిచేసే ప్రమాదం కూడా ఉండింది. ఉదాహరణకు శ్రీనగర్‌లోని ధనికవర్గాలు నివసించే ప్రాంతాల్లో ఆటో నడపడానికి సిద్ధంగా ఉన్న ఒక ఆటో డ్రైవరు డౌన్‌టౌన్ శ్రీనగర్‌కు, అంటే మిలిటెంట్ల సానుభూతిపరులు, వారికి ఆశ్రయమిచ్చే ప్రదేశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతానికి, ఆటో తీసుకుపోవడానికి

నిరాకరించాడు. ప్రజలపైన మిలిటెంట్లు పెడుతున్న ఈ ఒత్తిడి విమర్శించవలసిన విషయమే. అయినప్పటికీ వారిచ్చిన పిలుపుకు లోయలో విశాలమైన, విస్తృతమైన మద్ధతు ఉందని గుర్తించాలి. బందు, హర్తాల్ చాలావరకు స్వచ్ఛందంగానే విజయవంతం అయ్యాయి.

ప్రభుత్వ ఆఫీసులు లాకౌట్ చేయాలని మిలిటెంట్లు ఇచ్చిన పిలుపు మే 13నాడు మొదలైంది. కశ్మీర్ టైమ్స్, డైలీ కశ్మీర్ టైమ్స్ పత్రికలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం కూడా ఆ రోజే జరిగింది. ట్రిబ్యూన్ యొక్క అన్ని ప్రతులను ప్రభుత్వం కొనుక్కున్న ఘటన మే 14న జరిగింది. స్వాధీనం చేసుకున్న ఈ పత్రికల్లో అభ్యంతరకర విషయం ఏమిటో అధికారులు ఎప్పుడూ చెప్పలేదు. బహుశా జరుగబోతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె గురించి ఆ పత్రికల్లో ఏమైనా రాసి ఉండవచ్చు. సైనిక బలగాలు, రెనెగేడ్లు, సమ్మె చేస్తున్న ఉద్యోగులను బెదిరించారు. మే 20న కుప్వారా తాహసీల్దారు ఫిర్‌దోస్ అహ్మద్ రైనాను విధులకు హాజరు కాలేదు అని సైన్యం అరెస్టు చేసింది. మరుసటి రోజే అతన్ని విడుదల చేశారు గాని సైన్యం ఒక టాక్సీని అద్దెకు తీసుకుని లౌడ్‌స్పీకర్లో విధులకు హాజరుకాని ఉద్యోగులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది అని ప్రకటించుకుంటూ తిరిగింది. కుప్వారాలో 73 మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయమైన సెక్రటేరియట్‌లో కశ్మీర్ పండిట్లు, కశ్మీరేతరులైన ఉద్యోగులు మాత్రమే హాజరయ్యారు. కశ్మీర్ విశ్వవిద్యాలయం అధికారులపైన కూడా విశ్వవిద్యాలయాన్ని నడపాలి అనే ఒత్తిడి మే 21 నుంచి మొదలైంది.

మే 21 నుంచి మొదలైన సమ్మె దాదాపు నూటికి నూరు శాతం జరిగింది. కుప్వారాలో, అనంత్‌నాగ్‌లో, పుల్వామాలో, సైనిక బలగాలు బలవంతంగా దుకాణాలు తెరిపించే ప్రయత్నాలు చేశారు. కుప్వారాలో భారత సైనిక బలగాలు లౌడ్‌స్పీకర్ పెట్టుకున్న టాక్సీలో తిరుగుతూ దుకాణాలు తెరవాలనీ లేకపోతే తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించారు. పుల్వామా జిల్లాలోని త్రాల్‌లో గాలలోకి కాల్పులు జరిపి దుకాణందార్లను బెదిరించి తాళాలు పగులగొట్టారు. అది చాలక ఇఖ్వానుల్ ముస్లిమూన్ కార్యకర్తలు దుకాణందారుల దగ్గరకొచ్చి తమ సంస్థ జెండాను దుకాణాలపై ఎగరేయాలని ఒత్తిడి చేశారు. అనంత్‌నాగ్‌లో సాయుధ యువకులు మూసిన దుకాణాల తలుపులు పగులగొట్టి వాటిని లూటీ చేశారు. కుప్వారాలో ఒకరోజు దుకాణాలు తెరవమని ప్రచారం చేసిన సైనికులు రెండవ రోజు ఈ రోజుగాని దుకాణాలు మూస్తే శాశ్వతంగా దుకాణాలు మూయవలసి వస్తుంది అని బెదిరిస్తూ ప్రచారం చేశారు. దాని ఫలితంగా కుప్వారాలో ఒక విచిత్రమైన దృశ్యం కన్పించింది. దుకాణాలన్నీ తీసే ఉన్నాయి. కాని దుకాణందారుడు లేడు, కొనుగోలుదారులు లేరు. ఒక్క పైస కూడా వ్యాపారం జరుగలేదు. బారాముల్లా జిల్లాలో అదే రకమైన బెదిరింపులు చేసినప్పటికి ఎవ్వరు దుకాణాలు తెరువలేదు.

బారాముల్లాలో జమాతె ఇస్లామి అనుయాయులను కించపర్చడం కోసం దుకాణందార్లలో ఆ సంస్థ అనుయాయులుగా గుర్తింపు ఉన్నవాళ్లను తుపాకులతో బెదిరించి వారిచేత మొట్టమొదట దుకాణాలు తెరిపించారు. దీనిని వేర్పాటువాదుల మీద సైన్యం యొక్క విజయంగా అధికారులు భావించారు. ఈ రకంగా బారముల్లాలో ఒక 25శాతం దుకాణాలు తెరిపించి ఉంటారు.

సమ్మెను, హర్తాల్‌ను విఫలం చేయడానికి ఇటువంటి ప్రయత్నాలు చేయడమే కాక ఎన్నికల్లో పాల్గొనక తప్పదు అంటూ సైనిక బలగాలు ప్రజలకు పదే పదే బెదిరింపులు జారీ చేశారు. ఎన్నికలు బహిష్కరించిన వాళ్ళు దాని పర్యవసానం అనుభవించవలసి వస్తుంది అని బెదిరించారు. ఈ విషయం లోయలోని 3 నియోజకవర్గాల్లోనూ అంటే బారాముల్లాలో, అనంత్‌నాగ్‌లో, శ్రీనగర్‌లో ప్రజలు హక్కుల సంఘాల వారితో అన్నారు. హిజ్‌బుల్ ముజాహిదీన్ మే 4న ఇచ్చిన ఒక పత్రికా ప్రకటనలో, సైనిక బలగాలు ప్రజలను ఓటు వేయకపోతే వ్యవసాయం చేసుకోనివ్వము అని బెదిరిస్తున్నాయని ఆరోపించారు. అందరూ ఓటు వేయాలని సైన్యానికి ఎందుకు అంత పట్టుదల? ఎన్నికల బహిష్కరణ పిలుపుకు చెప్పుకోదగ్గ మోతాదులో మద్దతు ఉన్నప్పటికీ లోయలో ఒక సెక్షన్ ప్రజలు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నమాట వాస్తవమే. అంతేకాకుండా కశ్మీర్ లోయ నుంచి బయటికి వలస వెళ్ళిపోయిన పండిట్లు ఓటు వేయడానికి సిద్ధమే. భారతదేశపు ఎన్నికల నియమాలు ఒక కనీస ఓట్ల ప్రమాణమేమి పెట్టవు. అంటే తక్కువ మంది ఓట్లు వేసినా మెజారిటీ ఓట్లు వచ్చినవారు గెలిచినట్లే. మరి ఎందుకు సైనిక బలగాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో ఓట్లు వేయాలన్న ఈ పట్టింపు? ఒక కాంగ్రెస్ నాయకుడు సైన్యం యొక్క చర్యను సమర్థిస్తూ దాన్ని ఈ విధంగా వివరించాడు. కాంగ్రెస్ మద్ధతుదారులు లేక నేషనల్ కాన్ఫరెన్స్ మద్దతుదారులు ఒక్కొక్క గ్రామంలో 3 లేక 4 కుటుంబాలు మాత్రమే ఉంటారు. వారు మాత్రమే ఓటు వేయడానికి భయపడతారు. అయితే గుంపులో ఒకరుగా పోయేటట్లయితే వారికి ఓటు వేసే ధైర్యం ఉంటుంది. రెండవ కారణం ఏమిటంటే తక్కువ మందిగాని ఓట్లు వేస్తే భారత్‌కు ప్రపంచ వేదికలో పరువుపోతుంది. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ, నేషనల్ కాన్ఫరెన్స్ ఎన్నికల్లో రిగ్గింగ్ చేసి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ప్రయత్నం చేసేవనీ, దానికి కారణం ఏమిటంటే వేర్పాటువాదుల ఎన్నికల బహిష్కరణ పిలుపును ప్రజలు తిరస్కరించారని ప్రచారం చేయవలసిన అవసరం అనీ అంటాడు. ఇక ప్రజాస్వామ్యం మాట అంటారా? జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని మరీ దూరం లాగకూడదు. ఎందుకంటే అది పాకిస్తాన్ అనుకూల శక్తులకు లేదా స్వతంత్ర శక్తులకు ఊతమిస్తుంది అని ఆయన అంటాడు.

ఇంతకంటె స్పష్టంగా చెప్పడం సాధ్యం కాదు. జమ్మూ కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఎదగనిస్తే ఆ రాష్ట్రం భారత్ నుంచి విడిపోతుంది అనేది మొదటి నుంచి భారత పాలకులకు ఉన్నటువంటి భయం.

ఎన్నికల బహిష్కరణ కోసం ప్రచారం చేసిన ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్ నాయకుల మీద పదే పదే ఎన్నికలకు పూర్వం దాడులు చేయడం జరిగింది. చివరికి వాళ్ళు కేవలం ప్రాణ భయంతో తమ ప్రచారాన్ని మానుకునే పరిస్థితి ఏర్పడింది. అబ్దుల్ గనీలోన్, సయ్యద్ అలీషా గిలానీల ఇళ్లపైన గ్రానేడ్లతోను, రాకెట్లతోను దాడులు జరిగాయి. మే 9వ తేదీనాడు బారాముల్లా జిల్లా సొపోర్ సమీపంలోని బోమియా గ్రామంలో హురియత్ కాన్ఫరెన్స్ నాయకులు ఎన్నికల బహిష్కరణ ప్రచారం చేస్తూ ఉండగా కొంతమంది రెనెగేడ్లు తుపాకులతో వచ్చి ఆ మీటింగ్ పైన కాల్పులు జరిపారు. ఆ మీటింగ్‌లో సయ్యద్ అలీషా గిలాని, అబ్దుల్‌గనీలోన్, ప్రొఫెసర్ అబ్దుల్ గనిభట్, జావేద్ మీర్‌లతో పాటు యాసిన్ మాలిక్ కూడా ఉన్నాడు. అతని కథనం ప్రకారం స్థానిక పోలీసులు ఆ రెనెగేడ్ల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారుగాని, సైనిక జవాన్లు వెంటనే వచ్చి పోలీసులను కొట్టి ఆ తుపాకులను తాము స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా సైనిక జవాన్లు అబ్దుల్ అహోద్ వజాద్, అబ్దుల్ గనీలోన్లను తుపాకులతో కొట్టారు. అబ్దుల్ గనీలోన్ ఈ విషయంలో సొపోర్ పోలీసు స్టేషన్లో ఒక ఫిర్యాదు కూడా ఇచ్చారు. వారు తిరిగి శ్రీనగర్‌కు వస్తూ ఉండగా పటన్ వద్ద ఒక పేలుడు జరిగి వారి కారుకు దెబ్బ తగిలింది. మే 11 నాడు హురియత్ నాయకులు ఒక పెద్ద బలగంతోపాటు చరార్-ఇ-షరీఫ్ పోతూ ఉండగా రెండు మందు పాతరలు దారిలో వారి కారుకు సమీపంలో పేలాయి. మరొక రెండు రోజుల తరువాత మే 13న శ్రీనగర్‌లో రాజ్‌బాగ్ ప్రాంతంలోని హురియత్ కాన్ఫరెన్స్ ఆఫీసు వద్ద పెద్ద పేలుడు సంభవించింది. ఆఫీసు గోడలు దెబ్బతిని నీటిసరఫరా వ్యవస్థ పాడయింది.

మే 23 బారాముల్లా అనంత్‌నాగ్‌లలో ఎన్నికల దినం. ప్రతి గ్రామంలోను పొద్దున 6 గంటలకు, కొన్ని గ్రామాల్లో అంతకంటే ముందే కూడా. గ్రామ మసీదు నుండి సైనిక బలగాలు ప్రజలందరినీ ఇళ్ల నుండి బయటకు వచ్చి పోలింగ్ బూత్ వద్ద లైను కట్టవలసిందిగా ఆదేశిస్తూ ప్రకటన చేశారు. నిద్రలేచారా, ముఖం కడుక్కున్నారా లేదా అనేది అప్రస్తుతం. వాళ్లంతా వెంటనే బయటికి వచ్చి లైను కట్టాల్సిందే. ఇక ఓటు వేయాలని ఇష్టముందా లేదా అనేది మరీ అప్రస్తుతం. ఈ ప్రకటన చేసిన తరువాత సైనిక బలగాలు ఇంటింటికి పోయి ప్రజలను బయటకు లాగారు. వాళ్ళకేం చెప్పారు అంటే ఎన్నికలు అయిపోయిన తరువాత, ఎన్నికల సిబ్బంది వెళ్ళిపోయిన తరువాత సైన్యం మళ్ళీ ఇంటింటికి వస్తుందని, ఎవరి వేలు మీద అయితే ఓటు వేసినట్టు ఇంకు గుర్తు ఉండదో వారు పర్యవసానాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని. హక్కుల సంఘాల

బృందం హధివార, అవంతిపురా గ్రామాల్లో ఇళ్ల నుంచి బయటకు లాగిన ప్రజలతో మాట్లాడింది. ఆ ఊళ్లలో ప్రజలను సైనిక బలగాలు ఇళ్ల నుండి బయటికి లాక్కొచ్చారు. బిజ్‌బెహారాలో ఇఖ్వానుల్ ముస్లిమూన్‌కు చెందిన రెనెగేడ్లు, రాష్ట్రీయ రైఫిల్స్ కలిసి ఈ పని చేశాయి. పొద్దున్న ఇంటింటికి పోవడానికి ముందు, తెల్లవారుఝామున మూడు గంటలకే ఒక సెర్చ్ లైటును గ్రామంపైన వేసి గాలిలోకి తుపాకులతో కాల్పులు జరిపారు. బారుస్ గ్రామంలో ఈ పని సిఆర్‌పిఎఫ్ చేసింది. బొజెరాలో సైనిక బలగాలు ప్రజలను నాలుగు ట్రక్కులలో ఎక్కించుకుని పోలింగ్‌బూత్‌కు తీసుకుపోయారు. బారముల్లా జిల్లాలోని డెలీనా గ్రామంలో ఈ పని బిఎస్ఎఫ్ చేసింది. హక్కుల సంఘాల బృందం చూస్తుండగానే బిఎస్ఎఫ్ జవాన్లు కొంత మంది స్త్రీలను కొట్టి బలవంతంగా పోలింగ్‌బూత్‌వైపు తీసుకుపోయారు. కొన్నిచోట్ల సైనిక బలగాలతోపాటు రెనెగేడ్లు ఉన్నారు. కొన్నిచోట్ల సైనిక బలగాల బదులు రెనెగేడ్లు ఉన్నారు. సొపోర్ సమీపంలోని దంగర్‌పురా గ్రామంలో కుకాపరే మనుషులు తెల్లవారుఝామున తుపాకులతో ఇళ్లమీదికి పోయి ప్రజలను బయటికి లాక్కొచ్చిలైను కట్టించారు. బారాముల్లా, సొపోర్ పట్టణాల్లో సైనిక బలగాలు పొద్దున్నే తమ ఐడెంటిటీ (గుర్తింపు) కార్డులను తీసేసుకుని సాయంత్రం ఓటు వేసిన చిహ్నం వేలుమీద ఉంటే తిరిగి ఇస్తామని చెప్పారని కొంతమంది ప్రజలు ఫిర్యాదు చేసారు. ఇది ఎంత భయాన్ని కలిగిస్తుందో తెలుసుకోవాలంటే కశ్మీర్‌లో గుర్తింపుకార్డు లేని ఏ కశ్మీర్ ముస్లింనైనా పట్టుకుంటే ఇంటరాగేషన్ కేంద్రానికి తీసుకుపోయి ఇక తాను పాకిస్తానీ కాదని, ఆఫ్ఘాని కాదనీ అతన్నే రుజువు చేసుకొమ్మని చెప్పి రుజువు చేసుకునేదాక హింసిస్తారని చెప్పాలి. లేదా అతన్ని కాల్చి పారేసి సరిహద్దు దాటుతున్న చొరబాటుదారుడు ఎన్‌కౌంటర్‌లో మృతి అని ప్రకటిస్తారు. అనంత్‌నాగ్ నియోజకవర్గంలోని ఒక జిల్లా కేంద్రమైన పుల్వామాలో తమను బలవంతంగా బయటకు తీసుకురావడమేకాక కొట్టి మరీ లైన్లో నిలబెట్టించారని ప్రజలు చెప్పారు. శ్రీనగర్ నుంచి అనంత్‌నాగ్‌కు తెల్లవారుఝామున పోతున్న పత్రికా విలేఖర్లను పాంపోర్ వద్ద జాతీయ రహదారిపై అరగంట ఆపారు. కారణం చెప్పలేదు. ఎందుకో తెలియజేయలేదు. తరువాత వాళ్ళు ఊహించిందేమిటంటే ఆ గ్రామంలో ప్రజలను బలవంతంగా బయటికి లాక్కొచ్చే కార్యక్రమం అప్పుడు నడుస్తూ ఉండింది. అందువల్ల పత్రికా విలేఖరులు దాన్ని చూడకుండా ఉండటం కోసం వారిని ఆపారు అని. బారముల్లా జిల్లాలోని కొన్ని గ్రామాలలో ఓటర్ల జాబితాలో పేరులేనోళ్లను కూడా సైనిక బలగాలు బయటికి బలవంతంగా తీసుకువచ్చారు. పోలీసుస్టేషన్లో రెండు లిస్టులున్నాయి. ఓటరు లిస్టులో పేరు ఉన్నవాళ్లది ఒకటి, ఓటరు లిస్టులో పేరు లేనివాళ్లది ఒకటి. ఇద్దరు కూడా పోలింగ్‌బూత్‌కి వచ్చి వేలికి ఇంకుచుక్క

వేసుకుని సాయంత్రం సైనిక బలగాలకు కనిపించవలసి వచ్చింది. ఈ ఇంకుచుక్క సాధారణ ఎన్నికల ప్రక్రియలో ఆ వ్యక్తి ఓటు వేశారా లేదా అనడానికి గుర్తుమాత్రమే. కశ్మీర్‌లో అది భారతదేశం పట్ల వారికి ఉండవల్సిన విశ్వాసానికీ, భక్తికీ చిహ్నమయిపోయింది. ఓటు వేసినా వేయకపోయినా వేలిమీద ఇంకుచుక్క మాత్రం ఉండాలి. ఉంటే జాతీయ జనజీవన స్రవంతిలో వారు చేరినట్టే. బారముల్లా జిల్లాలోని డెలీనా గ్రామంలో ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ ఓటరు లిస్టులో పేరులేని వాళ్లను విడిగా లైన్లో నిలబెట్టించి ఒక బిఎస్ఎఫ్ అధికారి వారి ముంజేతి మీద ఓటు లేదు అని రాసి సంతకం కూడా చేశాడు. అంటే వారి పేరు ఓటర్ల జాబితాలో లేకపోయినా కూడా వారు పోలింగ్‌బూత్ దగ్గర లైనుకట్టి భారత్‌పట్ల తమ దేశభక్తిని రుజువు చేసుకోవాలి. దీనిపై బిఎస్ఎఫ్ అధికారి సంతకం చేయాలి.

ప్రజలు మౌనంగా దీన్నంతా స్వీకరించలేదు. అనంత్‌నాగ్ నియోజకవర్గంలోని బుందయాల్‌గాం గ్రామంలో ప్రజల హక్కుల సంఘాల బృందంతో ఏమన్నారంటే, ఇక ఎట్లాగు ఓటు వేయక తప్పదు. వేలిమీద చుక్క వేయించుకోక తప్పదు, కాబట్టి సైనిక బలగాలను సతాయించడం కోసం సాయంత్రం దాకా వీధుల్లో తిరుగుతూ సాయంత్రం మూసేసే టైంలో మాత్రమే ఓట్లు వేస్తాము, ఆ రకంగా జవాన్లకు టెన్షన్ కల్గిస్తాము అని. పుల్వామా జిల్లాలోని కడాబల్ గ్రామంలో ఇంటి నుంచి బలవంతంగా బయటకు లాగబడ్డ స్త్రీలు ఏమైనా కానీ ఓటు మాత్రం వేయము అని చెప్పారు. అనేక చోట్ల ఊరేగింపులు, నిరసన ప్రదర్శనలు చేసారు. ముఖ్యంగా బారాముల్లా జిల్లాలో ఇటువంటి ప్రదర్శనలు చాలా జరిగాయి. హంద్వారాలో ధర్నా జరిగింది. బారాముల్లా, సొపోర్ పట్టణాల్లో చాలా పెద్ద ప్రదర్శనలు జరిగాయి. పెద్ద సంఖ్యలో జనం ఊరేగింపు తీస్తూ స్వాతంత్ర్యం కావాలి అంటూ నినాదాలు ఇచ్చారు. సైనిక బలగాలు, పోలీసులు, వారిపైన లాఠీచార్జి చేసి భాష్పవాయువు ప్రయోగించారు. సొపోర్ పట్టణం గడచిన సంవత్సరాల్లో అనేక సందర్భాలలో మొత్తంగా తగలబెట్టబడింది. మరొక్కసారి ఈ ఎన్నిక దినాన సైనిక బలగాలు సొపోర్‌ను మొత్తం తగలబెడతామని బెదిరించారు. బారముల్లాలో ఈ ఘటనలను ఫోటో తీస్తున్న అసోసియేటెడ్ ప్రెస్ ఫోటోగ్రాఫర్ జాన్‌మూర్, ఎఎఫ్‌పి ఫోటోగ్రాఫర్ తౌసీఫ్ ముస్తఫా, అసోసియేటెడ్ ప్రెస్ విలేఖరి కైజర్ మిర్జా, రాయటర్ విలేఖరి షేక్ ముస్తాక్, వాయిస్ ఆఫ్ అమెరికా మైఖెల్ డ్రాజ్‌లను సైనిక బలగాలు కొట్టి వారి కెమెరాల్లోని రీల్‌ను బలవంతంగా తొలగించారు. ఇండియాటుడే విలేఖరి సమత్రూగోష్ కెమెరాలో ఉన్న రీల్‌ను కూడా తొలగించారు. ఒక ఓటర్‌ను ఒక సైనికుడు బలవంతంగా పోలింగ్‌బూత్‌కు తీసుకుపోతున్న దృశ్యాన్ని అతను ఫోటో తీశాడు. టెలిగ్రాఫ్ విలేఖరి ముక్తార్ అహ్మద్‌ను కడావర్ గ్రామంలో పోలింగ్‌బూత్ నుండి బలవంతంగా బయటకు తోసివేశారు. తన దగ్గర ఎన్నికల కమీషన్ ఇచ్చిన గుర్తింపుకార్డు ఉందని

చూపించినా వినకుండా బయటికి తోసేశారు. అనంత్‌నాగ్ పట్టణం సరిహద్దులో, ఆయుధాలు పట్టుకున్న కొందరు తెల్లబట్టల యువకులు, విలేకర్లు పట్టణం నుండి వెంటనే వెళ్ళిపోవాలి. లేదా తీవ్ర పరిణామాలుంటాయని బెదిరించారు. అనంత్‌నాగ్ పట్టణంలో మధ్యాహ్నం రెండున్నర తరువాత ప్రజలు చాలా భయంతో కన్పించారు. విలేకరులతో మాట్లాడడానికి నిరాకరించారు. సాయంత్రం 5 దాటితే ఏం జరుగుతుందో అనే భయం వాళ్ల ముఖాల్లో స్పష్టంగా కన్పించింది. బారముల్లా జిల్లాలోని గౌరిపురాలో బలవంతంగా ఓటు వేయిస్తున్న పోలింగ్ బూత్ మీదికి ప్రదర్శనకారులు గుంపుగా రాగా సైనిక బలగాలు కాల్పులు జరిపి రియాజ్ అహ్మద్ అనే నాలుగేళ్ళ పిల్లవాడిని చంపారు. పుల్వామా జిల్లాలోని మచ్‌పురా గ్రామంలోకి హక్కుల బృందం వాహనం ప్రవేశించగానే పోలింగ్ బూత్ దగ్గర బలవంతంగా సమీకరించబడ్డ ప్రజలు స్వాతంత్ర్యానికి అనుకూలంగా నినాదాలిచ్చుకుంటూ దగ్గరికి వచ్చారు. వారిలో ముసలివాళ్ళున్నారు. స్త్రీలున్నారు, పిల్లలున్నారు. ఆ పోలింగ్‌బూత్ బయట రెండు ట్రక్కులు కన్పించాయి. ఆ ట్రక్కుల్లోనే వాళ్లను తీసుకొచ్చారు. తమను బలవంతంగా చాలా తీవ్రంగా కొట్టి ట్రక్కులెక్కించి తీసుకొచ్చి లైన్లో నిలబెట్టారని ఆ ప్రజలు తెలియచేశారు. స్థానిక మసీదు ఇమాం కుంటుతూ ఉన్నాడు. హక్కుల సంఘాల బృందం గ్రామం నుండి బయటకుపోతూ ఉండగా పోలింగ్‌బూత్‌కు కాపలా ఉన్న సిఆర్‌పిఎఫ్ వాళ్లు హక్కుల బృందంతో మాట్లాడిన ప్రజలపై లాఠీచార్జీ చేయడానికి సిద్ధమవడం కన్పించింది. గుంపులోని కొందరు యువకులు వాళ్లపై కర్రలు తీసుకుని తిరగబడటం కూడా కన్పించింది.

సాయంత్రం శ్రీనగర్‌లో, జమ్మూ కశ్మీర్ చీఫ్ సెక్రటరీ అశోక్‌కుమార్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయని చెప్తుండగా పైన చెప్పిన ఘటనలు చూసిన విలేకర్లు (కొంతమంది చూడటమేగాక స్వయంగా అనుభవించారు కూడా) వీటి గురించి నిర్దిష్టమైన ఉదాహరణలు ఇస్తూ ప్రశ్నించారు. 'నాకున్న సమాచారం అందుకు భిన్నంగా ఉంది' అని పడికట్టు సమాధానంతో అతను ఈ ప్రశ్నలను దాటవేశాడు. మరి ప్రజలు చేసిన నిరసన ప్రదర్శనల మాట ఏమిటంటే అవన్నీ కూడా ముందుగా ఏర్పాటు చేసినవి, ఆ ప్రదర్శనలు ఎవరు ఏర్పాటు చేశారో తమకు తెలుసనీ వారిపై తగుచర్య తీసుకుంటామనీ అన్నాడు. జమ్మూ కశ్మీర్ పరిపాలనా యంత్రాంగం, సైనిక బలగాలు కేవలం ప్రజలకు ఓటు వేసే ధైర్యాన్ని మాత్రమే ఇస్తున్నారు అని చెప్తున్నప్పటికీ, వాస్తవం ఏమిటంటే సైనిక బలగాలే ఎన్నికలను నిర్వహించాయి. వారు పోలింగ్ స్టేషన్ల బయట ఉన్నారు. లోపల ఉన్నారు, కుప్వారా జిల్లాలో అన్ని పోలింగ్ స్టేషన్లలోను పౌరుల కంటే సైనికులే ఎక్కువ ఉన్నారు అని స్థానిక పత్రికలు రాశాయి. డెలినాలో ఒక బిఎస్ఎఫ్ అధికారి చేతిలో ఓటర్ల లిస్టు ఉండటం చూసి 'అది నీ చేతిలో ఎందుకుంది' అని హక్కుల బృందం అడిగినప్పుడు, ఎవరు వేశారో ఎవరు వేయలేదో చూస్తూ ఉన్నాను,

అని అన్నాడు. అది అతని పని ఎందుకయ్యిందో! బారాముల్లా జిల్లాలోని పట్టన్‌లో జమ్మూ కశ్మీర్ అవామీ లీగ్ అభ్యర్థికి అనుకూలంగా ఉన్న రెనెగేడ్లు సైనిక వాహనాల్లో తిరుగుతూ ఉండటం కనిపించింది. అనంత్‌నాగ్ నియోజకవర్గంలోని చజ్‌కూట్ గ్రామంలో సైనిక జవాన్లు ఓటర్లు వేలికి ఇంకు వేసి పంపించి ఆ ఓటు తామే వేస్తుండటం కూడా కనపడింది. చాలా పోలింగ్ బూత్‌లలో అభ్యర్థులెవరికి ఏజెంట్లు లేరు. పోలింగ్ అధికార్లు, సైనిక జవాన్లు మాత్రమే ఉన్నారు. అయితే కొన్ని పోలింగ్‌బూత్‌లలో మాత్రం అనధికారికంగా కొందరు యవకులు కన్పించారు. వారి ఫోటోలు తీయడానికి విలేకర్లు ప్రయత్నించగా వారు ముఖాలు చాటేశారు. కొన్ని ప్రాంతాల్లో సైనిక జవాన్లను, ఓటర్ల తరుపున మీరే ఓటు గుద్ది డబ్బాలో వేస్తున్నారు ఎందుకు అని అంటే సహాయం చేస్తున్నామని జవాబు చెప్పారు.

పత్రికలు, ముఖ్యంగా పాశ్చాత్యదేశాల పత్రికలు ఎన్నికల్లో పాల్గొనడానికి ప్రజలపైన పెట్టిన ఒత్తిడి గురించి రాసిన తరువాత భారత ప్రభుత్వ చర్యలను సమర్థించేవారు ఒక విచిత్రమైన వాదనను ముందుకు తీసుకొచ్చారు. ఒకవేళ సైన్యంగాని నిజంగానే బలవంతంగా ఓట్లు వేయించి ఉంటే కేవలం 30 లేక 40 శాతం ఓట్లు పడేవి కావని ఇంకా ఎక్కువ పడి ఉండేవని అన్నారు. ఈ సమాధానం కేవలం జమ్మూ కశ్మీర్ పరిపాలనా యంత్రాంగం, సైన్యం మాత్రమే కాక, పత్రికా సంపాదకులు, పత్రికల్లో వ్యాసాలు రాసే పెద్దలు, భారత ఛీఫ్ ఎలక్షన్ కమీషనర్ కూడా ఇచ్చారు. చీఫ్ ఎలక్షన్ కమీషనర్ అయితే ప్రచురితమైన ఆరోపణల మీద ఎటువంటి విచారణ లేకుండానే జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు న్యాయబద్ధంగా, సక్రమంగా జరిగాయని ప్రకటించేశాడు. ఇది అర్థరహితమైన వాదన. ఓటు వేసే హక్కు ఎంత ఉందో, ఓటు వేయకుండా ఉండే హక్కు కూడా అంతే ఉంది. కశ్మీర్ లోయలో ప్రజలు తమ మీద ప్రయోగించిన బెదిరింపులకూ బలప్రయోగానికీ చాలా కోపగించుకున్నారనీ నిరసన తెలియచేశారనీ పరిశీలకులందరూ చూశారు. ఈ బెదిరింపు, బలప్రయోగం లోయ అంతటా ఉండింది. కాని దాన్ని ప్రజలు ఏ మేరకు ప్రతిఘటించగలిగారు. ఏ మేరకు అధిగమించగలిగారు అనేది ఆయా గ్రామాలను బట్టి, ప్రాంతాలను బట్టి ఉంది. కొందరు బెదిరింపులకు లొంగారు. మెజారిటీ దాన్ని ప్రతిఘటించారు. కొంత మంది సైనిక బలగాల మీద ప్రతీకారం తీర్చుకోవడానికి తమ ఓట్లను చెల్లనివి చేస్తామని అన్నారు. కొన్ని చోట్ల ప్రజలు నవ్వుకుంటూ ఏమన్నారంటే “మేము అందరిని మెప్పించదలుచుకున్నాం. మేము ఓటు వేయాలని సైన్యం కోరుకుంటుంది. కాబట్టి ఓటు వేస్తాం. ప్రతి అభ్యర్థి తనకే ఓటు వేయాలని కోరుకుంటున్నాడు కాబట్టి అందరికీ గుద్దుతాం. ఆ రకంగా ఓటు చెల్లనిది అవుతుంది. అప్పుడు ఓట్లను బహిష్కరించమని పిలుపునిచ్చిన మిలిటెంట్లకు కూడా సంతోషంగా ఉంటుంది”. చెల్లని ఓట్లు పెద్ద సంఖ్యలో లేవుగాని భారతదేశంలో సగటున ఉండే సంఖ్య కంటే బాగా ఎక్కువగానే ఉన్నాయి. కనీసం దాన్ని చూసైనా దేశ ప్రధాన ఎన్నికల

కమీషనర్ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా జరిగింది అన్న ప్రకటన ఎంతవరకు వాస్తవమో ఆలోచించవలసి ఉండింది. పార్లమెంటు ఎన్నికల్లో సగటున దేశంలో చెల్లని ఓట్లు 2.5% లేక 3% ఉంటాయని ఎన్నికల కమీషన్ అంటుంది. కాని కశ్మీర్‌లో బారముల్లాలో 7.5 శాతం, శ్రీనగర్‌లో 10 శాతం చెల్లని ఓట్లు ఉన్నాయి. దేశ సగటు కంటే మూడు రెట్లు ఓట్లు చెల్లనివయ్యాయి అంటే అది ప్రజల నిరసనకు చిహ్నమని ఎన్నికల కమీషన్ గుర్తించాలి. ఇక పోలైన ఓట్ల శాతం కూడా ప్రాంతానికి, ప్రాంతానికి మారింది. శ్రీనగర్ పాత బస్తీలో కేవలం 9 శాతం మాత్రమే ఉండింది. అంటే రాష్ట్ర రాజధానిలోని అత్యధిక శాతం చాలా పెద్ద ఎత్తున సైనిక బలగాలు నగరాన్ని చుట్టుముట్టినప్పటికీ ఎన్నికలను బహిష్కరించారని దీన్నిబట్టి అర్థమవుతున్నది. షోపయ్యా, వాచీ, రాజ్‌పురా, లోలాబ్, హంద్వారా, సొపోర్, కుప్వారా, బారముల్లా, గుల్‌మార్గ్‌లలో ఓటింగ్ శాతం 20-25 శాతం వరకు మాత్రమే ఉండింది. ఇవన్నీ కూడా అప్పటికి ఏడు సంవత్సరాలుగా మిలిటెన్సీకి, నిర్భంధానికీ కేంద్రాలుగా ఉన్నాయి. అటువైపు 60 శాతం మించి పోలింగ్ జరిగిన ఒకే ఒక ప్రాంతం బారముల్లా జిల్లాలోని పాకిస్తాన్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న ఉడి. ఉడి ప్రాంత ప్రజలు ఆ ఏడేళ్లుగానే కాదు, ఎప్పట్నించో సైనిక పాలనలో ఉన్నారు. సైన్యం చేతుల్లో వాళ్లు విపరీతమైన హింసను అనుభవించారు. అక్కడ పౌర జనాభా కంటే సైన్యం జనాభా చాలా ఎక్కువ. అక్కడి ప్రజలు తిండి, బట్టలు తదితర దైనందిన అవసరాల కోసం సైన్యం పైన ఆధారపడతారు. అక్కడొక్కచోటే

చెప్పుకోదగ్గ పరిమాణంలో ప్రజలు ఓట్లు వేయడం ఆ ఎన్నికల పైన వివరణ అవసరంలేని వ్యాఖ్య.

## 5. పౌర ప్రభుత్వం పునరాగమనం

అందరూ ఊహించినట్టే, పార్లమెంటుకు ఎన్నికలు విజయవంతంగా నిర్వహించిన పిమ్మట 1996 సెప్టెంబరు నెలలో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీకి కూడ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు దశలలో నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితంగా నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చి ఫరూఖ్ అబ్దుల్లా మళ్ళీ ముఖ్యమంత్రి అయ్యాడు. అంటే 6 సంవత్సరాల తరువాత ఆ రాష్ట్రంలో పౌర ప్రభుత్వం ఏర్పడింది. దాని ఫలితమెలాగుందో చూడడానికి 1997 వేసవిలో హక్కుల సంఘాల నిజనిర్ధారణ కమిటీ కశ్మీర్‌లో పర్యటించింది.

1990 ప్రథమార్థంలో బయటి నుండి కశ్మీర్‌కు పోయిన హక్కుల నిజ నిర్ధారణ కమిటీతో మాట్లాడినవాళ్ళు కశ్మీర్ సమస్య యొక్క రాజకీయ పార్శ్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వగా 1997లో పర్యటించిన బృందానికి కలిగిన అనుభవం ఏమిటంటే మానవహక్కుల అతిక్రమణ గురించి ఎక్కువమంది ఎక్కువగా మాట్లాడటం. బహుశా ఎన్నికయిన పౌర ప్రభుత్వం వేరే ఏం చేయకున్నా కనీసం భద్రతాదళాల అతి ప్రవర్తనను అదుపుచేస్తుందన్న సహజమైన కోరిక దీనికి కారణం కావచ్చు. ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో ప్రధాన పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ (ఐ) రెండూ కూడా ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు ప్రజలపైన చేస్తున్న అత్యాచారాల గురించి, సైనిక బలగాలు వారికి ఇస్తున్న రక్షణ గురించి విమర్శిస్తూ మాట్లాడాయి. లొంగిపోయిన మిలిటెంట్ల ఆయుధాలు స్వాధీనం చేసుకోండి అని ఫరూక్ అబ్దుల్లా అప్పట్లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. తుపాకులు పట్టుకున్న లొంగిపోయిన మిలిటెంట్లు ఎన్నికలను రిగ్గింగ్ చేసి సైనిక బలగాలకు అనుకూలమైన ఫలితాల్ని రప్పించే ప్రయత్నం చేస్తారు అన్న ఆందోళనను అప్పట్లో ఆయన వ్యక్తం చేశాడు. రెనెగేడ్లను నిరాయుధీకరించకపోతే తమ పార్టీ, అంటే నేషనల్ కాన్ఫరెన్స్, ఎన్నికల నుంచి వైదొలుగుతుంది అని కూడా బెదిరించాడు. అదే విధంగా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు, బారాముల్లా పార్లమెంట్ సభ్యుడైన గులాం రసూల్ కార్ కూడా సర్కారీ మిలిటెంట్ల నిరాయుధీకరణ చేపట్టాలి అని డిమాండ్ చేస్తూ, వారు ఇట్లాగే కొనసాగితే ప్రజాస్వామానికి చెడ్డపేరు వస్తుందనీ జాతీయ అంతర్జాతీయ వేదికల్లో దుష్ఫలితాలుంటాయనీ కూడా చెప్పాడు. సర్కారీ మిలిటెంట్ల దగ్గర పదిహేను వందల తుపాకులున్నాయనీ, సైన్యము, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఈ తుపాకులు వారికి అందించి ఒక భయానక రాజ్యాన్ని కశ్మీర్ లోయలో నెలకొల్పారనీ కూడా ఆయన ఆరోపించాడు. కొంతమంది సైనిక అధికార్లు కాంగ్రెస్ పార్టీని కూడా తమకు అనుకూలమైన సర్కారీని మిలిటెంట్లను చేర్చుకొమ్మని ఒత్తిడి పెట్టారనీ కాని తాము ఒప్పుకోలేదనీ, ఎందుకంటే

ఈ సర్కారీ మిలిటెంట్లు రాజకీయ వేదికపైన ఉండటం చూడదలచుకోలేదనీ ఆయన చెప్పాడు.

అనంత్‌నాగ్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్రమంత్రి, జనతాదళ్ నాయకుడు మహ్మద్ మక్బుల్ డార్ కూడా సర్కారీ మిలిటెంట్లు ప్రయోగిస్తున్న హింస గురించి మాట్లాడాడు. ఆయనను కేంద్ర హోంశాఖలో మినిస్టర్ ఆఫ్ స్టేట్‌గా నియమించిన వెంటనే సైన్యం సర్కారీ మిలిటెంట్లకు ఇస్తున్న రక్షణ ఆగిపోవాలని ప్రకటించాడు.

ఆ సమస్య గురించి మళ్ళీ మళ్ళీ ఆయన మాట్లాడాడు. హురియత్ కాన్ఫరెన్స్ విమర్శను మాత్రమే ప్రస్తావిస్తే అదంతా దురుద్దేశపూరితమైన ప్రచారం అంటారు కాబట్టి నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ (ఐ), జనతాదళ్ నాయకుల అభిప్రాయాలను చెప్పడం జరిగింది. కాని ఎన్నికలు అయిపోయి ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన చేసింది ఎన్నికలప్పుడు మాట్లాడిన మాటలకు సరిగ్గా విరుద్ధమైనది. నిజానికి ఎన్నికలప్పుడు కూడా ఒక చిన్న సర్కారి మిలిటెంట్ల గ్రూపు మద్దతును ఆయన తీసుకున్నాడు. అనంత్‌నాగ్ జిల్లాలోని ముస్లిం హిదీన్ ఒక చిన్న గ్రూపు నాయకుడు గులాంనబి ఆజాద్ నేషనల్ కాన్ఫరెన్స్‌కు తన మద్ధతును ప్రకటించడమేకాక, ఆయన కార్యకర్తలు ఫరూక్ అబ్దుల్లా ఎన్నికల ప్రచార సభలకు రక్షణ కల్పిస్తూ ఉండటం చాలా మంది చూశారు. అంటే బహుశా ఫరూక్ అబ్దుల్లా గారి అభ్యంతరం సైన్యం ప్రోత్సహిస్తున్న రెనెగేడ్ బృందాల విషయంలో కాకపోవచ్చు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు వ్యతిరేకంగా ఉన్న బృందాలవల్ల తన పార్టీకి రాగల ప్రమాదం గురించి మాత్రమే కావచ్చు. 1996 అక్టోబర్ 19న అధికారం చేపట్టిన తరువాత ఫరూక్ అబ్దుల్లా అప్పటికే అందరికి తెలిసిన సత్యాన్ని అధికారికంగా ప్రకటించాడు. ఈ సత్యాన్ని నిజానికి సైనిక అధికారులు కూడా ఎన్నడూ కాదు అనలేదు. ఆయన ప్రకటించిన సత్యం ఏమిటంటే ప్రభుత్వ అనుకూల మిలిటెంట్లు సైనిక, పారామిలిట్రీ బలగాలకు చెందిన వివిధ అంగాల అధ్వర్యంలో పనిచేస్తున్నారు. ఎన్నికలప్పుడు ఆయన ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ఉద్దేశం గానీ ఆయనకు ఉంటే ఈ విషయాన్ని ప్రకటించిన తరువాత వారందరిని నిరాయుధీకరించడం జరుగుతుందనీ ఇక మీదట ఇటువంటివి జరగకుండా చూడటం జరుగుతుందనీ ప్రకటించి ఉండవల సింది. కాని ఆయన ఆ పని చేయలేదు. ఆయన ఏమన్నాడంటే గతంలో విభిన్న సైనిక శాఖల ఆధ్వర్యంలో పనిచేస్తున్న మిలిటెంట్లను ఒకే ఒక కమాండ్ కిందికి తీసుకురావడం జరుగుతుంది అని అన్నాడు. అది బహుశా జమ్మూ కశ్మీర్ పోలీస్ కావచ్చునన్నాడు. 1996 నాటికి నవంబర్ వారిలో కొంతమందిని జమ్మూ కశ్మీర్ పోలీస్ యంత్రాంగంలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించడం జరిగింది. బహుశా, సైన్యం చేతి నుంచి వారిని బయటకు లాగాలంటే పోలీసులు చేతుల్లో పెట్టి ప్రభుత్వం ఆధ్వర్యంలోకి

తీసుకురావడం సులభమైన మార్గం అని ఫరూఖ్ అబ్దుల్లా భావించి ఉండవచ్చు. ఒకేసారి వారిని పూర్తిగా నిరాయుధీకరిస్తే సైన్యమూ వ్యతిరేకిస్తుంది. కేంద్ర ప్రభుత్వంలోని కశ్మీర్ వ్యూహకర్తలూ వ్యతిరేకిస్తారు. ఈ వ్యూహాన్ని ఇప్పట్లో వదులుకోవడం సాధ్యం కాదు అని వారు బహిరంగంగానే ప్రకటించి ఉన్నారు.

ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఫరూక్ అబ్దుల్లా మాత్రమే కాక జమ్మూ కశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు రెనెగేడ్లను నిరాయుధీకరించాలి అని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి పద్మనాభయ్య గారు'జీ' టీవీకి ఇంటర్వ్యూ ఇస్తూ "అది ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చు" అని అన్నాడు. "భవిష్యత్‌లో ఏదో ఒక రోజు నేను వారిని నిరాయుధీకరించవలసి ఉంటుందేమో కాని ఇప్పుడు సాధ్యం కాదు" అని ఆయన నిర్మొహమాటంగాచెప్పాడు.

న్యూఢిల్లీ వ్యూహకర్తల అభిప్రాయాలకు భిన్నంగా నడచుకోవడం జమ్మూ కశ్మీర్ ప్రభుత్వానికి సాధ్యం కాదని ఫరూఖ్ అబ్దుల్లా అనుభవ పూర్వకంగా ఎరిగినవాడు కాబట్టి, సైన్యానికి స్నేహితులైన నేరగాళ్లను ఒకేసారి నిరాయుధీకరించకుండా పోలీసుల్లోకి తీసుకోవడం అనేది ఉచితమైన ఆలోచనగా ఆయన భావించి ఉండవచ్చు. వారికి ఉన్న కారణాలు ఏవైనా కావచ్చుగానీ సర్కారీ మిలిటెంట్లు భారత సైన్యానికి ఇస్తున్న చట్టవిరుద్ధ సేవలను వారికి స్పెషల్ పోలీసు ఆఫీసర్లుగా ఉద్యోగాలివ్వడం ద్వారా రెగ్యులరైజ్ చేయడం అనేది చాలా దుర్మార్గమైన విషయం. చాలా అభ్యంతరకరమైన విషయం. వారు కశ్మీరీ స్వయం నిర్ణయాధికార పోరాట కార్యకర్తలపైన, మద్దతుదారులపైన, చేస్తున్న నేరపూరిత దాడులకు చట్టం ముసుగు తగిలించడం తప్ప ఇది వేరే ఏమీ కాదు. కొంత మంది సర్కారీ మిలిటెంట్లను స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా నియమించగా మరికొంతమందిని మంత్రులు, విఐపి భద్రతా సిబ్బందిలో నియమించారు. ఒక వంద మంది దాకా సర్కారీ మిలిటెంట్లు ఈ విధంగా నియమించబడ్డారని పత్రికలు రాశాయి. మరికొంత మందిని జమ్మూ కశ్మీర్ పోలీస్ యొక్క ప్రత్యేక విభాగమైన స్పెషల్ ఆపరేషన్స్ గ్రూపులో చేర్చుకున్నారు. ఈ గ్రూపులో చేరిన వాళ్ళు పోలీస్ యూనిఫారం వేసుకోవడం అనేది కేవలం ఒక చట్టబద్ధత కల్పించే ముసుగు మాత్రమే.ఎందుకంటే ఈ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ అనేది సర్కారీ మిలిటెంట్లు ఎంత విచ్చల విడిగా వ్యవహరిస్తున్నారో అంతే విచ్చల విడిగా వ్యవహరిస్తుంది. కాబట్టి వారు తమ పాత వృత్తిలోనే కొనసాగుతున్నారు. కానీ దీనికి ఇప్పుడు అధికారమైన ఆమోదం ఉంది. ఇవన్నీ చూసినప్పుడు అబ్దుల్లా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పరిస్థితిని మరింత దిగజార్చాయని అనక తప్పదు.

ఈ సర్కారీ మిలిటెంట్లు ఒక విచిత్రమైన గుంపు. వారు ఏక సమయంలో మూడు

రకాల జీవితాలు గడుపుతూ ఉంటారు. 1. వారు తుపాకులు పట్టుకున్నటువంటి మిలిటెంట్లు, తమ ప్రత్యర్థుల మీద, వారి ఆస్తుల మీద, దాడులు చేస్తూ ఉంటారు. పేల్చివేస్తూ ఉంటారు. చంపివేస్తూ ఉంటారు. 2. వారు పోలీసులు, పోలీసులుగా వారు అదే పని చట్టం కల్పించినట్టు చెప్పుకునే అధికారంతో చేస్తుంటారు. 3. వారు జమ్మూ కశ్మీర్ అవామి లీగ్, జమ్మూ కశ్మీర్ ఇఖ్వాన్, తెహరీక్-ఇ వతన్ వంటి రాజకీయ పార్టీల సభ్యులు. అయినప్పటికీ వారు ఆత్మరక్షణ పేరుతో తుపాకులు పట్టుకుని మొదటి అవతారంలో చేసే పనులన్నీ కూడా చేస్తూ ఉంటారు. వారి ఉనికి ఒక పక్క చట్టాన్ని స్పృశిస్తుంది. మరొకపక్క నేరాన్ని స్పృశిస్తుంది. మరొకపక్క అధికారిక రాజకీయాలను స్పృశిస్తుంది. కాని నేరం దాని నుడికారం. ఈ నేరం వ్యక్తిగతమైనది కాదు. భారత ప్రభుత్వ వ్యూహాత్మక ప్రయోజనాల కోసం జరిగే నేరం. వారి వల్ల ప్రజల్లో కలిగే భయం కంటికి స్పష్టంగా కనిపిస్తుందని చెప్పవచ్చు. కశ్మీర్‌లో ఎవరూ కూడా బహిరంగ ప్రదేశాలలో హక్కుల నిజనిర్ధారణ కమిటీలతో మాట్లాడరు. ఇళ్లలో మాట్లాడుతారు. కార్యాలయాల్లో మాట్లాడతారు.లాయర్లు బార్ అసోసియేషన్ రూమ్‌లలో మాట్లాడుతారు. కానీ మాట్లాడిన తరువాత తమకు భద్రంగా అనిపించిన ఈ పరిమితమైన ప్రదేశాల నుంచి ఎవరూ రెండడుగులు కూడా బయటకు రారు. అందరూ ప్రధానంగా భయపడేది ఈ రెనెగేడ్లకే అని అంటారు. పుల్వామా జిల్లా బార్ అసోసియేషన్‌తో మే 30 నాడు నిజనిర్ధారణ కమటీ కూర్చుని మాట్లాడుతుండగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చాలా సాధారణమైన గళంతో ఒక మాట అన్నాడు. "మేమిక్కడ మానవహక్కుల కార్యకర్తలతో మాట్లాడుతున్నామని పాపాకిష్ట్యారికి గాని తెలిస్తే ఈ కోర్టు బిల్డింగ్‌నే పేల్చేస్తారు. మమ్మల్నందర్నీ చంపేస్తాడు" ఈ పాపాకిష్ట్వారీ ఉరఫ్ గులాం అహ్మద్ లోన్, కుకాపరే ఉరఫ్ జంషెడ్ షిరాజీ తరువాత అతి ముఖ్యమైన రెనెగేడ్ నాయకుడు. అతను పుల్వాను జిల్లాలోని ఒక చిన్న పట్టణమయిన పాంపోర్‌లో ఉంటాడు. ఆ ఊరు జమ్మూ, శ్రీనగర్ జాతీయ రహదారి పైన ఉంది. అతని ఇంటికి కాపలాగా ఒక లారి నిండా సిఆర్‌పిఎఫ్ జవాన్లుంటారు. ఎప్పుడు కూడా ఒక జమ్మూ కశ్మీర్ పోలీసు జీపు అతను ఉపయోగించుకోవడానికి సిద్ధంగా అతని ఇంటి దర్వాజ దగ్గర ఉంటుంది. ఆయన ఇంటి పక్క నుంచి పోతూ ఈ ఇంటి లోపల ప్రజలు విపరీతంగా భయపడే ఒక హంతకుడున్నాడనీ శాంతిభద్రతల పరిరక్షకులు అతన్ని కాపాడుతున్నారనీ గుర్తు చేసుకున్నప్పుడు చాలా విచిత్రంగా అనిపించక మానదు.

ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వం ఈ సర్కారీ మిలిటెంట్లకు పోలీస్ యూనిఫారాలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయం సైనిక బలగాలకు నచ్చలేదు. వారిని బిఎస్ఎఫ్‌లోనో సిఆర్‌పిఎఫ్‌లోనో చేర్చుకోవడం అంతకంటె మెరుగైన ఆలోచన అని సైనిక బలగాలు భావించాయి. బిఎస్ఎఫ్

ఇన్‌స్పెక్టర్ జనరల్ అయిన అప్పా సాహెబ్ అల్లూర్ 1997 ఫిబ్రవరి 15 నాడు కశ్మీర్ టైమ్స్ పత్రికతో మాట్లాడుతూ సర్కారీ మిలిటెంట్లతో ఒక బెటాలియన్ తయారుచేసే ఒక ఆలోచన ఉన్నదని చెప్పాడు. కొంత మందిని సిఆర్‌పిఎఫ్‌లో చేర్పిస్తామని కూడా అన్నాడు. అప్పటికి 2500 మంది మిలిటెంట్లు సరెండర్ అయి ఉన్నారని అధికార్ల అంచనా. అయితే 5 వేల దాకా అయి ఉన్నారని కొంతమంది అంటారు. వారిలో అందరూ భారత సైన్యం ప్రయోజనాల కోసం నేరగాళ్ళుగా మారడానికి సిద్ధంగా ఉండకపోవచ్చు. కాని ఎవరైతే సిద్ధంగా ఉన్నారో వారిని గుర్తించి సాయుధ బలగాల అధికారులు తమ తమ బలగాల్లో చేర్చుకున్నారు. ఇప్పుడు వారికి ఆ బలగాలకు యూనిఫారాలు ఇచ్చి జీతాలు ఇచ్చి భారత ప్రభుత్వ వ్యూహాన్ని అమలుచేసే సాధనాలుగా వారిని వాడుకోవాలని వారు భావించారు. ఈ సర్కారీ మిలిటెంట్ల వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతోను సైన్యం తరుపున బయటి నుంచి వచ్చిన బృందాలతో మాట్లాడటానికి నియమించబడ్డ బ్రిగేడియర్ అశోక్ కపూర్‌తోను నిజనిర్ధారణ కమిటీ మాట్లాడడానికి ప్రయత్నం చేయగా, వారిద్దరూ మర్యాదగానే జవాబులు చెప్పినప్పటికీ, చట్టబద్ధ పాలనపట్ల గౌరవాన్ని వ్యక్తం చేసినప్పటికీ, ఈ సర్కారీ మిలిటెంట్ బృందాలను రూపొందించడం ద్వారా ఏ వ్యూహాత్మక ప్రయోజనమైతే ప్రభుత్వము, సైనిక బలగాలు పొంది ఉన్నాయో దాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేరు అని స్పష్టం అయింది. తాము చాలా తెలివిగా విజయం సాధించామని వారు భావిస్తున్నారు. ప్రభుత్వానికి స్నేహితులైన మిలిటెంట్ల నేరపూరిత చరిత్రను ఎవ్వరూ కాదనడం లేదు. వారి మీద నిర్దిష్టమైన ఫిర్యాదులు ఎప్పుడొచ్చినా చర్య తీసుకుంటూనే ఉన్నాము అని వాళ్ళు అంటుంటారు. అయినప్పటికీ మిలిటెన్సీనీ, దానికి ప్రజాబాహుళ్యంలో ఉండే మద్దతునూ అణగదొక్కడానికి వీరిని వాడుకునే విషయంలో పునరాలోచన లేదనేది స్పష్టం. నేరచరిత గల వ్యక్తులను తమ బలగాల్లో చేర్చుకోవడం బిఎస్ఎఫ్, సిఆర్‌పిఎఫ్‌లకు తగినదేనా అని సైనిక బలగాల ప్రతినిధిని అడిగినప్పుడు అది సాధారణంగా జరగదు కాని కశ్మీర్‌లో ఉండేది అసాధారణమైన పరిస్థితి అని అన్నాడు. కశ్మీర్‌లో ప్రభుత్వం చేస్తున్న అన్ని తప్పుడు పనులకు ఇదే వారు చూపిస్తున్న సాకు. అసాధారణ పరిస్థితుల్లో చట్టవిరుద్ధమైన పనులు చేయవలసి ఉంటుంది అని వారు చెప్పదలచుకున్నారు. అంటే అర్థం ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామ్య హక్కులకు, చట్టానికి,సామాజిక సమస్యల పరిష్కారంలోను సామాజిక సంక్షోభాల పరిష్కారంలోను ఏ పాత్ర లేదని. ప్రజాస్వామ్యం అనేది పూర్తిగా శాంతియుత సమయాలలో ధరించే ఒక ఆభరణం మాత్రమే అని. ప్రజాస్వామ్యానికి ఇంతకంటె వికృతమైన వ్యాఖ్య వేరే ఏదీ ఉండదు.

పౌర ప్రభుత్వం సాయుధ బలగాల ఆగడాలనూ ఆత్యాచారాలనూ అరికడుతుందని ప్రజల్లో ఉన్న ఆకాంక్షలు గురించి చెప్పాము. ఫరూక్ అబ్దుల్లా సైనిక బలగాల పనితీరును నియంత్రించే యంత్రాంగాన్ని నెలకొల్పి వారిని చట్టానికి జవాబుదారులను చేసే ప్రయత్నం

చేసి ఉంటే అది జరిగి ఉండేది. ఆ పని కొత్త ముఖ్యమంత్రి చేస్తాడేమో అనే ఆశ త్వరలోనే అడియాశ అయ్యింది. కశ్మీర్‌లో మిలిటెన్సీకి వ్యతిరేకంగా జరుగుతున్న చర్యలలో సైన్యం, పారామిలిట్రీ బలగాలు, రాష్ట్ర పోలీసులు, కలిసి పని చేస్తాయి కాబట్టి ఈ మూడు రకాల బలగాల కార్యాచరణను సమన్వయపరిచే ఒక సంయుక్త కార్యాచరణ సమితి ఒకటి ఉంది. (ఇంగ్లీష్‌లో దీన్ని యూనిఫైడ్ కమాండ్ అంటారు) ఈ సంయుక్త కార్యాచరణ సమితికి రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను ఫరూక్ అబ్దుల్లా అధినేతను చేసి ఉంటే సైనిక బలగాలు రాష్ట్ర పోలీసులకు ఆ మేరకయినా లోబడి ఉండేవి. రాష్ట్ర పోలీసులు రాష్ట్ర ప్రభుత్వానికి, మరీ ముఖ్యంగా హోం మంత్రి కూడా అయిన ముఖ్యమంత్రికి లోబడి ఉంటారు. కాబట్టి ఈ సైనిక బలగాల పైన పౌర ప్రభుత్వం యొక్క అజమాయిషీ ఏర్పడి ఉండేది. ఫరూక్ అబ్దుల్లా ఈ పని చేసే ప్రయత్నం చేశాడనీ సైన్యమూ, కేంద్ర ప్రభుత్వమూ ఒప్పుకోలేదనీ ఒక వదంతి. తత్ఫలితంగా సమన్వయ సమితి యొక్క అధినేత శ్రీనగర్‌లో ఉన్న సైనిక బలగాల నేత అయినటువంటి లెఫ్టినెంట్ జనరల్ ధిల్లాన్. ఇతను, జమ్మూ కేంద్రంగా ఉన్న సైనిక బలగాల అధినేత అయిన లెఫ్టినెంట్ జనరల్ బుల్లర్ జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం యొక్క భద్రతా సలహాదారులు. ఇంకొక రకంగా చెప్పాలంటే ఆ రాష్ట్రంలో నడుస్తున్న మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు ప్రధాన ప్రాంతాలలోని సైనిక అధినేతల సలహా మేరకు పనిచేస్తుంది. ఈ నిర్ణయాన్ని ఫరూక్ అబ్దుల్లా అంతర్జాతీయ మానవహక్కుల దినం అయిన డిసెంబర్ 10వ తేదీన చేయడం కాకతాళీయమే కావచ్చును గాని దీనితో మిలిటెన్సీ వ్యతిరేక సైనిక చర్యలపైన పౌర ప్రభుత్వం అజమాయిషీ ఉంటుందన్న ఆశ అణగారిపోయింది.

ఈ నిర్ణయం తీసుకున్న తరువాత, ఎన్నుకోబడ్డ పౌర ప్రభుత్వం సాయుధ బలగాలను ఎప్పటిలాగే పని చేయనిచ్చింది. సైన్యం, ఇతర సైనిక బలగాలు, సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టానికి లోబడి వ్యవహరించాలని చట్టం చెప్తుంది. నిజానికి వాళ్లు ఆ చట్టం రీత్యానే జమ్మూ కశ్మీర్‌లో ఉంటున్నారు. అదొక నిర్బంధ చట్టమే అయినప్పటికీ, అది సైనిక బలగాలు ఆ రాష్ట్రంలో పౌర ప్రభుత్వానికి అండగా మాత్రమే ఉన్నాయని చెప్తుంది. నిజానికి వాళ్ళు ఆ చట్టం రీత్యానే జమ్మూ కశ్మీర్‌లో ఉంటున్నారు. అంటే పౌర ప్రభుత్వం తన పోలీసు యంత్రాంగం ద్వారా రాష్ట్రంలో శాంతిభద్రత నెలకొల్పాలి. ఎక్కడైతే ఆ పౌర ప్రభుత్వం యొక్క పోలీసులు తమ బలం సరిపోదు అని భావిస్తారో అప్పుడు సైనిక బలగాల సహాయాన్ని వారు కోరడం,సైనిక బలగాలు సాయం ఇవ్వడం జరగాలి. ఇది జరిగేటట్టు చూడడానికి ఆ చట్టంలో కొన్ని నియమాలున్నాయి. ఉదాహరణకు సైనిక బలగాలు ఎవరినైన అదుపులోకి తీసుకుంటే వెంటనే స్థానిక పోలీసులకు వారిని అప్పగించాలి. ఆ తరువాత జరిగే నేర పరిశోధన, కోర్టులో రిపోర్టు

దాఖలు చేయడం మొదలైన పనులన్నీ కూడా పోలీసులు నిర్వహించాలి. నిర్భంధ చట్టంగా పేరుగాంచిన ఈ చట్టనియమాల ప్రకారం కూడా పౌర ప్రభుత్వానికి సలహాదార్లుగా సైనిక అధినేతలను ఎంచుకోవడం, సంయుక్త కార్యాచరణ సమితి అధినేతలుగా సైనికాధికారులను నియమించడం, సరైనది కాదు. దీని ఫలితంగా ఏం జరుగుతోంది అంటే మానవ హక్కుల అతిక్రమణ చట్టబద్ధ పాలనకూ ప్రజల హక్కులకు సంబంధించిన విషయం కాక సైనిక బలగాల అంతర్గత క్రమశిక్షణకు సంబంధించిన విషయంగా తయారైంది. దాన్ని చట్టబద్ధపాలనకు, ప్రజల హక్కులకు సంబంధించిన విషయంగా చూడవలసిన బాధ్యత పౌర ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు ఉండగా అందరు ఆ విషయాన్ని సైన్యానికే వదిలేసి తన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సైన్యం దానితో వ్యవహరించే అవకాశం కల్పించారు. ఏం జరుగుతుందంటే ఏదైన మానవహక్కుల అతిక్రమణ గురించి ఆరోపణలు వస్తే సైనిక అధినేతలు దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. ఒక అధికారిని విచారించమని, రిపోర్టు ఇమ్మని పంపిస్తారు. ఆ రిపోర్టు సైనిక బలగాలలోని ఉన్నత స్థాయి అధికారుల దగ్గరికి పోతుంది. ఇక ఆ తరువాత ఏమైనా చేసేది చేయకుండా ఉండేది వారు నిర్ణయిస్తారు. కాబట్టి వ్యవహారమంతా కూడా సైన్యం లోపల, సైన్యం వద్ద ఉండిపోతుంది. చట్టానికీ, న్యాయానికీ వీటికి సంబంధించిన సాధారణ వ్యవస్థలకు ఇక్కడ ఏ పాత్ర ఉండదు.

సైన్యం పరాయిదేశాల సైన్యాలతో యుద్ధం చేసే సందర్భంలో ఈ రకమైన వ్యవస్థ ఉండటం సరైనదా కాదా అన్నది వేరే సంగతి కానీ, ఎప్పుడైతే సైన్యం దేశం లోపల మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాలు చేపడుతుందో అంటే దేశపౌరుల మీద సైనిక చర్యలకు పాల్పడుతుందో అటువంటి సందర్భాలలో సైనిక బలగాలు పాల్పడే మానవహక్కుల అతిక్రమణ సైనిక బలగాల అంతర్గత వ్యవహారంగా ఉండిపోవడం ఎంత మాత్రము సరైందికాదు. అది భారత రాజ్యాంగంలోని 14,21వ అధికరణలకు వ్యతిరేకం. ఈ వ్యవస్థ ఫలితం ఏమిటంటే మానవ హక్కుల అతిక్రమణకు సంబంధించి వచ్చినటువంటి ఆరోపణల్లో 95% అబద్దాలు అని సైన్యం అనగలుగుతున్నది. 1995 అక్టోబర్‌లో మానవహక్కుల గురించి సైన్యం కశ్మీర్‌లో విడుదల చేసిన కరపత్రంలో ఆ విషయమే చెప్పింది. సైనిక బలగాలు తమ వారి నేరాలు తామే పరిశోధించి తీసుకున్న నిర్ణయాల ఫలితంగా ఈ విధంగా ఉన్నదని వారు అచ్చువేసిన కరపత్రాన్ని బట్టి తెలుస్తుంది. 1991 నుంచి 1996 అక్టోబర్ మధ్యభాగం దాకా కశ్మీర్‌లో 490 ఫిర్యాదులు వచ్చాయనీ, వాటిలో 482 ఫిర్యాదులపైన విచారణ జరపడం సంభవించిందనీ, వాటిలో 460 ఫిర్యాదులు అబద్దాలు అని నిర్ణయించడం జరిగిందనీ, 52 మంది జవాన్లకు శిక్ష వేయడం జరిగిందనీ ఆ కరపత్రం చెప్తుంది. ఈ గణాంకాలు 1996 అక్టోబర్ నాటివి. అయితే 1997 జూలై 24వ తేదీన లెఫ్టినెంట్ జనరల్ పద్మనాభన్ ఒక కశ్మీరీ దినపత్రికకు

ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏమంటాడంటే 1996 అక్టోబర్‌కు, 1997 జూలైకు, మధ్య మరొక 102 ఫిర్యాదులను సైన్యం విచారించిందనీ అవన్నీ కూడా అబద్ధాలని తేల్చిందనీ, ఇదంతా నిజమే అయితే సైన్యం చాలా గొప్పగా పనిచేస్తున్నట్టే కాని వాస్తవం ఏమిటంటే ఇక్కడ సైన్యం తన దుశ్చర్యల మీద తానే తీర్పు చెబుతుంది. కాబట్టి సహజంగానే తనకు అనుకూలమైనటువంటి నిర్ణయాలకు వస్తుంది.

ఇక పౌర ప్రభుత్వం మాటంటారా అసెంబ్లీలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా సైన్యాన్ని గొప్పగా పొగడసాగాడు. కశ్మీర్‌లో శాంతిని పునరుద్ధరించి అసెంబ్లీకి ఎన్నికలు జరపడం సైన్యం సాధించిన ఘటన అని ఆయన అనసాగాడు. ఫరూక్ అబ్దుల్లా యొక్క ముఖ్యమైన విమర్శకుల్లో ఒకరైనటువంటి బిజ్‌బెహారా నుండి ఎన్నికైన కాంగ్రెస్ (ఐ) శాసనసభ్యురాలు మహబూబా ముఫ్తి కూడా పొగుడుతూ మాట్లాడుతారు. అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి అసెంబ్లీ సభ్యులతో మాట్లాడుతూ, మనం ఈ రోజు ఇక్కడ కూర్చొని ఉన్నామంటే అది సైన్యం చలవే అని అన్నాడు. ఈ వైఖరికి అర్థం ఏమిటంటే ప్రజాస్వామ్యము అనేది కేవలం ఎన్నికల నిర్వహణ, అసెంబ్లీ ఏర్పాట్లకు పరిమితమైందని, కాని ప్రజాస్వామ్యము అంటే అంతమాత్రమే కాదు. మొత్తంగా పరిపాలన అనేది చట్టానికి, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు లోబడి ఉండాలి. అప్పుడే అది ప్రజాస్వామ్యమవుతుంది. లేకపోతే సైనిక బలగాలు ఏదో ఒకరకంగా కొద్దిమంది వ్యక్తులకు అధికారం చెలాయించడానికి అవకాశం కల్పించేస్తే ఇక అదే ప్రజాస్వామ్యమని, ఆ తరువాత సైన్యం ఏం చేసినా ప్రజలతో ఏ విధంగా వ్యవహరించినా ఆ వ్యక్తులు చూసీ చూడనట్టు, పోతారని అనుకోవాల్సి ఉంటుంది. రాజ్యాంగం మీద, చట్టంమీద, శపథం చేసి ప్రజల హక్కులను, వారి న్యాయమైన అవసరాలను, కాపాడతామని అసెంబ్లీలో కూర్చున్నవాళ్ళు తమ విధిని మర్చిపోవడం అవుతుంది.

సైనిక జవాన్లు పాల్పడే మానవహక్కుల అతిక్రమణ సైనిక వ్యవస్థ యొక్క అంతర్గత క్రమశిక్షణకు సంబంధించిన విషయంగా ఉండే అవగాహన యొక్క మరొక ఫలితం ఏమిటంటే చాలా అరుదుగా వేసే శిక్షలు కూడా చాలా స్వల్పంగా ఉంటున్నాయి. 1995 అక్టోబర్‌లో సైన్యం విడుదల చేసిన కరపత్రంలో మరొక విషయం చెప్పారు. ఒక కేసులో ఒక అనుమానితుడైన మిలిటెంటును ఒక సైనిక అధికారి ప్రశ్నించి ఆ క్రమంలో అతనిని చంపేశాడు అంటారు. 5 నెలల్లో అతన్ని విచారించి 3 సంవత్సరాలుగా జైలు శిక్ష వేశారని రాసుకున్నారు. అంతేకాకుండా ఇంత త్వరగా, ఇంత సమర్థవంతంగా ప్రపంచంలో ఏ సైన్యం శిక్షలు వేస్తుంది అని తమ భుజాలు తాము చరుచుకుంటూ ప్రశ్నించారు కూడా. కాని ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యకు కేవలం 3 సంవత్సరాల జైలుశిక్ష వేసే కోర్టు ప్రపంచంలో ఎక్కడుంటుంది? పౌరులు చేసే హత్యలను విచారించే

భారతదేశ న్యాయస్థానాలు మాత్రం ఆ పని చేయవు. అసలు ఏ న్యాయవ్యవస్థలో 95 శాతం కేసులు తప్పుడు కేసులుగా తేలుతాయి? ఏ వ్యవస్థలో అయితే ఫిర్యాదులు తప్పు అని నిర్ణయించడంలో న్యాయమూర్తులకే ఒక ప్రయోజనం ఉంటుందో అటువంటి వ్యవస్థలో మాత్రమే అది జరుగుతుంది. భారత సైన్యం తన గురించి తాను చేసుకున్న ప్రచారంలో భాగంగా 1993 నుంచి సైన్యంలో ఒక మానవ హక్కుల సెల్ ఉందని, అటువంటి సెల్ ఉన్న మొట్టమొదటి సైన్యం భారత సైన్యమేనని, తన సిబ్బందికి మానవహక్కులు గౌరవించడంలో తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని చెప్పుకుంది. అది మంచి పనేగానీ సైన్యానికి మానవహక్కులపట్ల గౌరవం ఉందని నిజంగా ఎప్పుడు నమ్మకం కలుగుతుందంటే సైన్యం పైన వచ్చిన అభియోగాలను ఒక నిష్పాక్షికమైన విచారణ వ్యవస్థ ద్వారా విచారింపజేసినప్పుడు, దాన్ని మాత్రం సైన్యం ఎట్టి పరిస్థితుల్లోను ఒప్పుకోదు. ఇంకా సైన్యం ఏమంటుందంటే తీవ్రమైన అభియోగాలను మాత్రమే విచారించాలని. ప్రతి అభియోగాన్ని విచారించవలసిన అవసరం లేదని, అప్పుడే మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాల మీద జవాన్లు దృష్టి పెట్టగలుగుతారు అని. అయితే ఏది తీవ్రమైన నేరమో ఏది కాదో ఎవరు నిర్ణయిస్తారు? సైనిక బలగాలకు మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాలలో నిమగ్నమయ్యేటటువంటి మనశ్శాంతి ఉండాలి అన్నదే ప్రమాణం అవుతుందా? దాన్ని ప్రమాణంగా పెట్టుకుని ఏ అభియోగం తీవ్రమైందో ఏది కాదో నిర్ణయిస్తారా? ఎప్పుడైతే సైన్యం మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటుందో, ఆ క్రమంలో ఎప్పుడైతే దేశ పౌరుల మీదనే బలప్రయోగానికి పాల్పడుతుందో, సైన్యం నేరం చేసింది అని వచ్చినట్టి ప్రతీ అభియోగం మీద ఒక నిష్పాక్షికమైన న్యాయసమ్మతమైన, విచారణ జరగడం తప్పనిసరి. కేవలం ఆయుధాలు పట్టుకున్న మిలిటెంట్లు మాత్రమే పోరాటంలో భాగంగా ఉన్నా వారికి కూడా ప్రాథమిక హక్కులు ఉన్నాయని భారతదేశ చట్టము, రాజ్యాంగము చెప్తాయి. అయితే మిలిటెన్సీకి వ్యతిరేకంగా సైన్యంగాని, పోలీసులు గాని చర్యలకు పాల్పడేటప్పుడు తుపాకులు పట్టుకున్న మిలిటెంట్ల కంటె నిరాయుధులైన పౌరుల మీదనే ఎక్కువగా వారి బలప్రయోగం చూపించడం జరుగుతుంది అనేది ఒక చేదు వాస్తవం. ఆ మిలిటెన్సీపట్ల రాజకీయంగా, సామాజికంగా సానుభూతి ఉన్నవారిపైనే ఎక్కువగా బలప్రయోగం చేయడం జరుగుతుంది. తిరుగుబాట్లు రాజకీయ ప్రక్రియలనీ, వాటికి సామాజిక మద్దతు ఉందనీ చెప్పకుండా దాచిపెట్టడం ద్వారా ఈ విషయాన్ని గుర్తించకుండా చేయడానికి ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. కాని దాన్ని గుర్తించాలి. గుర్తించకపోవడం అప్రజాస్వామికం, అనాగరికం అవుతుంది. సైన్యం వేసిన అంచనా ప్రకారమే జమ్మూ కశ్మీర్‌లో మొత్తం మిలిటెంట్ల సంఖ్య 3 వేల నుంచి 4 వేల దాకా ఉంటుందని, దాంట్లో 25 శాతం మాత్రమే చాలా చురుగ్గా పాల్గొంటున్నారని

అర్థమవుతుంది. మరి జమ్మూ కశ్మీర్‌లో ఉన్న సైనిక బలగాల శక్తి ఎంత? 60 వేల మంది సాయుధ సైనికులు ఉన్నారు. అదనంగా సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్; ఐటిబిపి, జమ్మూ కశ్మీర్ పోలీసులు ఉన్నారు. అంతా కలుపుకుంటే ఒక లక్ష నుంచి లక్షన్నర అవుతుంది. ముగ్గురు మిలిటెంట్లకు వంద మంది జవాన్ల నిష్పత్తిలో పోరాటం చేయవలసిన అవసరం ఏముంటుంది? ఎందుకుంటుందంటే చాలా పెద్ద సంఖ్యలో సాధారణ ప్రజలు ఆ మిలిటెన్సీ యొక్క మద్దతుదార్లుగా, సానుభూతిదార్లుగా, అన్నం పెట్టేవాళ్లుగా, ఆశ్రయమిచ్చేవాళ్ళుగా ఉన్నారు కాబట్టి. నిజమే, మిలిటెంట్లు ప్రజలపైన ఒత్తిడి, బలప్రయోగం చేస్తున్న మాట వాస్తవమే. అయినప్పటికీ వారికి ప్రజల రాజకీయ మద్దతు ఉందనేది వాస్తవం. సైన్యం పాల్పడే మిలిటెన్సీ వ్యతిరేక చర్యలకు ప్రధానంగా బలయ్యేది ఈ ప్రజలే అనేది కూడా వాస్తవం. మానవహక్కుల అతిక్రమణ గురించి మనం ఈ సందర్భంలో, ఈ నేపథ్యంలో మాట్లాడుతున్నామని గుర్తుంచుకోవాలి.

జమ్మూ కశ్మీర్‌లో సైనిక బలగాలు ఒక వైపు, మిలిటెంట్లు మరొకవైపు పాల్పడుతున్న హత్యాకాండ, రక్తపాతాల వల్ల ఇతర రూపాల అన్యాయం లెక్కకు రాకుండా పోతుంది. కాని దాన్ని కూడా చూడటం అవసరం. ఇందులో ముఖ్యమైనది చాలా పెద్ద ఎత్తున జరుగుతున్న ఆవాసాల ధ్వంసం. ఇవి ఇళ్లు కావచ్చు, దుకాణాలు కావచ్చు, స్కూళ్లు కావచ్చు. సినిమా హాళ్ళు కావచ్చు. అధికారిక గణాంకాల ప్రకారం 1996 అక్టోబర్ 29 నాటికి మొత్తంగా నాలుగువేల పద్దెనిమిది పేల్చివేత ఘటనలు జరిగాయి. అందులో 686 విద్యాసంస్థలు కాగా, ప్రైవేట్ నివాసాలు 8468, ప్రభుత్వ కార్యాలయాలు 1206, దుకాణాలు 1162, ఆరు ఆస్పత్రులు కూడా ధ్వంసమయ్యాయి. ఈ విధ్వంసానికి ఇటు మిలిటెంట్లు అటు భద్రతాదళాలు కూడా బాధ్యులే. ఏ ఇళ్లు లేదా నివాసాలైతే మిలిటెంట్లకు ఆశ్రయం ఇవ్వడానికి ఉపయోగపడుతున్నాయి అని సైన్యం భావిస్తున్నదో వాటి మీద సైన్యం దాడి చేస్తుంది. ఏ నివాసాలనైతే సైన్యం క్యాంపులుగా వాడుకుంటుందో వాటిపైన మిలిటెంట్లు దాడి చేస్తారు. వలస వెళ్ళిపోయిన కశ్మీర్ పండిట్ల ఇళ్లు చాలా పెద్ద సంఖ్యలోనే మిలిటెంట్లు ధ్వంసం చేశారు. అదేరకంగా మిలిటెంట్ల పట్ల సానుభూతి ఉన్న, లేక వాళ్ళకు సహకారం ఇస్తున్న వారి నివాసాలను సైన్యం ధ్వంసం చేసింది.

ఒక ఘటన వివరాలు చూస్తే ఇది ఏవిధంగా ఉంటుందో అర్థం అవుతుంది. కుప్వార జిల్లా హంద్వారా తాలుకాలోని బద్‌కోట్ గ్రామానికి చెందిన అమిరుద్దీన్ వాని ఇల్లు, వారి ఆపిల్ తోట సైనిక బలగాల విధ్వంసానికి గురయ్యాయి. అతని కొడుకు మహ్మద్ అమీర్ వాని మాజీ మిలిటెంట్. కొంతకాలం మిలిటెంట్‌గా ఉండి బయటకు వచ్చి సర్కారీ మిలిటెంట్‌లలో చేరాడు. తరువాత మళ్ళీ మిలిటెంట్ల ఒత్తిడికి అతను మిలిటెన్సీలో భాగం అయ్యాడు. దీంతో కోపం వచ్చిన సైనిక బలగాలు తన కొడుకును మిలిటెంట్ల నుంచి బయటకు తీసుకురమ్మని అమీరుద్దీన్ వానిపైన ఒత్తిడి పెట్టారు. అతని భార్యను

క్యాంపుకు తీసుకుపోయి అవమానపరిచారు. భార్యభర్తలిద్దరూ ఇక భరించలేక బద్‌కోట్‌లోని తమ నివాసం వదిలేసి శ్రీనగర్‌కు వచ్చేశారు. వారు తప్పించుకున్నారని సైనిక జవాన్లకు చాలా కోపం వచ్చింది. వారు బద్‌కోట్‌లోని వాని ఇంటిని పేల్చేసి వాళ్ల మూడెకరాల ఆపిల్ తోటను నరికేశారు. మొదటిసారి ఆపిల్‌తోటను సగం నరికిన తరువాత వాని శ్రీనగర్‌కు వచ్చి హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు అబ్దుల్ గనీలోన్‌కు చెప్పుకుంటే లోన్ కశ్మీర్ ఐ.జి.కి చాలా వివరమైన లేఖ రాసి ఆపిల్ తోటను ఈ విధంగా ధ్వంసం చేయడమేమిటి దాన్ని ఆపండి అని కోరాడు. ఐతే సమాధానమేమి రాకపోగా ఆ తరువాత మిగిలిన సగం తోటను కూడా జవాన్లు ధ్వంసం చేశారు.

భావప్రకటనా స్వేచ్ఛపైన దాడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. సైనిక బలగాలు, సర్కారీ మిలిటెంట్లు పాల్పడే అత్యాచారాలకు గురయ్యే ప్రజలు తరుచుగా పెద్ద ఎత్తున నిరసన ఉద్యమాలు చేపడతారు. ముఖ్యంగా స్త్రీలపైన అత్యాచారాలు, కస్టడీ హత్యలు తరుచుగా నిరసనకు దారితీస్తాయి. ఈ నిరసన కార్యకలాపాలపైన, ఉద్యమాలపైన విపరీతమైనటువంటి బలప్రయోగం చేయడం, చెదరగొట్టడం జరుగుతూ ఉంటుంది. కశ్మీర్‌లో పత్రికారంగం అత్యంత సమస్యాత్మకమైన పరిస్థితుల్లో ఒక ముఖ్యమైన కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. అయితే రెండు వైపుల నుండి తమకు అనుకూలంగా రాయాలి, తమకు ఇబ్బందికరమైనవి రాయకూడదు అనే ఒత్తిడి పత్రికా రంగం మీద ఉన్నది. మిలిటెంట్లు భౌతికదాడులకు పాల్పడతామని బెదిరించడం, పత్రికలను నిషేధించడం అనేవి సాధనాలుగా ఎంచుకోగా, అధికార యంత్రంగా చాలా సందర్భాలలో పత్రికను మొత్తం జప్తు చేసుకునే మార్గాన్ని ఎంచుకుంది. లేదా దాడులు జరుగుతాయి జాగ్రత్త అనే బెదిరింపులను ఎంచుకుంది. రాజద్రోహం కేసులు చాలా పెద్ద ఎత్తున్నే పత్రికా రంగంపైన పెట్టారు. 1990లో మిలిటెన్సీ ప్రారంభమైన తరువాత కశ్మీర్ పేపర్లపైన 4 వందల రాజద్రోహం కేసులు పెట్టారని కశ్మీర్ టైమ్స్ దినపత్రిక రాసింది.

చాలా సందర్భాలలో సైన్యంగానీ, సర్కారీ మిలిటెంట్లుగాని, అత్యాచారాలకు హింసకు పాల్పడినప్పుడు వారిపైన ప్రజలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతూ ఉంటుంది. అయితే ఆ తరువాత ఏం జరుగుతుంది అనేది గమనించదగ్గ విషయం. మిలిటెన్సీ మొదలైన తరువాత చాలా కాలం దాక కశ్మీర్‌లో మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాలు భారత సైన్యం మాత్రమే నిర్వహించేది. రాష్ట్ర పోలీసులను సైతం అనుమానంగా చూడటం జరిగేది. ఒక పోలీసులే కాదు కశ్మీర్‌లో ఎవరినైనా, వాళ్లు న్యాయమూర్తులుగాని, ప్రొఫెసర్లుగాని, డాక్టర్లుగాని ఇంజనీర్లుగాని అందరిని అనుమానంగా చూడటం జరిగేది. 1996 తరువాత మాత్రమే జమ్మూ కశ్మీర్ పోలీసులు, ముఖ్యంగా దానిలో భాగమైన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ లేదా స్పెషల్ టాస్క్‌ఫోర్స్, సైనిక బలగాల

కార్యకలాపాల్లో భాగం పంచుకోవడం, సర్కారీ మిలిటెంట్లు కొంత మందిని రాష్ట్ర పోలీసు యంత్రాంగంలో స్పెషల్ పోలీసు ఆఫీసర్లుగా నియమించడం జరిగింది. అదంతా ఎట్లా ఉన్నా సైనిక బలగాలు లేదా జవాన్లు పాల్పడిన ఆత్యాచారాల గురించి ఒక ఫిర్యాదు వస్తే దాన్ని పరిశోధించడానికి పోలీసులకు పూర్తి అధికారం ఉంటుంది. ఏ నేరాన్నయినా పరిశోధించకుండా అడ్డుకునే చట్టమేది లేదు. చార్జిషీటు పెట్టడానికి, నేర విచారణ కోర్టులో జరిపించడానికి, కేంద్రం అనుమతి అవసరమైతే కావచ్చును గానీ నేర పరిశోధనకు ఏ అనుమతీ అవసరం లేదు. అయితే జమ్మూ కశ్మీర్ పోలీసులు అటువంటి ఫిర్యాదుపైన విచారణ అంత సులభంగా చేపట్టరు. ఏదో ఒక మేరకు ఎక్కడి నుండో ఒత్తిడి వస్తేనే చేస్తారు. ఒక వేళ అటువంటి ఒత్తిడి వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేసినా నేర పరిశోధన ఒక తంతుగా చేస్తారు. ఇక అక్కడితో విషయం ఆగిపోతుంది. ఆ తరువాత కూడా, ఒక వేళ కోర్టుకుపోయి పరిశోధన పూర్తి చేయమని ఆదేశం తెచ్చుకున్నా సైన్యం సహకరించదు. కాబట్టి నేర పరిశోధన పూర్తికాదు. ముద్దాయిని, లేక అనుమానితుడ్ని ప్రశ్నించడానికి, కస్టడీలోకి తీసుకోవడానికి, పోలీసులకు సైన్యం సహకారం దక్కదు. ఒకవేళ అదిసాగి చార్జిషీటు వేసే పరిస్థితి వచ్చినా కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా నేర విచారణ సాధ్యం కాదు కాబట్టి కేంద్ర ప్రభుత్వ అనుమతి ఇవ్వదు కాబట్టి, అక్కడితో విషయం ఆగిపోతుంది. మానవ హక్కుల న్యాయవాది అయిన జలీల్ అహ్మద్ అంద్రబీ హత్య ఒక ఉదాహరణ. అతని అపహరణ, హత్యలకు సంబంధించిన వివరాలు ముందు ఆధ్యాయంలో ఇచ్చాము. అతనిని 1996 మార్చి 9న ఒక సైనిక అధికారి ఆదేశాల మేరకు సర్కారీ మిలిటెంట్లు అపహరించారు. వెంటనే అతని అపహరణ పైన హైకోర్టులో కేసు దాఖలు చేయడం జరిగింది. హైకోర్టు ఉన్నతస్థాయి పోలీసు అధికారులతో ఒక స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంను నియమించింది. ఇదంతా జరుగుతూ ఉండగానే మార్చి 27న అంద్రబీ శవం జీలం నదిలో కన్పించింది. తాము నియమించినటువంటి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం తన నేరపరిశోధనను కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. మధ్య మధ్యలో నేర పరిశోధన ఆగిపోతుంటే హైకోర్టు పదే పదే ఆదేశాలు జారీ చేయగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం నేర పరిశోధన కొనసాగించి జలీల్ అంద్రబీని అపహరించి, చంపిన ఘటనకు ప్రధాన బాధ్యుడు మేజర్ అవతార్‌సింగ్ అనే సైన్యాధికారి అని గుర్తించింది. 1997 ఏప్రిల్ 10వ తేదీన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ విషయాన్ని హైకోర్టులో చెప్పింది. అతను లూథియానా కేంద్రంగా ఉన్న 103 టెరిటోరియల్ ఆర్మీకి చెందిన వాడని తేలింది.

హైకోర్టు సైనికాధికారులను ఈ విషయానికి జవాబు చెప్పమని కోరగా టెరిటోరియల్ ఆర్మీకి ఒక చట్టం ఉందనీ ఆ చట్టం కింద తాత్కాలికంగా మాత్రమే కొంతమంది సైన్యంలోకి తీసుకోవడం జరుగుతుందనీ ఆ తర్వాత వారు ఎక్కడికి పోతారో తెలియదనీ,

అంటే మేజర్ అవతార్‌సింగ్ ఎక్కడున్నాడో తమకు తెలియదనీ సైనిక అధికారులు చెప్పారు. అతన్ని 1996 నవంబర్ 7న పంపిచేసినట్టు చెప్పారు. హైకోర్టు జడ్జీలకు కోపం వచ్చింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీంకు సైన్యము, భారత ప్రభుత్వము అన్ని రకాల సహాయ సహకారాలిచ్చి మేజర్ అవతార్‌సింగ్ ఎక్కడున్నాడో వెతికి పట్టుకోవాలని ఆదేశించింది. అయినప్పటికి అతను ఎక్కడున్నాడో అతన్ని ఏ విధంగా పట్టుకోవడం జరుగుతుందో ఇప్పటికీ తెలియదు. భారత సైన్యం నిజంగానే తాత్కాలికంగా అధికారులను తీసుకున్నా ఆ సమయం దాటిపోయిన తర్వాత వారు ఎక్కడున్నారో తెలియనంతఅమాయకంగాఉంటుందనినమ్మడంసాధ్యం కాదు.ఇటువంటి ఘటనలు ఎన్నో.

పరిస్థితి ఈ విధంగా ఉండడానికి కోర్టులను కూడా కొంత మేరకు తప్పుపట్టక తప్పదు. చట్టబద్ధ పాలన ఆ స్థాయికి దిగజారింది అంటే న్యాయస్థానాల బాధ్యత కూడా ఉంది. జమ్మూ కశ్మీర్ హైకోర్టుకు రెండు బెంచీలున్నాయి. ఒకటి శ్రీనగర్‌లోను ఒకటి జమ్మూలోను. ఎవర్నయినా సైనికులుగాని, పోలీసులుగాని అరెస్టు చేస్తే వెంటనే హెబియస్ కార్పస్ పిటీషన్లు వేయడం జరుగుతుంది. శ్రీనగర్‌లో ముఖ్యంగా చాలా పెద్ద ఎత్తున ఈ హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలవుతున్నాయి. హైకోర్టు అడ్వకేట్లు చెప్పిన దాని ప్రకారము శ్రీనగర్ బెంచి ముందు పదమూడు వందల హెబియస్ పిటిషన్లు పెండింగులో ఉన్నాయట. అందులో 409 పిటిషన్లు సైన్యం అదుపులోకి తీసుకొని ఆ తర్వాత కనిపించకుండా పోయినవారి గురించి, మిగిలినవి పబ్లిక్ సేఫ్టీ ఆక్ట్ తదితర ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాల కింద అరెస్టయిన వాళ్ళ గురించి, అటువంటి కేసులలో హైకోర్టు ఒకవేళ విడుదల చేయమని ఆదేశం ఇచ్చినా ఆ ఆ దేశం 6 నెలలు లేక సంవత్సరకాలం అమలు కాకుండా పోయే పరిస్థితి కూడా ఉంది. కేసులు ఇంత ఆలస్యం కావడానికి అనేక కారణాలు ఉన్నాయి. విపరీతంగా హెబియస్ కార్పస్ కేసులుండటం వల్ల వారంలో ఒక్క రోజు మాత్రమే హెబియస్ కార్పస్ కేసులు వినడం జరుగుతుంది అన్న నియమం తనకు తాను హైకోర్టు పెట్టుకుంది. ఈ నియమం పెట్టిన మహానుభావుడు జమ్మూ కశ్మీర్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎస్. ఎస్.కాంగ్. ఇతను తర్వాత కాలంలో జాతీయ మానవహక్కుల సభ్యుడు అయ్యాడు కూడా. ఫలానా కోవకు చెందిన కేసులు ఎక్కువగా వున్నాయి కాబట్టి ఆ కేసులు వారంలో ఒకేరోజు వింటామనే నియమం పెట్టుకోవడం వేరే విషయాలలో హేతుబద్ధమయిన నిర్ణయం అయి ఉండవచ్చును కానీ, ఒకరోజు పట్టుకున్న వ్యక్తి గురించి మరొక ఆరు రోజుల తర్వాత తప్ప కోర్టులో కేసు వేయలేని పరిస్థితి ఉంటే ఆ వ్యక్తి ప్రాణానికి భరోసా ఏముంటుంది?

ఒకవేళ ఇంతాచేసి హైకోర్టు విచారణ క్రమంలో ఆయా జిల్లాల సెషన్ జడ్జిచేత కానీ మరొక అధికారి చేత కానీ న్యాయవిచారణ జరిపిస్తే ఆ విచారణకు సైన్యం సహకరించదు. ఒకవేళ విచారణ జరిగి రిపోర్టు వచ్చినా దానిమీద సైన్యం చర్య

తీసుకోదు. కోర్టు కూడా ఆ రిపోర్టు చూసిన తర్వాత వెంటనే ఖచ్చితమైన చర్య తీసుకోవాలి అన్న ఆదేశమివ్వదు. దానిమీద మళ్ళీ అభ్యంతరాలు చెప్పడానికి ప్రభుత్వానికి నెల, రెండు నెలల గడువిస్తుంది. హెబియస్ కార్పస్ కేసులు ఎంత మామూలు విషయాలైపోయాయంటే ఒక వ్యక్తిని సైనిక బలగాలు పట్టుకు పోయారు అని కేసు వేస్తే జవాబు చెప్పడానికి చాలా సందర్భాలలో నాలుగు వారాల టైం ఇస్తుంది హైకోర్టు. అప్పటికీ ఇంకా టైం కావాలి అని ప్రభుత్వం అడిగితే ఇంకా టైం ఇస్తుంది. ఒక్కొక్కసారి ఒక సంవత్సరం దాకా వారు జవాబే వేయరు. చివరికి కేసు వేసిన న్యాయవాది విసిగిపోయి ఈ కేసు మీద ఆసక్తిని వదులుకోవాలి. ఒక ఉదాహరణ చెప్పుకుంటే ఉపయోగకరంగా ఉంటుంది. అనంత్‌నాగ్ జిల్లాకు చెందినటువంటి గులాం నబీడార్ అనే వ్యక్తిని 1994 జులై 10న భారతసైన్యానికి చెందిన 10 మౌంటెన్ బ్రిగేడ్ అరెస్ట్ చేసింది. అతని అరెస్టు విషయంలో వెంటనే కుల్గాం పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది. అయినప్పటికీ అతను ఎక్కడున్నాడో తెలియకపోయేసరికి 1995లో అతని కుటుంబం హైకోర్టులో హెబియస్ కార్పస్ కేసు వేసింది. ఎప్పటిలాగే హైకోర్టు 4 వారాల టైం ఇచ్చింది. మళ్ళీ నాలుగు వారాలు, మళ్ళీ నాలుగు వారాలు.... అట్లా 2 సంవత్సరాలు గడిచింది. ప్రభుత్వం జవాబు ఇవ్వలేదు. 1997 సెప్టెంబర్‌లో హైకోర్టుకు ఎంత కోపం వచ్చింది అంటే జవాబు వెయ్యనందుకు అనంత్‌నాగ్ జిల్లా ఎస్పీకి వెయ్యి రూపాయల జరిమాన వేసి ఆఖరిసారిగా అంటూ మరొక రెండు వారాల టైమిచ్చింది అభ్యంతరాలు జారీ చెయ్యడానికి! ఈ రకమైన పద్ధతులు కోర్టులు ఆచరిస్తూ ఉంటే గులాం నబీ డార్ లాంటి యువకుల ప్రాణాలకు భరోసా ఏముంటుంది?

కోర్టులు ఒకవేళ ఒక ముద్దాయి లేక బందీ యొక్క విడుదలకు ఆదేశాలు జారీచేస్తే అవి అమలు కాకపోవడం అనేది దేశంలో సాధారణంగా జరుగదు. కానీ కశ్మీర్‌లో అది కూడా జరుగుతుంది. బారముల్లా జిల్లా గులిస్తాన్‌కు చెందినటువంటి ఫరూక్ అహ్మద్‌ఖాన్ కథ చాలా బాధాకరమైన ఉదాహరణ. అతను టీచర్‌గా ఎంపికయ్యాడు. మిలిటెన్సీ మొదలైన కొత్తలో అతనిని సైన్యం అరెస్టు చేసింది. ఏడు సంవత్సరాల తర్వాత కూడా అనేకసార్లు కోర్టులు అతని విడుదలకు ఆదేశాలు జారీచేసినా అతను విడుదల కాకుండా జైలులోనే ఉన్నాడు. మొదట్లో అతన్ని విపరీతంగా చిత్రహింసలు పెట్టారు. చివరికి అతను అమాయకుడు అని అర్థం చేసుకున్నారు. మిలిటెంట్లతో ఏమీ సంబంధం లేదు అని గ్రహించారు కానీ చిత్రహింసలు చాలా పెట్టారు కాబట్టి వెంటనే వదిలిపెట్టడం ఇష్టంలేక అతని తండ్రికి కబురు పంపించి కొడుకు అరెస్టు విషయం, నిర్బంధించిన విషయం ఎవరికి చెప్పొద్దనీ వారం తర్వాత వచ్చి తీసుకొమ్మనీ చెప్పారు. సరే వారం తర్వాత పోదాం కదా అని తండ్రి బాబా నవాబ్‌ఖాన్ అనుకుంటూ ఉండగా ఏ అధికారికో ఏదో అలోచన వచ్చి ఫరూక్ అహ్మద్‌ఖాన్‌ను మరికొంత విచారణ కోసం శ్రీనగర్‌కు పంపించాడు. అక్కడి నుండి అతని మీద 'పబ్లిక్ సేఫ్టీ యాక్ట్' కేసు పెట్టి ఉదంపూర్ జిల్లా జైలుకు పంపించాడు. ఆ

చట్టం కింద ఒక సంవత్సరం అతను బందీగా ఉండాలి. కాని అతన్ని ఎక్కడికి పంపించిందీ ఏమయ్యింది తల్లితండ్రులకు తెలియదు. వెతకగా వెతకగా మూడు నెలల తర్వాత అతను ఉదంపూర్ జైలులో ఉన్నాడని తండ్రికి అర్థమయ్యింది. తండ్రి కశ్మీర్ బార్ అసోసియేషన్ సహకారంతో హెబియస్ కార్పస్ పిటీషన్ వేశాడు. దాని విచారణ అయ్యేటప్పటికీ అతని నిర్బంధ కాలం అంటే ఒక సంవత్సరం గడచిపోయింది. అయినప్పటికీ అతన్ని వదిలిపెట్టకపోయేసరికి 1992 నవంబర్ 17న హైకోర్టు అతన్ని వదలిపెట్టమని ఆర్డరు జారీచేసింది. కాని దాన్ని అమలు చేయలేదు. అతన్ని ఉదంపూర్ నుంచి జమ్మూలోని కోట్‌బిల్‌వాల్ డిటెన్షన్ సెంటర్‌కు తీసుకుపోయారు. అక్కడ అతన్ని బంధించడానికి ఏ చట్టం కాని, ఏ చట్టబద్ధమైన అధికారం గాని లేదు. ఎన్నాళ్ళైనా తన కొడుకు తిరిగి వచ్చేటట్టు లేడని మంచమెక్కి అతని తండ్రి గుండెపోటుతో చనిపోయాడు. ఆ తర్వాత కొడుకు కోసం ప్రయత్నం చేసేవాళ్ళెవరు లేకుండా పోయారు.

రెండున్నర సంవత్సరాల తర్వాత మార్చి 1995లో అతన్ని మళ్ళీ శ్రీనగర్‌లోని రంగ్‌రేత్ ప్రాంతంలో ఉన్న ఒక ఇంటరాగేషన్ సెంటర్‌కు తీసుకొచ్చారు. ఈ మొత్తం కాలంలో అతని నిర్బంధానికి ఏ రకమైన చట్టబద్ధమైన ఆధారము లేదు. 1996 జూలైలో కశ్మీర్ బార్ అసోసియేషన్‌కు చెందిన కొందరు లాయర్లు ఆ ఇంటరాగేషన్ కేంద్రానికి పోయారు. పూర్తిగా ఎముకల గూడుగా అయిపోయిన ఫరూక్ అహ్మద్‌ఖాన్‌ను చూసి వాళ్ళకు చాలా జాలి అనిపించింది. మళ్ళీ వాళ్ళు హైకోర్టులో హెబియస్ కార్పస్ కేసు వేశారు. కోర్టు భారత ప్రభుత్వాన్ని, సైన్యాన్ని అతన్ని ఏ చట్టం కింద అరెస్టు చేశారో చెప్పమని ఆదేశించింది. అప్పుడు వాళ్ళు ఒక నేరంలో అతన్ని ముద్దాయిగా చూపించారు. ఇది 1993లో జరిగినటువంటి నేరం. లాయర్లు వెంటనే అతనికి బెయిల్ తీసుకున్నారు. బెయిల్ తీసుకున్న తర్వాత విడుదల చేయకుండా మరొక కేసులో ముద్దాయిగా చూయించారు. దానిలో కూడా లాయర్లు బెయిల్ తీసుకున్నారు. అప్పుడు మరొక కేసులో ముద్దాయిగా చూచించారు. దానికి కూడా బెయిల్ తీసుకున్నారు. ఈసారి కొత్త కేసు ఏదీ పెట్టలేదు కాని విడుదల చెయ్యలేదు. విడుదల చేయమని ఆదేశాన్ని ఖాతరు చేయలేదు. తిరిగి మళ్ళీ లాయర్లు కోర్టుకుపోగా అతన్ని మళ్ళీ ఒక కేసులో ముద్దాయిగా చూపించారు. దానిలో కూడా బెయిల్ తీసుకున్నా అతన్ని వదిలిపెట్టలేదు. మరొకసారి కశ్మీర్ బార్ అసోసియేషన్ లాయర్లు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్ వేశారు. 1997 ఫిబ్రవరి 4 నాడు కేసు విచారణకు వచ్చినప్పుడు లాయర్లు ఏడు సంవత్సరాలుగా ఫరూక్ అహ్మద్‌ఖాన్ ఏ విధంగా బందీగా ఉన్నాడో వివరిస్తూ చెప్పారు. అప్పుడు ఆ జడ్జి ఫరూక్ అహ్మద్‌ఖాన్ మీద ఏయే కేసులున్నాయో మొత్తం లిస్టు ఇయ్యమని ఆదేశించాడు. అవి తప్పఅతని మీద వేరే ఏ కేసులు పెట్టడానికి వీలు లేదు అని కూడా ఆదేశించాడు. దానికి 3 వారాలు టైమిచ్చారు కాని వారు ఏడు నెలల టైం తీసుకుని మరొక కేసులో అతన్ని ముద్దాయిగా చూపించారు. దాంట్లో కూడా లాయర్లు అతనికి బెయిల్ తీసుకున్నారుగానీ దానికి కూడా విలువ లేకుండా పోయింది. అతన్ని వదిలిపెట్టలేదు. ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుంది అని లాయర్లు కోర్టులో కేసు వేయగా జడ్జి కనీసం విచారించకుండా ఆ కేసును డిస్మిస్ చేశాడు. 1997 మే 31 నాటికి ఇది పరిస్థితి. ఇప్పటికయినా ఫరూక్ అహ్మద్ విడుదల అయి ఉంటాడా?

# 6. కాల్పుల విరమణ- చర్చల ప్రతిపాదన

2000 సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా భారత ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ ప్రకటించింది. దానిని తరువాత పొడిగించింది. మిలిటెంట్లతో ప్రభుత్వం ప్రత్యక్షంగా మాట్లాడుతుంది అనే ఆలోచన కూడా చర్చలో ఉంది. ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడైన కె.సి.పంత్ కేంద్ర ప్రభుత్వం ప్రతినిధిగా ఆ రాష్ట్రానికి పంపబడ్డాడు. కాల్పుల విరమణ ఏ విధంగా ఆలస్యమవుతున్నది? చర్చల విషయంలో ప్రజల అభిప్రాయం ఏమిటి? కాల్పుల విరమణ నేపథ్యంలో ప్రజలపైన సాయుధ బలగాల అత్యాచారాలు, అణచివేత ఏమైనా తగ్గాయా? అనే విషయాలు 2001 మే నెలలో ఆ రాష్ట్రంలో పర్యటించిన మానవహక్కుల బృందం పరిశీలించింది.

నిజానికి అప్పటికే కొన్ని పరిణామాలు రాజకీయ వేదిక మీద జరుగుతూ వచ్చాయి. 2000 సంవత్సరం రంజాన్ పండుగ సందర్భంగా మొదలైన కాల్పుల విరమణను రంజాన్ పండుగ అయిపోయిన రోజున 2001 మే 31 దాకా పొడిగించారు. దానితోపాటే కె.సి. పంత్‌గారిని భారత ప్రభుత్వ ప్రతినిధిగా జమ్మూ కశ్మీర్‌కు పంపించి, ఎవరు కశ్మీర్ సమస్య గురించి మాట్లాడడానికి సిద్ధంగా ఉన్నారో అన్వేషించి వారితో చర్యలు మొదలు పెట్టమని పురమాయించడం జరిగింది. అయితే మే 23న కేంద్ర ప్రభుత్వం నుండి ఒక ప్రకటన వచ్చింది. అదేమిటి అంటే మే 31 తర్వాత కాల్పుల విరమణను ఇక పొడిగించడం జరుగదు అని. అయితే పాకిస్తాన్ అధ్యక్షుడైన పర్వేజ్ ముషారఫ్‌ను చర్చల కోసం భారత్‌కు ఆహ్వానించడం జరుగుతుందని అదే సమయంలో అన్నారు. కాగా, దాదాపు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోను 2000 నవంబర్ 28 నుండి 2001 మే 31 దాకా అమలైన కాల్పుల విరమణ ఒక బూటకం అనే అభిప్రాయం వినపడింది. అయితే దాన్ని నిర్ద్వంద్వంగా బూటకం అని ప్రజలు అనలేదు. మొదటి నెల రోజులు అంటే రంజాన్ నెల కాలంలో అది అమలయ్యిందనీ ఆ తర్వాత సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కడైతే రెండు సైన్యాలూ కొంత సంయమనం పాటించాయో అక్కడ మాత్రమే అమలయ్యిందనీ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కాల్పుల విరమణకు అర్థం, అణచివేత తీవ్రత కొంచెం తగ్గింది అని మాత్రమే తప్ప, గుణాత్మకమైన మార్పేమీలేదనీ ప్రజల అభిప్రాయంగా చెప్పుకోవచ్చు. దీనికి మూడు కారణాలు ఉండవచ్చును. (1) కాల్పుల విరమణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అభిప్రాయంతో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఎన్నడూ ఏకీభవించలేదు. నిజానికి కాల్పుల విరమణను కేంద్రప్రభుత్వం ప్రకటించిన వెంటనే జమ్మూ కశ్మీర్ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శ్రీ ఎ.కె.నూరి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం కేంద్ర పారామిలిటరీ బలగాలకూ సైన్యానికీ మాత్రమే వర్తిస్తుందని రాష్ట్ర పోలీసులకు వర్తించదనీ బహిరంగంగానే ప్రకటించాడు. ప్రత్యేకించి

మిలిటెంట్లపైన పోరాడుతున్న రాష్ట్ర పోలీసు స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ లేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా ఒకసారి కాదు పలుమార్లు అన్నాడు. తన ప్రభుత్వానికి కాల్పుల విరమణ పట్ల పెద్దగా ఉత్సాహం లేదని బహిరంగంగానే అన్నాడు. దోడా తాలూకాలోని కొండ ప్రాంతాల్లో ప్రజలు ఏమన్నారంటే అప్పటిదాకా అక్కడున్న సైన్యం క్యాంపుల్ని తొలగించి పోలీసుల స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ క్యాంపులను నెలకొల్పడం జరిగిందనీ ఫలితంగా ప్రజలకొచ్చిన వెసులుబాటేమీలేదనీ. (2) రెండవ కారణం ఏమిటంటే భారతసైన్యంలో కూడ కాల్పుల విరమణ గూర్చి భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు అన్పిస్తుంది. శ్రీనగర్‌కు చెందిన ఒక అనుభవజ్ఞుడైన జర్నలిస్టు మాటల్లో చెప్పాలంటే కాల్పుల విరమణ ఎంత సమర్థవంతంగా ఉండింది అనేది స్థానికంగా ఉన్న సైనిక దళాల కమాండర్ దానిని ఏ విధంగా అర్థం చేసుకున్నాడనే దానిపైన ఆధారపడింది. రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో సైన్యమూ పారామిలిటరీ బలగాలూ కాల్పుల విరమణను మరీ అంత సీరియస్‌గా తీసుకోలేదు. అంతకుముందు సైనికబలగాల సోదాలు రాత్రి, పగలు కూడా జరిగేవి కాగా కాల్పుల విరమణ తర్వాత పగలు మాత్రమే జరిగేవి అనేది పుల్వామాలో విన్నటువంటి ఒక అభిప్రాయం. బారముల్లా జిల్లాలో హైగాం గ్రామంలో విన్న మరొక అభిప్రాయం. ఏమిటంటే కాల్పుల విరమణకు ముందు సైనిక బలగాలు ఇళ్ళను సోదా చేసినప్పుడు ప్రజలందరిని బయటకొచ్చి ఒకచోట గుమికూడమని చెప్పేవారు. కాల్పుల విరమణ తర్వాత అట్లా చేయకుండా ప్రజలు ఇండ్లల్లో ఉంటూ ఉండగానే సోదాలు చేయసాగారు. బహుశా చాలా ప్రాంతాల్లో సైనిక బలగాలు కాల్పుల విరమణ అంటే ప్రజలపైన తాము పెడుతున్న ఒత్తిడిని కొద్దిగా తగ్గించడం అని మాత్రమే అర్థం చేసుకుని ఉండవచ్చు. కొందరు ఈ విధంగా కూడా అర్థం చేసుకోలేదు. (3) మిలిటెంటు గ్రూపులు కాల్పుల విరమణను తిరస్కరించి తమ దాడులు కొనసాగించారు. కాల్పుల విరమణకు ముందు మొదలైన ఆత్మాహుతి దాడులు (ఫిదాయిన్ దాడులు) కాల్పుల విరమణ కాలంలో కొనసాగాయి, ఆ తర్వాత కూడా కొనసాగాయి. ఫిదాయిన్ అన్నటువంటి మాటలను "ఆత్మాహుతిదళం" అని పత్రికలు అనువదించాయి. వాస్తవానికి కూడా అవి ఆత్మాహుతిదళాలే. అయితే దీని గురించి కొంత ఆసక్తికరమైన చర్చ నడిచింది. ఎందుకంటే ఇస్లాం విశ్వాసాల ప్రకారం ఆత్మహత్య అనేది పాపం కాబట్టి, ఇస్లాం పేరు మీద పోరాటం చేస్తున్న మిలిటెంట్లు ఆత్మాహుతి దళాలను ఏర్పరచుకోవడం సాధ్యం కాదు. కాబట్టి ఫిదాయిన్ దాడులను ఆత్మాహుతి దాడులుగా కాకుండా అతి తీవ్రమైన రిస్క్ తీసుకునే దాడులుగా వారు అభివర్ణించారు. ఏ పేరు పెట్టుకున్నప్పటికీ వాస్తవం ఏమిటంటే ఈ దాడులు మొదలైన తర్వాత సాయుధ బలగాల్లో అభద్రతాభావం విపరీతంగా పెరిగింది. కాల్పుల విరమణను వ్యతిరేకించేవాళ్ళు ఈ దాడులు, కాల్పుల విరమణ సమయంలో కూడా కొనసాగడాన్ని తమ వ్యతిరేకతకు మద్దతుగా ఒక వాదనగా వాడుకున్నారు.

ఈ కారణాలన్నింటి వలన కాల్పుల విరమణ పైకి కన్పించినంత సమర్ధంగా వాస్తవంలో లేదు. కాల్పుల విరమణ ఢిల్లీలో ఉందీ ఇక్కడ కాదు అనీ, కాల్పుల విరమణ పేపర్లో మాత్రమే ఉంది జీవితంలో లేదు అనీ ప్రజలు అనేక సందర్భాలలో అన్నారు. ఇందులో కొంత అతిశయోక్తి ఉంటే ఉండవచ్చును. అయితే దానికి కూడా ఒక కారణం ఉంది. 'కాల్పుల విరమణ'అనే మాట వినగానే నిజంగా కొంతమేరకు శాంతి లభిస్తుంది అనే ఆశ కలిగే ఉంటుంది. అది విఫలం కావడం వల్ల కూడా కొంత అతిశయోక్తి ఉండి ఉండవచ్చు. కాల్పుల విరమణ కాలంలో మిలిటెంట్లు తమ దాడులు కొనసాగించారు. అనేది దేశమంతా ఎరిగిన విషయమే. అయితే భద్రతాదళాలు మాత్రం క్రమశిక్షణతో కాల్పుల విరమణ పాటించాయన్న అభిప్రాయం దేశవ్యాప్తంగా ఉండింది. ముఖ్యంగా కాల్పుల విరమణ ఉపసంహరించుకున్న తర్వాత ఈ అభిప్రాయాన్ని చాలా విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడం వల్ల ప్రభుత్వానికి కొంత సానుభూతి కలిగిన మాట వాస్తవమే. శాంతికోసం తానే ఏకపక్షంగా చొరవ తీసుకున్నటువంటి అభిప్రాయం కూడా కలిగించిన మాట వాస్తవమే. కాని ఇక్కడ ఏం చెప్పాలంటే పూర్తిస్థాయిలో కాల్పుల విరమణ అంటూ ఎప్పుడూ జరగలేదు. ప్రభుత్వంలోనూ హోంశాఖలోనూ ఉన్న అతివాదులు కాల్పుల విరమణ పాటిస్తే భద్రతాదళాల ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. అదే విధంగా మిలిటెంట్లు రాష్ట్రమంతటా కూడా విస్తరించే అవకాశం కలుగుతుంది అని అభ్యంతరం చెపుతూనే వచ్చారు. కాని వాస్తవానికి రంజాన్ చొరవ తర్వాత పెద్దగా మార్పేమీ రాలేదు. ప్రభుత్వంలోని అతివాదులు అంతగా భయపడాల్సిన అవసరమేమీ ఉండలేదు. ఎప్పటిలాగే తన్నడము, చిత్రహింసలు పెట్టడము సాధారణ ప్రజానీకాన్ని సాయుధ బలగాలు హింసించడం జరుగుతూనే ఉన్నాయి. కాల్పుల విరమణ అమలు చేసి శాంతి కోసం ప్రయత్నం ప్రారంభం అవుతుంది అని ఎప్పుడైతే ప్రకటించడం జరిగిందో అప్పుడే సాధారణ ప్రజానీకంలో కొంత ఆశ కలిగింది. ముఖ్యంగా శాంతియుతంగా ప్రదర్శనలు, ఊరేగింపులు తీసుకునే హక్కు తనకు లభిస్తుంది, లేక లభించింది అని భావించారు. కాల్పుల విరమణ కాలంలో గతంలో కంటే కాస్త ఎక్కువగానే మానవహక్కుల అతిక్రమణలకు వ్యతిరేకంగాను, ప్రభత్వ విధానాలకు వ్యతిరేకంగాను ప్రదర్శనలు, ఊరేగింపులు, జరిగినట్టు పత్రికలను బట్టి అనిపిస్తుంది. నిజానికి అతి తీవ్రమైన నిర్బంధం ఉన్న సందర్భాలలో కూడా కస్టడీ మరణాలపైన, ఇతర మానవహక్కుల అతిక్రమణపైన ప్రజలు పెద్ద ఎత్తుననే నిరసన ప్రదర్శనలు జరిపారు. అయినప్పటికీ కాల్పుల విరమణ తర్వాత ఇది కొంత పెరిగింది. ఈ విషయంలో మార్పు స్పష్టంగానే కనిపించింది.

కాల్పుల విరమణ ఉంది కాబట్టి ఊరేగింపులు నిర్వహించినా, ప్రదర్శనలు తీసినా తమకు హాని జరగదు అని భావించి భంగపడి ప్రాణాలు పోగొట్టుకున్న

సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటువంటి ఒక ఘటన బారముల్లా జిల్లా సొపోర్ తాలూకాలోని హైగాం గ్రామంలో జరిగింది. ఆ గ్రామానికి చెందిన జలీల్ అహ్మద్‌షా ఒకప్పుడు మిలిటెంటు. అప్పటికి కొంతకాలం క్రితం అతను సరెండరై హైగాంలోనే ఒక మెడికల్ షాపు పెట్టుకుని బ్రతుకుతున్నాడు. అందరు మాజీ మిలిటెంట్లు లాగా అతను కూడా ఏ చట్టంలోను లేనటువంటి ఆదేశానుసారం సైనిక బలగాల క్యాంపుకు రమ్మన్నప్పుడల్లా పోయి హాజరు ఇస్తున్నాడు. ఇతను సొపోర్‌లోని 3 రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపుకు పోతూ ఉండేవాడు. 2001 సంవత్సరం ఫిబ్రవరి 13 నాడు అతను రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపుకు మామూలుగా పోతూ ఉండగా దారిలో అతనిని సైనిక బలగాలు అదుపులోకి తీసుకున్నారు. ఆ సాయంత్రం కొంతమంది జవాన్లు హైగాంలోని అతని ఇంటికి వచ్చిన అతను రాసిన ఓ ఉత్తరాన్ని అతని సోదరికి ఇచ్చారు. దాంట్లో తన ఆయుధాన్ని సైనికులకు ఇవ్వవలసిందిగా అతను రాశాడు. అయితే జవాన్లు ఇల్లంతా వెతికినా అతని 'ఆయుధం' కనబడలేదు. ఫిబ్రవరి 14 నాడు గ్రామస్తులు కొందరు సొపోర్‌కు పోయి అతను ఎక్కడున్నాడో తెలుసుకునే ప్రయత్నం చేయగా అతని ఆచూకీ తెలియలేదు. ఫిబ్రవరి 15 నాడు అతని శవం బారముల్లా పట్టణంలోని స్టేడియం దగ్గర లభించింది. అతని బంధువులు మధ్యాహ్నానికి అతని శవాన్ని తెచ్చుకున్నారు. శవం మీద ఖచ్చితంగా చిత్రహింసలు పెట్టిన గుర్తులు కనిపించాయి. రెండు చేతులు విరిగి వున్నాయి. తలమీద తీవ్రమైన గాయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దాదాపు 3 వేల మంది గ్రామస్తులు, హైగాం నుండి పరిసర గ్రామాల నుండి, శ్రీనగర్– బారముల్లా రహదారి పైన పొద్దున తొమ్మిది గంటలకే ఊరేగింపు తీసారు. రహదారిని వారు ఆటంకపరిచి అతని మృతదేహం కోసం రహదారి మీదనే కూర్చున్నారు. మృతదేహం వచ్చిన తర్వాత ప్రార్థనలు నిర్వహించి అతని శవాన్ని ఖననం చేసిన తర్వాతే లేస్తామని పట్టుపట్టారు. ఇందులో చాలా మంది స్త్రీలు ఉన్నారు. వారిలో ఒకరైన తస్లీమా అనే అమ్మాయి " కాల్పుల విరమణ ఉంది కాబట్టి దాంట్లో పాల్గొన్నా ఏమి కాదు అని మేము అనుకున్నాము" అని హక్కుల బృందంతో చెప్పింది. పాపం ఆమె అపోహపడింది. ఆమె అక్క బిల్కిసా, ఆమె మేనత్త అతీకా ఆ రోజు జరిగిన కాల్పుల్లో చనిపోయారు. మృతదేహం సొపోర్ నుంచి వచ్చేసరికి ఆలస్యం కావడం వల్ల ఒక రెండు మూడు గంటలసేపు రహదారిపైన ట్రాఫిక్ ఆగిపోయింది. ఈ రహదారి మీదు రివాజుగా పెద్ద ఎత్తుననే సైన్యం వాహనాలు వస్తూ పోతూ ఉంటాయి. సైన్యం వాహనాలు కూడా ఆగిపోయాయి. సొపోర్‌కు చెందినటువంటి పోలీస్ స్టేషన్ ఎస్ఐ, ఇతర పోలీసులు, అక్కడికి వచ్చారు. ఆగిపోయిన సైనిక ట్రక్కుల్లోని జవాన్లు విసుక్కుంటున్నారని గ్రహించిన సొపోర్ ఎస్ఐ ప్రదర్శనకారులకు వెళ్ళిపొమ్మని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ప్రజలు ఒప్పుకోలేదు. సైనిక జవాన్లు ట్రక్కుల నుంచి దిగి రోడ్డుపైన బైఠాయించిన ప్రజల తలలపైన, వీపులపైన, తుపాకీ మడమలపైన కొట్టసాగారు. ఒక పదినిమిషాలపాటు ఇది జరిగింది. అప్పటికీ ప్రదర్శనకారులు లేవలేదు. అప్పుడిక జవాన్లు కాల్పులు

జరపడానికి సిద్ధపడ్డారు. సొపోర్ ఎస్ఐ కుర్షిద్ అహ్మద్ అడ్డుకొని కాల్పులు జరుపొద్దని జవాన్లను వేడుకున్నాడు. తాను ప్రదర్శనకారులతో మాట్లాడి ప్రదర్శనను ముగింపు చేస్తాను అందుకు టైం ఇవ్వమని కోరాడు. జవాన్లు అంగీకరించకుండా ఒక పదినిమిషాలపాటు నేరుగా జనంలోకి కాల్పులు జరిపారు. వాళ్ళు ఎంత విచక్షణారహితంగా కాల్పులు జరిపారంటే ఎస్ఐ సైతం చచ్చిపోయేవాడే. కాని సఫ్దర్ అలీడార్ అనే ఒక గ్రామస్తుడు ఎస్ఐని కాపాడటానికి అడ్డంపోయి తాను చనిపోయాడు. మరొక ముగ్గురు కూడా చనిపోయారు. వారు అతీకాబేగం (ఈమె ఐదుగురు పిల్లల తల్లి), బిల్కిసా బాను (ఈమె డిగ్రీ విద్యార్థిని), మంజూర్ అహ్మద్ ఫర్రా అనే ఒక దుకాణందారు.

ఆ సమయంలో అక్కడ వివిధ టెలివిజన్ కెమెరాలు కూడా ఉండడం వల్ల ఇది మొత్తం 'జీ'టీవి వంటి ఛానళ్ళలో ప్రసారమైంది. అందువల్ల ఢిల్లీతో సహా దేశంలో పలు ప్రాంతాల్లో నివసించేవారు ఈ దుర్మార్గమైన దాడిని చూశారు. నిజానికి సైన్యం ఆనాడు పాల్పడిన చర్య, అత్యంత అణచివేత స్వభావం కలిగినటువంటి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టానికి సహితం విరుద్ధమైనది. ఆ చట్టం నిర్బంధపూరితమైనదే అయినప్పటికీ ఆ చట్టం ప్రకారం కూడా సైన్యం అక్కడ మోహరించబడినది పౌరపాలన అధికారానికి ప్రత్యామ్నాయంగా కాదు, పౌర పాలనాధికారానికి సహకరించడానికి స్థానిక పౌర పరిపాలనలో భాగమైన ఎస్ఐ తాను ప్రజలను ఒప్పించి విరమింపజేస్తాననీ అప్పటిదాకా ఆగమనీ కోరినప్పుడు అతని మాట కాదని సైనిక జవాన్లు వ్యవహరించడం ఈ చట్టం ప్రకారం కూడా తప్పే. సరే ఆ తర్వాత ఏం జరిగిందంటే విషయం టీవీ ఛానళ్ళ ద్వారా దేశమంతా ప్రసారమయింది కాబట్టి సొపోర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ కట్టారు. బారముల్లా జిల్లా ఎస్పి గారు స్వయంగా నేరపరిశోధన చేస్తున్నారని పత్రికలు రాశాయి. అయితే కశ్మీర్‌లో ఉన్న సైనిక జవాన్లు పోలీసుల నేర పరిశోధనకు సహకరించరు కాబట్టి దీనివల్ల ఏ ప్రయోజనమూ వచ్చే అవకాశము లేదు. సైన్యం కూడా తన విచారణను తాను చేపట్టింది. అయితే ఈ విచారణ ఎక్కడ చేపట్టారు అంటే బారముల్లాలోని రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపులోనే. వాంగ్మూలాలు ఇవ్వదలచిన ప్రజలు ఆ క్యాంపుకే వెళ్ళి సైనిక అధికారుల సమక్షంలోనే వారికి వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇవ్వవలసి వచ్చింది. అయినప్పటికీ ధైర్యం చేసి జనం అక్కడికిపోయి హైగాం కాల్పులకు ప్రధాన బాధ్యుడు మేజర్ ఝూ అనే అధికారి అని పేరు పెట్టి చెప్పారు. వాంగ్మూలం ఇస్తున్న ప్రజలు తాము వాంగ్మూలం ఇచ్చేటప్పుడు స్థానిక పోలీసులు అక్కడ ఉండి తమ మాటల్ని తర్జుమా చేయాలని కోరారు. దీనికి సైన్యం ఒప్పుకోలేదు. ఆ తర్వాత పత్రికల్లో మేజర్ ఝూతో పాటు కొందరు

అధికార్లపైన సైన్యం చర్యలు తీసుకుంటూ ఉంది అని వ్రాశారు. కావచ్చు కాకపోవచ్చు, నిర్ధారించుకోవడం కష్టం. అయితే ఇక్కడ చెప్పుకోదగ్గక విషయం ఏమిటంటే ఏ ఘటనను పరిశోధించేదీ సైన్యమే నిర్ణయించుకుంటుంది. తానే పరిశోధిస్తుంది. తానే తీర్పు ఇస్తుంది. సాధారణ పౌరులందరికి వర్తించేటటువంటి నేర పరిశోధన, నేర విచారణ విధానాల్ని సైన్యం గౌరవించదు. అంటే పోలీసులు నేర పరిశోధన జరిపి కోర్టులో నేర విచారణ జరగడం అనేది సైన్యానికి ఇష్టం లేదు. అప్పటికి ఒక దశాబ్దం ముందయితే తన జవాన్లు ఏ అత్యాచారాలకూ పాల్పడరు అని సైన్యం బుకాయించేది. చాలా విషయాలు బయటికొచ్చి అణచివేత చర్యలపైన నిరసన వచ్చేటప్పటికి, ఇప్పుడు ఎంపిక చేసుకున్న కొన్ని ఘటనలను తానే పరిశోధిస్తుంది, తానే విచారిస్తుంది, తానే నిర్ణయించుకున్న పద్ధతిలో తాను వేయదలచుకున్న శిక్ష వేస్తుంది. ఏ ఘటనను విచారించకపోవడం ఎంత చట్ట విరుద్ధమో ఇదీ అంతే చట్టవిరుద్ధం. ఏవో కొన్ని ఘటనల మీద కోర్టు మార్షల్ జరిపి శిక్షలు వేసినట్టు చూపించుకుంటే చూపించుకోవచ్చు గాక, ఇది న్యాయం అనడానికి మాత్రం వీలు లేదు.

జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం కూడా హైగాం కాల్పుల గురించి ఒక న్యాయ విచారణను ప్రకటించింది. ఓ.పి శర్మ అనే ఒక రిటైర్డ్ జిల్లా జడ్జీని నియమించింది. మే నెల చివరిదాకా శర్మ గారు కనీసం హైగాం గ్రామాన్ని సందర్శించలేదు. రెండు నెలల్లోపు ఆయన తన విచారణ నివేదికను అందజేయాలని ప్రభుత్వం చెప్పగా మూడున్నర నెలల తర్వాత అతను ఆ గ్రామానికి పోలేదు. హైగాం గ్రామస్తులు న్యాయం జరుగుతుందని కాని, దోషులపైన చర్య తీసుకోవడం జరుగుతుందని కాని ఏ ఆశా పెట్టుకోవడం లేదు. ఇది జమ్మూ కశ్మీర్‌లో కాల్పుల విరమణ కాలంలో జరిగిన ఘటన. కాల్పుల విరమణ కాలంలో సైతం ప్రజలపైన జరిగే అత్యాచారాల విషయంలో అధికార యంత్రాంగం ఎటువంటి వైఖరి అనుసరించింది అనే దానికి ఇదొక మంచి ఉదాహరణ.

కాల్పుల విరమణ కాలంలో జరిగిన మరొక ప్రముఖమైన ఘటన శ్రీనగర్ నుండి పర్యాటక కేంద్రమైన 'గుల్మార్గ్'కు పోయే రహదారిపైన బడ్గాం జిల్లాలో ఉన్న మాగాంలో జరిగింది. అదొక పెద్ద గ్రామం. కశ్మీరీ ముస్లింలు ప్రధానంగా సున్నీలు కాగా, మాగాం షియాలు నివసించేటటువంటి 9వేల జనాభా ఉన్న గ్రామం. మే నెల 9 నాడు ఆ గ్రామంలో జరిగిన ఘటన దానంతటదే పెద్ద వార్త అయి ఉండేది కాదు కానీ 10వ తేదీ నాడు పత్రికా విలేకర్లపై జరిగిన దాడి వల్ల ఈ ఘటనకు కూడా ప్రాముఖ్యం వచ్చింది. మొహర్రం నాడు అంటే ఏప్రిల్ 1వ తేదీన దాదాపు 10వేల మంది జనం మతపరమైన ఊరేగింపు తీస్తూ ఉండగా శ్రీనగర్ నుండి వస్తూ వున్న సైనిక జవాన్లు ఆ గుంపును చూసి భయపడ్డారో ఏమోగాని వారిని విపరీతంగా కొట్టారు. 17 మందికి గాయాలయ్యాయి అందులో ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. మాగాం పోలీస్‌స్టేషన్లో జవాన్లపై ఎఫ్ఐఆర్ కూడా నమోదయ్యింది. ఎస్ఐ స్వయంగా దాన్ని

ఫిర్యాదుగా నమోదు చేశాడు. అయినప్పటికీ అతను ఏ చర్యా సైనిక జవాన్లపై తీసుకోడు. తీసుకోలేడు, అని తెలుసును కాబట్టి మాగాం గ్రామ యుకులు ఆందోళన కొనసాగించారు. వారి ఆందోళనను అదుపు చేయడానికి 5 వ తేదీన ఒక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీస్ క్యాంపును గ్రామంలో ప్రభుత్వం నెలకొల్పింది. మే 9వ తారీఖున షౌకత్ అహ్మద్ ఖండే అనే ఆత్మాహుతి దళ సభ్యుడు ఒక ఐస్‌క్రీం బండిని మాగాంలో ఉన్నటువంటి బిఎస్ఎఫ్ క్యాంపు దగ్గరికి తీసుకుపోయి పేల్చి వేశాడు. ఆ పేలుడులో ప్రమోద్ కుమార్ అనే ఒక బిఎస్ఎఫ్ అధికారి, ఏడుగురు పౌరులు చనిపోయారు. అయితే పక్కనే ఉన్నటువంటి బిఎస్ఎఫ్ క్యాంపు జవాన్లు పేలుడు సంభవించిన వెంటనే కాల్పులు జరపడం మొదలుపెట్టి దాదాపు గంటసేపు కాల్పులు జరుపుతూ వున్నారు కాబట్టి చనిపోయిన వారిలో ఎంతమంది పేలుడులో చనిపోయారో ఎంతమంది కాల్పుల్లో చనిపోయారో తెలియదు. కాల్పులు జరగగానే బిఎస్ఎఫ్ జవాన్లు ప్రతీకార దాహంతో గ్రామమంతటా తిరుగుతూ విచ్చలవిడిగా పౌరులపై కాల్పులు జరిపారు. గులాం అహ్మద్ భట్ అనే పేపర్లు అమ్ముకునే యువకుడు పోలీస్ స్టేషన్ సమీపంలోనే చనిపోగా, గులాం అహ్మద్ డార్ అనే ఒక ఆటో డ్రైవరు ప్రధాన రహదారిపైన చనిపోయాడు. నిజానికి ఈ ఆటో డ్రైవరు మాగాం నివాసి కాడు. శ్రీనగర్‌లోని కమర్‌వారి ప్రాంత నివాసి. కొంతమంది ప్యాసింజర్లను ఎక్కించుకుని ఆ సాయంత్రం గ్రామంలోకి ప్రవేశిస్తూ ఉండగా ఊరంగా తిరుగుతూ తుపాకులతో కాలుస్తున్నటువంటి బిఎస్ఎఫ్ జవాన్లు అతని ఆటోపైన కాల్చారు. అప్పుడే శ్రీనగర్ నుండి వస్తున్న ఒక బస్సులోని ప్రయాణికులు ఇదంతా కళ్ళారా చూశారు. వారు దీనికి ప్రత్యక్ష సాక్షులు.

మరుసటి రోజు శ్రీనగర్ నుంచి పత్రికా విలేకరులు మాగాంకు పోయారు. ముందురోజు చనిపోయిన వ్యక్తుల మృతదేహాలు గ్రామంలో అట్లాగే పడి ఉన్నాయి. ప్రజలు ఆ మృతదేహాలను గ్రామంలోని ప్రధాన చౌరస్తా దగ్గర పెట్టి బిఎస్ఎఫ్ వారు జరిపిన విచ్చలవిడి కాల్పులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శవాలను తీసుకుని వారు ఊరేగింపు తీయాలని అనుకుంటుండగా బిఎస్ఎఫ్ జవాన్లు గుంపుపైన లాఠీచార్జి చేశారు. పత్రికా విలేకర్లను కూడా విడిచిపెట్టకుండా కొట్టారు. నిజానికి పత్రికా విలేకర్లను, మీడియా ప్రతినిధులను,పనిగట్టుకుని చాలా ఎక్కువగా కొట్టారు. వారి కెమెరాలను పగులగొట్టారు. ఈ కారణంగా మాగాం ఘటన గురించి చాలా విస్తృతంగానే వ్యాఖ్యలు, నిరసన వినిపించింది, కాని ముందురోజు జరిగిన కాల్పుల గురించి ఎవ్వరు ఎక్కువగా మాట్లాడలేదు. మాగాం ప్రజానీకం ఈ విషయంలో చాలా నిరసన వ్యక్తం చేశారు. చనిపోయిన మనుషుల ప్రాణాల కంటే విరిగిపోయిన కెమెరాలకు చాలా ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టుంది అని వారు అన్నారు. మాగాం పోలీసు స్టేషన్లో ఈ కాల్పుల ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు అయిందనీ సొపోర్ సూపరింటెండ్ ఆఫ్ పోలీస్ దాన్ని పరిశోధిస్తున్నాడనీ ప్రభుత్వం అనింది. అయితే బిఎస్ఎఫ్ అతనితో సహకరించదు కాబట్టి ఈ నేరపరిశోధన వల్ల ప్రయోజనమేమీ ఒనగూడే అవకాశం లేదు. ఒనగూడనూ లేదు.

మరొక సంఘటన కూడా కాల్పుల విరమణ కాలంలో జరిగింది. దీని గురించి కూడా చెప్పుకోవాలి. ఇదేమిటి అంటే నిరాయుధ పౌరులను సైనిక బలగాలు

మిలిటెంట్ల దాడి నుండి ఆత్మరక్షణ కోసం కవచంగా వాడుకోవడం. శ్రీనగర్ జిల్లాలోని గండర్‌బల్ తాలుకాలోని జాజ్నా గ్రామంలో ఈ ఘటన జరిగింది. గండర్‌బల్ శ్రీనగర్ నుండి లదాక్‌కు వెళ్ళే రహదారిపైన ఉంది. జాజ్నా దగ్గర రాష్ట్ర నీటిపారుదల శాఖ నిర్వహించే ఒక ఎత్తిపోతల పథకం కార్యాలయం ఉంది. దాని పక్కనే రాష్ట్రీయ రైఫిల్స్ సైనికుల క్యాంపు ఉంది. మే 17, 2001 మధ్యాహ్నం 12 గంటల సమయంలో 25 మంది రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు ఆ కార్యాలయం దగ్గరకు వచ్చారు. బయటి గేటు తాళం పగులగొట్టి లోపలికొచ్చి అక్కడున్న ముగ్గురు ఉద్యోగులను తమతో పాటు రమ్మన్నారు. ఆ కార్యాలయం పక్కనే ఉన్న ఒక అడవి మార్గం గుండా కొంతమంది మిలిటెంట్లు పారిపోయారని వారిని వెతకడానికి తమకు సహకరించాలనీ చెప్పారు. ఆ ముగ్గురు మహ్మద్ సుల్తాన్ ఇట్టు అనే పంపు ఆపరేటర్, హబీబుల్లా దార్ అనే గేట్‌మేన్, అలిమహ్మద్ గనాయ్ అనే తోటమాలి కొంచెం దూరం వాళ్ళు జవాన్లతోపాటు ప్రయాణించిన తర్వాత అక్కడ బాట మీద ఆలీవ్ గ్రీన్ బట్టతో చేసిన ఒక సంచి కన్పించింది. ఆ సంచిని తెరవమని ఈ ముగ్గురు ఉద్యోగులను జవాన్లు ఆదేశించారు. వీళ్ళు అందులో ఏముందో అని తెరవడానికి నిరాకరించగా ఒక అరగంటసేపు వాదన జరిగింది. చివరికి వాళ్ళను కొట్టి చంపుతామని బెదిరించి తెరవమన్నారు. జవాన్లు ప్రక్కనే ఉన్న చెట్ల వెనకాల నిలబడి ఈ ముగ్గురు ఉద్యోగుల మీద తుపాకులు ఎక్కుపెట్టి సంచి తీయమన్నారు. మహ్మద్ సుల్తాన్ ఇట్టు సంచిని తెరిచాడు. వెంటనే అది పెద్ద ఎత్తున పేలి ఇట్టు అక్కడికక్కడే చనిపోయాడు. అతని ప్రక్కనే ఉన్న హబీబుల్లా దార్ తీవ్రంగా గాయపడ్డాడు. కొంచెం దూరంలో ఉన్న మహ్మద్ అలీ గనాయ్ కూడా గాయపడ్డాడు. గనాయ్‌కు కుడిచేతి పై భాగంలో ఎముక పలుచోట్ల విరిగింది. అతనొక్కడే బతికాడు. వాళ్ళు రక్తస్రావం అవుతూ అక్కడ పడి ఉండగా ఒక జవాన్ వచ్చి ఇక్కడే చావండి మీరు కూడా అన్నాడని గనాయ్ అంటాడు. ఒక గంట తర్వాత జవాన్లు ట్యాక్సీ తీసుకొచ్చి ట్యాక్సీ డ్రైవర్‌ను కొట్టి వీరిద్దరిని సంబల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపొమ్మని ఆదేశించారు. వారితోపాటు ఈ జవాన్లు రాలేదు. సంబల్ చేరుకున్న తర్వాత గనాయ్ అక్కడే నివసించే దార్ సోదరికి ఈ విషయం చెప్పాడు. సంబల్ ఆసుపత్రిలోని డాక్టర్ వీరిద్దరిని పరిశీలించి శ్రీనగర్‌కు తీసుకుపొమ్మని దార్ సోదరికి చెప్పాడు. ఆమె వారిద్దరిని శ్రీనగర్‌లోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని పోతుండగా దారిలో దార్ చనిపోయాడు. గనాయ్ చాలా రోజులు ఆస్పత్రిలో ఉన్న తర్వాత డిశ్చార్జ్ అయ్యాడు. గండర్‌బల్ పోలీసులు గనాయ్ వాంగ్మూలాన్ని పూర్తి వివరాలతో నమోదు చేసుకున్నారు. హంతకులు వేరెవరన్నా అయి ఉంటే ఈ పాటికి వాళ్ళు కటకటాలు లెక్కిస్తూ ఉండేవాళ్ళు. కాని పోలీసులు రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లను అరెస్టు చేయడం అనేది జరిగేది కాదు.

సైనిక బలగాలు కాని, పోలీసులు కాని సాయుధ పోరాటాలపైన అణచివేతకు పాల్పడే అన్ని ప్రాంతాల్లో జరిగినట్టే కశ్మీర్‌లో కూడా స్త్రీలపైన లైంగిక హింస అనేది

అణచివేతలో అంతర్భాగంగా జరుగుతుంది. తరచుగా పత్రికల్లో ఇటువంటి వార్తలు వస్తుంటాయి గాని వాటి గురించి ప్రజలచేత మాట్లాడించడం కష్టం. బాధితురాలుగాని, బంధువులు కాని సాధారణంగా నిర్దిష్టమైన సమాచారం ఇవ్వరు. దోడా జిల్లాలోని మర్మత్ కొండ ప్రాంతంలో జరిగిన కొన్ని ఘటనల గూర్చి మాత్రం బాధితురాళ్ళు హక్కుల సంఘాల బృందంతో నిర్మొహమాటంగా మాట్లాడటం వల్ల కొన్ని ఘటనల వివరాలు సేకరించడం సాధ్యం అయింది. బల్దార్రి అనే గ్రామానికి చెందిన రాజాబేగం, ఆమె కుమార్తె గుల్షన్‌బాను సైనిక బలగాలచేత పదేపదే లైంగిక అత్యాచారానికి గురయ్యారు. అప్పటికి మూడేళ్ళ క్రింద వారి ఇంటి సమీపంలో ఒక గ్రనేడ్ పేలుడు సంభవించింది. కొద్దిసేపు తరువాత సైనిక బలగాలు పెద్ద సంఖ్యలో వారింటికి వచ్చి రాజాబేగం భర్త కోసం, కొడుకు కోసం వెతుకుతున్నట్టు, చెప్పారు. ఆమె భర్త అప్పటికి ఇంట్లో లేడు. కొడుకులు ఇద్దరూ హిమాచల్‌ప్రదేశ్‌లో కూలీ చేసుకోవడానికి పోయి ఉన్నారు. సైనిక జవాన్లు తల్లినీ కూతురునూ వేరు వేరు గదుల్లోకి తీసుకుపోయి రేప్ చేశారు. గుల్షన్ వయస్సు అప్పటికి 16 సంవత్సరాలు. ఆ తరువాత సైనికులు గోవాలోని సైనిక క్యాంపుకు తీసుకుపోయి కళ్ళకు గంతలు కట్టి ఆ ఇద్దరు స్త్రీలను నిర్బంధించి అత్యాచారం చేశారు. ఆ తరువాత వాళ్ళను పోలీసు కస్టడీకి నాలుగు రోజులు దోడాలోను, నాలుగురోజులు భదర్వాలోను వాళ్ళను నిర్బందించి అప్పగించగా చివరికి విడిచిపెట్టారు. వారు బయటికి వచ్చిన తరువాత విషయం తెలుసుకుని ప్రజలు పెద్ద ఎత్తున దోడాలో ప్రదర్శన నిర్వహించగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వైద్య పరీక్ష కూడా జరిగింది కాని వైద్యులు అస్పష్టమైన రిపోర్టు ఇచ్చారు. సైన్యం దగ్గర గుల్షన్‌కు చెందిన రక్తసిక్తమైన సల్వార్ ఉంది కాని దానిని పోలీసులకు అప్పగించడానికి వారు నిరాకరించారు. అదిగాని అప్పగిస్తే ప్రధాన సాక్ష్యం అయి ఉండేది. ప్రజలు ప్రదర్శన చేసిన కారణంగా కుటుంబంపైన వేధింపు కొనసాగుతున్నది. రాజాబేగం కొడుకు ఫారూక్ అలీ, ఫర్మాన్ అలీ 2000 సంవత్సరం చివరి భాగంలో తాము పనిచేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ నుండి ఇంటికొచ్చారు. సైన్యం వారిద్దరిని తీసుకునిపోయి ఒక బాంబుపేలుడు ఘటనలో వారు ముద్దాయిలు అంటూ నిర్బంధించింది. 25 రోజులు వారిని జమ్మూలోని జాయింట్ ఇంటరాగేషన్ సెంటర్‌లో నిర్బంధించి విపరీతమైన చిత్రహింసలు పెట్టారు. అయితే స్థానిక ప్రజలు, పత్రికా విలేకర్లు ఆమ్నెస్టి ఇంటర్నేషనల్‌కు సందేశం పంపగా ఆమ్నెస్టి చొరవతో వారిని విడిచిపెట్టారు. వారు తిరిగి గ్రామానికి రావడానికి భయపడుతున్నారు. గ్రామాన్ని, రాష్ట్రాన్ని విడిచిపెట్టి వెళ్ళిపోయారు. రాజాబేగంను, ఆమె కుమార్తెను తమ ఫిర్యాదు వెనక్కి తీసుకొమ్మని సైన్యం అధికారులు చాలా ఒత్తిడి పెడుతూ ఉన్నారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర మానవహక్కుల కమీషన్ విచారణ జరుపుతూ ఉంది. రాష్ట్ర మానవహక్కుల కమీషన్ ఒకవేళ కచ్చితంగా అత్యాచారం జరిగింది అని తీర్పు చెప్పినా దోషులపైన ఎటువంటి చర్య తీసుకోవడం జరుగదు. అయినప్పటికీ ఆ స్త్రీలపైన ఒత్తిడి కొనసాగుతూనే ఉంది. ఒక్కోసారి వాళ్ళను బెదిరిస్తున్నారు. ఒక్కోసారి రాజాబేగం

కొడుకులకు ఉద్యోగాలిస్తామని ఆశ చూపుతున్నారు. ఇటువంటి ఘటనలు దోడా జిల్లాలోని కొండ ప్రాంతంలో చాలా జరిగాయి. ప్రక్కనే ఉన్నా బిహోతా గ్రామంలో 1994 నుంచి సైన్యం క్యాంపు ఉంది. అక్కడ 19 సిక్కు రెజిమెంట్ క్యాంపున్న కాలంలో ఒక అధికారి చాలా తరచుగా ఇళ్ళలోకి ప్రవేశించి స్త్రీలపై అత్యాచారం చేసేవాడని, 26 ఘటనలు జరిగిన తరువాత ప్రజల నిరసన ఫలితంగా అతన్ని అక్కడి నుంచి బదిలీ చేశారని ప్రజలు చెప్తున్నారు. బిహోతాకు చెందిన రజీనా బేగం తన విషయంలో జరిగిన అత్యాచారం గురించి మాట్లాడేటప్పుడు కన్నీళ్ళు ఆపుకోలేకపోతున్నది. ఆమె భర్త అయూబ్ అప్పటికి మూడేళ్ళ కింద మిలిటెంట్లలో చేరాడు. ఏడేళ్ళుగా ఆ గ్రామంలో ఒక సైన్యం క్యాంపు ఉండటం వల్ల జవాన్లు పదేపదే ఆమె ఇంట్లోకి ప్రవేశించి భర్త గురించి వాకబు చేసే మిష మీద ఆమెపైన అత్యాచారం చేశారు.అక్టోబర్ 29, 2000 సంవత్సరం నాడు బీహార్ రెజిమెంట్‌కు చెందిన సైనిక బలగాలు ఆ గ్రామాన్ని సోదా చేశాయి. ఒక స్త్రీని క్యాంపుకు తీసుకుపోయారు. మరుసటి రోజు 20 మంది స్త్రీలు బిహోతా నుంచి బయలుదేరి క్యాంపుకుపోయి ఆ స్త్రీని విడిపించడం కోసం ప్రయత్నం చేశారు. కాని వీరిని కూడా 4,5 గంటలపాటు నిర్బంధించి లైంగికంగా హింసించారు. చివరికి రాత్రి 8 గంటలకు విడిచిపెట్టారు. వాళ్ళంతా వెంటనే దోడాకు పోయి దోడా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు, డిప్యూటీ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అన్ని విషయాలు స్పష్టంగా చెప్పినప్పటికీ, కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఆ ఫిర్యాదు అందినప్పటికీ ఏ ఫలితమూ రాలేదు.

రాత్రివేళ జవాన్లు గ్రామాలను సోదా చేసేటప్పుడు స్త్రీలపైన లైంగిక వేధింపులకు, అత్యాచారాలకు పాల్పడటం తరుచుగా జరుగుతుంటుంది. ఒక్కొక్కసారి అందుకోసమే సోదా చేస్తారు. ఏప్రిల్ 13, 2001 నాడు బారముల్లా తాలూకా క్రీరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న అలాయ్‌వారిపురా అనే ఒక మారుమూల గూడానికి 29 రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు వెళ్ళారు. మిలిటెంట్ల కోసం వెతుకుతున్నాము అని చెప్పారు. నిజానికి వారు అంతకుముందు మధ్యాహ్నమే గ్రామానికి వచ్చారు. వెతికారు, వెతికివెళ్ళిపోయి తిరిగి మళ్ళీ రాత్రి వచ్చారు. వాళ్ళు మధ్యాహ్నం ఎందుకు వచ్చారు. అనే విషయం మళ్ళీ రాత్రి వచ్చినప్పుడు అర్థమైంది. ఎందుకంటే నేరుగా మూడిళ్ళకుపోయారు. ఆ మూడిళ్ళలో ఉన్న స్త్రీల మీద వాళ్ళ కన్ను పడింది. వాళ్ళపైన అత్యాచారం చేయడం కోసం వాళ్లు రాత్రి వచ్చారు. ఇది గమనించిన గ్రామస్తులు నిరసన తెలిపారు. ఎక్కువ మంది బయటకు రావడానికి భయపడ్డారు కాని ఇద్దరు వ్యక్తులు బయటకు వచ్చి గట్టిగా అరిచారు. వారు 60 సంవత్సరాల మహ్మద్ సుల్తాన్ అలాయ్, 28 సంవత్సరాల గులాం అహ్మద్ అలాయ్. రాష్ట్రీయ రైఫిల్స్ అప్పటికప్పుడే వాళ్ళిద్దరినీ కాల్చి చంపి ఇంకా గ్రామస్తులు ఇళ్ళ నుండి బయటకు వస్తారేమోనని చెప్పి చాలాసేపు గాలిలోకి కాల్పులు జరుపుతూ ఉండింది. తరువాత ఆ ముగ్గురు స్త్రీలనూ వారి క్యాంపుకు జవాన్లు తీసుకుపోయారు. మరుసటి రోజు గ్రామం నుంచి, పరిసర గ్రామాల నుంచి జనం పెద్ద ఎత్తున బారాముల్లా–

శ్రీనగర్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఆ నిరసన ఫలితంగానే ఆ ముగ్గురు స్త్రీలను విడిచిపెట్టారు. వారిలో ఒకరైన ఆయెషా బేగం తన పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసింది కాబట్టి ఆమె పేరు తెలుసు కానీ మిగతా వారి విషయాలు గ్రామస్తులకు మాత్రమే తెలుసు.

ఒక బాధితురాలు రాష్ట్ర మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేసిన ఉదంతం పైన చూసాం. నిజానికి ఆ రాష్ట్ర మానవహక్కుల కమీషన్ పనితీరు చూస్తే అసలు ఆ సంస్థకు ఫిర్యాదులు ఇచ్చి ప్రయోజనం ఏమన్నా ఉంటుందా అనే అనుమానం వస్తుంది. మానవహక్కుల బృందం రాష్ట్ర మానవహక్కుల కమీషన్ ఛైర్మన్ అయిన రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ పాత్రేని కలవడానికి పోయినపుడు ఎదురైన అనుభవం చూస్తే ఏడవాలో నవ్వాలో తెలియదు. జస్టిస్ పాత్రే తన దగ్గరికి ఎవరొచ్చినా బాగానే మాట్లాడతారు. మానవహక్కుల బృందంతోనూ బాగానే మాట్లాడారు. పదే పదే తన క్రింది ఉద్యోగులను పిలవడానికి బెల్లు కొట్టారు. కాని బెల్లు కొట్టినప్పుడు ఎవ్వరూ రారు, వచ్చినపుడు తెమ్మన్న ఫైలు తేరు, ఇమ్మన్న సమాచారం ఇవ్వరు. ఒకటి తీసుకురమ్మంటే మరొకటి తీసుకొచ్చి సరైన ఫైల్ తేవడానికి మళ్ళీ పరుగెత్తి పోతారు. ఎన్ని విచారణలు జరిపామో వీళ్ళకు చెప్పండి అని ఆయన అడుగగా ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి కేవలం 4 కేసుల్లో విచారణ జరిగిందని ఒక ఉద్యోగి ఆయన సమక్షంలోనే అన్నాడు. జస్టిస్ పాత్రే గారికి విపరీతమైన కోపం వచ్చింది. నేను నాలుగే విచారించానా? మనమిక్కడ కూరగాయలు తరుక్కుంటూ కూర్చున్నామా? నేను ఎన్నో కేసుల్లో ప్రభుత్వాన్ని చర్య తీసుకొమ్మని ఆదేశించాను కదా? అవన్నీ ఏమయ్యాయి అని గట్టిగా అరిచారు. చివరికి తేలింది ఏమిటంటే ఎన్ని కేసులు చేపట్టింది, ఎన్ని ఆదేశాలిచ్చింది అనే సమాచారం కూడా వారి సిబ్బంది దగ్గర లేదు. కమీషన్ కార్యకలాపాల వివరాలు సక్రమంగా నమోదు కావడం లేదు. జమ్మూ కశ్మీర్ రాష్ట్ర మానవహక్కుల కమీషన్ 1997 డిసెంబర్‌లో ఏర్పడింది కాని అది ప్రజానీకానికి ఎక్కువ ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఆ కమీషన్‌కు సైన్యం చేసే మానవహక్కుల అతిక్రమణలపైన కూడా విచారణ జరిపే అధికారం ఉంది అని జస్టిస్ పాత్రే భావిస్తూ ఉండగా, సైన్యం మాత్రం సాయుధ బలగాల ప్రత్యేక అధికార చట్టం ఉన్నంతకాలం అటువంటి విచారణలు చేయడానికి వీలు లేదు అని అంటూ ఉంది. రాష్ట్ర మానవహక్కుల కమీషన్‌కు అధికంగా వచ్చే ఫిర్యాదులు సైన్యం లేక పారామిలిటరీ బలగాల సిబ్బంది చేసే అత్యాచారాల పైననేననీ వాటిపై విచారణ జరిపి తగు చర్య తీసుకొమ్మని ఆదేశించే అధికారం కమీషన్‌కు ఉంది అనీ జస్టిస్ పాత్రే అంటారు. అయితే సైన్యం వారికి ఈ అధికారం ఉంది అని ఒప్పుకోదు కాబట్టి వారు సహకరించడం లేదు. అందువల్ల ఏ విచారణా కూడా వారు సమర్థవంతంగా చేయలేకపోతున్నారు.

శ్రీనగర్‌లోని వివిధ కళాశాలల అధ్యాపక సిబ్బందితో మానవహక్కుల బృందం మాట్లాడినప్పుడు నిర్బంధం వల్ల, మొత్తంగా కశ్మీర్లో ఉన్న పరిస్థితి వల్ల, సాధారణ పౌర జీవితం ఏ విధంగా దెబ్బతింటున్న విషయం తెలిసి వచ్చింది. కశ్మీర్లో అక్షరాస్యత 49% ఉండగా, విషయం స్త్రీలలో 45%. ఆజాదీ కోసం పోరాటము, దానిపైన నిర్బంధమూ ప్రారంభమైన తరువాత విద్య బాగా దెబ్బతినిందనీ అయితే అమ్మాయిలకంటే అబ్బాయిల విద్యే ఎక్కువగా దెబ్బతినిందనీ ఒక మహిళా కళాశాల అధ్యాపకురాలు అన్నారు. నిరుద్యోగం చాలా ముఖ్యమైన సమస్యగా ఉంది అనేది అధ్యాపకులు అందరూ చెప్పే విషయం. కశ్మీర్‌లో అభివృద్ధి అంతకుముందు కూడా అంతంత మాత్రంగానే ఉండింది. ప్రస్తుత సందర్భంలో అదిపూర్తిగా ఆగిపోయింది. కొత్త పరిశ్రమలు కాదు సరికదా కొత్త వ్యాపారలు సహితం ఎవ్వరూ చేపట్టడం లేదు. ప్రభుత్వమూ ఉద్యోగాలు ఇవ్వడం లేదు. దీని వల్ల వచ్చే నిరసన కూడా మిలిటెన్సీ పెరగడానికి దోహదం చేస్తూ ఉంది అని అన్నారు. స్త్రీలు ఎంతటి ఒత్తిడిలో, భయంలో బతుకుతున్నారో, ఒక మహిళా కాలేజి అధ్యాపకులు వివరించారు. సాయుధ బలగాలు ఎప్పుడైనా, ఏ స్త్రీనైనా అపహరించవచ్చు, అరెస్టు చేయవచ్చు లైంగికంగా వేధించవచ్చు, అనేది విపరీతమైన అభద్రతా స్థితికి దారితీసింది. సైనిక బలగాలు ఇళ్ళను సోదా చేసేటప్పుడు మగవాళ్ళను బయటకు పోయి నిలబడమని, స్త్రీలు మాత్రం పోనక్కరలేదని చెప్పి ఇళ్లు సోదా చేస్తూ ఉంటారు. మొదట్లో అదే విధంగా స్త్రీలు ఇళ్ళల్లో ఉండేవారు. ఈ రకంగా జరిగే సోదాలప్పుడు తరచుగా సైనిక బలగాలు స్త్రీలపైన లైంగికంగా హింసకు పాల్పడటం వల్ల, వద్దని చెప్పినా స్త్రీలు కూడా మగవారితో పాటు బయటకు పోయి గంటల తరబడి బయట నిలబడటం మొదలుపెట్టారు. కుప్వారా జిల్లాలోని మారుమూల గ్రామాల్లో అయితే సైనిక సిబ్బంది రాత్రివేళ ఇంటిలోకి ప్రవేశించి రాత్రంతా అక్కడే ఉండడం తరచుగా జరుగుతుంది. అప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కాదు అని స్థానికులు అన్నారు. కశ్మీర్ సమాజంలో కొన్ని దశాబ్దాలుగా వస్తున్న సంస్కరణాత్మకమైన మార్పుల వల్ల మిలిటెన్సీకి పూర్వం అమ్మాయిలకు 20 సంవత్సరాలు దాటిన తరువాతే పెళ్ళిచేసే అలవాటు నెలకొని ఉండింది. కానీ అభద్రతా స్థితిలో 14,15 సంవత్సరాలకే అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసేస్తున్నారు. లైంగిక హింసకు సంబంధించిన భయం మాత్రమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా స్త్రీలపైన చాలా బలంగా పనిచేస్తూ ఉంటుంది. ప్రతి స్త్రీ కూడా తన భర్త, తన తమ్ముడు,తన అన్న, తన కొడుకు ఏ క్షణమైనా అరెస్టు కావచ్చు లేక మాయం కావచ్చు అన్న భయంతో జీవిస్తూ ఉంటుంది. ఎవరినో ఒకరిని పోగొట్టుకొని ఒక్క ఇల్లు కూడా కశ్మీర్‌లో లేదు కాబట్టి ఇదొక సాధారణ విషయం. మారుమూల గ్రామాలలో వైద్య సదుపాయాలు కూడా ప్రస్తుత పరిస్థితిలో దెబ్బతినడమే కాకుండా స్త్రీల ఆరోగ్య పరిస్థితి మరింత సమస్యాత్మకంగా తయారయింది. మారుమూల ప్రాంతాల్లో పోస్టింగ్ మహిళా డాక్టర్లు సాయుధ బలగాల భయానికి ఉద్యోగంలో చేరకపోవడం వల్ల చాలా ప్రాంతాల్లో స్త్రీలకు వైద్య సదుపాయాలే లేవు. ప్రసూతి సమయంలోనైనా

మరొక సమయంలోనైనా శ్రీనగర్ దాకా వాళ్ళు బయలుదేరి వెళ్ళాలి. మిలిటెంట్లు బలంగా ఉండే ప్రాంతాల్లో గర్భస్రావంపైన వాళ్ళ నిషేదం పెట్టడం వల్ల గర్భస్రావం చేయించుకోదలచిన స్త్రీలు ముందుగానే ఏదో కారణం చెప్పి పట్టణాలకు పోయి చేయించుకుని ఎవ్వరికీ తెలియకుండా రావలసి వస్తుంది.

అయినప్పటికీ ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలు ఒక బలమైన ఆత్మవిశ్వాసంతోనే బ్రతుకుతున్నారు. ముఖ్యంగా చదువుకు ఎన్ని ఆటంకాలు ఎదురైనా చదువుకోవాలి అనే ఆకాంక్ష చాలా బలంగా కన్పిస్తుంది. హైస్కూల్ చదువుతున్న అనేక మంది పిల్లలు డాక్టర్లు అవుతామనీ లాయర్లు అవుతామనీ చాలా విశ్వాసంతో మాట్లాడారు. శ్రీనగర్ సిటీలో అయినా మారుమూల గ్రామాల్లో అయినా స్త్రీలు బహిరంగ ప్రదేశాల్లోకి రావడం, మాట్లాడటం సామాజిక జీవితంలో పాలుపంచుకోవడం ప్రస్ఫుటంగా కన్పించింది. ఏ ఇంటికిపోయి మాట్లాడినా, ఏ గ్రామానికి పోయి మాట్లాడినా మగవారితో సమానంగా ఆడవాళ్ళు ముందుకు రావడం, కూర్చోవడం బుర్ఖాలు లేకుండానే తమ అభిప్రాయాలు నిర్మోహమాటంగా చెప్పడం కన్పిస్తుంది. ఆజాదీ కోసం పోరాటం మొదలైనప్పటి నుంచి స్త్రీలను ఇంటికే పరిమితం చేయడానికి, బలవంతంగా బుర్ఖాలు వేసుకునేటట్టు చేయడానికి మిలిటెంట్లలో ఒక వర్గం చేసిన ప్రయత్నం బయటి పత్రికల్లో కూడా చోటు చేసుకుంది. సనాతనవాదులైన మిలిటెంట్లు తమకు సంస్కృతి గురించి ఉండే అభిప్రాయాలను కశ్మీరీల మీద బలవంతంగా రుద్దే క్రమంలో సినిమా హాళ్ళు మొత్తం మూసివేశారు. సంప్రదాయకంగా కశ్మీరీ సమాజంలో ఉండే నాటకరంగాన్ని ఆపేశారు. దాంట్లో భాగం గానే స్త్రీలు బుర్ఖాలు వేసుకుని తీరాలి అని వాళ్ళు ఒత్తిడి చేయడం జరిగింది. దీనిని స్త్రీలు అనేక రూపాల్లో మొదటి నుంచి ప్రతిఘటిస్తూ వచ్చారు. బుర్ఖావేసుకోవడం అనేది స్త్రీలను తక్కువగా చూసే సంప్రదాయానికి చిహ్నం కాబట్టి అందరిని సమానంగా చూసే మతం దాన్ని తప్పనిసరి ఎట్లా చేస్తుంది అని బహిరంగంగానే ప్రశ్నించారు. జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ నాయకుడైన మక్బూల్ భట్ ఉరితీతకు ముందు, తాను బుర్ఖాకు వ్యతిరేకం అని ప్రకటించిన విషయం కూడా వాళ్ళు ఉటంకించి దాన్ని వాడుకున్నారు. మిగిలిన విషయాలు అట్లా ఉంచి కశ్మీరి స్త్రీలు అత్యధికంగా పొలాల్లో పనిచేసే కూలీలు కాబట్టి బుర్ఖా వేసుకోవడం వారికి ఆచరణ సాధ్యం కాదు అని కూడా అన్నారు. 1990ల మధ్య భాగంలో స్త్రీల మీద ఒత్తిడి పెట్టే ప్రయత్నం మళ్లీ జరిగింది. పత్రికల్లో ప్రచురించిన హెచ్చరికలు చదివి కాలేజీ విద్యార్థినులు ఆ బెదిరింపులు తెలుసుకున్నారు. దాని గురించి మాట్లాడుకుని, మగవాళ్ళకు లేని వేషధారణ నియమాలు స్త్రీలకు ఎందుకుండాలి అని నిరసన తెలియచేసి, ఏ రూపంలో సాధ్యమైతే ఆ రూపంలో దాన్ని వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు. బస్సులో ప్రయాణం చేసే బుర్ఖాలేని అమ్మాయిలను బస్సులోకి ప్రవేశించే మిలిటెంట్ సంస్థలకు చెందిన కార్యకర్తలు బలవంతంగా దింపడం

మొదలుపెట్టేసరికి బస్సెక్కకుండా నడవడమే మొదలుపెట్టారు. కొంత మంది కొన్నాళ్ళు బుర్ఖా వేసుకుని ఒత్తిడి తగ్గింది అనుకోగానే దాన్ని అవతల వేశారు. కొంతమంది స్త్రీలు బుర్ఖా వేసుకుని బయటికి పోవడం కంటే బయటకుపోకుండానే ఇంట్లో ఉండడమే మేలు అని చెప్పి ఇంట్లోనే ఉండిపోయారు. స్త్రీలు ఈ విధంగా ప్రతిఘటించడం వల్ల కొంత, ఉద్యమానికి వచ్చిన చెడ్డపేరు వల్ల కొంత స్త్రీలపైన ఈ ఒత్తిడి తగ్గింది. అయితే 2001 సంవత్సరంలో మరొక్కసారి బెదిరింపులు మొదలయ్యాయి. అప్పటిదాకా ఎవరూ పేరు విననటువంటి లష్కరే జబ్బార్ అనే ఒక మిలిటెంట్ సంస్థ బుర్ఖాలేని స్త్రీలపైన ఆసిడ్ విసరడం మొదలుపెట్టింది. ప్రధాన మిలిటెంట్ సంస్థలయిన లష్కరే తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ ఈ దాడులను ఖండించినప్పటికీ గతంలో కంటే ఎక్కువగా స్త్రీలు భయపడసాగారు. ఆ కారణంగా కొంతమంది బుర్ఖాలు వేసుకోవడం మొదలుపెట్టారు కానీ నిరసన మాత్రం స్పష్టంగానే ఉంది.

**ఇక రాజకీయ ప్రక్రియకు వద్దాం!**

మొదట్లో చెప్పినట్టు 2000 సంవత్సరం రంజాన్‌తో మొదలైన కాల్పుల విరమణను భారత ప్రభుత్వం 2001 మే 31న వెనక్కి తీసుకుంది. మిలిటెంట్లతో నేరుగా మాట్లాడుతాను అన్న హామీని ప్రక్కన పెట్టింది. అయితే పర్వేజ్ ముషారఫ్‌ను చర్చలకు ఆహ్వానించింది. జూలై 13న ఆగ్రాలో చర్చలు జరిగాయి. అంటే ఒక రకమైన రాజకీయ ప్రక్రియ మొదలైనట్టు భావించవచ్చు. దీని గురించి కశ్మీరీలు ఏమనుకున్నారు? అప్పటికి 12 సంవత్సరాలుగా విపరీతమైన హింసను అనుభవించిన కారణంగా రక్తపాతం లేనటువంటి వాతావరణం కోసం కశ్మీరీలు ప్రధానంగా ఎదురుచూస్తున్నారని చెప్పవచ్చు. అయితే ఆ శాంతి ఆత్మగౌరవంతో కూడింది. శాశ్వత రాజకీయ పరిష్కారం పర్యవసానంగా లభించేది అయి ఉండాలి అనేది చాలా మంది కశ్మీరీల అభిప్రాయం. ఈ పరిష్కారానికి కీలకం కశ్మీరీల స్వేచ్ఛా కాంక్ష. 'ఆజాదీ' కావాలన్న కోరిక.

అయితే దేశాలకు, రాజ్యాలకు ఉన్నభూమి దాహం ఎటువంటిది అంటే ఈ ఆజాదీ అనేది ఏ విధంగా సాధ్యమవుతుందో చెప్పడం చాలా కష్టం. అందువల్ల కశ్మీరీలు దానికి సులభమైన జవాబులేమీ చెప్పరు. ఒకవైపు విపరీతమైన ఆశ, మరొకవైపు విపరీతమైన నిస్పృహ వారిలో కనిపిస్తాయి. 'ఆజాదీ' కావాలన్న ఆశను వాళ్ళు వదులుకోవడం లేదు. అయితే ప్లెబిసైట్‌కు సంబంధించిన హామీలు, ఐక్యరాజ్యసమితి తీర్మానాలు ఉన్నప్పటికీ ఒకేసారి తమకు స్వాతంత్ర్యం ఇచ్చేయాలని వారు అడగటం లేదు. త్రైపాక్షికంగా చర్చించుకుందాం అంటున్నారు. అంటే భారత్ పాకిస్తాన్‌లు కశ్మీరీ ప్రజల ప్రతినిధులతో సమ హోదాలో కూర్చొని మాట్లాడుకోవాలని.

'ఆజాదీ'కి సంబంధించిన చర్చలతో కాని, రాజకీయ ప్రక్రియల్లో కాని కశ్మీర్ ప్రజల ప్రతినిధి ఎవరు అన్న ప్రశ్న అప్పుడు వస్తుంది. చట్టం ప్రకారం ఎన్నికైన ప్రభుత్వం

ఒకటి జమ్మూ కశ్మీర్‌లో ఉంది. అయితే అది ప్రజల ప్రతినిధి కాదు అనడంలో సందేహం ఎవరికీ లేదు. హురియత్ కాన్ఫరెన్స్ నిజమైన ప్రతినిధిగా తనకు తాను చెప్పుకుంటుంది. తాము లదాఖ్‌లోని బౌద్ధుల, రాష్ట్రంలోని సకల హిందువుల ఆకాంక్షలకు కూడా ప్రతినిధులమని హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు ప్రొఫెసర్ అబ్దుల్ గనీ భట్ అంటాడు. ఇది తప్పనిసరిగా అతిశయోక్తే. ఎందుకంటే హురియత్ కాన్ఫరెన్స్, కశ్మీర్ భారత్‌లో భాగం కాదు అని నమ్మే 32 సంస్థల ఉమ్మడి వేదిక. అవన్నీ కశ్మీరీ ముస్లింల సంస్థలే. కశ్మీర్ వరకు రెఫరెండం అంటూ పెడితే ప్రతినిధిగా హురియత్‌కు మెజారిటీ ఓట్లు వచ్చే అవకాశం ఉంది. అయితే హురియత్ జమ్మూ, లదాఖ్ ప్రాంతాల్లో ఉన్న ప్రాతినిధ్యం చాలా స్వల్పం. హురియత్ ఎంతవరకు కశ్మీరీలకు ప్రాతినిధ్యం వహిస్తుంది అనే విషయంలో కూడా అభిప్రాయ భేదాలున్నాయి. హురియత్‌ను విమర్శించే వారూ ఉన్నారు. హురియత్‌లో మతవాత సంస్థలూ సెక్యులర్ భావాలు కల సంస్థలూ ఉన్నప్పటికీ మతవాద సంస్థలదే పైచేయి అన్న విమర్శ ఉంది. కశ్మీరీ ప్రజలలో మతవాదం కంటే సెక్యులర్ ప్రజాతంత్ర భావాలకే ఎక్కువ ఆదరణ ఉంది అన్న అభిప్రాయమూ ఉంది. ఒకటి మాత్రం వాస్తవం. మానవహక్కుల అతిక్రమణ జరిగినప్పుడు ప్రజల దగ్గరకు పోయి మద్దతు, సానుభూతి ప్రకటించేది హురియత్ నాయకులు మాత్రమే. ఇది హురియత్‌కు కొంతమేరకు లోయలో గౌరవాన్ని తెచ్చిపెట్టిన మాట వాస్తవమే. చివరికి కశ్మీర్ పండిట్లలో కూడా కొంత సంయమనం పాటిస్తూ మాట్లాడే వాళ్ళు ఏమంటారంటే హురియత్‌లోని ప్రధాన నాయకులైన జమాతె ఇస్లామీ వారితోపాటు మితవాద ప్రతినిధులైనటువంటి షబీర్‌షాను, హురియత్‌లో ఉన్న అబ్దుల్‌గనీలోన్ లాంటి మధ్యేవాదులను కూడా ముందుకు తీసుకువస్తే అప్పుడు అది కశ్మీర్ ప్రజలందరి ప్రతినిధి కాగలదని అంటారు. హురియత్ కశ్మీరీలందరికి ప్రతినిధి అయినా కాకపోయినా వారిని సంప్రదించక తప్పదు అనేది పార్లమెంటరీ రాజకీయాల్లో ఉన్నటువంటి మహబూబా ముఫ్తిలాంటి వాళ్ళ అభిప్రాయం కూడా. ఎవరైతే జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనం కావడాన్ని వ్యతిరేకిస్తున్నారో వారికి హురియత్ ప్రతినిధి కాబట్టి హురియత్‌తో మాట్లాడితేనే వారితో మాట్లాడినట్టు అవుతుంది అని ఆమె అంటారు. భారత్ కశ్మీర్ విషయంలో ఏమైనా అనుకోనీగాక, వేర్పాటువాద మిలిటెంట్ నాయకులతో మాట్లాడవలసిన ఆవశ్యకతను కాదనడం సాధ్యం కాదు. రాజకీయ పరిష్కారం ఒకటి లభిస్తుంది అని శాంతియుత జీవనం తిరిగి వస్తుందనీ కశ్మీరీలు ఆశపెట్టుకున్నారు. అయితే ఈ సమస్యలో భాగస్వాములైన ఇతర శక్తులు – భారత్, పాకిస్తాన్, అమెరికా, సమస్యను పరిష్కారం చేయదలుచుకోలేదు అనీ, చేయకపోవడంలోనే వారి ప్రయోజనాలు ఉన్నాయనీ వారంటారు. భారత్,పాకిస్తాన్‌లు రెండూ కూడా కశ్మీర్ వివాదాన్ని తమ స్వార్థం కోసం, రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్నాయని భావిస్తారు. ఈ రెండు దేశాల నాయకత్వానికీ, ఈ రెండు దేశాల మధ్య ఉండే సంఘర్షణ తమ మనుగడ కోసం అవసరం కాబట్టి సమస్య పరిష్కారాన్ని ఇద్దరూ కూడా కాంక్షిచరు అని అంటారు. అయితే కశ్మీర్‌కు

సంబంధించి ఏ ఒప్పందానికి, లేక అంగీకారానికి రాదలచినా పాకిస్తాన్‌ను బయట ఉంచడం సాధ్యం కాదు అని కూడా కశ్మీరీలు చాలా బలంగా నమ్ముతారు. జూలై 13, 14 తేదీల్లో ఆగ్రాలో జరిగిన చర్చల ప్రక్రియను ఈ నేపథ్యంలో చూడాలి. దాని నుంచి ఏ ఫలితమూ రాలేదు అనేది ఇప్పుడు అందరికీ తెలిసిన విషయమే. ఆగ్రా శిఖరాగ్ర సమావేశం విఫలం కాగానే పెద్ద ఎత్తున మిలిటెంట్లు, ముఖ్యంగా ఫిదాయిన్ దళాలు దాడులు చేశారు. ఆగ్రా శిఖరాగ్ర సమావేశంతో పరిష్కారం ప్రారంభమవుతుంది అన్న ఆశ వమ్మయి ఇక పరిష్కారం అన్నది దొరకదేమో అన్న నిరాశ నెలకొనడం వల్ల పరిస్థితి మరింత దిగజారిపోయింది.

సైన్యం, పారామిలిట్రీ బలగాలు పెద్ద ఎత్తున్నే మిలిటెంట్ నాయకత్వంపైన దాడి ప్రారంభించారు. హిజ్‌బుల్ ముజాహిదీన్ కమాండర్ మసూద్ ఉరఫ్ ముస్తఫాఖాన్‌ను కస్టడీలో చంపి ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు చెప్పారు. కమాండర్ మసూద్ మృతదేహాన్ని మాగాం గ్రామంలో 2001 ఆగస్టు 5 నాడు ప్రజలు ఊరేగిస్తూ ఉండగా దానిపైన కాల్పులు జరిపి ఇద్దరిని చంపారు. మసూద్ వంటి కొందరు మిలిటెంట్ నాయకులు చాలా ప్రజాదరణ కలిగి వ్యక్తులు. మసూద్ సాధారణ పౌరులను, గ్రామస్తులను చంపడాన్ని బహిరంగంగా విమర్శించిన వ్యక్తి. నిజానికి చర్చలు అంటూ పెట్టుకోదలుచుకుంటే అతను తగిన ప్రతినిధి. అతను తన అసలు పేరు అయిన అబ్దుల్ హమీద్ తాంత్రే అనే పేరుతో 'చత్తాన్' అనే ఉర్దూ పత్రికలో ఒక కాలం రాసేవాడు. దాంట్లో తరుచుగా శాంతియుత పరిష్కారం గురించి ప్రస్తావించేవాడు. అటువంటి వాళ్ళను కూడా పట్టుకుని చంపడమే తన బాధ్యత అనుకోవడం ప్రభుత్వ వైఖరిని సూచిస్తుంది. ఆగస్టు 9, 2001 నాడు అప్పటికే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో అమలులో ఉన్న సాయుధ బలగాల జమ్మూ కశ్మీర్ ప్రత్యేక అధికారాల చట్టాన్ని మరో నాలుగు జిల్లాలకు విస్తరించారు. దానితో, లదాఖ్ తప్ప జమ్మూ కశ్మీర్ రాష్ట్రమంతటా ఆ చట్టం అమలులో ఉంది. ఆగ్రా సమావేశం వైఫల్యం తరువాత మరికొన్ని అప్రజాస్వామిక ప్రతిపాదనలు కూడా ప్రభుత్వం ప్రకటించింది. ఉదాహరణకు మానవహక్కుల అతిక్రమణలో పాల్గొన్న సైనిక బలగాల సిబ్బందికి క్షమాభిక్ష పెట్టాలి అనే ప్రతిపాదన కేంద్రహోంశాఖ చేసింది. దోడా జిల్లాలో వెయ్యిమంది స్పెషల్ పోలీస్ ఆఫీసర్లను నియమించాలి అని ఆగస్టు నెలలో ఒక నిర్ణయం కూడా చేశారు. దోడా ప్రాంతంలోకి చాలా పెద్ద ఎత్తున అదనపు బెటాలియన్లను దింపారు. ఆగస్టు 3, 15 తేదీలలో దోడాలో హిందువులను మిలిటెంట్లు చంపిన ఘటనల తరువాత ఈ కఠినమైన చర్యలను ప్రభుత్వం ప్రకటించింది. అది వీటికొక కారణంగా కనిపించినప్పటికి 'రంజాన్ కాల్పుల విరమణ' మొదటి వార్షిక దినం వచ్చేసరికి పరిస్థితి దానికి వ్యతిరేకమైన దిశలో చాలా దూరం వెళ్లిపోయింది.

# 7. కొత్త ప్రభుత్వం, కొత్త ఆశలు, పాత వాస్తవాలు

2002 సంవత్సరం జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఆ రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారి నేషనల్ కాన్ఫరెన్స్ ఓడిపోయి వేరే పార్టీ అధికారంలోకి వచ్చింది. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి), కాంగ్రెస్‌ల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఎన్నికల చాలా స్వేచ్ఛాయుతంగా జరిగిందనీ, ప్రజలు మిలిటెంట్ల బెదిరింపులను లెక్కచేయకుండా, హురియత్ కాన్ఫరెన్స్ ఇచ్చిన బహిష్కరణ పిలుపును కూడా లెక్కజేయకుండా, పెద్ద ఎత్తున ఓట్లు వేశారనీ, ఇది వేర్పాటువాద రాజకీయాలను తిరస్కరించడమేననీ భారత్‌లో చాలా మంది భావిస్తారు. కాని వాస్తవానికి ఆ ఎన్నికల్లో భారతదేశంలో చాలా మంది భావించినంతగా ప్రజలు ఓట్లేమీ వెయ్యలేదు. వేసిన మేరకు వేర్పాటువాదం లేక కశ్మీరీల భాషలో చెప్పాలంటే స్వాతంత్ర్యం తమకు అక్కరలేదు అని ప్రకటించడం కోసం వేసిన ఓటుగా కాకుండా ప్రజల ప్రాథమిక అవసరాలను, హక్కులను గౌరవించే ప్రభుత్వం కావాలి అన్న కోరికగా చూడడమే సబబుగా ఉంటుంది. మిలిటెంట్ల బెదిరింపులు ఉన్న మాట వాస్తవమే. హురియత్ కాన్ఫరెన్స్ ఇచ్చిన బహిష్కరణ పిలుపు ఒత్తిడి ఉన్న మాట వాస్తవమే. అయితే ఎట్టి పరిస్థితుల్లోనయినా ఓటు వేయాలని సైనిక బలగాలు ప్రజలపైన పెట్టిన ఒత్తిడి కూడా తక్కువేమీ కాదు. సరిహద్దు ప్రాంతాల్లో, కుప్వార వంటి చెప్పుకోదగ్గ జనాభా ఉన్న పట్టణాలలో కూడా, ఈ ఒత్తిడి చాలా బలంగా పనిచేసింది. పరస్పర విరుద్ధమైన ఈ రెండు ఒత్తిడిలు చివరికి ఏ విధంగా పని చేశాయో చెప్పడం కష్టం గాని ఎన్నికల్లో ప్రజలు ఏ మేరకు పాల్గొన్నారు అనేది ఓట్ల సంఖ్యను బట్టే ఉంటుంది కాబట్టి చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే కశ్మీర్ లోయలో ఓటింగ్ శాతం కేవలం 28% మాత్రమే ఉండింది. ఇది అంతకుముందు జరిగిన ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ కంటే ఎక్కువే కాని, భారతదేశంలో సగటుగా భావించే దానికంటే చాలా తక్కువ. దీన్ని కప్పి పెట్టడానికి ఏం చేస్తారంటే రాష్ట్రం మొత్తం మీద జరిగిన ఓటింగ్ శాతాన్ని పేర్కొని అది కశ్మీర్‌లో లోయలో జరిగిన ఓటింగ్‌ను సూచిస్తుందని దబాయించడం.

గతంలో కంటే ప్రజలు ఎక్కువగా ఎన్నికల్లో పాల్గొనడానికి మానవహక్కులకు సంబంధించిన కారణం కూడా ఉంది. అది ఏమిటి అంటే ముఫ్తి మహ్మద్ సయీద్ నాయకత్వంలో ఉన్న పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, అందులో ముఖ్యంగా ఆ పార్టీకి అధ్యక్షురాలుగా ఉన్న ఆయన కుమార్తె మహబూబా ముఫ్తి, మానవహక్కులను తిరిగి ప్రతిష్టిస్తామని హామీ ఇవ్వడం, దానిని తమ ఎన్నికల ఎజెండాలో భాగం చేయడం. చాలా ఏళ్ళుగా రాష్ట్రంలోని మిలిటెంట్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అనుభవిస్తున్న ఆవేదనను దృష్టిలో ఉంచుకుంటే ఈ హామీ వారికి ఆకర్షణీయంగా కనిపించడం ఆశ్చర్యం కాదు. పైగా పార్టీగా పిడిపి సంగతి ఎట్లాగున్నా పార్టీ అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ విషయానికి వచ్చేసరికి ఇది కేవలం ఎన్నికల కోసం ఇచ్చిన హామీగా అనుకోవడానికి ఆస్కారం లేదు. ఎందుకంటే ఆమె అప్పటికి కొంతకాలంగా మానవహక్కుల అతిక్రమణ

గురించి బహిరంగంగానే ఒక రాజకీయ ఉద్యమం చేపట్టింది. అందువల్ల ఈ రంగంలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో చూడడం అవసరం అని హక్కుల సంఘాలు భావించాయి. అంతేకాకుండా 'కశ్మీర్ సమస్య' పరిష్కారానికి చర్చలు జరగబోతాయన్న ప్రతిపాదన అప్పటికి ప్రచారం పొంది ఉంది. ఇది ప్రధానంగా అమెరికా ఒత్తిడి మేరకు. భారత, పాకిస్తాన్‌ల మధ్య చర్చే అయినప్పటికీ ప్రజలు భయం నుండి, ఆవేదన నుండి విముక్తులైతే తప్ప వారి భూభాగం భారతదేశంలో విలీనం కావడం న్యాయమా? కాదా? అనే విషయంలో జరుగుతున్న చర్చలో వాళ్ళు సమర్థవంతంగా, స్వేచ్ఛగా పాల్గొనలేరు.

కాగా, భారత, పాకిస్తాన్ సరిహద్దు వద్ద నివసించే ప్రజల వెతలు ఇంతకాలం ఎవరూ పట్టించుకోలేదు. మానవహక్కుల సంఘాలు సహితం అంతకుముందు ఎప్పుడు కూడా వారి గురించి, వారి స్థితిగతుల గురించి నివేదికలు రూపొందించలేదు. భారతదేశానికి పాకిస్తాన్‌తో సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. గుజరాత్‌లో మొదలై జమ్మూ కశ్మీర్‌లోని జమ్మూ జిల్లాలోని అఖ్నూర్ తాలూకా మధ్య భాగం దాకా ఉన్న దాన్ని అంతర్జాతీయ సరిహద్దు అంటారు. అఖ్నూర్ తాలూకాలోని పల్లన్‌వాలా గ్రామం నుండి మొదలై కశ్మీర్ లోయ అంచున కార్గిల్ దాకా వెళ్ళేదాన్ని వాస్తవాధీనరేఖ అంటారు. ఈ సరిహద్దు వద్ద, ముఖ్యంగా వాస్తవాధీనరేఖ వెంబడి, నివసిస్తున్న వేలాది కుటుంబాలు అర్థశతాబ్దంగా ఈ రెండు దేశాల మధ్య జరుగుతున్న సంఘర్షణకు మౌనంగా బలి అవుతున్నారు. వారు ప్రాణాలు కోల్పోయారు, అవయవాలు కోల్పోయారు. నిర్వాసితులయ్యారు, వారి ఇళ్లు కూలిపోయాయి, పశువులు చచ్చిపోయాయి, పొలాలు బీడు పడ్డాయి. అస్థిరతవల్ల, అప్పుడప్పుడు జరిగే తొలగింపువల్ల వారి పిల్లల చదువు, ఉద్యోగావకాశాలు, వారి వ్యవసాయాల అభివృద్ధి దెబ్బతిన్నది. ఇది ఒక ప్రగాఢమైన మానవ సమస్య. 1950 ల నుంచి ఈ పరిస్థితి ఉన్నా ఇప్పటిదాకా ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. ఈ మధ్య ఒక 15 సంవత్సరాలుగా దీని పరిమాణం పెరిగింది. 1989లో కశ్మీర్‌లో స్వాతంత్ర్యం కోసం ఉద్యమం మొదలైన తరువాత మిలిటెంట్లు కాగోరే వారు ఇటు నుంచి అటుకు, అటు నుంచి ఇటుకు రావడం పెరిగింది. ఫలితంగా సరిహద్దు వెంబడి సైనిక చర్యలూ పెరిగాయి. సరిహద్దు ప్రజానీకం సమస్యలూ పెరిగాయి. తరువాత 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం సమయంలో భారత సైనిక బలగాలు మొత్తంగా కార్గిల్ దగ్గరికి చేరడం వల్ల ఇతర సరిహద్దు ప్రాంతాల్లో చొరబాట్లు చాలా పెరిగాయి. ఆ యుద్ధం తరువాత మరింత ఎక్కువగా భారత ప్రభుత్వం సైన్యాన్ని సరిహద్దు మీద మోహరించి చొరబాట్లు ఆపడానికి ప్రయత్నించింది. ఇది కూడా సరిహద్దు

ప్రజానీకం మీద ఉన్న ఒత్తిడిని పెంచింది. 2001, 13 డిసెంబర్ నాడు భారత పార్లమెంట్‌పై దాడి జరిగిన తరువాత భారత ప్రభుత్వం ఆపరేషన్ పరాక్రమ్ పేరు మీద పాకిస్తాన్‌పై ఒత్తిడిపెట్టి 'సీమాంతర ఉగ్రవాదాన్ని' ఆపే ఉద్దేశ్యంతో చాలా పెద్ద ఎత్తున సైనిక బలగాలను సరిహద్దు మీద మోహరించింది. ఇది మరింతగా సరిహద్దు ప్రాంతవాసుల సమస్యలను పెంచింది. ఇప్పటికైనా వీరి కష్టాలను, అనుభవించిన మానవహక్కుల అణచివేతను బయటి ప్రపంచానికి తెలియచేయడం అవసరం అని హక్కుల సంఘాలు భావించాయి.

ఇక మూడవది ప్రతిపాదిత చర్చల గురించి ప్రజలు ఏమనుకుంటారు అనేది. 'కశ్మీర్ సమస్య' అనేది భారతదేశంలో కశ్మీర్ విలీనానికి సంబంధించిన వివాదం. అయితే ఆ విలీనాన్ని పాకిస్తాన్ ప్రశ్నించడం వల్ల అది సమస్య కాలేదు. కశ్మీరీ ప్రజానీకం ప్రశ్నించడం వల్ల సమస్య అయింది. తరుచుగా ఈ విషయం మనం మరచిపోతూ ఉంటాం. భారత ప్రభుత్వం ఈ విషయం గుర్తు చేసుకోవడానికి సహితం ఇష్టపడదు. ఎందుకంటే ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటే అప్పుడెప్పుడో 55 ఏళ్ళ క్రింద నోరుజారి ప్లెబిసైట్ నిర్వహిస్తామని హామీ ఇచ్చేసిన విషయం జ్ఞాపకం రావాల్సి వస్తుంది. అయితే ఇష్టమున్నా లేకున్నా దాన్ని జ్ఞాపకం చేసుకోక తప్పదు. ఈ సమస్య అనే దాన్ని, వివాదం అనే దాన్ని, ఏ విధంగా పరిష్కరించినా దాంట్లో మొదటి నుంచీ జమ్మూ కశ్మీర్ ప్రజానీకం భాగంగా ఉండాలి. చివరి మాట వారిదే కావాలి. అయితే భారత పాకిస్తాన్‌ల మధ్య చర్చల గురించి జరుగుతున్న సంభాషణల్లో ప్రాథమిక పక్షమైన జమ్మూ కశ్మీర్ ప్రజానీకం ప్రస్తావన ఎక్కడా కూడా రాదు. కేవలం వారి భూభాగం ప్రస్తావన మాత్రమే వస్తూ ఉంటుంది. ఈ ప్రాథమిక పక్షాన్ని తీసుకొచ్చి కూర్చోబెట్టడం అవసరం.

హక్కుల సంఘాల బృందం 2003 మే నెలలో కశ్మీర్‌కు పోయేటప్పటికి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మానవహక్కుల పరిస్థితి మెరుగైందా? లేదా? అనే విషయంలో ఆ రాష్ట్రంలో చాలా చర్చ జరుగుతూ ఉండింది. అందరి మాటలూ విని విషయాన్ని పరిశీలించిన తరువాత ఏమనిపించిందంటే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత కొంతకాలం పాటు కస్టడీలో మరణాలు, ఎదురుకాల్పుల్లో పౌరుల మరణాలు తగ్గినట్టు చెప్పుకోవచ్చు. అయితే 2003 మార్చి 23 నాడు నదీమార్గ్ గ్రామంలో 24 మంది హిందువులను మిలిటెంట్లు కాల్చి చంపిన తరువాత ఈ మార్పు వెనకకు తిరిగింది. దుర్మార్గమైన ఈ హత్యాకాండను ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం, సైనికాధికారులు తమకు అనుకూలంగా వాడుకుని ముఫ్తీ మహ్మద్ సయీద్ ప్రభుత్వం మిలిటెన్సీ పట్ల మరీ ఉదారంగా ఉంటోంది అని నిందించసాగారు. అప్పటిదాకా సైన్యం కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు తలొగ్గి, ఏ మేరకైతే తన విచ్చలవిడి ప్రవర్తనను అదుపు చేసుకుందో, ఇక ఆ అదుపు అవసరం లేదని భావించసాగింది. ఈ మాట వేరే ఎవరో

కాదు పిడిపి అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ స్వయంగా అన్నారు. నదీమార్గ్ ఊచకోత తరువాత సైనిక బలగాలను అదుపు చేయడం అసాధ్యమైపోయింది అని ఆమె బహిరంగంగానే అన్నారు.

సరే అంతకుముందు సంవత్సరాల గణాంకాలు ముందు పెట్టుకుని ఈ సంవత్సరం గణాంకాలతో పోల్చిచూస్తే తప్ప మరణాలు పెరిగాయా? తగ్గాయా? అని చెప్పడం సాధ్యం కాదు. కానీ మరణాల సంఖ్య పెరిగిందా? తగ్గిందా? అనే దానికంటే కూడా పోలీసులనూ సైనిక బలగాలనూ అదుపులో ఉంచగల వ్యవస్థలు బలోపేతమయ్యాయా లేదా? పునరుజ్జీవనం పొందాయా లేదా? అనేది ముఖ్యం. భారత ప్రజాస్వామ్యంలో ఎక్కడయినా ఎప్పుడయినా అతి బలహీనమైన అంశం ఈ వ్యవస్థలు. అయినప్పటికీ కశ్మీర్‌లో వీటి పతనం మరీ పాతాళానికి పోయింది. పిడిపి – కాంగ్రెస్ పాలనలో ఈ స్థితిలో ఏమైనా మెరుగుదల ఉందా అని చూస్తే మెరుగుదల ఏమీ కనిపించలేదు. 1995కు పూర్వం మిలిటెన్సీ కార్యకలాపాలు మొత్తం సైన్యం, కేంద్ర పారామిలిటరీ బలగాలు నిర్వహించేవి. వారు ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వానికి,తమ సైనిక బలగాల అధికారులకు, తప్ప వేరే ఎవరికీ జవాబుదారులం కామన్నట్టు ప్రవర్తించేవారు. కొంతమేరకైనా రాష్ట్ర పోలీసులకు మిలిటెన్సీ వ్యతిరేక కార్యకలాపాలలో పాత్ర ఇస్తే స్థానికులు కావడం వల్ల ప్రజల హక్కుల పట్ల కొంత సానుభూతిగా ఉంటారేమో అన్న అవగాహనతో ఆ రోజుల్లో సైన్యం నుండి పోలీసు బలగాలకు ఈ అధికారాన్ని బదలాయించాలి అని డిమాండ్ చేయడం కూడా జరిగేది. తరువాతి కాలపు పరిస్థితి ఏమిటంటే సరిహద్దు ప్రాంతాల్లో మాత్రమే సైన్యమూ, పారామిలిటరీ బలగాలు భద్రతా బాధ్యతలు పూర్తిగా నిర్వర్తించాయి. లోయ లోపలి భాగంలో వారితోపాటు రాష్ట్ర పోలీసు యంత్రాంగం కూడా పని చేయసాగింది. పోలీసు యంత్రాంగానికి సంబంధించిన ఒక స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ లేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ రూపొందించబడింది. దురదృష్టం ఏంటంటే స్థానికులు కావడం వల్ల కొంత సానుభూతిగా ఉంటారేమో అనుకున్న ఈ కశ్మీరీ పోలీసులు సైన్యంతో సమానమైన క్రూరత్వాన్ని త్వరలోనే ప్రదర్శించసాగారు. చివరికి స్పెషల్ ఆపరేషన్ గ్రూపును రద్దుచేయాలి అనేది ఒక డిమాండ్ అయింది. రద్దు చేస్తాము అనేది పిడిపి వారి ఎన్నికల హామీ అయింది.

ఇది నిజంగా జరిగిందా? లేదా? అనేది ఒక పెద్ద చర్చ. పిడిపి ప్రభుత్వం ఏం చేసింది అంటే స్పెషల్ ఆపరేషన్ గ్రూపుకు ఉన్న ఆ ప్రత్యేకత అంటే 'స్పెషల్' స్వభావాన్ని తొలగించి వారిని సాధారణ పోలీసు యంత్రాంగంలో భాగం చేశారు. అంతకుముందు ఈ స్పెషల్ ఆపరేషన్ గ్రూపు లేక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెల్లబట్టల్లో తుపాకులు పట్టుకుని, వారి పేరుగానీ, వారి హోదా గానీ తెలియజేసేటటువంటి గుర్తులేవీ లేకుండా

తిరిగేవారు. ఆ శాఖ యొక్క పై స్థాయి ఆఫీసర్లు ఎవరో ప్రజలకుతెలియదు. ఎవరికీ వారు కనిపించే వారు కాదు. ఈ 'స్పెషల్' పోలీసులు ఎవరిని తీసుకుపోయినా, ఎవరి మీదనైనా ఆత్యాచారం చేసిపోయినా ఫిర్యాదు చేసుకోవడానికి ఎవరూ ఉండేవారు కాదు. ఒక లైసెన్సు గుండాల ముఠా సమాజం మధ్యన ఉన్నట్టు ఉండేది. ముఫ్తీ మహమ్మద్ సయీద్ ప్రభుత్వం ఏం చేసింది అంటే స్పెషల్ ఆపరేషన్ గ్రూపు యొక్క ఎస్‌పిని సంబంధిత జిల్లాలో ఒక అడిషనల్ ఎస్‌పిగా నియమించి ఆ జిల్లా పోలీసు యంత్రాంగం లో భాగం చేసింది. కనీసం కాగితాల మేరకయినా డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ అదుపులోకి తీసుకొచ్చింది. దీని వల్ల కనీసం వాళ్లెవరినైనా తీసుకుపోతే చెప్పుకోవడానికి ఒక అధికారి ఉంటాడు అనే పరిస్థితి వచ్చింది. అంతవరకు బాగానే ఉంది కాని ఈ స్పెషల్ ఆపరేషన్ గ్రూపు సిబ్బంది క్రూరమైన హింసకు అలవాటు పడ్డవారు. వారిలో చాలా మంది మీద తీవ్రమైన అభియోగాలున్నాయి. అటువంటి చర్యలకు పాల్పడిన వారిని కనీసం తొలగించకుండా, వారిపైన విచారణ జరుపకుండా మొత్తమంతా ఆ గ్రూపును తీసుకొచ్చి పోలీసు యంత్రాంగంలో కలిపేయడం వల్ల సాధారణ పోలీసు యంత్రాంగం యొక్క అణచివేత స్వభావం పెరిగింది.

ఇక సైన్యం మాటకు వస్తే అంతకుముందు పౌర ప్రభుత్వానికి సైన్యంపై ఏ మాత్రం అజమాయిషీ ఉండిందో పిడిపి - కాంగ్రెస్ పరిపాలనలో కూడా అంతే ఉండింది. మారుమూల ప్రాంతాలు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలకు పోలీసులు సైతం సైన్యం అనుమతి తీసుకోకుండా పోవడానికి వీలులేదు. హక్కుల బృందాన్ని ఒక గంటసేపు ఆపి ముచ్చట్లు పెట్టుకున్న రాష్ట్రీయ రైఫిల్స్ కులిగాం క్యాంపు అధికారి అయిన కెప్టెన్ పంకజ్‌సింగ్ మాటల్లో చెప్పాలంటే "ఒకే కుటుంబంలో ఒకరు పోలీసుల్లో ఉండొచ్చు. ఇంకొకరు మిలిటెంట్ కావచ్చు. కాబట్టి పోలీసులను కూడా సరిహద్దు ప్రాంతాలకు మా అనుమతి లేకుండా పోనివ్వము". మరి ఈ పాటి విశ్వాసం పొందిన పోలీసు శాఖ సైనిక బలగాలు ప్రజలపైన చేసే అత్యాచారాల గురించి విచారణ ఏం జరుపుతుంది? కులిగాం రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపునే ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆ క్యాంపుకు అవతల వాస్తవాధీనరేఖకు సమీపంలో అనేక గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో సైనిక బలగాలు తరుచుగా సోదా నిర్వహిస్తుంటారు. కాని ఆ గ్రామాల ముఖద్వారం వద్ద ఉన్న కులిగాం క్యాంపు తన అనుతి లేకుండా ఎవరినీ, అంటే పోలీసులను సైతం, లోపలికి పోనివ్వదు. కాబట్టి ఏం జరుగుతోంది అంటే ఆ సరిహద్దు గ్రామ ప్రాంతాల ప్రజలపైన సోదాల పేరు మీద సైనిక బలగాలు ఎటువంటి అత్యాచారాలకు పాల్పడినా ఎవరూ చూడలేరు, ఎవరూ మాట్లాడలేరు. అంటే పౌర ప్రభుత్వం అజమాయిషీ అనేది సైనిక బలగాలపైన సరిహద్దు ప్రాంతాల్లో శూన్యం అని చెప్పుకోవచ్చు.

ఇక్కడ ఒక ఉదంతాన్ని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. షకీలా రషీద్ అనే వార్‌నో గ్రామానికి చెందిన 17 సంవత్సరాల అమ్మాయిని 2003 జనవరి 16 నాడు రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు తన గ్రామానికి సమీపంలో కాల్చి చంపారు. షకీలా చిన్నాన్న గులాం అహ్మద్ భట్ గ్రామ సమీపంలో ఉన్న ఒక రోడ్డు మరమ్మత్తు పనిలో నిమగ్నమై ఉన్నాడు. అతనికి ఒంట్లో బాగాలేదు కాబట్టి అతన్ని చూడడానికి ఆ రోజు షకీలా మరొక ముగ్గురు అమ్మాయిలకు తీసుకుని వెళ్ళింది. చూసి వెనక్కి వస్తున్నది. వాళ్ళు రహదారి గుండా రాకుండా ఒక అడ్డదారి మీదుగా పోతున్నారు. ఒక ఎత్తుమీద నుంచి పెట్రోలింగ్ చేస్తున్న రాష్ట్రీయ రైఫిల్స్ ఇబ్బంది ఆ అమ్మాయిలవైపు నేరుగా కాల్పులు జరిపి షకీలాను చంపేశారు. దానికి వాళ్ళు ఇస్తున్నటువంటి జవాబు ఏమిటంటే అక్కడ కొందరు మిలిటెంట్లు ఉన్నారనీ వాళ్ళు తమపైన కాల్పులు జరిపారు అని ఎదురుకాల్పులు జరుపుగా ఆ అమ్మాయి చచ్చిపోయిందని. గ్రామస్తులేమంటారంటే అక్కడ ఏ మిలిటెంట్లు లేరని, గ్రామస్తులు చెప్పేది నిజమని, సైన్యం చెప్పేది తప్పనిసరిగా అబద్ధమని అనడం లేదు. సమస్య ఏమిటంటే ఏది నిజం, ఏది అబద్ధం అనేది ఎవరు నిర్ణయిస్తారు? ఏ పద్ధతిలో నిర్ణయిస్తారు? అనేది. కశ్మీర్‌లో సైన్యం అజమాయిషీ చేసే ప్రాంతాలలో తాను చంపినవాళ్ళను ఏ పరిస్థితుల్లో చంపింది, ఎందుకు చంపింది సైన్యమే ప్రకటిస్తుంది. ఇక ఇదే అదే చివరి మాట. మానవహక్కుల పరిస్థితిలో నిజమైన మార్పు రావడం అంటే ఇది మారాలి. కశ్మీర్‌లో పిడిపి – కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మార్పేమీ లేదు. రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు షకీలను చంపేసి సత్యాన్ని తామే ప్రకటించడం మాత్రమే కాకుండా అక్కడికి పోతున్న హక్కుల బృందాన్ని ఒక గంటసేపు ఆపి బృందం జీపులో ఒక లొంగిపోయిన మిలిటెంట్‌ను ఎక్కించి ప్రజలెవరు కూడా స్వేచ్ఛగా మాట్లాడకుండా చేశారు. ఒక సాధారణ గ్రామస్తునిగా నటిస్తూ దారి చూపడానికి జీపు ఎక్కిన ఆ వ్యక్తి సైన్యానికి లొంగిపోయిన మాజీ మిలిటెంట్ అన్న విషయం ఎప్పుడు అర్థమయ్యిందంటే షకీలా తండ్రి అబ్దుల్ రషీద్ భట్ తన కుమార్తె మరణం ఒక విషయమే కానట్టు, అదేం పట్టించుకోవాల్సిన సంగతి కానట్టు మాట్లాడి, ఒక అరగంట నిష్ప్రయోజనమైన సంభాషణ అనంతరం అతని ఇంటి నుంచి అందరూ బయటకు వస్తుండగా నెమ్మదిగా చెవిలో "ఆ వ్యక్తి ఒక మాజీ మిలిటెంట్ కాబట్టి "సైన్యం ఏజెంట్ కాబట్టి నేను మాట్లాడలేకపోయాను" అని చెప్పినప్పుడు, తామే చంపడం, తామే సత్యాన్ని ప్రకటించడం మాత్రమే కాకుండా వేరెవరూ సత్యాన్ని తెలుసుకోకుండా ఏ విధంగా చేయగలిగారో అప్పుడు అర్థమయింది.

మరి చట్టం ఏమంటుంది అంటే, సైనిక బలగాలకు ప్రత్యేక అధికారాలు కల్పించే చట్టాలు సైతం తాము చేసేటటువంటి చర్యల సత్యాసత్యాలను సైన్యమే నిర్ణయిస్తుంది అని చెప్పవు. జమ్మూ కశ్మీర్‌లో సైన్యం సాయుధ బలగాల (జమ్మూ కశ్మీర్) ప్రత్యేక

అధికారాల చట్టం 1990 కింద పనిచేస్తూ ఉంది. నిర్బంధపూరితమైన ఈ చట్టం రాజ్యాంగబద్ధమైనదేనని సుప్రీంకోర్టు దురదృష్టవశాత్తు తీర్పు ఇచ్చినప్పటికీ చట్టానికి సంబంధించిన కొన్ని లక్షణాలను స్పష్టం చేసింది. ఆ చట్టం కింద మోహరింపబడేటటు వంటి సైనిక బలగాలు పౌర ప్రభుత్వానికి అండగా అక్కడ ఉంటాయే తప్ప పౌర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా కాదు. ఉదాహరణకు ఆ చట్టం కింద పనిచేస్తున్న సైనిక బలగాలు ఎవరినైనా అరెస్టు చేస్తే వెంటనే సమీప పోలీసుస్టేషన్లో ఆ వ్యక్తిని అప్పగించాలి. ఆ స్టేషన్ పోలీసులు ఆ వ్యక్తిని 24 గంటలలోపు కోర్టు ముందు హాజరుపరచాలి. అట్లాగే ఏ ఇంటికైనా సైనిక బలగాలు సోదా చేసేటప్పుడు పోలీసులు చేపట్టే సోదాకు వర్తించే నియమాలను పాటించాలి. స్వాధీనం చేసుకున్న వస్తువులు ఏమన్నా ఉంటే వాటిని వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్లో అప్పగించాలి. సైనిక బలగాలు ఆ చట్టం కింద పనిచేసే క్రమంలో అధికార దుర్వినియోగానికి గాని పాల్పడితే వాటిపైన తప్పనిసరిగా విచారణ జరపాలి. ఆ విచారణ జరపడానికి అవసరమైన సమ్మతిని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఇవ్వాలి. ఇవన్నీ సుప్రీంకోర్టు చెప్పింది. కాని అవన్నీ కాగితం మీద మాటలుగా సుప్రీంకోర్టు ప్రవచనాలుగా ఉండిపోయాయి. పూర్తిగా సరిహద్దుపైన నివసించే గ్రామాలలోనైతే వారి గురించి అడగ్గలవారు. చూడగలవారు కూడా లేరు.

ఇక్కడ ఇంకొక్క ఉదాహరణ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది. వాస్తవాధీనరేఖ వెంబడి ఉన్న జమ్మూ ప్రాంతంలోని పూంచ్ జిల్లాలో సాత్రా అనే గ్రామం ఉన్నది. ఆ గ్రామానికి చెందిన జైతున్‌బీ మే 28, 2003 నాడు పొద్దున ఇంట్లో పనిచేసుకుని బజారుకు పోవడానికి ఇంటి నుంచి బయటకు వచ్చింది. అప్పటికే పొద్దుటి నుంచి ఆ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఎత్తుమీద ఉన్న జండ్రోలా అనే గ్రామంలో సైన్యానికీ, మిలిటెంట్లకూ ఎన్‌కౌంటర్ జరుగుతున్నది. ఆ శబ్దాలు జైతున్‌బీ విన్నది. ఇది ఎప్పుడూ ఉండే విషయమే కాబట్టి ఆమె పట్టించుకోలేదు. అక్కడ ఎన్‌కౌంటర్ మొదలుకాగానే ఒక సైనిక బలగాల క్యాంపు తన ఇంటిముందు నెలకొనడం ఆమె గమనించింది. ఆ విషయం కూడా మామూలే కాబట్టి ఆమె పట్టించుకోలేదు. ఇంటి పనులు ముగించుకుని 9 గంటలకు ఆమె బజారుకు పోవడానికి బయటకు రాగా ఆ క్యాంపులో ఉన్న జవాన్లు నేరుగా ఆమెపైకి కాల్చారు. ఆమె ఎడమకాలి తొడ ఎముక పూర్తిగా చితికిపోయింది. మానవహక్కుల బృందం చూసేటప్పటికి ఆమె విపరీతమైన నొప్పితో పూంచ్ జిల్లా ఆసుపత్రిలో ఉంది. బహుశా ఆమె కాలు తీసేయడం జరుగుతుంది. ఒక విచారణ అంటూ జరిగితే, ఆమె బతికే ఉంది కాబట్టి ఏం జరిగిందో చెపుతుంది. ఆమె భర్త హైదర్షా కూడా సాక్ష్యం చెప్పగలడు. అటువంటి విచారణ జరిగితే కాల్పులకు బాధ్యులైన సైనిక అధికారులకు శిక్ష పడటం కూడా సాధ్యమే. కాని అది జరుగుతుందా?

నేర విచారణ సంగతి పోనీయండి. కనీసం మెజిస్టీరియల్ విచారణ జరిపే అధికారం ఉన్న ఎగ్జిక్యూట్ మెజిస్ట్రేట్ ఆ పని చేస్తాడా? ఎగ్జిక్యూట్ మెజిస్ట్రేట్ హోదా ఉన్న డిప్యూటీ కమీషనర్లు (మన దగ్గర జిల్లా కలెక్టర్లు అంటాం) సైనిక బలగాలు జరిపే అత్యాచారాలపైన విచారణ జరిపే అధికారం తమకుంది కదా. అని దానిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తే వారి మీత త్వరలోనే నిందలు వేస్తారు. గతంలో అనంత్‌నాగ్ జిల్లా డిప్యూటీ కమీషనర్‌గా ఉన్న ఒక అధికారి చట్టం చెప్పింది కదా, సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది కదా. అని సైనిక బలగాలు చేసిన బలప్రయోగ చర్యలపైన పనిగట్టుకొని విచారణ జరిపేసరికి అతని మీద మిలిటెంట్లకు సన్నిహితుడు అని ముద్రవేసి అతన్ని చాలా ఇబ్బంది పెట్టారు. ఈ సంగతి వేరెవరో అన్నదికాదు, అతని తరువాత ఆ కుర్చీలో కూర్చున్న అనంత్‌నాగ్ డిప్యూటీ కమీషనరు. దూరాన ఉన్న పూంచ్ జిల్లా డిప్యూటీ కమీషనరు, ఇద్దరు కూడా అతనికి జరిగిన అన్యాయాన్ని గురించి బాధతో చెప్పారు. ఈ స్థితిలో తాము చట్టం ఇచ్చిన అధికారాన్ని వినియోగించలేకపోతున్నాము అని వాళ్ళు స్పష్టంగానే అన్నారు. కాబట్టి చట్టం అధికారాలు ఇచ్చింది కదా అని సైన్యం చేసే అత్యాచారాల పైన చట్టబద్ధమైన విచారణలు జరిపే కంటే ఎవరి జాగ్రత్తలో వారుండడం మేలు అని మెజిస్టీరియల్ అధికారులుగా ఉండే డిప్యూటీ కమీషనర్లు, అంతకంటె పై స్థాయి అధికారులు సైతం భావిస్తారు. ఉత్తర సరిహద్దు వద్దనున్న కుప్వారా జిల్లా కేంద్రం నివాసి మహ్మద్ అష్రాఫ్ మాలిక్ అనే యువకుడు రాష్ట్రీయ రైఫిల్స్ 41వ బెటాలియన్ చేతిలో 2003 మే 19న చనిపోయాడు. మే 12వ తేదీన కుప్వారా పట్టణ కేంద్రంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ పోస్ట్ మీద ఆత్మాహుతి దళం దాడి, అంటే ఫిదాయిన్ దాడి, జరిగింది. ఆత్మాహుతి దళసభ్యుడు తనను తాను పేల్చేసుకుని ముగ్గురు సిఆర్‌పిఎఫ్ జవాన్లను కూడా చంపాడు. గతంలో ఇటువంటి సంఘటన ఎప్పుడు జరిగినా చుట్టూ ఉన్న సాధారణ పౌరులపైన సైనిక బలగాలు ప్రతీకారం తీర్చుకోవడం జరిగేది. దీనిపట్ల చాలా పెద్ద ఎత్తున జాతీయంగాను, అంతర్జాతీయంగాను నిరసన వచ్చేటప్పటికి వెనువెంటనే పౌరులపైన ప్రతీకారం తీర్చుకోవడం తగ్గించారు. కాని ఆ దాడి చేసిన ఫిదాయిన్ ఎవరో తమకు చెప్పాలి అని స్థానిక ప్రజలను, ముఖ్యంగా యువకులను, ప్రశ్నించే క్రమంలో ప్రతీకారం తీర్చుకోవడం జరుగుతుంది. మే నెలలో కుప్వారాలో అదే జరిగింది. చాలా మంది స్థానిక యువకులను ఆ ఫిదాయిన్ గురించి ప్రశ్నించడానికి సైనిక బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆ విధంగా తీసుకున్న ఒక వ్యక్తి మహ్మద్ అష్రాఫ్ మాలిక్. ఇతను అటవీశాఖలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనిని అదుపులోకి తీసుకున్నారని తెలియగానే అతని మేనమామ మహ్మద్ జమాల్ మాలిక్ సమీపంలో ఉన్న రాష్ట్రీయ రైఫిల్స్ అధిపతి మేజర్ చౌహాన్‌ను కలిసి అడిగాడు. సాయంత్రం పంపిస్తాము పొమ్మని మేజర్ చౌహాన్ చెప్పాడు. సాయంత్రం అతను రాకపోయేసరికి మరుసటి రోజు ప్రజలు మళ్ళీ ఆ రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపుకు వెళ్లారు. సాయంత్రం దాకా ఆ క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ వాళ్ళకు కనిపించలేదు. సాయంత్ర

5.30కు వచ్చి కుప్వారా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అతన్ని ప్రశ్నించదలుచు కున్నాడనీ ఆ ప్రశ్నించడం అయిపోగానే మరుసటి రోజు వదిలిపెడతామనీ చెప్పాడు. మరుసటిరోజు సాయంత్రం, అంటే మే 18న కుప్వారా జిల్లా ఎస్పి మహ్మద్ జమాల్‌మాలిక్‌కు ఫోన్ చేసి ఆ యువకుడు అమాయకుడనీ అతన్ని మరుసటి రోజు వదిలిపెడతామనీ చెప్పారు.మరుసటిరోజు పొద్దున్న అతను వెనక్కి రాకపోయేసరికి మేనమామ శ్రీనగర్‌కు పోయి జమ్మూ కశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు సజ్జాద్‌లోన్ చేత కుప్వారా ఎస్పికి ఫోన్ చేయించాడు. ఆ అబ్బాయిని 20వ తేదీన వదిలిపెడతామని ఎస్పి లోన్‌కు చెప్పాడు. కాని అదే రాత్రి అంటే 19వ తేది రాత్రి అతనిని చంపేశారు. సైనిక బలగాల కథనం ఏమిటంటే మహ్మద్ అష్రాఫ్ మాలిక్ తనకు మిలిటెంట్లతో సంబంధాలున్నాయని చెప్పాడనీ ఒక రహస్య స్థావరాన్ని చూపిస్తానని తీసుకుపోయాడనీ దారిలో మిలిటెంట్లు మందుపాతరపేల్చగా మాలిక్ చనిపోయాడని అన్నారు. అతని శరీరంలో ఒక ముక్కను మాత్రమే అతని కుటుంబానికి అందచేశారు. విచిత్రం ఏమిటంటే అతనితోపాటు చనిపోతున్నారు అని చెప్పుకున్న సైనిక జవాన్లు మాత్రం సురక్షితంగా ఉన్నారు. ఈ కథ నమ్మేవారెవరూ లేరు. రాష్ట్రీయ రైఫిల్స్ 41వ బెటాలియన్ జవాన్లు, బహుశా పోలీస్ యంత్రాంగం కూడా కలిసి, అతన్ని చంపారు అన్నది స్పష్టమే. అయితే కుప్వారా జిల్లా డిప్యూటీ కమీషనర్ గారు మెజిస్టీరియల్ విచారణ ప్రకటించడానికి కూడా నాలుగు రోజులు తటపటాయించాడు. నాలుగు రోజులు కుప్వారా పట్టణం బంద్ జరిగిన తరువాత, అతను కాదు రాష్ట్ర ముఖ్యమంత్రి మెజిస్టీరియల్ విచారణ ప్రకటించాల్సి వచ్చింది.

కాబట్టి సైనిక బలగాల అనుచిత ప్రవర్తనను గానీ వారు పాల్పడే అత్యాచారాలను గానీ అదుపు చేయడానికి అధికార యంత్రాంగానికి చట్టం ఇచ్చిన అధికారాలు సద్వినియోగం చేయడం అనేది గతంలో ఏ విధంగా ఉండిందో మానవహక్కుల పునరుద్ధరణ జరుగుతుందన్న హామీతో అధికారానికి వచ్చిన పిడిపి, కాంగ్రెస్ పాలనలోనూ అదే విధంగా ఉంది.

రెనెగేడ్లు అని పిలువబడే సైన్యానికి తోడ్పడుతున్న మాజీ మిలిటెంట్ల విషయం కూడా ఇంతే. కొన్ని సంవత్సరాలుగా కశ్మీర్‌లో సైనిక బలగాలు ముఖ్యంగా రాష్ట్రీయరైఫిల్స్ ఒకప్పుడు మిలిటెంట్లుగా ఉండి లొంగిపోయి, నేరమయమైన జీవితం గడపడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులను పట్టుకుని వారికి ఆయుధాలు ఇచ్చి సమాజం మీదికి వదిలి వాళ్ళు సమాజంపైన చేసే నేరాలను ఉపేక్షించడం, వారి నేర ప్రవృత్తిని తమకు అనుకూలంగా మలచుకోవడం జరుగుతూ ఉంది. దీనిని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిడిపి గట్టిగా వ్యతిరేకించింది. అధికారానికి వస్తే ఈ రెనెగేడ్లందరినీ నిరాయుధుల్ని చేసి వారి

ఆగడాలను అదుపుచేస్తామని పదే పదే పిడిపి నాయకులు ప్రకటించారు. కాని ఆ విషయంలో తేడా ఏమీ రాలేదు అనేది స్పష్టంగానే కన్పించింది. మానవహక్కుల బృందం పర్యటనకు కొద్దిముందు జరిగిన ఒక అత్యంత బాధాకరమైన ఘటన ఈ రెనెగేడ్ల విషయంలో పిడిపి ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతుంది. మధ్య కశ్మీర్ ప్రాంతంలో ఉన్న జిల్లా బడ్గామ్. బడ్గామ్ జిల్లా ఒక చివర శ్రీనగర్ పట్టణం దాకా వస్తుంది. మరొక చివర వాస్తవాధీనరేఖ దాకా పోతుంది. వాస్తవాధీనరేఖకు సమీపంలో ఉన్న కొండల్లో ఉన్న ఒక పోలీస్‌స్టేషన్ బీరు. ఆ బీరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతమంతా కూడా కొండలు,అడవులమయం. ఆ కొండల లోపల ఉన్న ఒక ఊరు డంగర్‌పూర్. ఆ ఊరికి చెందిన షహజాదా, షమీమా అనే ఇద్దరు అక్కాచెల్లెళ్లు. బీరులో క్యాంపులో ఉన్న రాష్ట్రీయ రైఫిల్స్ జవాన్లు కాపాడుతూ ప్రజలమీదికి వదులుతూ ఉన్న రెనెగేడ్ల చేతుల్లో అప్పటికి ఒక సంవత్సర కాలంగా నరకాన్ని చవిచూస్తూ ఉన్నారు. డంగర్‌పూర్‌కు చెందిన అబ్దుల్ రహమాన్ డార్ కుమార్తెలైన 17 సంవత్సరాల షహజాదా, 15 సంవత్సరాల షమీమా తమ తండ్రి సహాయ సహకారాలతో గట్టిగా నిలబడి ఆందోళన చేయబట్టి ఈ విషయాలు బయటికి వస్తాయి.

ఒక అయిదుగురు యువకులకు బీరులో ఉన్న రాష్ట్రీయ రైఫిల్స్ క్యాంపు అధికారులు తుపాకులిచ్చి తమ మనుషులుగా వాడుకుంటున్నారు. వారిలో మహ్మద్‌మక్బూల్‌మీర్, నజీర్‌డెండా మాజీ మిలిటెంట్లు కాగా, ఫయాజ్‌ఖాన్, రషీద్‌ఖాన్, బషీర్‌మీర్‌లు వారితో చేరిన నేరగాళ్ళు. ఈ అయిదుగురు రాష్ట్రీయ రైఫిల్స్ పంచన చేరిన నేరగాళ్ళు కాగా, వీరికి తోడుగా మహమ్మద్ అష్రాఫ్ అనే సాదాసీదా నేరగాడు జత అయ్యాడు. వీళ్లు బీరుకు ఆవల ఉన్న అడవి ప్రాంతంలో చాలా బీభత్సం సృష్టించారు. 2002 మే నెలలో ఒక దినం ఈ అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ గుల్మార్గ్ రహదారి మీదుగా ఇంటికి వస్తుండగా ఈ ముఠా వారిని అపహరించి తీసుకుపోయింది. 3 రోజుల తరువాత చిన్నమ్మాయి షమీమా పారిపోయి వచ్చింది. షహజాదా మాత్రం 40 సంవత్సరాల మహ్మద్ మక్బూల్ మీర్‌ను బలవంతంగా పెళ్ళిచేసుకోవాల్సి వచ్చింది. అయితే మూడు నెలల తరువాత షహజ్దా ఈ బలవంతపు భర్త నుండి తప్పించుకుని పారిపోయి వచ్చింది. ఈ విషయంలో గొడవేమీ చేయొద్దు అని ఆ రౌడీలు చేసిన బెదిరింపులకు ఆ అమ్మాయిలు, వారి తండ్రిగాని లొంగి ఉంటే కథ ఇక్కడితో ముగిసేది. ఎవరికీ అది తెలిసేది కాదు. కాని శ్రీనగర్ నుండి పనిచేసే మహ్మద్ ఎహసాన్ ఉంటూ అనే మానవహక్కుల కార్యకర్త సహాయంతో, పత్రికల సహాయంతో, ఆ అమ్మాయిల తండ్రి అబ్దుల్ రహమాన్ డార్ విషయాన్ని బయటికి తీసుకొచ్చి బాగా గొడవచేశాడు. తన పెద్ద కుమార్తె వెనక్కి వచ్చేదాక ఆగాడు. ఆమె రాగానే విషయాన్ని ప్రచారంలో పెట్టాడు. పత్రికలు రాశాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వానికి జోక్యం చేసుకోవలసిందిగా విజ్ఞప్తి

చేసింది. జమ్మూ కశ్మీర్ హైకోర్టులో ఒక కేసు కూడా వేశారు. షహజాదా, షమామీల అపహరణ మీద విచారణ జరపాలి అని, 2003 ఏప్రిల్ 5వ తేదీన హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కేసులో ఇప్పటిదాకా ఏమేం చేశారో తెలుపుతూ రిపోర్టు సమర్పించాల్సిందిగా ఆదేశం జారీ చేసింది. మూడువారాలకు కూడా ఎటువంటి రిపోర్టు ప్రభుత్వం సమర్పించలేదు. అప్పుడు అమ్మాయిలు, వారి తండ్రి, మహ్మద్ ఎహసాన్ ఉంటూ సహకారంతో ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి మూడు రోజుల లోపల దోషుల్ని అరెస్టుగాని చెయ్యకపోతే తాము ముఖ్యమంత్రి ఇంటి ముందే ధర్నా చేస్తామని ప్రకటించారు. దీనికి స్పందిస్తూ స్థానిక ఎంఎల్ఏ అయిన మంత్రిగారు ముజఫర్ హుస్సేన్‌బేగ్ 2 రోజుల్లో వారిని అరెస్టు చేస్తామని హామీ ఇచ్చాడు. అయినా ఏమీ జరుగలేదు. మే 5వ తేదీన ఆ ఇద్దరు అమ్మాయిలు,వారి తండ్రి, మానవహక్కుల కార్యకర్త మహ్మద్ ఎహసాన్ ఉంటూ శ్రీనగర్‌లోని సెక్రటేరియట్ బయటే ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం మాత్రమే కాదు. అక్కడికి బయలుదేరి వెళ్ళారు. పోలీసులు వారిని అరెస్టు చేసి ఆత్మాహుతిని ఆపారు. అయితే కొంచెం ఫలితం వచ్చింది. ముఠాలో ఒకడైన మహ్మద్ అష్రాఫ్‌వార్‌ను అరెస్టు చేసారు. (ఆ ముఠాలో ఇతనొక్కడే రాష్ట్రీయ రైఫిల్స్‌తో సంబంధంలేనివాడు) మహ్మద్ మక్బూల్ మీర్ సంగతేమిటి, అసలు షహజాదాను బలవంతంగా పెళ్ళి చేసుకున్నది అతను కదా అంటే అతను తిరిగి మళ్ళీ మిలిటెంట్లలో చేరిపోయాడు అని పోలీసులు ప్రకటించారు. పత్రికలు ఈ వార్తను రాయడమే వెక్కిరింతగా రాశాయి. ఎవరూ నమ్మడం లేదని గ్రహించిన పోలీసులు అతన్ని కూడా మే 23న అరెస్టు చేశారు. అతన్ని అరెస్టు చేసిన బీరు ఎస్ఐ గారు మరి అంతకుముందు మీర్ మిలిటెంట్లతో మళ్ళీ కలిసాడు అన్నారు కదా, ఎందుకన్నారు అనే ప్రశ్నకు ఏ వివరణ ఇవ్వలేదు. అయితే తరువాత రోజు ఈ గ్యాంగుకు చెందిన ఫయాజ్‌ఖాన్‌ను కూడా అరెస్టు చేశాడు.

చెప్పుకోదగ్గ అంశం ఏమిటంటే ఈ డ్రామా అంతా జరుగుతుండగా ఆ నేరగాళ్ళను ప్రోత్సహించి వారికి తుపాకులిచ్చి వాడుకుంటున్న రాష్ట్రీయ రైఫిల్స్ అధికారులు పెదవి విప్పలేదు. తమకు మాట్లాడే బాధ్యత ఉందని వారు అనుకోలేదు. తాము చేసేది తాము చేస్తారు. అది త్రిప్పికొడితే ఏమీ జరుగలేదన్నట్లు నటిస్తారు. అంతే తప్ప తమ ద్వారా జరిగే విషయాలకు జవాబు ఇవ్వాలి అని వారు అనుకోరు. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే రాష్ట్రీయ రైఫిల్స్ ఈ విషయానికి జవాబు చెప్పాలని కాని, చెప్తుందని కాని ఎవరూ ఆశించలేదు. కనీసం ఆ సైనికశాఖ షమీమా, షహజాదాలకు, క్షమాపణ అయినా చెప్పుకుంటుంది అని ఎవరు ఆశించలేదు. వారూ ఆ పని చేయలేదు. ఇంకా ప్రధానంగా చెప్పదలచిన విషయం ఏమిటంటే ఎన్నికలప్పుడు పిడిపి నాయకులు, ముఖ్యంగా మహబూబా ముఫ్తీ రెనెగేడ్లను పూర్తిగా నిరాయుధుల్ని చేస్తామని పదే పదే హామీ ఇచ్చినప్పటికీ ఈ ఘటన అంతా జరుగుతుండగా షమీమా, షహజాదాలు, వారి

తండ్రి పత్రికలకు చెప్పడము, పత్రికలు ప్రచురించడము, దానిని ఖండిస్తూ పోలీసులు మాట్లాడడం జరుగుతుండగా ఒక్కసారైనా పిడిపి నాయకులు మాట్లాడలేదు. మొత్తం అంతా ఏ విధంగా నడిచింది అంటే వారిని అపహరించిన ఆ నేరగాళ్ళను అరెస్టు చేస్తారా లేదా అన్నదొక్కటే చర్చనీయాంశమైనట్టు, అటువంటి నేరగాళ్ళకు సైన్యం తుపాకులు ఇచ్చి వారి నేరాలను కాపాడటం చర్చించాల్సిన అంశమే కానట్టు నడిచింది. నిజంగా ఒక భిన్నమైన పరిపాలన ఇచ్చే సంకల్పంగాని పిడిపికి ఉంటే అది జరిగేది కాదు.

మానవహక్కుల బృందం బీరు పోలీస్‌స్టేషన్ అరెస్టు అయ్యి ఉన్న ఫయాజ్‌ఖాన్‌ను కలిసింది. అతని దగ్గర సైన్యం ఇచ్చిన ఐడెంటిటీ కార్డు చూసి ఆశ్చర్యపోవడం వారి వంతయింది. లిఖితపూర్వకంగా రాష్ట్రీయ రైఫిల్స్ 34వ బెటాలియన్‌కు చెందిన ఒక అధికారి 2000 ఆగస్టు 8న ఈ కార్డు ఫయాజ్‌ఖాన్‌కు ఇచ్చాడు. ఒక సర్టిఫికెట్ కూడా ఇచ్చాడు. దానిమీద ఏమని ఉన్నది అంటే ఇతను సైన్యానికి కావాల్సినవాడు అని (సోర్స్ పర్సన్ అని) అతనికి ఒక పిస్టల్ 16 రౌండ్ల తూటాలు ఇవ్వడం జరిగింది అని సంతకం చేసి మరీ ఇచ్చాడు.

తొలినాటి నుండి మిలిటెన్సీని ఎదుర్కొనే క్రమంలో సైన్యం సాధారణ పౌరులను కవచంగా వాడుకోవడం జరుగుతూ ఉంది. దీనిమీద చాలా విమర్శ వచ్చింది. అతి ఘోరమైన మానవహక్కుల అతిక్రమణగా దీనిని గుర్తించడం జరిగింది. కాని ఇది కూడా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ ఒక ఘటన వివరాలు చూద్దాం. ఇది పిడిపి అధికారంలోకి రాకముందు జరిగిన ఘటన అయినప్పటికి ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనిపైన ఎటువంటి చర్య తీసుకోవడం కానీ బాధితుల విజ్ఞప్తులకు స్పందించడం కానీ జరుగలేదు. జమ్మూ ప్రాంతంలోని రాజోరి తాలూకాలో గంభీర్ అనే ఊరు ఉంది. అది రాజోరి పూంచ్ రహదారి మీద ఉన్నది. 2002, సెప్టెంబర్ 17 పొద్దున గంభీర్‌కు సమీపంలో ఉన్న కటర్‌మల్ కొండమీది ఒక సుదీర్ఘమైన ఎన్‌కౌంటర్ జరిగింది. కొండమీద ఉన్న మిలిటెంట్లు, కొండకింద ఉన్న సైన్యానికి చెందిన 6 గ్రెనేడియర్స్, కాల్పులు జరుపుకున్నారు. సాయంత్రం అయ్యేసరికి తుపాకుల శబ్దం ఆగింది. సైన్యానికి చెందిన ఒక హవల్దార్ గంభీర్ గ్రామానికి వచ్చి దుకాణాలలో, వీధుల్లో, ఉన్నటువంటి వాళ్ళను 21 మందిని పోగుచేసి కొండమీద మిలిటెంట్లు చచ్చిపోయారనీ, ఒక జవాను కూడా చచ్చిపోయాడని, జనం పైకి పోయి ఆ జవాను శవాన్ని తీసుకురావాలనీ చెప్పాడు. ఒక కెప్టెన్‌కు వారిని అప్పగించాడు. అయితే ఆ కెప్టెన్ ఇంకొంత భిన్నమైన కథ చెప్పాడు. కొండమీదికి పోయే జనం చచ్చిపోయిన మిలిటెంట్లకు చెందిన సామాన్లను తీసుకురావాలి అని చెప్పి వారిని మరొక మేజర్‌కు అప్పగించాడు. ఆ మేజర్ వారిని కొండెక్కమన్నాడు. వాస్తవానికి ఈ కథలన్నీ అబద్ధాలే.

ఒక వేళ నిజంగానే జవాను శవాన్ని తీసుకురావాల్సి ఉన్నా, మిలిటెంట్ల సామాన్లు తీసుకురావాల్సి ఉన్నా ఆ పని జవాన్లు చేయగలిగి ఉండేవారు. దానికి పౌరులను పంపించాల్సిన అవసరం లేదు. అసలు కారణం ఏందో ఆ ప్రజలకు ఒకవేళ ముందే అర్థం కాకపోయినా కొండ ఎక్కుతుండగా అర్థం అయ్యి ఉండాలి. కొండమీది మిలిటెంట్లు చనిపోనూలేదు. పారిపోనూ లేదు. వారక్కడే ఉన్నారు. వారు ఎక్కడున్నారో వారి ఆచూకీ తెలుసుకోవడం కొరకు ప్రజలను సైన్యం పావులుగా వాడుకుంది. ఈ ఇరవై ఒక్క మంది కొండ ఎక్కి కొండ పైభాగాన్ని సమీపించేసరికి వారిని చూసిన మిలిటెంట్లు కాల్పులు మొదలుపెట్టారు. అది చూసి క్రింది నుంచి మిలిటెంట్లు ఎక్కడున్నారో గ్రహించిన సైన్యం ఎదురు కాల్పులు మొదలుపెట్టింది. మధ్యలో కొండెక్కుతున్న పౌరులు ఉన్నారు అనే విషయం వారికి పట్టలేదు. ఆ జనం గట్టిగా కేకలు పెడుతూ కాల్పులు ఆపండి అని కిందికి దిగి వచ్చేస్తామనీ అన్నారు కాని జవాన్లు వినలేదు.ఆ జనం ఎటుపడితే అటు పారిపోవడం మొదలుపెట్టారు. వారిలో కొద్ది మంది తప్పించుకోగా ముగ్గురు తూటాలు తగిలి అక్కడే పడిపోయారు. ఇద్దరు అప్పటికప్పుడే చనిపోయారు. మూడవ అతను చాలాసేపు ప్రాణంతో ఉండి గట్టిగా అరుస్తూ ఉన్నారు. వారి పేర్లు విజయ్ కుమార్, రాకేష్ శర్మ. హక్మద్దీన్ ఉరఫ్ మహ్మద్ షరీఫ్.

ముఖ్యమైన విషయం ఏమిటంటే జనం ఆ తరువాత గొడవచేయగా సైన్యం ఈ ఘటనకు వేరే చిత్రం ఇచ్చింది. చనిపోయిన ముగ్గురూ మిలిటెంట్ల మీద పోరాటం చేసి దేశభద్రత కోసం ప్రాణాలర్పించారు. కాబట్టి వారి కుటుంబాలకు ఏదో ఒక పతకం లభిస్తుంది అని ప్రకటించారు. ప్రకటించడమే కాక తాము నిష్కారణంగా ప్రాణం తీసిన హిందువులైన ఇద్దరి కోసం అంటే విజయ్ కుమార్, రాకేష్ శర్మల కోసం ఒక చిన్న స్థూపం కూడా సైన్యం నిర్మించింది. మరి చచ్చిపోయింది ముగ్గురు. మూడవ వ్యక్తి ముస్లిం. అతడికి ఎందుకు నిర్మించలేదు అన్న ప్రశ్నకు జవాబులేదు. శౌర్య పతకమేదో వస్తుంది అని ఆశ చూపించి విజయ్ కుమార్, రాకేష్ శర్మల కుటుంబాలు చేస్తున్న ఆందోళనను చల్లార్చగలిగారు గానీ ఆ తరువాత జనవరి 26 వచ్చింది, పోయింది. మళ్ళీ ఆగస్టు 15 వచ్చింది పోయింది. ఎటువంటి పతకమూ రాకపోయేసరికి వారు ఆందోళన చేయసాగారు. ముఖ్యంగా విజయ్‌కుమార్ తండ్రి రూప్‌లాల్ రాష్ట్ర మానవహక్కుల కమిటీకి, మానవహక్కుల బృందానికి సుదీర్ఘమైన వినతిపత్రాలు సమర్పించి తన కుమారుని హత్య విషయంలో న్యాయం చేయాలని కోరుతున్నాడు. మళ్లీ ఇక్కడ చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఘటన జరిగింది పిడిపి – కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే అయినప్పటికి మృతుల తండ్రులు చేస్తున్న ఆందోళన కొనసాగింది పిడిపి – కాంగ్రెస్ పరిపాలనలో, కాని ఏ రకమైన స్పందన లేదు.

## సరి'హద్దు'లు

ఇక సరిహద్దు ప్రజల సమస్యలు పరిశీలిద్దాం. భారత్‌కు పాకిస్తాన్‌తో సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. కొన్ని లక్షల కుటుంబాలు ఈ సరిహద్దు వెంబడి నివసిస్తున్నాయి. శౌర్య పరాక్రమాల్ని గొప్పగా కొనియాడే దేశభక్తి ఈ ప్రజల కళ్ళలో యుద్ధాన్ని ఎప్పుడూ చూడలేదు. అప్పుడే యుద్ధం అసలు భావం తెలుస్తుంది. దేశ విభజన జరిగినప్పుడు, అంటే 1947లో ఈ సరిహద్దు సమీపంలో నివసించిన వాళ్ళు ఏమి అనుభవించారో కొంతమేరకు సాహిత్యం ద్వారా మనం తెలుసుకున్నాం. కాని 1965 యుద్ధం సమయంలో, 1971 యుద్ధం సమయంలో వారు ఏమి అనుభవించారో ఎవరికీ తెలియదు. 1989లో కశ్మీర్ లోయలో మిలిటెన్సీ పెరిగిన తరువాత ఈ సరిహద్దు ప్రజల వెతలు పెరిగాయి. దాదాపుగా వాళ్ళు ఒక టెర్రర్‌లో జీవిస్తున్నారని చెప్పవచ్చు. 1999 కార్గిల్ యుద్ధం పరిస్థితిని మరింత దిగజార్చింది. 2001, డిసెంబర్ 13నాడు భారత పార్లమెంట్‌పైన దాడి జరిగిన తరువాత భారత ప్రభుత్వం ఏడు లక్షల సైన్యాన్ని భారత సరిహద్దుపై మోహరించింది. దాదాపు 10 నెలలపాటు ఈ మోహరింపు సాగింది. ఆ దశలో సరిహద్దు ప్రజలు అనుభవించిన తీవ్రమైన కష్టాల నుండి 2003 వేసవి నాటికి అప్పుడప్పుడే కోలుకుంటున్నారు. మన దేశంలోని రాజకీయ నాయకులు, అవతల పాకిస్తాన్ రాజకీయ నాయకులు, యుద్ధాన్ని గురించి తరచుగా మాట్లాడే వీరోచితమైన మాటలు సరిహద్దు గ్రామాలలో ఏ విధంగా ధ్వనిస్తాయో తెలిస్తే బహుశా సిగ్గుపడుతారేమో!

గుజరాత్‌తో మొదలై రాజస్తాన్, పంజాబ్‌ల ద్వారా, జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని జమ్మూ జిల్లాలోని అఖ్నూల్ తాలూకాకు చెందిన పల్లన్‌వాలా గ్రామం దాకా ఈ సరిహద్దు ఇరుదేశాలు ఒప్పుకుని కంచె నిర్మించుకున్న అంతర్జాతీయ సరిహద్దు. ఇది ఎక్కువగా మైదాన ప్రాంతాలలో ఉంది. మిలిటెంట్ల చొరబాటుకు అంతగా ఉపయోగపడదు. ఆ కారణంగా యుద్ధ సమయాలప్పుడు తప్ప ఈ సరిహద్దు వెంబడి భారత సైన్యమైనా, పాకిస్తాన్ సైన్యమైనా మందుపాతరలు పెట్టడం జరుగదు. యుద్ధం అయిపోయిన తరువాత మందుపాతరలను తరచుగా తొలగించివేస్తారు. యుద్ధ సమయంలో తప్ప ఈ సరిహద్దు వద్ద ఇరుదేశాల సైనికులు కాల్పులు పెద్దగా జరుపుకోరు. కాబట్టి యుద్ధమున్నప్పుడు తప్ప ఈ సరిహద్దు వెంబడి నివసించడం మరీ అంత సమస్యాత్మకం కాదు. అయితే 2001 డిసెంబర్ 13 తరువాత 10 నెలల పాటు సైన్యాన్ని మోహరించిన కాలంలో యుద్ధ సమయంలో అనుభవించినన్ని కష్టాలూ ఈ ప్రజలు అనుభవించారు. యుద్ధ సమయమప్పుడు కానీ డిసెంబర్ 13 తరువాత గానీ జరిగేదేమిటంటే రెండువైపుల నుంచి సైనికులు మందుగుండు తూటాలు పేలుస్తూ ఉంటారు. ఇళ్లు ధ్వంసం అవుతూఉంటాయి. ప్రజల ప్రాణాలూ పశువుల ప్రాణాలూ పోతూ ఉంటాయి. అందువల్ల ప్రజలు మూటలు సర్దుకుని తమ ఇళ్ళనూ, పొలాలనూ, పశువులనూ విడిచిపెట్టి దేశం

లోతట్టు భాగానికి వలస పోవలసి ఉంటుంది. చిన్న, చితక వ్యాపారాలు ఏమన్నా ఉంటే వాటిని వదులుకోవాల్సి ఉంటుంది. పిల్లల చదువులను పాడుచేసుకోవాల్సి ఉంటుంది. 2001 డిసెంబర్ 13 తరువాత జరిగిన సైన్యం మోహరింపు కాలంలో ఒక్క జమ్మూ జిల్లాలోనే 28,000 కుటుంబాలు సరిహద్దు లోపలికి వచ్చాయి అని అధికార గణాంకాలే చెబుతున్నాయి. వారికి రాష్ట్ర ప్రభుత్వం చిన్న చిన్న టెంట్లు ఎక్కడ చోటు దొరికితే అక్కడ వేసింది.సరిహద్దు ప్రాంతాల వారందరికీ కూడా ఆ రకమైన పునరావాసం కల్పించినట్టు రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటుంది. కానీ అందరికి ఆ వసతి కల్పించలేదు. రాజోరి జిల్లాలో మూడవ వంతు నిర్వాసితులకు, జమ్మూ జిల్లాలో కేవలం సగం మంది నిర్వాసితులకు వసతి కల్పించడం జరిగింది. ఇది కూడా అంతా రాష్ట్ర ప్రభుత్వం చేసింది కాదు. 'ఆక్స్‌ఫామ్' 'రెడ్‌క్రాస్' వంటి సంస్థలు సహాయం చెయ్యబట్టే ఈ మాత్రమైనా జరిగింది. పునరావాసానికి నివాసం కల్పించినా, కల్పించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం వారికి కొంత సహాయం అందించింది. తలసరి నెలకు 2 కిలోల బియ్యము 9 కిలోల గోధుమపిండి, నాలుగు వందల రూపాయల నగదు (కుటుంబానికి 1600 రూ॥లు మించకుండా) ఇచ్చింది. వేరే ఎంతో కొంత సంపాదించుకోకపోతే ఇది ఏ మాత్రం చాలదనేది స్పష్టం. అయితే ఈ కాందీశీకులు తమ పరిస్థితిని 1989 నుండి కాందిశీకులుగా ఉన్న కశ్మీర్ పండిట్ల పరిస్థితితో పోల్చుకుంటారు. కశ్మీర్ పండిట్లకు తలసరి 5 కిలోల బియ్యము 11 కిలోల గోధుమపిండి నెలకు కుటుంబానికి 3000 రూపాయలు ఇస్తున్నారు. ఏ అధికారీ కూడా ఈ వివక్షకు కారణం ఏమిటో చెప్పలేకపోయారు. అయితే నిర్వాసితులతో మాట్లాడితే సగం నవ్వుతూ, సగం కోపంగా వారి వివరణ వారే ఇస్తున్నారు. పండిట్లు క్లాస్ 'ఎ' నిర్వాసితులని, తాము క్లాస్ 'బి' అని, వారు తెల్లవారని తాము నల్లవారమని వెక్కిరింతగా వారంటున్నారు.

డిసెంబర్ 13 తర్వాత జరిగిన సైన్యం మోహరింపును వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం 2002 అక్టోబర్‌లో నిర్ణయించుకున్న తర్వాత నిర్వాసితులందరిని కూడా తిరిగి సరిహద్దు వద్దకు పొమ్మని చెప్పింది. సైన్యం సరిహద్దు వెంబడి పెట్టిన మందుపాతరలను తొలగించే కార్యక్రమం మొదలుపెట్టింది. అది పూర్తికాగానే వెనక్కి పొమ్మని చెప్పింది. పంజాబ్‌లో, రాజస్తాన్‌లో, సరిహద్దు వెంబడి పరిస్థితి జమ్మూ కశ్మీర్ అంత తీవ్రం కాదు కాబట్టి చాలా మంది జనం వెనక్కి వెళ్ళిపోయారు. కాని జమ్మూలో అంతర్జాతీయ సరిహద్దు దగ్గర నివసిస్తున్న ప్రజలు వెనక్కి పోవడానికి పెద్దగా ఇష్టపడలేదు. ఎందుకంటే ఈ శాంతి ఎక్కువ కాలం ఉంటుందని వారు నమ్మలేదు. ఈ రెండు దేశాలు ఎప్పటికీ యుద్ధాన్ని మానుకోవనీ తమ జీవితాలకు శాంతి ఉండదనీ ఎక్కడో అక్కడ రాష్ట్రంలో ఇంత భూమి ఇస్తే అక్కడే స్థిరపడాలనీ వారు అనుకుంటున్నారు. ఈ రెండు దేశాల నాయకులూ సవాళ్ళు విసురుకోవడం ఇతరులకు ఏ విధంగా కనిపిస్తుందో కాని ఈ ప్రజలకు మాత్రం చిన్న పిల్లల చేష్టలా కనిపిస్తుంది. రైతులు మామూలుగా వ్యవసాయం చేసేటప్పుడు వాతావరణం మీద ఓ కన్నువేసి చేస్తారు. మేము దక్షిణ

ఆసియా రాజకీయ వాతావరణం మీద కూడా ఓ కన్నువేసి చెయ్యాలి' అని నవ్వుతూ వారు అంటారు. అయితే ప్రభుత్వం మాత్రం వారిని తిరిగి వెనకకు పంపే ప్రయత్నమే చేస్తూ ఉండింది. తిరిగి వెనక్కిపోతేనే వారికిస్తున్న రేషన్ ఇవ్వడం కొనసాగుతుంది అని ఒత్తిడి పెట్టింది. వాళ్ళు వెనక్కి పోవడానికి ఇష్టపడకపోవడానికి మరొక కారణం ఏమిటి అంటే దాదాపు 10 నెలలు ఇళ్ళు, పొలాలను విడిచిపెట్టి వచ్చేశారు కాబట్టి ఆ ఇళ్ళు చాలా వరకు పాడుపడిపోయి ఉన్నాయి. అవతలివైపు నుంచి వచ్చిన మందుగుండు తూటాల దెబ్బకు కొన్ని కూలిపోయి ఉన్నాయి. పొలాల నిండా కలుపు మొక్కలు మొలిచి ఉన్నాయి. అందువల్ల వెనక్కి పోతే తిరిగి మళ్ళీ నివాసం, భూమి రెండింటినీ యోగ్యం చేసుకోవడానికి చాలా ఖర్చు అవుతుంది అని వారి భయం. జమ్మూ ప్రాంతంలోని జమ్మూ, రాజోరి, పూంచ్ డిప్యూటీ కమీషనర్లు ఈ విషయంలో ఏమన్నారంటే తిరిగి మళ్ళీ ఇళ్ళు కట్టుకోవడానికి, పొలాలు బాగు చేసుకోవడానికి అప్పు యిచ్చే ఉద్దేశంలో ప్రభుత్వం ఉన్నది అని. అయితే సరిహద్దు వెంబడి ఏ నిర్మాణం చేపట్టాలన్నా కేంద్ర ప్రభుత్వం అనుమతి కావాలి. కాబట్టి కేంద్ర ప్రభుత్వం అనుమతికి రాశామని వారన్నారు. అంతే తప్ప రాష్ట్రం లోపల వారికి పునరావాసం కల్పించే ప్రసక్తే లేదని వారన్నారు.

ఇది అంతర్జాతీయ సరిహద్దు వద్దనున్న పరిస్థితి, అయితే అఖ్నూర్ తాలూకాలోని పల్లన్‌వాలా దగ్గర మొదలుపెట్టి దాదాపు 940 కిలోమీటర్లు అడవుల్లో కొండల్లో మంచులో ప్రయాణించి కశ్మీర్‌లోయ దాటి కార్గిల్ దాకా సాగేటటువంటి వాస్తవాధీనరేఖ వెంబడి పరిస్థితి మరింత అధ్వాన్నం. వాస్తవాధీనరేఖ మొదలయ్యే దగ్గరే కొండలు మొదలవుతాయి. కార్గిల్‌వైపు పోయేకొద్ది మరింత పెద్దవవుతాయి. నేల ఎగుడుదిగుడుగా ఉంటుంది. దట్టమైన అడవులతో నిండి ఉంటుంది. ఇది వివాదాస్పదమైన సరిహద్దు కాబట్టి ఈ సరిహద్దు వెంబడి కంచెవేసే ఆలోచనకు అర్థం ఉండదు. భారత్ మాత్రం వేస్తానని అంటున్నప్పటికీ నిజానికి సరిహద్దును కొంచెం ఇటు, కొంచెం అటు నెట్టాలని రెండు సైన్యాలూ ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాయి. అందువల్ల అంతర్జాతీయ సరిహద్దు వద్ద కేవలం యుద్ధమప్పుడు కాల్పులు జరుగుతుండగా వాస్తవాధీనరేఖ వద్ద ఎప్పుడూ కాల్పులు జరుగుతూనే ఉంటాయి. పైగా మిలిటెంట్ల చొరబాటుకు వాస్తవాధీనరేఖ ప్రధానమైన క్షేత్రం కావడం వల్ల మిలిటెంట్లను లోపలికి ప్రవేశింప చేయడానికి పాకిస్తాన్ సైన్యం అటువైపు నుండి భారత సరిహద్దుసైన్యంపైన కాల్పులు జరుపుతుండగా, మిలిటెంట్లు రాకుండా చూడటానికి భారత బలగాలు కాల్పులు జరుపుతూ ఉంటారు. కేవలం రైఫిళ్లతోనే కాల్పులు జరుపుతున్నట్లయితే సరిహద్దు సమీపంలో నివసించే ప్రజానీకానికి అంత

ఇబ్బంది ఉండకపోయేది కానీ బోఫోర్స్‌వంటి పెద్ద పెద్ద గన్నులతో కూడా కాల్పులు జరుపుతూ ఉంటారు. ఇది ప్రజలకు, పశువులకు, ఇళ్లకు చాలా నష్టం చేస్తుంది. కాగా, అంతర్జాతీయ సరిహద్దు విడిచిపెట్టి వాస్తవాధీనరేఖను చేరుకుని ఇంకా ముందుకు పోయేకొద్దీ జనాభా యొక్క మతపరమైన గుర్తింపు కూడా మారుతుంది. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఉండేది ప్రధానంగా హిందువులు కాగా వాస్తవాధీనరేఖ ముందుకు పోయేకొద్దీ జనాభాలో ముస్లిం శాతం పెరుగుతుంది. పూంచ్ దాటిన తరువాత దాదాపు అందరూ ముస్లింలే. ఏ మతమైనప్పటికీ సరిహద్దు ప్రాంతంలో నివసించే ప్రజానీకాన్ని సైన్యం తన విధి నిర్వహణకు అడ్డమొచ్చే న్యూసెన్స్‌గా చూస్తుంది. అయితే వాళ్ళు ముస్లింలయితే కేవలం న్యూసెన్సుగానే కాకుండా శత్రువుకు సహకరించగల అనుమానాస్పద వ్యక్తులుగా కూడా కనిపిస్తారు. అటువంటప్పుడు వారి సమస్యలు మరింతగా పట్టరానివి అవుతాయి.

ఈ ప్రజల ప్రధానమైన సమస్యలు వాస్తవాధీనరేఖకు ఇరువైపుల నుంచి నిరంతరం జరిగే ఫిరంగుల కాల్పులు, వాస్తవాధీనరేఖ వెంబడి అమర్చి మందు పాతర్లు, ఈ మందుపాతర్లు మొదటి నుంచి కూడా ఉన్నాయి కాని 1989లో కశ్మీర్‌లో మిలిటెన్సీ పెరిగిన తరువాత మందుపాతర్లు పెరిగాయి. 1999లో కార్గిల్ యుద్ధం తరువాత ఇంకా పెరిగాయి. 2001, డిసెంబర్ 13 తరువాత ఇంకా ఇంకా పెరిగాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంబడి అవసరం తీరిపోయిన తరువాత మందుపాతర్లు తొలగించడం జరుగుతుంది. కాని వాస్తవాధీనరేఖ వెంబడి ఉన్న వాటిని తొలగించడం ఎప్పటికీ జరుగదు. మందుపాతర్ల ప్రధాన ఉద్దేశం మిలిటెంట్ల చొరబాటును అడ్డుకోవడం కనుక వాటిని తొలగించే ఆలోచన భారత ప్రభుత్వం చేయదు. ఆ అవసరాన్ని మించిన అవసరం భారత ప్రభుత్వం దృష్టిలో కశ్మీర్‌లో వేరే ఏదీ లేదు. వాస్తవాధీనరేఖ వద్ద ఉన్న కొండచరియల్లోని మట్టి వర్షంలో తరుచుగా జారుతూ ఉంటుంది. కాబట్టి ఈ మందుపాతరలు అమర్చిన చోట ఉండవు. వాటి స్థలం మారుతూ ఉంటుంది. సైనిక బలగాల ఉన్నతస్థాయి అధికారులు సైతం మందుపాతరలు ఎక్కడున్నాయో సైన్యానికి తెలియదు అని విలేకరుల వద్ద ఒప్పుకుంటారు. దీని వల్ల ఏం జరుగుతుంది అంటే సాధారణ ప్రజలు తరచుగా తమకే తెలియకుండా మందుపాతర్ల మీద కాలుపెడుతూ ఉంటారు. అవి పేలి ప్రాణమో, అవయవాలో పోతూ ఉంటాయి. సరిహద్దు దగ్గర జరిగే సైనిక బలగాల ఎదురుకాల్పుల్లో పౌరులు ఎవరన్నా చనిపోతే కొంత నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుంది కాబట్టి ఆ జాబితా ప్రభుత్వం దగ్గర దొరుకుతుంది. కాని మందుపాతరల విషయంలో అటువంటి జాబితా కూడా లేదు. ఎందుకంటే చాలా

కాలం పాటు వారికి ఏ నష్టపరిహారము ఇచ్చేవారు కాదు. దానికి ప్రభుత్వం చూపిన కారణం ఏమిటంటే మందుపాతరలు ఉన్నచోటికి ఎవరు పొమ్మన్నారు వాళ్ళను? పోవడం వాళ్ళ తప్పు కాబట్టి ప్రాణం పోయినా, అవయవాలు పోయినా ప్రభుత్వం బాధ్యత లేదు అని. అయితే తన సైనిక బలగాలకే, సైనిక అధికారులకే అవి ఎక్కడున్నాయో తెలియనప్పుడు వీళ్ళ మీద నెపం పెట్టడంలో అర్థం లేదు. ఈ మధ్యకాలంలో మాత్రమే అంటే 2003 సంవత్సరం నుండి మాత్రమే కొంత నష్టపరిహారం నామమాత్రంగా ఇస్తున్నారు. సరిహద్దు ఎదురు కాల్పుల్లో చనిపోయే పౌరులకు ఇచ్చే నష్టపరిహారంలో పదవవంతు మాత్రమే మందుపాతర్ల బాధితులకు ఇస్తున్నారు. సరిహద్దు వద్ద తుపాకీ కాల్పుల్లో చనిపోయేవారు పాకిస్తాన్ సైన్యం చేతిలో చనిపోతున్నారు కాబట్టి వారి చావు ఒక రకమైనది, మందుపాతర పేలి చనిపోయే వాళ్ళు భారత సైన్యం పెట్టిన మందుపాతర పేలడం వల్ల చనిపోతున్నారు కాబట్టి వారి చావు తక్కువది అని అనుకోవాలేమో.

ప్రభుత్వం దగ్గర సరైన గణాంకాలు లేక పోయినప్పటికి పూంచ్ నివాసి అయిన డా॥ జగ్బీర్ సింగ్ అనే ఒక సామాజిక కార్యకర్త దగ్గర చాలా సమాచారం ఉంది. ఇతను ప్రీతం ట్రస్ట్ అనే సేవా సంస్థ పెట్టుకుని అసాధారణమైన సేవ చేస్తున్నాడు. అతను ఏమంటాడంటే వాస్తవాధీనరేఖ వద్ద జరిగే ప్రాణనష్టం, అవయవాల నష్టం, ఎక్కువభాగం మందుపాతర పేలడం వల్లనే జరుగుతాయి. సరిహద్దు ఎదురు కాల్పుల్లో చనిపోవడం రెండవ కారణమని, మిలిటెంట్ల చేతుల్లో చనిపోవడం మూడవదని అంటాడు.

ఇది జమ్మూ ప్రాంతంలోని రజోరి, పూంచ్ జిల్లాల విషయమే కాదు. కశ్మీర్ లోయలో సహితం సరిహద్దు గ్రామాల్లో మందుపాతరలు పేలడం వల్ల అవయవాలు, ప్రాణాలు కోల్పోయిన వారే ఎక్కువ. డా॥ జగ్బీర్‌సింగ్ ఒక ఉదంతం చెప్తాడు. కశ్మీర్‌లోని కుప్వారాలో జిల్లాలో లాంగేట్ అనే ఒక చిన్న గ్రామంలో ఒకరోజు అతను వికలాంగులకు అవసరమైన పరికరాలు ఇవ్వడానికి పోయాడు. ఆ గ్రామంలో మూడువందల మంది వికలాంగులు ఉన్నారని, తాను 61 మందికి చేతికర్రలు, 41 మందికి మూడు చక్రాల బండ్లు ఇచ్చానని చెప్పాడు. అంత అసాధారణ స్థాయిలో వికలాంగులున్నారంటే సరిహద్దు వెంబడి మందుపాతరల ప్రమాదం ఎంత ఉందో అర్థమవుతుంది. రజోరి జిల్లా డిప్యూటీ కమీషనర్ మానవహక్కుల బృందంతో మాట్లాడుతూ ఇటువంటి విషయమే చెప్పాడు. తన విధులలో భాగంగా ఒకరోజు నౌషెరా తాలూకాలోని కొన్ని సరిహద్దు గ్రామాలలో వికలాంగులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి పోయినపుడు ఒక్కొక్క కుటుంబంలోనూ ఇద్దరు ముగ్గురు వికలాంగులుండడం చూసి ఎందువల్ల వికలాంగులయ్యారు అంటే మందుపాతర్ల వల్లే అని కుటుంబ సభ్యులు చెప్పారని చెప్పాడు. మనుషుల పరిస్థితే

ఇదయితే ఇక పశువుల సంగతి చెప్పనక్కరలేదు. ఎవర్నడిగినా వేలాదిగా చనిపోయారని చెప్తూ ఉంటారు. వీటి లెక్క తేలదు, ఎందుకంటే మనుషులకు నష్టపరిహారం ఇవ్వడం ఈ మధ్యే కొంత మొదలయ్యింది కాని పశువులకు ఇప్పటి వరకు ఇవ్వడం లేదు. దానికి కారణం ఏం చెప్తున్నారు అంటే ఆ పశువుల యజమాని ఎవరో గుర్తించడం సాధ్యం కాదు కాబట్టి అని. మొదట్లో ప్రజలు పశువు చనిపోయినా అంగవైకల్యం ఏర్పడినా అది మందు పాతరల వల్ల అయితే నష్టపరిహారం కోరే ప్రయత్నం చేసినట్టున్నారు కానీ, ప్రభుత్వ అధికారుల వద్దకు పోతే ఆ పశువు నిజంగానే చనిపోయిందని పశువుల డాక్టర్ సర్టిఫికెట్ పెట్టమని, అది మందు పాతర వల్లనే చనిపోయిందని ఎస్ఐ సర్టిఫికెట్ పెట్టమని, దాని యజమాని ఈ ఫిర్యాదుదారుడే అని సర్పంచ్ సర్టిఫికెట్ అవసరమని అడిగేటప్పటికి మానుకున్నారు.

సరిహద్దు వెంబడి కానీ మిగతా ప్రాంతాల్లో కానీ, మనుషులు లేక ఏవైన బండ్లు మీది నుండి పోయినపుడు ఒత్తిడికి పేలే మందుపాతర్లు పెట్టకుండా నివారించే ప్రయత్నం ఒకటి అంతర్జాతీయంగా జరుగుతున్నది. ఈ రకమైన మందుపాతరలను ఇంగ్లీషులో ఆంటీపర్సానెల్ మైన్స్ అంటారు. అంటే ఇవి ఒకరు శత్రువును గుర్తుపట్టి పేల్చే మందుపాతరలు కావు. నేలలో ఉంటాయి, ఒత్తిడికి పేలుతాయి. అటువంటివి నిరాయుధ పౌరుల్ని చంపే ప్రమాదం ఉంది కాబట్టి 1996 మే 3వ తేదీన ఐక్యరాజ్యసమితి ఇటువంటి మందుపాతర్ల వినియోగాన్ని, నిషేధించాలి లేదా తగ్గించాలి అనే ఒడంబడిక ఒకటి రూపొందించింది. దీనిని మందుపాతర నిషేధ ఒడంబడిక అని క్లుప్తంగా అంటారు. 2003 మే నాటికి 147 దేశాలు దీనిపైన సంతకం చేశాయి. అందులో 134 దేశాలు తమ చట్టసభల్లో దాన్ని ఆమోదించాయి. దాన్ని ఆమోదించని, సంతకం చేయని కొద్ది దేశాలలో భారత్ ఒకటి. మనతోపాటు అమెరికా కూడా ఉంది. పాకిస్తాన్ కూడా మన సరసనే ఉంది కాని మన మరొక పొరుగుదేశం బంగ్లాదేశ్ దానిపై సంతకమూ చేసింది, తన చట్టసభలో దాన్ని ఆమోదించింది కూడా. వాస్తవాధీనరేఖ వెంబడి నివసించే లక్షలాది కుటుంబాలకు భారతదేశం ఈ మందుపాతర నిషేధ ఒడంబడికపై సంతకం చేయడం జీవన్మరణ సమస్య. ఎందుకంటే ఎక్కువగా ఈ మందుపాతరల వల్ల అపాయానికి గురయింది సరిహద్దు వెంబడి పశువుల్ని పోషించుకుంటూ బ్రతికే గుజర్, బకర్వాల్ తెగల జనం వారి నివాస స్థలమే అది. యుద్ధమొచ్చిందనో, సరిహద్దు వెంబడి కాల్పులు జరుగుతున్నాయనో సైన్యం మందుపాతర్లు పెడితే వేరే ఎక్కడికి పోదామన్నా వారికి వేరే ప్రదేశమేదీ లేదు. వారి గురించి మాట్లాడటానికి సంఘాలు లేవు. వారి వార్తలు రాసే పత్రికలూ లేవు. కశ్మీరుకు తరుచుగా పోయే మానవహక్కుల బృందాలు కూడా వారిని కలవడం చాలా కష్టం. ఎందుకంటే వారు నివసించేది ప్రమాదకరమైన కొండ ప్రాంతాలలో, ఎవరో చెప్పగా విన్నది, చూడగా చెప్పేది తెలుసుకుని వారి పరిస్థితిని గుర్తించాల్సి ఉంటుంది. ఆజాద్ కశ్మీర్ నుండి పీర్‌పంజర్ కొండల మీదుగా జమ్మూలోనికి ప్రవేశించే మిలిటెంట్లతోను, వారి కోసం వెతుకుతున్న సైన్యంతోను ఈ పశువుల కాపర్లు

తలపడవలసి వస్తుంది. వీరికో వారికో తప్పనిసరిగా సహాయం చేయవలసి ఉంటుంది. ఎవరికి సహాయం చేసినా అవతలి వాళ్లతో ప్రాణాపాయాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. మిలిటెంట్ల చేతిలోనూ జవాన్ల చేతిలోనూ చావకపోతే, ఏదో ఒక రోజు ఒక మందుపాతర మీద కాలుపెట్టి తామో తమ పశువులో చనిపోవాల్సి ఉంటుంది. ఈ చావులు మాత్రమే కాదు. ఈ పశువుల కాపరుల వలస కూడా ఒక వార్తే కాదు. పూంచ్‌జిల్లా డిప్యూటీ కమీషనర్, డిసెంబర్ 13, 2001 తరువాత జరిగిన సైన్యం మోహరింపు కాలంలో ఆ జిల్లాలో 22 వేల మంది వాస్తవాధీనరేఖ వెంబడి ఉన్న ముప్పై గ్రామాల నుంచి నిర్వాసితులయ్యారని చెప్పాడు. రజోరి జిల్లాలో 10161 మంది నిర్వాసితులయ్యారు. అయితే ఇది స్థిర నివాస గ్రామాల నుండి ఒక పద్ధతి ప్రకారం జరిగిన తొలగింపు కాబట్టి ఈ గణాంకాలన్నీ ఉన్నాయి. సైన్యం చాలా తరుచుగా కొండలమీద గాలింపు చర్యలు చేపట్టేటప్పుడు గుజర్, బకర్‌వాల్ పశువుల కాపరులను అక్కడి నుంచి వెళ్ళిపొమ్మంటూ ఉంటుంది. మళ్ళీ తిరిగి వాళ్ళను రానిచ్చేంత వరకు వారు వేరే ప్రాంతానికి పోవాలి. దీని గురించి సమాచారం లేదు. గణాంకాలు లేవు. దీని వల్ల ఆ పశువుల కాపరులు ఎంత నష్టపోయారో అనే విషయం కూడా ఎవరికీ తెలియదు. డిసెంబర్ 13 తరువాత పరిస్థితి ఈ కోణం నుంచి చాలా అధ్వాన్నమైంది. 2003 సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో పీర్‌పంజల్ కొండల మీద గుడారాలు వేసుకున్నట్టి మిలిటెంట్లను పెద్ద సంఖ్యలో మట్టుబెట్టినట్టు సైన్యం చెప్పుకుంది. దాదాపు 60 మంది మిలిటెంట్లను చంపేసి వాళ్ళ గుడారాలను ధ్వంసం చేసినట్టు చెప్పుకుంది. ఈ క్రమంలో ఆ కొండలమీద నివసించే గుజర్, బకర్‌వాల్‌లను సైన్యం విపరీతంగా హింసించింది. తాను కొండల మీదికి ఎక్కడానికి తన మూటలను వారి చేత మోయించింది. టెంట్లు వాళ్ళచేత వేయించింది. మరొకవైపు మిలిటెంట్లు కూడా సైన్యంతో సహకరిస్తున్నారు అనే సాకుతో ఇదే గుజర్, బకర్‌వాల్ తెగ ప్రజలను విపరీతమైన హింసకు గురిచేస్తూ ఉంటారు. చంపడం మాత్రమే కాకుండా తాము అనుమానించే మగవాడు దొరకకపోతే ఇంట్లో స్త్రీల ముక్కులు కోసివేయడం, చెవులు కోసివేయడం కూడా జరుగుతూ ఉంటుంది. అయితే పండిట్లు, బహుశా వారు హిందువుల, బ్రాహ్మణులు కావడం వల్ల, అనుభవించే సమస్య చర్చకు వస్తూ ఉంటుంది కానీ ఈ గుజర్ బకర్‌వాల్‌లు పండిట్లతో సమానంగా అంతకంటే ఎక్కువగా, తమ నివాస ప్రాంతాల నుంచి తొలగింపుకు తరుచుగా గురౌతూ ఉన్నా వారు ముస్లింలు కావడం వల్ల, సంచార జీవులు కావడం వల్ల, వారి విషయం ఎవరికీ తెలియదు. మాట్లాడేవారు ఎవరూ లేరు.

మిలిటెంట్ల చర్యలు సైనికాధికార్లకు, సైనికాధికార్ల చర్యలు మిలిటెంట్లకు తమ తమ వ్యూహాలను ఎత్తుగడలనూ సమర్థించుకోవడానికి ఉపయోగించే వైనం మొదటి నుంచీ ఉన్నది. పిడిపి - కాంగ్రెస్ ప్రభుత్వం సైన్యం అత్యాచారాలను అదుపుచేసే విషయంలో ఎంత నిబద్ధతతో ఉందోగాని, వారు ఏ కొంచెం ప్రయత్నం చేయాలని అనుకున్నారో అదంతా కూడా 2003 సంవత్సరం మార్చి 23,24 తేదీల మధ్య రాత్రి పుల్వామా

జిల్లా షోపయ్యా తాలూకాలోని నదీమార్గ్ గ్రామంలో మిలిటెంట్లు 24 మంది పండిట్లను చంపడంతో వెనుకడుగు వేసింది. నిజానికి కశ్మీర్‌లో చాలా మంది నమ్మే విషయం ఏమిటంటే పిడిపి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చిన తరువాత వారు చర్యను తీసుకుంటారనే భయంతో పోలీసులు, సైన్యమూ నిర్బంధం ప్రయోగించే విషయంలో కొంచెం వెనక్కి తగ్గారు. సాధారణ పౌరులపై అత్యాచారాలు తగ్గాయి. కాని నదీమార్గ్ ఊచకోత సైన్యానికి పిడిపి-కాంగ్రెస్ ప్రభుత్వం మీద నిందవేసే అవకాశం ఇచ్చింది. ఆ ప్రభుత్వం మిలిటెంట్ల పట్ల సానుకూలంగా ఉండటం వల్ల వారు పేట్రేగిపోయారని సైన్యమూ ఆరోపించింది. కేంద్ర హోం మంత్రి ఎల్.కె.అద్వానీ కూడా ఆరోపించారు. ఆ తరువాత సైన్యాన్ని ఏ కొంచెం కూడా అదుపుచేయడం సాధ్యం కాలేదని పిడిపి అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ బహిరంగంగానే అన్నారు.

మొత్తం కశ్మీర్ లోయలో పండిట్లు మాత్రమే నివసించిన ఏకైక గ్రామం నదీమార్గ్ అని అంటారు. ఒకప్పుడు 60 కుటుంబాలు ఉండేవట ఆ గ్రామంలో. మిలిటెన్సీ మొదలై పండిట్లు లోయ విడిచి బయటికి పోవడం మొదలైన తరువాత 49 కుటుంబాలు వెళ్లిపోయి 11 మాత్రం మిగిలాయి. అది కేవలం పండిట్లు మాత్రమే ఉండే గ్రామం కావడం వల్ల ఏ రోజైనా దాడి జరుగొచ్చునేమో అనే సందేహంతో ఒక పోలీస్ పికెట్ ఆ గ్రామంలో ఉంచడం జరిగింది. కాని వాళ్ళకు ఖచ్చితంగా ప్రతీ రాత్రీ అక్కడే ఉండాలనీ పహారా వదిలిపెట్టకూడదనీ ఆదేశాలేమీ లేవు. అంతేకాకుండా 23,24 మధ్య రాత్రి జరిగిన ఘటనకు కొంత ముందు ఆ గ్రామం పరిసరాల్లో అనుమానాస్పదమైన సంచారాలు గ్రామస్తులకు కనిపించి వారు పుల్వామా, అనంత్‌నాగ్ జిల్లాల డిప్యూటీ కమీషనర్లకు ఫిర్యాదు కూడా చేశారు. ఆ గ్రామం ఉండేది పుల్వామా జిల్లాలో అయినప్పటికి అనంత్‌నాగ్ సరిహద్దుమీద ఉంటుంది. ఆ ఫిర్యాదును అధికారులు సీరియస్‌గా తీసుకుని పోలీస్ పికెట్ సంఖ్య పెంచినా లేక పోలీసులకు ఖచ్చితమైన ఆదేశాలిచ్చినా కొంత మెరుగ్గా ఉండేదేమో. వారు ఆ పనేమి చేయలేదు.

23 మార్చి రాత్రి 11 తరువాత సైన్యం యూనిఫారాలు వేసుకున్న మిలిటెంట్లు గ్రామంలోకి ప్రవేశించి సోదా జరుగుతూ ఉంది అని చెప్పి జనాన్ని బయటకు రమ్మన్నారు.ఇది ఎప్పుడూ జరుగుతూ ఉండేదే కాబట్టి జనం లేచి తలుపులు తెరచి బయటకు వచ్చారు. కాని ఆ సాయుధులు ఇళ్ళలోకి వెళ్లి బీరువాలు పగులగొట్టి డబ్బులు, నగలు తీసుకోవడం మొదలుపెట్టారు. జనాన్ని పోగుచేసి గ్రామం మధ్యలో ఉన్నటువంటి ఒక చినార్ వృక్షం కింద నిలబడమన్నారు.అప్పటికే అనుమానం వచ్చిన కొందరు తప్పించుకుని పారిపోగా 23 మంది మిగిలారు. వారందరిని కూడా కాల్చి చంపారు. దాంట్లో 11 మంది స్త్రీలు, ఇద్దరుపిల్లలు, పైన చెప్పినట్టు ఈ ఘటన తరువాత సైన్యం, సైనికాధికార్లు,కేంద్రం జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వంపైన చాలా నిందలు వేశారు.

ముఫ్తీమహమ్మద్ సయీద్ ప్రభుత్వము శాంతిపేరుమీద, చర్చల పేరుమీద, మౌలిక సమస్యల పరిష్కారం పేరుమీద ఉదారంగా వ్యవహరిస్తున్నదనీ అందువల్లే మిలిటెంట్లు పేట్రేగిపోయారనీ ఆరోపించారు. ఆ తరువాత ఎప్పటిలాగా సైన్యం, పారా మిలిటరీ బలగాల అత్యాచారాలు పెరిగినా ఆ ప్రభుత్వం ఏమీ చేయలేకపోయింది. లేదా చేయదలచుకోలేదు. చెప్పుకోదగ్గ మరొక విషయం ఏమిటంటే చంపినవాళ్లు మిలిటెంట్లు అయిఉంటారని దేశంలో అందరూ నమ్ముతున్నారు. ప్రభుత్వం కూడా అనింది. అది నిజం కూడా కావచ్చు. కాని కశ్మీర్‌లో చాలా మంది– కేవలం ఉడుకు రక్తం ఉన్నటువంటి యువకులు మాత్రమే కాదు. చాలా నెమ్మదిగా,నిదానంగా ఆలోచించే వారు కూడా చంపింది నిజంగా మిలిటెంట్లేనా లేక సైన్యమే, లేక సైన్యం పురమాయింపు మీద పనిచేసేటటువంటి కిరాయి ముఠాలే దానికి పాల్పడ్డాయా అని సందేహిస్తున్నారు. ఏదో ఒక కారణం చూపించి నిర్బంధాన్ని పెంచడానికి సైన్యానికి అవకాశం ఇవ్వడం కోసం ఆ పని చేశారా అన్న ప్రశ్న వేస్తున్నారు. ఇది నిజమని అనడం లేదు గానీ ఒక వరుసగా 1997 నుంచి ముస్లిమేతరులను,అంటే హిందువులను,సిక్కులను లేదా కశ్మీరీయేతరులను, అంటే బీహార్ ప్రాంతం నుంచి వచ్చిన కూలీలను పెద్ద సంఖ్యలో చంపిన ఘటనలు ఏ ఒక్కదానిపైనా ఇప్పటిదాకా విచారణ పూర్తికాకపోవడం గమనార్హం. 1997 జనవరిలో వంధామా వద్ద, 1997 మార్చిలో సంగ్రాంపుర వద్ద, 1998 ఏప్రిల్‌లో పరాన్‌కోట్ వద్ద, 1998 జూన్‌లో చాప్నాన్ వద్ద, 2000 మార్చి లలో చట్టీ సింగ్‌పురి వద్ద, 2001 ఆగస్టులో పవాల్గాం వద్ద, అదే నెల కాన్సీగుండ్ – అచాబల్ వద్ద 2001 జూలై లో శేష్ నాగ్ వద్ద, 2002 ఆగస్టులో జమ్మూ నగరంలోని రాజీవ్‌నగర్ వద్ద 10 మంది కంటే ఎక్కువ సంఖ్యలో జనాన్ని చంపడం జరిగింది. ఇవన్నీ కూడా రాజకీయంగా ప్రాముఖ్యం కలిగిన సందర్భాల్లోనే జరిగాయి. ఆ సందర్భంలో ఈ చావులకు, ఈ హత్యలకు, ఏదో ఒక రాజకీయ లక్ష్యం ఉంది. ఈ ఘటనలకు ఎవరు పాల్పడ్డారు అన్న విషయంలో ఒక్క విచారణా పూర్తికాలేదు. ఎవరి మీదా చార్జ్‌షీట్ వెయ్యడం కాని, ఫలాన వాళ్ళు చేశారు అని పోలీసులు ప్రకటించడం కానీ జరుగలేదు. ఇవన్ని రాజకీయంగా ప్రాముఖ్యం కలిగిన సందర్భాలలో జరిగాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఘటనల గురించి విచారణ పూర్తికాక పోవడాన్ని ప్రశ్నించినప్పుడు, కశ్మీరీల్లో ఉన్న సందేహం పూర్తిగా అవాస్తవం కాకపోవచ్చుననిపిస్తుంది. ఏది ఏమైనా ఇప్పటికి జరిగిన ఘటనల మీద పోలీసుల విచారణ పూర్తిచేసి, పూర్తి వివరాలతో ఎవర్ని అనుమానిస్తున్నారు అని బయట పెడితే తప్ప నిరాయుధులైనటువంటి మైనారిటీలను – అంటే ఆ రాష్ట్రంలో మైనారిటీ అయిన హిందువుల, సిక్కులను – బయటివాళ్ళను, చంపింది మిలిటెంట్లేనా లేక సైన్యం పురమాయింపు మీద పనిచేసే కిరాయి హంతకులా అన్నది తేలదు.

ముఫ్తీ మహమ్మద్ సయీద్ పరిపాలనలో మళ్ళీ బాగా చర్చకు వచ్చినటువంటి విషయం సైన్యం లేక పోలీసులు అదుపులోకి తీసుకుని మాయమైన వాళ్ళ విషయం.తన

కుమారుడ్ని పోగొట్టుకున్నటువంటి పర్వీనా అహంగర్ అనే స్త్రీ చొరవతో అసోసియేషన్ ఆఫ్ పేరెంట్స్ ఆఫ్ డిస పియర్డ్ పర్సన్స్ (మాయమైన వ్యక్తుల తల్లిదండ్రుల సంఘం - ఎపిడిపి) అనే సంస్థ ఏర్పడింది. ఈ సంస్థ చెప్పే లెక్కల ప్రకారం 1989 నుండి 2003 మే నెల దాకా దాదాపు 8 వేల మంది ఈ విధంగా మాయమయ్యారు. మామూలుగా ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇది నిజమని ఒప్పుకోవు గాని, కొత్తగా అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి ముఫ్తీ మహమ్మద్ సయీద్ అసెంబ్లీలో ప్రకటన చేస్తూ తన ముందు పరిపాలించిన ఫరూఖ్ అబ్దుల్లా ప్రభుత్వం హయాంలో 2000 సం॥లో 1053 మంది, 2001 సం॥ 1086 మంది, 2002 సం॥ 605 మంది మాయమయ్యారని ఒప్పుకున్నాడు. అంటే కేవలం 2000, 2001, 2002 సంవత్సరాల్లోనే 3744 మంది మాయమయ్యారు. అటువంటప్పుడు 1989 నుంచి లెక్కబెట్టుకుంటే 8 వేలు అని ఎపిడిపి వాళ్ళు అనడంలో ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. బహుశా గత పాలనలో ఇది జరిగి ఉండొొచ్చును కానీ తన పాలన ఇంతకంటే మెరుగ్గా ఉంటుంది అని ముఫ్తీ మహమ్మద్ సయీద్ భావించడం ఈ నిజాయితీకి కారణం అయి ఉంటుంది. ఏమైతేనేం ఇది అధికారికంగా చెప్పినట్టి లెక్క. కాని ముఫ్తీ మహమ్మద్ సయీద్ ప్రభుత్వం కూడా ఈ మాయం కావడం అనే ప్రక్రియను ఆపలేకపోయింది అనడానికి నిదర్శనంగా 2003 సంవత్సరం మే నెల నాటికి 44 మంది మాయమయ్యినట్టు ఎపిడిపి ఒక జాబితా రూపొందించింది. వారిలో 24మందిని కుటుంబ సభ్యులు చూస్తూ ఉండగా వివిధ సైనిక బలగాల వాళ్ళు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వాళ్ళను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుపోయినట్టుగా పత్రికలు రాయడం జరిగింది. కనీసం ఆ 24 మంది విషయంలో ప్రభుత్వం లేక సైన్యం జవాబు చెప్పవలసి ఉంటుంది. మాయమయిన వారి గురించి ఎప్పుడూ ప్రశ్నించినా ప్రభుత్వాలు చెబుతున్న జవాబు ఏమిటంటే వాళ్ళు మిలిటెన్సీలో కలిసి పాకిస్తాన్ వెళ్ళిపోయారని. వాళ్ళను ఆఖరున చూసింది సైనికుల కస్టడీలో అయినప్పుడు ఈ జవాబు చెప్పడం సరైనది కాదు. అది చట్టం కళ్లలో ఆమోదనీయమైనదీకాదు. ఎవరి అదుపులో ఒక వ్యక్తిని ఆఖరున చూడడం జరుగుతుందో వారే ఆ వ్యక్తికి ఆ తరువాత ఏమైంది అని చెప్పాల్సి ఉంటుంది అనేది సాధారణ జ్ఞానానికి సంబంధించిన విషయం. అదే చట్టం కూడా. ఆ జవాబు చెప్పకుండా వీళ్ళంతా మిలిటెన్సీలో కలిశారు అని మాట్లాడటం బాధ్యతారాహిత్యం. గత ప్రభుత్వాల లాగే ముఫ్తీ మహ్మద్ సయీద్ ప్రభుత్వం కూడా ఇదే జవాబు ఇచ్చింది.

## చివరి మాట

# 8. ఈ కథకు ముగింపు కనుచూపు మేరలో లేదు

2001తో మొదలుపెట్టి భారత ప్రభుత్వం 'కశ్మీర్ సమస్య' పరిష్కారానికి చర్చలు జరపడానికి సిద్ధమని అంటూ ఉంది. ఒకసారి మిలిటెంట్లతోనే నేరుగా మాట్లాడతామనీ, ఒకసారి హురియత్ కాన్ఫరెన్స్‌తో మాట్లాడతామనీ, ఒకసారి ఎవరు మాట్లాడడానికి సిద్ధంగా ఉంటే వాళ్ళతో మాట్లాడతామనీ అంటూ ఉంది. పాకిస్తాన్‌తో ఏదో ఒక స్థాయిలో మాట్లాడుతూనే ఉంది. ఈ సంభాషణల్లో ఏ రకమైన పురోగతీ కనిపించకపోవడాన్ని బట్టి, పురోగతి కావాలన్న ఆరాటం భారత ప్రభుత్వంలో కనిపించకపోవడాన్ని బట్టి, ఇదంతా ఎవరినో మెప్పించడం కోసం చేస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కోసం కాదని అనుమానిస్తే తప్పులేదు.

ఆ 'ఎవరో' అన్నది అమెరికా అని విడమరచి చెప్పవలసిన అవసరమూ లేదు. 'కశ్మీర్ సమస్య' న్యాయబద్ధంగా పరిష్కారం కావాలన్న ఆరాటం అమెరికాకు లేదు గానీ ఏదో ఒకరకంగా అది చల్లబడాలని మాత్రం ఉంది. అమెరికాను విపరీతంగా భయపెడుతున్న 'ఇస్లామిక్ తీవ్రవాదాన్ని' దెబ్బతీయాలంటే అది వర్ధిల్లడానికి అవకాశం కల్పించే సంక్షోభాలను న్యాయంగానో అన్యాయంగానో చల్లార్చాలి. ఆ సంక్షోభాలు రగులుతున్నంత కాలం లష్కర్-ఎ-తోయిబా, జైష్-ఇ-మహమ్మద్, వీటన్నిటి వెనుక ఉన్న పెద్ద భూతం ఆల్‌ఖైదా ఎదుగుతూనే ఉంటాయని అమెరికా భయం. ఆ సంక్షోభాలలో ఒకటయిన కశ్మీర్ సమస్యను ఏదో ఒక రకంగా పరిష్కరించుకొమ్మని అమెరికా భారత పాకిస్తాన్‌లపైన ఒత్తిడి పెడుతున్నది. అమెరికా చూపిస్తున్న ఈ చొరవకు వేరే కారణాలు కూడా ఉన్నాయి గానీ ఇది అన్నిటికన్న ముఖ్యమైనది.

భారత్ చర్చలు అంటూ ముందుకు రావడానికి మరొక కారణం కూడా ఉండవచ్చు. కశ్మీరీ ఉద్యమం కశ్మీరీ జాతీయవాదుల చేతిలో ఉన్నంతకాలం అది హింసాత్మక రూపం తీసుకున్నప్పటికీ విచ్చలవిడి హత్యలకు పాల్పడలేదు. అయితే దాని మార్గనిర్దేశనం ఇస్లామిక్‌వాదుల చేతిలోకి పోయిన తరువాత పరిస్థితి మారింది. బజార్లోకి గ్రెనేడ్లు విసిరి దారిన పోయేవాళ్లను చంపడం, సరిహద్దు ప్రజలను క్రూరంగా హింసించడం మొదలయింది. 'టెర్రరిజం' దెబ్బకు భారత్ తన మూర్ఖత్వాన్ని సడలించి చర్చలకు సిద్ధమయిందా?

ఇది నిజమయితే సిగ్గుమాలిన ప్రవర్తనగా భావించవలసి ఉంటుంది. ప్రత్యర్థి మర్యాదగా నడుచుకుంటే చులకనగా చూస్తాం, అనాగరికంగా నడుచుకోవడం మొదలు పెడితేనే గౌరవిస్తాం అనేది ఏ రకమైన సంస్కారం?

ఈ పుస్తకం చదివినవాళ్ళకు కశ్మీరీల స్వాతంత్ర్య కాంక్ష గమనం స్పష్టంగా అర్థమయ్యే ఉంటుంది. అది మొదట సెక్యులర్ ప్రజాతంత్ర భావాలుగల కశ్మీరీ జాతీయవాదుల చేతిలో ఉండింది. షేక్ అబ్దుల్లా బతికి ఉన్నంతకాలం శాంతియుతంగా ఉండింది. 1989 తరువాత జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జెకెఎల్ఎఫ్) నేతృత్వంలో మిలిటెంట్ రూపం తీసుకుంది. అయితే ఇద్దరి ప్రాపంచిక దృక్పథమూ సెక్యులర్ ప్రజాతంత్ర కశ్మీరీ జాతీయవాదమే. అప్పుడు భారత్ చర్చల లాంటి ప్రజాస్వామిక ప్రక్రియల ప్రతిపాదన చేయలేదు. కశ్మీరీల ఆరాటాన్ని అవహేళన చేసింది. కుయుక్తులతోనూ బలప్రయోగం తోనూ అణచివేసింది.

1991-92 తరువాత కశ్మీరీల పోరాటం హిజ్‌బుల్ ముజాహిదీన్ చేతిలోకి పోయింది. అది పాకిస్తాన్ అండదండలున్న మతవాద సంస్థే అయినప్పటికీ కశ్మీరీ జాతీయవాద సంస్థ. దాని నాయకులు, కార్యకర్తలు అంతా కశ్మీరీలే. దాని వ్యవస్థాపకుడు 1987 ఎన్నికలలో అసెంబ్లీకి పోటీ చేసి ఓట్ల లెక్కింపు దగ్గర గెలిచి బయటకు పోయిన తరువాత ఓడిపోయినట్లు ప్రకటించబడ్డ సయ్యద్ సలా వుద్దీన్. హిజ్‌బుల్ ముజాహిదీన్‌కు స్థానిక ప్రజల బాగోగులు, మంచిచెడ్డలు, ప్రతిష్టముఖ్యమే కాబట్టి వాళ్లెప్పుడూ విచ్చలవిడి హింసకు పాల్పడలేదు. భారత సైనిక బలగాలపైన, తమ రాజకీయ శత్రువులపైన మాత్రమే గురి పెట్టారు. ఆ దశలోనైనా భారత్ చర్చలు, సంప్రదింపుల ఆలోచన చేసి ఉండవచ్చును కానీ చేయలేదు.

1996, 97 సంవత్సరాల నుండి హిజ్‌బుల్ ముజాహిదీన్ ప్రాముఖ్యం తగ్గి లష్కర్-ఎ-తోయిబా, జైష్ -ఇ- మహమ్మద్ వంటి సంస్థలు కశ్మీరీ పోరాటంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించుకోసాగాయి. ఇవి ఇస్లామిక్‌వాద సంస్థలు. వీరి మిలిటెంట్లలోనూ అత్యధికులు కశ్మీరీలే ఉన్నప్పటికీ అరబ్బులు, పాకిస్తానీలు,అఫ్ఘాన్‌లు, ఈజిప్షియన్లు, అల్జీరియన్లు మొదలయినవారు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. అంతకంటె ముఖ్యమైన విషయం ఏమిటంటే వీరి ప్రాపంచిక దృక్పథం కశ్మీరీ జాతీయ వాదం కాదు. ఇస్లామిక్ వాదం వీరి దృక్పథం. ప్రపంచంలో ముస్లింలు ఎక్కడున్నా అక్కడ ఇస్లామిక్ రాజ్యం ఉండాలని నమ్ముతారు. చెచెన్యా నుండి పాలస్తీనా దాకా, పాలస్తీనా నుండి కశ్మీర్ దాకా అన్నిచోట్ల ఆ లక్ష్యంతో పోరాడుతూ ఉంటారు. వీరు చేసే హింసకు ఏ పరిమితీ ఉండదు. బజార్లోకి గ్రెనేడ్లు విసిరి చిన్నపిల్లలను చంపగలరు. ఇంట్లో మగవాడు దొరకకపోతే భార్య ముక్కు, చెవులు కోసేయగలరు.

వీరి 'టెర్రర్'కు భారత్ దిగివచ్చి చర్చలు, శాంతి ప్రక్రియ అని గానీ అంటూ ఉంటే అది నిస్సందేహంగా సిగ్గుపడవలసిన విషయమే. అంతేకాక భారత్ పంపుతున్న శాంతి సంకేతాలకు హిజ్‌బుల్ ముజాహిదీన్ (కొన్ని అంతరంగిక విభేదాలతో) స్పందించింది గానీ ఇస్లామిక్ వాదులు స్పందించలేదు. స్పందిస్తారన్న దాఖలాలూ లేవు.

ఇదీ ప్రస్తుత పరిస్థితి. అమెరికా ఒత్తిడి లేకపోతే ఈ స్థితి ఎంతకాలమైనా సాగేదేనేమో గానీ అమెరికా ఒత్తిడి కారణంగా భారత పాకిస్తాన్‌లు కశ్మీరీల ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా సమస్యను 'పరిష్కరించేస్తా' యేమోనన్న ఆందోళన కశ్మీరీలలో తీవ్రంగా ఉంది. ఏ పరిష్కారమైనా తమ భూభాగాన్ని రెండుగా చీల్చి కొంత ఇండియాకు, కొంత పాకిస్తాన్‌కు ఇచ్చే ప్రాతిపదిక మీదనే ఉండగలదని వారికి తెలుసు. దీనివల్ల సంబంధ బాంధవ్యాలున్న ప్రజలు శాశ్వతంగా చీలిపోతారని వాళ్ల భయం. 'ఏమైనా చేయండి కానీ మమ్మల్ని ఒకటిగా ఉంచండి' అంటుంటారు.

చర్చల పేరిట భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఒక దిశ ఉన్నట్టు కనిపించదు. ఇదంతా కేవలం కాలయాపన అని కశ్మీరీలు భావిస్తే వారిని నిందించలేం. పాకిస్తాన్‌తో బస్సులు, రైళ్ళు, వ్యాపార వర్తకాలు, సాంస్కృతిక సంబంధాలు, అన్నిటి గురించి మాట్లాడుతుంది గానీ కశ్మీర్ గురించి మాట్లాడదు. వేరే విషయాల గురించి చర్చలు పెట్టుకుని భారత పాకిస్తాన్ సంబంధాల మెరుగుదలకు చర్యలు తీసేసుకుని భారత్‌తో సత్సంబంధాలుండడం అవసరం అనే భావ వాతావరణాన్ని పాకిస్తానీ సమాజంలో కల్పించేస్తే ఇక ఆ తరువాత కశ్మీర్ సమస్యను శాశ్వతంగా దాటవేయవచ్చుననేదే భారత్ ఆలోచన అని కశ్మీరీలు అనుమానించడంలో తప్పేమయినా ఉందా?

మిలిటెంట్లతో నేరుగా మాట్లాడతాం అని కనీసం 2001 నుండి భారత్ అంటున్నది గానీ ఆ పని మొదలుపెట్టదు. మిలిటెంట్ల రాజకీయ ప్రతినిధి అయిన హురియత్ కాన్ఫరెన్స్‌తో మాట్లాడే ప్రయత్నం భారత ప్రభుత్వం మొదలుపెట్టింది గానీ అది హురియత్ కాన్ఫరెన్స్‌లో చీలికకు దారి తీసింది. పాకిస్తాన్ కూడ కూర్చుంటేనే హురియత్ కాన్ఫరెన్స్ చర్చలలో పాల్గొంటుందని భీష్మించిన సయ్యద్ ఆలీషా గిలానీది ఒక వర్గం. మొదటి మెట్టుగా భారత్‌తో మాట్లాడటానికి సిద్ధపడిన మీర్వయిజ్ ఉమర్ ఫరూఖ్‌ది ఒక వర్గం అయ్యాయి. ఈ చీలికను భారత్ పనిగట్టుకొని ప్రోత్సహించిందన్న అనుమానం కశ్మీరీలలో లేకపోలేదు. ఎన్ని లోపాలున్నా ఒకటిగా ఉన్న హురియత్ కాన్ఫరెన్స్‌కు గౌరవం ఉండేది. అది కూడా పోగొట్టి ఒక వర్గంతో మాట్లాడి భారత్ సాధించేది ఏముండగలదు? పోనీ ఆ వర్గంతో చర్చలయినా ముందుకు సాగాయా అంటే అదీ లేదు. దాదాపు అయిదేళ్లుగా భారత్ మీర్వయిజ్ ఉమర్ ఫరూక్ వర్గంతో మాట్లాడుతూనే ఉంది గానీ ఏం ఫలితం వచ్చిందో ఎవరికీ తెలీదు. ఈ లోపల రక్తపాతం దీనికి ముగింపు ఏమిటన్నది కాలమే తేల్చాలి. హింస మాత్రం నిరంతరాయంగా సాగుతూనే ఉన్నాయి.

అనేక దినాలుగా యుద్ధరంగాన్ని తలపిస్తోంది అందాల సుందర ప్రదేశం.. 'కశ్మీర్'.

కశ్మీర్ కోసం భారత్, పాకిస్తాన్‌లు ఎందుకు కొట్లాడుకుంటున్నాయి? ఆ కోట్లాట గురించి కశ్మీరీలు ఏమనుకుంటున్నారు? కశ్మీర్ ఏ పరిస్థితుల్లో భారత దేశంలో భాగం అయ్యిందీ? 1989 తరువాత భారత్ నుండి వేరుపడే లక్ష్యంతో కశ్మీర్‌లో మిలిటెంట్ పోరాటం ముందుకు రావడానికి గల నేపథ్యం ఏమిటి? ఆ పోరాటంతో భారత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఎటువంటిది?

1995 నుండి 2003 మధ్య అయిదుసార్లు కశ్మీర్ పర్యటించిన హక్కుల సంఘాల నిజనిర్ధారణ కమిటీ నివేదికల సారాంశమైన ఈ పుస్తకం, పై ప్రశ్నలన్నిటికీ సమాధానాలు వెతికే ప్రయత్నం చేస్తుంది.

ఈ పుస్తక రచయిత కె. బాలగోపాల్ ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల సంఘం నాయకులు, రచయిత, వ్యాసకర్త.

